

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 125

శనివారం 26-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బొమ్మినేని సంజనారెడ్డి

అత్యంత ఓర్పు నేర్పులతో మానసిక, శారీరక సామర్థ్యాలను ఉక్కు సంకల్పంతో పరిరక్షించుకుంటూ ఏదైనా సాధించగలం అని నిరూపిస్తోంది బొమ్మినేని సంజనారెడ్డి. ఐరన్‌మ్యాన్ ప్రపంచ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించిన ఈ హైదరాబాద్ వాసి 'సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధ్యమే!' అంటున్నారు.

సంజన... ఐరన్ మ్యాన్

ఈ ఏడాది అక్టోబర్‌లో హవాయి లోని కోనాలో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఐరన్‌మ్యాన్ ప్రపంచ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించారు బొమ్మినేని సంజనారెడ్డి. 18–24 ఏళ్ల విభాగంలో ఆమె ఈ స్థానాన్ని సాధించారు. గత జూన్‌లో ఆస్ట్రేలియాలో జరిగిన అల్ట్రా–ఎండ్యూరెన్స్ ట్రయాథ్లాన్‌ను 15 గంటల 22 నిమిషాల 13 సెకన్లలో పూర్తి చేశారు.

లండన్‌లో అర్బన్ ఎకనామిక్ డెవలప్‌మెంట్‌లో ఎంఎస్సీ చేస్తున్న సంజన ప్రస్తుతం హైదరాబాద్‌లోనే శిక్షణ తీసుకుంటున్నారు. ఐరన్‌మ్యాన్‌లో తన అడుగు ఎలా మొదలయ్యిందో వివరించారు.





కఠినమైన శిక్షణ

''స్కూల్ టైమ్‌లో నేనూ మా చెల్లెలు స్విమ్మింగ్ క్లాసులకు వెళ్లేవాళ్లం. స్విమ్మింగ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. డిగ్రీ చేయడానికి యూకే వెళ్లాను. థర్డ్ ఇయర్‌లో ఐరన్‌మ్యాన్ గురించి తెలిసి, శిక్షణ తీసుకున్నాను. మాస్టర్స్ కూడా యుకెలోనే. శిక్షణ తీసుకుంటూ గత జూన్‌లో ఆస్ట్రేలియాలోని కైర్న్స్‌లో జరిగిన ఐరన్‌మ్యాన్‌లో పాల్గొన్నాను. సైక్లింగ్, రన్నింగ్, స్విమ్మింగ్ ఈ మూడూ నిర్ణీత టైమ్‌లో పూర్తి చేయాలి. వరల్డ్ ఐరన్ మ్యాన్ 1978లో ఆరంభం అయింది. అయితే, ఇప్పటివరకు మన దేశం నుంచి నా ఏజ్ క్యాటగిరీలో ఎంపిక అయిన వారిలో నేనే మొదటి స్థానంలో ఉన్నాను. మొదట వారానికి 20 గంటలు, రోజూ 3–4 గంటలు ట్రెనింగ్ ఉంటుంది. రేస్ టైమ్ దగ్గర అవుతున్న కొద్దీ ట్రెనింగ్ సమయం పెరుగుతుంది. యూకేకి చెందిన కోచ్ ద్వారా ఆన్‌లైన్‌లో సూచనలు తీసుకుంటూ రోజుకు ఐదు నుండి ఆరు గంటలు శిక్షణ తీసుకుంటున్నాను.

తప్పుకోవాలనుకున్న క్షణాలూ తప్పలేదు!

మొదట్లో కఠిన సాధన వల్ల రేసు నుండి తప్పుకోవాలనిపించిన క్షణాలు చాలా ఉన్నాయి. కానీ లక్ష్యం ఐరన్‌మ్యాన్‌ను పూర్తి చేయడం మాత్రమే కాదు, ప్రారంభించిన దాన్ని ఎలాగైనా పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందుకే అడుగు వేశాను. ఈ అడుగు మరికొందరికి ప్రేరణగా మారాలి అనుకున్నాను. సౌకర్యమైన జీవనంలో ఉంటే మన సామర్థ్యాలు ఏవీ తెలియవు. ఈ రోజుల్లో దాదాపు అందరం చాలా సౌకర్యాలకు అలవాటుపడిపోతున్నాం. అది ఓవర్ అవుతుంది కూడా. దీని వల్ల మన మీద మనకే కాదు, ఎదుటివారి మీద కూడా గౌరవం రాదు. మనలో ఎంతటి శక్తి ఉందో గుర్తించాలి. ఆ శక్తిని వెలికి తీయడానికి నిరంతరం ప్రయత్నించాలి. అప్పుడే మనమేంటి.. అన్నది తెలుస్తుంది. ఒకసారి మనమా శక్తిని గ్రహించగలిగామంటే మనపై మనకే చాలా కాన్ఫిడెన్స్ వస్తుంది. మహిళగా అది చాలా ముఖ్యం. నేనేం సాధించాలో తెలుసుకునే బ్రేకింగ్ పాయింట్‌కు చేరుకోవాలనుకున్నాను. చాలావరకు మన చుట్టూ ఉన్నవారే తొక్కేయడానికే చూస్తుంటారు. వాటిని అడ్డుకుంటూనే నాలో ఆత్మవిశ్వాసం, సాధికారతను గుర్తించాను.

వ్యాపారంలోనూ రాణించాలని..

మహిళగా ఈ రేస్‌లో పాల్గొనడానికి పీరియడ్స్ టైమ్ అసౌకర్యంగా ఉంటుంది. కొంతమందికి చాలా నొప్పి, క్రాంప్స్ వస్తాయని విన్నాను. నాకు అలా ఏమీ కాలేదు. ఆస్ట్రేలియాలో జరిగిన రేస్‌లో పీరియడ్స్ టైమ్ లోనే పాల్గొన్నాను. ఏమీ ఇబ్బంది అనిపించలేదు. మానసిక, శారీరక ప్రయోజనాలు క్రీడల్లోనే సాధించగలమని తెలుసుకున్నాను. స్పోర్ట్స్‌లో మనం రొటీన్ ఫుడ్ తీసుకుంటే ఇబ్బంది పడతాం. ఎనర్జీ బేస్డ్ సప్లిమెంట్స్ తప్పనిసరి అవసరం. దీంతో ఇండియాలో స్పోర్ట్స్ సప్లిమెంట్ బిజినెస్ రంగంలో రాణించాలని ఆలోచన కలిగింది. అమ్మానాన్నలు వెంకట్‌రెడ్డి, స్వప్న ఇద్దరూ వ్యాపార రంగంలోనే ఉన్నారు. కూతుళ్లమైనా మా ఆలోచనలను పాజిటివ్‌గా తీసుకుంటారు. నా చిన్నప్పటి నుంచి స్కేటింగ్, టెన్నిస్, తైక్వాండ్, భరతనాట్యం... సాధన చేస్తూ ఉన్నాను. వీటితో పాటు చేసిన స్విమ్మింగ్ ఐరన్ మ్యాన్ వరకు తీసుకెళ్లింది. ఈ విషయంలో అమ్మ నన్ను చాలా పుష్ చేశారు.

ఈ రేసులో పాల్గొనే అమ్మాయిలు 20 శాతం వరకే ఉన్నారు. ఇండియాలో ఆరేడేళ్లుగా హాఫ్ ఐరన్‌మ్యాన్ జరుగుతోంది. గోవాలో జరిగే ఈ ఈవెంట్‌లో పాల్గొనే వారి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. మన దేశంలో ఫుల్ ఐరన్‌మ్యాన్ వస్తే చాలా మంది అమ్మాయిలు ఈ రేసులో పాల్గొని తమని తాము నిరూపించుకునే అవకాశం ఉంది'' అని తెలిపారు సంజన.

– నిర్మలారెడ్డి

పిల్లలు చిన్నగా ఉంటే వాళ్లు ఎక్కడ తప్పిపోతారోనని ట్రాకింగ్ యాప్స్ వాడటం మంచిదే. కాని పిల్లలు పెద్దయ్యి టీనేజ్‌లో అడుగుపెట్టాక వాళ్లు వీధిలోకి అడుగుపెడితే చాలు లైవ్ లొకేషన్ పెట్టమని అడగడం మంచిదా? చెడ్డదా? తల్లిదండ్రుల భయాలు తల్లిదండ్రులకు ఉండొచ్చు. కాని దీనివల్ల టీనేజ్ పిల్లలు స్వేచ్ఛగా ఎదగడం, నేర్చుకోవడం తగ్గుతుందా? నిపుణులు ఏమంటున్నారు?



'లైవ్'గా పెంచుదాం లొకేషన్ వద్దు

సార్థక్ ఫ్రెండ్స్‌తో డిన్నర్‌కు వెళ్లాలి. వాళ్లు ఏదో కేఫ్ పేరు చెప్పారు. సాయంత్రం 7కు కలవాలి. వచ్చేసరికి తొమ్మిదిన్నర కావచ్చు. ఆ మాటే ఇంట్లో చెప్పాడు. ఇంటర్ పూర్తిచేసి బి.టెక్. జాయిన్ కాబోతున్నాడు సార్థక్.

'అయితే లైవ్ లొకేషన్ పెట్టు' అన్నాడు తండ్రి.

వాట్సప్‌లో లైవ్ లొకేషన్ పెడితే సార్థక్ ఎక్కడ ఉన్నాడో తెలుస్తూ ఉంటుంది.

అలా పెట్టడానికి సార్థక్‌కు అభ్యంతరం ఏమీ లేదు. కాని అది పెట్టినప్పటి నుంచి ప్రతి పది నిమిషాలకు దానివైపే చూస్తూ వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ట్రాక్ చేస్తూ, చెప్పిన చోట నుంచి లొకేషన్ కాస్త కదిలినా ఆందోళన పడుతూ పదేపదే తండ్రి ఫోన్లు చేస్తాడు. అదే విసుగు సార్థక్‌కు.

'నాన్నా... నేను చిన్నపిల్లాణ్ణా?' అంటాడు.

తండ్రి భయం తండ్రిది. నగరాల్లో తిరిగేటప్పుడు సేఫ్టీ ముఖ్యం. వాళ్లను ఒక కంట కనిపెడుతూ ఉండాలనే తప్ప సార్థక్ తప్పు పనులు చేస్తాడని కాదు. తండ్రి మనసు కొడుక్కు అర్థం కాదు. కొడుకు కోరుకుంటున్నది తండ్రికి అర్థమైనా నిస్సహాయుడు. ఇలాంటి వ్యవహార శైలే ఆడపిల్లలతో తల్లులది ఉంటుంది. వారు బయటకు వెళుతుంటే లొకేషన్ పెట్టమనడమే కాదు క్యాబ్‌లు, ఆటోలు తమ ఫోన్ నుంచి బుక్ చేసి ట్రాక్ చేస్తూ ఉంటారు కూడా.

ఇంటర్ వయసు పూర్తయ్యిందంటే పిల్లలు పూర్తిగా తమ జాగ్రత్తలు తాము తీసుకోదగ్గ వయసుకు వచ్చినట్టే. బాధ్యత లేకుండా అతి నిర్లక్ష్యంగా ఉండే పిల్లలు తప్ప మిగిలిన అందరు పిల్లలూ జాగ్రత్తగా బయటకు వెళ్లి వద్దామనే అనుకుంటారు. ఏదైనా అవసరం వస్తే తప్పక తల్లిదండ్రుల సాయం అడుగుతారు. కాని ప్రతిసారి ప్రతి ఔటింగ్‌కు తల్లిదండ్రులు వెంటపడటం వారికి ఇబ్బంది కలిగించవచ్చు. లేదా సొంతగా తామే సందర్భాలను ఎదుర్కొని ఆత్మవిశ్వాసాన్ని నింపుకోవడంలో ఆలస్యం కావచ్చు. అందుకే టీనేజ్ పిల్లలను సంయమనంతో అర్థం చేసుకోవాలి.

కొన్ని సూచనలు

- పిల్లలకు సామాజిక స్థితిగతులు అర్థం చేయించాలి. వారిచేత న్యూస్ పేపర్లు చదివించడం, వార్తలు చూపించడం చేయాలి. తద్వారా తమ చుట్టూ ఏం జరుగుతుందో, ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వారికి అర్థం చేయించాలి.
- పిల్లలు ఎక్కడికైనా వెళ్తామన్నప్పుడు మొండిగా వద్దనకూడదు. ముందుగా వివరాలన్నీ కనుక్కొని, అక్కడికి వారు ఎందుకు వెళ్తున్నారో, పనేమిటి, ఇంకా ఎవరెవరు ఉన్నారో తెలుసుకోవాలి. అన్నీ విని, వెళ్లడం మంచిదే అనిపిస్తే పంపించాలి. కాదనిపిస్తే అది వారికి అర్థమయ్యేలా చెప్పాలి.
- పిల్లలు ఏది చెప్పినా కొట్టిపారేయడం, వారి మీద అరవడం, చేయి చేసుకోవడం చేయకూడదు. దానివల్ల భయం ఏర్పడి, తల్లిదండ్రులతో అబద్ధాలు చెప్పడం ప్రారంభిస్తారు. వారు చెప్పేది పూర్తిగా విని, వారితో స్నేహంగా మెలుగుతూ మంచీ చెడూ చెప్పాలి.
- పిల్లలకు సామాజిక బాధ్యత నేర్పే చిత్రాలు చూపించాలి. విజేతల ఆత్మకథలు, సమాజాన్ని అర్థం చేయించే పుస్తకాలు చదివించాలి. అందులోని అంశాలను వారితో చర్చించాలి. పిల్లలు బయటకు వెళ్తే ఏదో ప్రమాదం జరిగిపోతుందన్న ఊహ చేయకుండా, వెళ్లేచోట ఎలా మెలగాలో వారికి శిక్షణ అందించాలి. ఆడ, మగ తేడా లేకుండా అందరికీ స్వీయరక్షణ పద్ధతులు నేర్పించాలి.
- పిల్లల అనుమతి లేకుండా వాళ్ల ఫోన్లు చెక్ చేయడం, వారి వస్తువులు సోదా చేయడం చేయకూడదు. ఏదైనా అనుమానం ఉంటే వారిని అడిగి, వారి ముందే అలాంటివి చేయాలి తప్ప వారిని బయటివారిగా భావించి నిలదీయడం మొదలుపెడితే, వారు మరింత జాగ్రత్త పడి చెడుదారులు తొక్కుతారు.
- పిల్లల స్నేహితులెవరో, వారి తల్లిదండ్రులెవరో తెలుసుకుంటూ ఉండాలి. వారు మీ పిల్లలకు ఎలాంటి విషయాలు నేర్పిస్తున్నారో అంచనా వేస్తూ ఉండాలి. బయటెక్కడో కాకుండా మీ ఇంట్లోనే వారు ఎక్కువగా కలిసే ఏర్పాటు చేయాలి. దీనివల్ల పిల్లలకు మీ మీద నమ్మకం ఏర్పడుతుంది.
- పిల్లల్ని అందరిముందూ అవమానించడం, అనుమానించడం, ఎందుకూ పనికి రావంటూ తిట్టడం చేయకూడదు. ఇతరులతో పోలిక తెచ్చి వారిని తక్కువ చేయకూడదు. వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో ఆ రంగంలో ఎదగనివ్వాలి.
- వయసురీత్యా పిల్లల్లో వచ్చే మార్పులను గమనించి, వారితో ఆ విషయాలు నిర్భయంగా చర్చించాలి. తామూ ఆ దశ దాటి వచ్చామని చెప్తూ తమ అనుభవాలు వివరించాలి. దీనివల్ల వారిలో ఉండే అయోమయాలు దూరమవుతాయి.

భద్రతా? లేదా స్వేచ్ఛ?

భద్రత ముఖ్యం అని తల్లిదండ్రులు అనుకుంటారు. స్వేచ్ఛ ఉండాలని పిల్లలు అనుకుంటారు. రెండూ ఉంటే బాగుండని ఇరుపక్షాలు అనుకుని ఏం చేయాలో ఆలోచించడం అన్ని విధాలా మేలు. ఇవాళ రేపు నగరాల్లోనే కాదు టౌన్లలో పల్లెల్లో కూడా టీనేజ్ అబ్బాయిలతో, అమ్మాయిలతో అపరిచితులు గాని, అసాంఘిక శక్తులు గాని ఎలా వ్యవహరిస్తున్నారో మనకు తెలుసు. అందుకే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని పిల్లలకు చెప్పాలి. అదే సమయంలో భద్రత కోసమని తల్లిదండ్రులు చేసే హంగామా పిల్లలకు ఏమాత్రం మంచిది కాదని ఇటీవల యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ చేసిన ఒక అధ్యయనంలో తేలింది. తల్లిదండ్రుల ఆందోళన చూసి పిల్లలు కూడా ఆందోళన పడతారని, కోపం, డిప్రెషన్ వంటి సమస్యలు వారిలో తలెత్తుతాయని ఆ అధ్యయనం హెచ్చరించింది.

రిస్క్ లేనిది ఎక్కడ?

ఈ విషయమై భారతీయ సైకియాట్రిస్ట్ డాక్టర్ శుక్లా ఏమంటారంటే 'పిల్లలు బయటకు వెళ్లి మంచి చెడు వారికై వారే తెలుసుకోనివ్వండి. రిస్క్ కొద్దిగా తీసుకుంటే మంచిదే. రిస్క్ లేనిది ఎక్కడ? ఎక్కడైనా రిస్క్ ఉంటుంది. రిస్క్‌ను ధైర్యంగా ఎదుర్కోవడం ఎలాగో వారికి నేర్పడం తల్లిదండ్రుల విధి' అంటారాయన.

అందుకే తల్లిదండ్రులు ఓవర్ ప్రొటెక్టివ్‌గా ఉండటం కంటే పిల్లల్లో చైతన్యం నింపడం, వారికి బయటి పరిస్థితులు విశదపరచడం, ధైర్యంగా వ్యవహరించడం నేర్పాలి.

వంటిల్లు

మీల్ స్నాకర్

వర్షం వస్తే కరకరలాడే రుచులను కోరుకోని వారెవరుంటారు! కాస్త కారంగా, ఇంకాస్త క్రిస్పీగా ఉండే ఈ ఈజీ స్నాక్స్ ప్రయత్నించి చూడండి!

మీల్‌మేకర్ లాలీపాప్స్

కావలసినవి: **మీల్‌మేకర్** – 2 కప్పులు (ఉడికించి, చల్లారాక తురుములా చేసుకోవాలి); **జీడిపప్పు పేస్ట్** – పావు కప్పు; **బ్రెడ్ పౌడర్** – అర కప్పు; **అల్లం పేస్ట్** – పావు టీ స్పూన్; **బంగాళదుంప గుజ్జు** – పావు కప్పు; **పచ్చిమిర్చి పేస్ట్** – ఒకటిన్నర టీ స్పూన్లు; **మజ్జిగ** – 3 టేబుల్ స్పూన్లు; **మిరియాల పొడి** – అర టీ స్పూన్; **జీలకర్ర పొడి** – పావు టీ స్పూన్;



ఆమ్‌చూర్ పౌడర్ – 2 టీ స్పూన్లు; **గరం మసాలా** – తగినంత; **గుడ్లు** – 2 (ఒక బౌల్‌లో పగలగొట్టి, పాలు కలిపి పెట్టుకోవాలి); **ఉప్పు** – తగినంత; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో మీల్‌మేకర్ తురుము, జీడిపప్పు పేస్ట్, అల్లం పేస్ట్, ఆమ్‌చూర్ పౌడర్, బంగాళదుంప గుజ్జు, పచ్చిమిర్చి పేస్ట్, మజ్జిగ వేసుకుని బాగా కలుపుకోవాలి. ఇప్పుడు అందులో గరం మసాలా, మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి వేసుకుని బాగా కలుపుకుని, ఆ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని, చిత్రంలో చూపిన విధంగా పుల్లలకు గుచ్చాలి. వాటిని ముందుగా గుడ్ల మిశ్రమంలో ముంచి బ్రెడ్ పౌడర్ పట్టించి, నూనెలో దోరగా వేయించి సర్వ్ చేసుకోవాలి.

మీల్‌మేకర్ పకోడీ



కావలసినవి: **మీల్‌మేకర్** – ఒక కప్పు (నానబెట్టి, ఉడికించి, చల్లారాక, తురుములా చేసుకోవాలి); **జీడిపప్పు పేస్ట్** – 2 టేబుల్ స్పూన్లు; **కరివేపాకు** – కొద్దిగా (చిన్నచిన్నగా తరగాలి); **మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, శనగపిండి** – అర కప్పు చొప్పున; **ఉల్లిపాయ ముక్కలు** – ఒక కప్పు (సన్నగా నిలువుగా కట్ చేసుకోవాలి); **కారం** – ఒక టీ స్పూన్; **చాట్ మసాలా** – తగినంత; **అల్లం వెల్లుల్లి పేస్ట్** – రెండు స్పూన్లు; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా; **నిమ్మరసం** – కొద్దిగా; **నీళ్లు** – సరిపడా; **ఉప్పు** – తగినంత;

తయారీ: ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో మీల్ మేకర్ తురుము, మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, శనగపిండి, చాట్ మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు పేస్ట్, కరివేపాకు తరుగు, నిమ్మరసం ఇలా అన్ని వేసుకుని కాస్త నీళ్లు పోసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని, మరుగుతున్న నూనెలో పకోడీల్లా వేసుకుని దోరగా వేయించుకోవాలి. వేడివేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి ఇవి.

మీల్‌మేకర్ రోల్స్



కావలసినవి: **చపాతీలు** – 4 లేదా 5 (అప్పటికప్పుడు వేయించుకోవాలి); **క్యాప్సికమ్** – ఒకటి (చిన్నగా తరగాలి); **పనీర్ తురుము** – ఒక కప్పు (మెత్తగా ఉడికించి, చల్లారాక తురుములా చేసుకోవాలి); **బంగాళదుంప గుజ్జు** – కొద్దిగా; **పచ్చి బఠానీలు** – 2 టేబుల్ స్పూన్లు (నానబెట్టి, ఉడికించుకోవాలి); **ఉల్లిపాయ ముక్కలు, టొమాటో ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు** – కొద్దికొద్దిగా; **మిరియాల పొడి, జీలకర్ర పొడి** – ఒక టీస్పూన్ చొప్పున; **పసుపు** – అర టీ స్పూన్, **టొమాటో కెచప్** – రెండు టీ స్పూన్లు;**ఉప్పు** – సరిపడా, **నూనె** – తగినంత;

తయారీ: కళాయిలో కొద్దిగా నూనె వేసి వేడెక్కాక తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేయించాలి. అలాగే క్యాప్సికమ్ ముక్కలు, టొమాటో ముక్కలు వేసి, గరిటెతో తిప్పుతూ వేయించాలి. తర్వాత బంగాళదుంప గుజ్జు, ఉడికిన బఠానీలు, మీల్ మేకర్ తురుము వేసుకుని, ఉడికిస్తూ ఉండాలి. ఆ మిశ్రమం మాడుతున్నా లేదా పొడిగా అనిపించినా కొద్దిగా నీళ్లు పోసి ఉడికించుకోవచ్చు. ఈ కర్రీని దించడానికి కొన్ని నిముషాల ముందు జీలకర్ర పొడి, ఉప్పు, టొమాటో కెచప్ వేసి కలపాలి. బాగా ఉడికితే మంచి వాసన వస్తుంది ఆ కర్రీ. ఇప్పుడు చపాతీపై ఒకవైపు, ఈ కర్రీ వేసుకుని, ఆ చపాతీని రోల్‌లా చుట్టుకోవాలి. ఉల్లిపాయముక్కలు, కొత్తిమీర తురుము జోడించి తింటే భలే రుచిగా ఉంటాయి ఈ రోల్స్!

తల్లిపాల దాత

'నవజాత శిశువులకు తల్లిపాలు అమృతం' అనే మాటను చాలాసార్లు విని ఉంటాం. అయితే దురదృష్టవశాత్తూ కొన్ని పరిస్థితుల వల్ల అందరు శిశువులు ఆ అదృష్టానికి నోచుకోవడం లేదు. నెలలు నిండని పిల్లలు, తక్కువ బరువుతో పుట్టే నవజాత శిశువులకు తల్లి పాలు దొరకడం గగనమైంది. ఇలాంటి సమస్యనే ఎదుర్కొంది అనంతపురం నగరానికి చెందిన దర్శి లిఖిత. తాను పడిన ఇబ్బంది ఇతరులు పడకూడదని భావించిన లిఖిత పేదింటి శిశువులకు డబ్బా పాలు కాకుండా తల్లిపాలు ఇవ్వాలనే ఉద్దేశంతో ముందడుగు వేసింది.

ఎయిపోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బెంగూరులో ఎలక్ట్రికల్ మేనేజర్‌గా పని చేస్తోంది లిఖిత. ఈ ఏడాది ఏప్రిల్ 30న ఆమెకు బాబు పుట్టాడు.

'మొదటి రెండు వారాల పాటు నాకు పాలు తక్కువగా వచ్చేవి. నా పాలతో పాటు డబ్బా పాలు బాబుకు పట్టేవాళ్లం. బాబు కడుపు నిండా తాగేవాడు. పాలు తక్కువైనప్పుడల్లా ఏడ్చేవాడు. ఆ సమయంలో అందుబాటులో ఉన్న డబ్బాపాలు పట్టేదాన్ని.అయితే డబ్బా పాలు తాగించేటప్పుడల్లా ఎంతో బాధపడేదాన్ని. ఆ తర్వాత పెద్దలు, అనుభవజ్ఞులు, కొందరు వైద్యులు చెప్పిన సూచనలను, సలహాలను పాటించిన తర్వాత అదృష్టవశాత్తూ నాకు పాలు బాగా పడ్డాయి. నా బిడ్డ బొజ్జ నింపుకున్న తర్వాత కూడా ఇంకా మిగిలేవి. వాటిని తల్లి పాలు దొరకని చిన్నారుల కోసం ఉపయోగిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. విదేశాల్లో, బెంగళూరులాంటి ప్రాంతాల్లో మిల్క్ బ్యాంకుల గురించి విన్నాను. అనంతపురంలోనూ మదర్ మిల్క్ బ్యాంకు ఉందని అక్క శ్రీలేఖ(గైనకాలజిస్టు) చెప్పారు. నేను పడ్డ ఇబ్బంది ఇతరుల పిల్లలు, తల్లులూ పడకూడదని, అలాంటి వారికి తల్లి పాలు అందజేయాలని నిర్ణయించుకున్నాను' అంటుంది లిఖిత.



లిఖిత తీసుకున్న నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు స్వాగతించారు. ప్రోత్సహించారు. పాలను స్టోరేజ్ చేయడానికి ఆన్‌లైన్‌లో ప్యాకెట్స్ కొనుగోలు చేస్తుంది లిఖిత. వాటిలో నుంచి తన బిడ్డకు సరిపడా పాలు ఇస్తూనే మిగిలిన పాలను రోజూ 200 మి.లీ. వరకు సేకరించి డీప్ ఫ్రీజర్‌లో నిల్వ చేస్తుంది. అలా నెల రోజుల పాటు సేకరించిన మొత్తం తొమ్మిది లీటర్ల పాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని మదర్ మిల్క్ బ్యాంకుకు అందిస్తోంది.

'చనుబాల దానం కార్యక్రమాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాను. తల్లిపాల ప్రాముఖ్యత, దానిలోని పోషకాలు, రోగనిరోధక శక్తి గురించి ప్రచారం చేస్తాను' అంటుంది లిఖిత

– ఆర్‌డీవీ బాలకృష్ణారావు, సాక్షి, అనంతపురం

లిఖిత బాటలో...

అనంతపురం జిల్లాలో ఎంతోమంది పేదతల్లులు గర్భం సమయంలో రకరకాల కారణాల వల్ల పౌష్టికాహారం తీసుకోకపోవడంతో నెలలు నిండక, బిడ్డ ఎదుగుదల సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూలో పసికందులు పాలు లేక ఇబ్బంది పడుతుంటారు. అటువంటి వారి కోసం మదర్ మిల్క్ బ్యాంక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. లిఖిత ముందుచూపుతో తొమ్మిది లీటర్ల పాలు అందజేయడం సంతోషంగా అనిపించింది. వృత్తిరీత్యా బిజీగా ఉండే లిఖిత పేద పిల్లల గురించి ఆలోచించడం అభినందనీయం. ఇంకా ఎంతోమంది తల్లులు ముందుకువచ్చి పాలు ఇవ్వాలి. లిఖితను స్ఫూర్తిగా తీసుకోవాలి.



– డాక్టర్ హేమలత, డిప్యూటీ ఆర్‌ఎంఓ

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 25న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,410	బంగారం (24 క్యారెట్లు)	1,01,900	బంగారం (24 క్యారెట్లు)	1,00,480	బంగారం (24 క్యారెట్లు)	1,01,900	బంగారం (24 క్యారెట్లు)	98,700	బంగారం (24 క్యారెట్లు)	1,00,470
బంగారం (22 క్యారెట్లు)	92,640	బంగారం (22 క్యారెట్లు)	92,100	బంగారం (22 క్యారెట్లు)	92,100	బంగారం (22 క్యారెట్లు)	94,860	బంగారం (22 క్యారెట్లు)	90,800	బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,18,400	వెండి	1,18,700	వెండి	1,28,000	వెండి	1,18,700	వెండి	1,17,500	వెండి	1,28,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 125

శనివారం 26-7-2025



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'



సైగలు చేస్తే చాలు!

అధికారులకు సైన్ లాంగ్వేజ్‌లో శిక్షణ.. కరీంనగర్ కలెక్టర్ వినూత్న యత్నం -15లో



టెస్టు చేజారిపోతోంది!

పసలేని భారత బౌలింగ్. 186 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లండ్ -17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మాల్దీవులతో బలీయ బంధం

భారత్, మాల్దీవ్స్ విశ్వసనీయమైన మిత్ర దేశాలని మోదీ ఉద్ఘాటించారు. ద్వీప దేశానికి 4,850 కోట్ల రుణం ఇవ్వబోతున్నామన్నారు.

వివరాలు 6లో ▸



ఐదో రోజూ అదే తీరు..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో గందరగోళానికి ఇంకా తెరపడలేదు. ఐదో రోజూ ఉభయ సభలు స్తంభించాయి.

వివరాలు 6లో ▸



పాలస్తీనాకు మద్దతుగా ఫ్రాన్స్

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ పాలస్తీనాకు మద్దతుగా నిలిచారు. ఆ దేశ సార్వభౌమత్వాన్ని గుర్తిస్తున్నామని చెప్పారు.

వివరాలు 6లో ▸



మోదీకంత సీన్ లేదు: రాహుల్

'మోదీదంతా షో మాత్రమే. అనవసరంగా ఆయనకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఆయనకు అంత సత్తా లేదని రాహుల్ తీసిపారేశారు.

వివరాలు 6లో ▸

నిజమైన బీసీలకు నష్టం

తెలంగాణ ప్రభుత్వ 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగబద్ధం కాని రిజర్వేషన్లను రద్దు చేస్తాం
- కాంగ్రెస్‌లా తూతూమంత్రంగా కాకుండా దేశంలో రాజ్యాంగబద్ధమైన కులగణన చేసి బీసీలకు న్యాయం చేస్తాం
- రేవంత్, రాహుల్ ద్వయం బీసీలను మభ్యపెడుతున్నారంటూ విమర్శ




ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాక్షి, న్యూఢిల్లీ

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న 42 శాతం రిజర్వేషన్లతో నిజమైన బీసీలు నష్టపోతారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే పనికి రానిదని విమర్శించారు. రిజర్వేషన్ల విషయంలో డొంకతిరుగుడు ప్రచారంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీలు బీసీలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగబద్ధం కాకుండా ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తూతూమంత్రంగా చేసినట్టు తాము దేశవ్యాప్తంగా చేపట్టబోయే కులగణన ఉండదన్నారు. రాజ్యాంగబద్ధమైన కులగణన చేసి, భవిష్యత్‌లో బీసీలకు న్యాయం చేస్తామని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్ల పేరుతో ఎంఐఎం పార్టీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన షబ్బీర్ అలీ, అజారుద్దీన్ వంటి వారికోసమే రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నారని ఆరోపించారు. కన్వర్టెడ్ బీసీ అంటూ ప్రధాని మోదీని సీఎం రేవంత్ హేళన చేయడాన్ని ఆక్షేపించారు. మిడిమిడి జ్ఞానంతో సీఎం స్థానంలో ఉండి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 1972లో లంబాడీలను ఎస్టీల్లో చేర్చారు అంటే వారు కూడా కన్వర్టెడ్ ఎస్టీలా అంటూ ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ పార్టీ గుజరాత్‌లో అధికారంలో ఉన్నప్పుడు మండల్ కమిషన్ నివేదిక ప్రకారమే మోదీ కులాన్ని బీసీల్లో చేర్చారని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ ఏ సామాజికవర్గానికి చెందిన వారో సీఎం రేవంత్ చెప్పాలన్నారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల ప్రకారం పెంచిన రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేరేవారికి నీతులు చెప్పే రేవంత్‌రెడ్డి ముందు సీఎం పదవికి రాజీనామా చేసి బీసీని ముఖ్యమంత్రిని చేయాలని సవాల్ విసిరారు. మెట్రో విషయంలో రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ట్రైపార్టీ అగ్రిమెంట్ జరగాలన్న అవగాహన కూడా లేకుండా మాట్లాడుతున్నారని, మెట్రోకు వందశాతం కేంద్రం సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి పదవి దత్తాత్రేయకు ఇవ్వాలన్న డిమాండ్‌ను స్వాగతిస్తున్నామన్నారు.

పాలమూరు-రంగారెడ్డి రెండు దశల్లో..



తొలిదశలో 45 టీఎంసీల తరలింపునకే ప్రాజెక్టు పరిమితం

నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అభ్యంతరాల నేపథ్యంలో సర్కారు కొత్త వ్యూహం

- మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన 45 టీఎంసీలతో తొలిదశ ప్రాజెక్టు
- కీలకమైన సీడబ్ల్యూసీ ఆమోదం పొందడానికి యత్నాలు
- త్వరలో కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక
- ఇప్పటికే కేంద్రానికి, కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్రం విజ్ఞప్తులు
- ఉమ్మడి వాటా 45 టీఎంసీలు ప్రస్తుతానికి పక్కన పెట్టాలని నిర్ణయం

15 లో

ఓబీసీల కోసం ప్రత్యేక ప్రణాళిక

ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

- సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం
- బీసీనని చెప్పుకునే మోదీ 11 ఏళ్లలో బీసీలకు చేసిందేమీ లేదు
- ఓబీసీల కోసం ఇక రెట్టింపు వేగంతో పని చేయబోతున్నా: రాహుల్‌గాంధీ
- తెలంగాణలో చేసిన కులగణన ఓ రాజకీయ భూకంపమని వ్యాఖ్య
- ఏఐసీసీ ఓబీసీ విభాగం 'భాగీదారీ న్యాయ సమ్మేళనం'లో నేతలు

3 లో



భాగీదారీ న్యాయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఖర్గే

న్యూస్‌రీల్

మరిన్ని పరిశోధనలు



అంతరిక్ష పరిశోధనల్లో భారత్ వాటా పది శాతానికి పెంచుతామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. ప్రస్తుతం భారత్ వాటా 2 శాతంగా ఉందని, దీనిని 10 శాతానికి పెంచేందుకు ఇస్రో ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశించుకుందని తెలిపారు.

- వివరాలు 13లో▶

డీలిమిటేషన్ పిటిషన్ డిస్మిస్



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచేలా నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. పిటిషన్‌లో చట్టబద్ధత ఏదీ కనబడలేదని ధర్మాసనం పేర్కొంది.

- వివరాలు 13లో▶

బ్రాండ్ పురుష్



వ్యాపార ప్రకటనల్లో సరికొత్త ధోరణి.. ఆకట్టుకుంటున్న మోహన్‌లాల్ యాడ్

వివరాలు 12లో▶



డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం సక్సెస్

- కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో డీఆర్‌డీఓ ప్రయోగం
- గతంలో అభివృద్ధి చేసిన యూఎల్‌పీజీ ఎం-వీ2 అధునాతన వెర్షన్ ఇది
- యుద్ధతంత్రంలో భారత డ్రోన్ ముందంజ
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాల ఛేదన

14 లో



లోటు నుంచి సాధారణం దిశగా..

- ఊరట కలిగిస్తున్న వర్షాలు
- ప్రస్తుతం సాధారణ స్థితికి చేరిన సగటు వర్షపాతం
- మరో రెండ్రోజులు మోస్తరు వర్షాలు
- నెలాఖరు వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం: ఐఎండీ

- వివరాలు 5లో▶



హెచ్‌సీయూ భూముల్లో సీఎంకు కమీషన్లు

- క్విడ్ ప్రో కో కింద బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ. 1,600 కోట్ల కాంట్రాక్టు
- బీజేపీ ఎంపీకి కమీషన్లు ఇస్తుంటే రాహుల్ మౌనం ఎందుకు?.. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ నడుమ రాజకీయ అక్రమ సంబంధం
- బీఆర్‌ఎస్‌వీలో రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ విలీన కార్యక్రమంలో కేటీఆర్


- వివరాలు 12లో▶


kisna.com
20TH YEAR ANNIVERSARY
CELEBRATION
KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
PRESENTS
ECHO
COLLECTION
ఫ్లాట్
50% తగ్గింపు
వజ్రాల ఆభరణాల తయారీ ఛార్జీలపై
ఫ్లాట్
20% తగ్గింపు*
బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై
90%* బైబ్యాక్
95%* ఎక్స్ఛేంజ్
వజ్రాల నగలపై తయారీ ఛార్జీలతో సహా
Certified Natural Diamond Jewellery
నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి*

చివరి మజిలీ వీలునామా!

ముందుచూపునకు నిదర్శనం వీలునామా. కుటుంబ ఆస్తులు, అప్పుల పంపకాలు.. నేత్రదానం.. ఇంకా చెప్పాలంటే 'దేహదానం'పై అంతా బాగున్నప్పుడే వీలునామా రాసిపెట్టుకునే ఆనవాయితీ తెలిసిందే. ఈ కోవలోకి ఒక సరికొత్త వీలునామా వచ్చి చేరింది. అదే తన 'ఆఖరి చికిత్స' ఎలా ఉండాలనుకుంటున్నారో స్పష్టంగా ముందే రాసుకునే వీలునామా! కోర్టు మార్గదర్శకాల వెలుగులో మొగ్గ తొడిగిన ఆధునిక వ్యవస్థ. దీన్ని చట్టబద్ధంగా నమోదు చెయ్యటంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముంబైలో ఓ ప్రైవేటు క్లినిక్ ప్రతి శనివారం ప్రత్యేక ఓపీ సేవలందించటం కూడా ప్రారంభించింది. దేశంలోనే తొలి 'లివింగ్ విల్' పుట్టు పూర్వోత్తరాలు చదవండి!

ఆధునిక వైద్య సదుపాయాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో.. మంచాన పడిన దాదాపు ప్రతి మనిషీ పెద్దాసుపత్రి ఐసీయూలోనే అంతిమ శ్వాస విడుస్తున్న పరిస్థితి నెలకొంది. కురువృద్ధులకైనా ఐసీయూ చికిత్సల అనివార్యత ఓ ఆనవాయితీగా స్థిరపడుతున్న సంధి కాలం ఇది. ఈ స్థితిలో 'ఆఖరు మజిలీలో అనవసర ఆర్భాటపు చికిత్సలు, ఆస్తుల్ని కరిగించే కొండంత అప్పుల వేదన మన కుటుంబాలకు అవసరమా?' అని కొందరు ఆలోచనా పరులు ప్రశ్నిస్తున్నారు. తమకు మటుకు అటువంటి చివరి మజిలీ వీడుకోలు వద్దని, భీష్ముడిలా గౌరవంగా సహజ మరణం పొందే అవకాశాన్ని ఇవ్వాలని వీలునామాలు రాస్తున్నారు. ముంబై వాసులు కొందరు ఇలా వినూత్న వీలునామాలు రాయటమే కాదు, కోర్టు సాయంతో ఈ సజీవమైన వీలునామా (లివింగ్ విల్)కు చట్టబద్ధతను సంతరింపజేశారు. ఈ కోవలో ముందు నడిచిన వ్యక్తి 55 ఏళ్ల సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ నిఖిల్ దాతర్.



- సాక్షి, స్పెషల్ డెస్క్

లివింగ్ విల్ అంటే?

మనిషి ఎంత కూడబెట్టాడన్నది కాదు.. ఎంత సుఖంగా కన్నుమూశాడన్నది ముఖ్యం అంటారు పెద్దలు. ఈ ఆలోచన నుంచి పుట్టిందే లివింగ్ విల్ భావన. నయంకాని రోగాలతో మంచాన పడి, నిర్ణయం తీసుకోలేని స్థితిలో కటుంబ సభ్యులు మరణం ముంగిట ఉన్నప్పుడు కుటుంబ సభ్యులు ఏ నిర్ణయం తీసుకోవాలనే సంకట స్థితిని ఎదుర్కోకుండా 'లివింగ్ విల్' స్పష్టత ఇస్తుంది. సహజంగా మరణించాల్సిన చివరి క్షణాల్లో ఐసీయూ, వెంటిలేటర్ వంటి చికిత్సలు చేయించాలా వద్దా అనేది ముందే రాసి పెట్టుకోవటానికి వ్యక్తులకు ఈ వీలునామా దోహదపడుతుంది. అందువల్ల ఈ వీలునామాకు 'అడ్వాన్స్ మెడికల్ డైరెక్టివ్స్' అనే పేరొచ్చింది. ప్రాణ రక్షణకు ఇక చేయగలిగిందేమీ లేని విషమ స్థితిలో ఉన్నప్పుడు కూడా ఐసీయూలో వెంటిలేటర్ పెట్టడం వంటి పనులు చెయ్యనక్కరలేదని ముందే రాసుకోవటమే ఈ వీలునామా పరమార్థం.

ఇందులో ఏముంటుంది?

ఆఖరి మజిలీ చికిత్సలు ఏవిధంగా ఉండాలన్న అంశంపై రాసుకునే వీలునామా గురించి సుప్రీం కోర్టు 2018లో ఒక తీర్పులో పేర్కొంది. దాని ప్రకారం.. 18 ఏళ్లు నిండిన ఇద్దర్ని (ఒకరు కుటుంబ సభ్యులు, మరొకరు స్నేహితులు లేదా సహోద్యోగి) లివింగ్ విల్‌లో నామినీలుగా పేర్కొనాలి. ఆ వ్యక్తికి అనారోగ్య సమస్య వచ్చినప్పుడు ఆయన కోరిన విధంగా వీరు అమలు చేయించాలి. మెకానికల్ వెంటిలేషన్, ఫీడింగ్ ట్యూబులు, సీపీఆర్, డయాలసిస్ చెయ్యాలా? పాలియేటివ్ కేర్ లేదా పెయిన్ రిలీఫ్ కేర్ మాత్రమే చెయ్యాలా? అనేది స్పష్టంగా విల్‌లో రాయాలని నిర్దేశించింది. ఈ నేపథ్యంలో లివింగ్ విల్ నిబంధనల విషయంలో 2023లో సర్వోన్నత న్యాయస్థానం కొన్ని సడలింపులు ఇచ్చింది. ఆ తర్వాత, డాక్టర్ నిఖిల్ ముసాయిదా లివింగ్ విల్‌ను రూపొందించారు.

మున్సిపల్ అధికారులే...

వీలునామాలు రాస్తారు సరే.. వీటిని ఏ అధికారి ఎక్కడ నమోదు చేస్తారు? అవసరం వచ్చినప్పుడు ఎలా వెలికితీస్తారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఈ అంశాలపై స్పష్టత కోసం డా. నిఖిల్.. బాంబే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దాంతో, లివింగ్ విల్‌లను మున్సిపల్ అధికారులు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత తొలి లివింగ్ విల్‌ను డాక్టర్ నిఖిల్ నమోదు చేసుకున్నారు. బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)లోని వార్డుల్లో మెడికల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ల వద్ద ఇప్పటికి 40 మంది తమ లివింగ్ విల్‌లను రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 50 నుంచి 80 ఏళ్ల వయస్కులు ఉన్నారు. వీటిని బీఎంసీ వెబ్‌సైట్‌లో భద్రపరుస్తున్నారు. త్వరలో ఆన్‌లైన్‌లో కూడా వీటిని నమోదు చేసుకునే ఏర్పాట్లు చేస్తున్నట్లు బీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డా. భూపేంద్ర పాటిల్ తెలిపారు.

అనవసరమైన హింస ఎందుకు?

'నా స్నేహితుడు జబ్బుపడి సొంత వారిని కూడా గుర్తుపట్టలేని స్థితికి చేరుకున్నారు. అతన్ని ఐసీయూలో చేర్చిన కుటుంబ సభ్యులు సుమారు రూ.50 లక్షలు ఖర్చు పెట్టారు. చివరికి మనిషి దక్క లేదు. పైగా, బతికినా అతను సొంత మనుషులను కూడా గుర్తుపట్టలేని స్థితి. అలాంటప్పుడు ఐసీయూలో వైద్యం చేయించటం ఎందుకు? ఆర్థికంగా, మానసికంగా అనవసరమైన హింస పడటం ఎందుకు?' అని ముంబైకి చెందిన 60 ఏళ్ల చార్టర్డ్ అకౌంటెంట్ ప్రఫుల్ పురానిక్ అంటున్నారు. అందుకే తనకైతే ట్యూబులు వేయటం, ఐసీయూలో చికిత్స వద్దే వద్దు.. గౌరవంగా వెళ్లిపోనిస్తే చాలు అంటూ లివింగ్ విల్‌లో ఆయన పేర్కొన్నారు.

తొలి లివింగ్ విల్ క్లినిక్

ముంబైలోని పి.డి. హిందూజ ఆసుపత్రి దేశంలోనే తొలి లివింగ్ విల్ క్లినిక్‌ను ప్రారంభించింది. ఆసక్తి కల వారికి అవగాహన కల్పించేందుకు వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం రెండు గంటల పాటు ఈ క్లినిక్‌లో అవుట్ పేషంట్ సేవలు అందిస్తున్నారు. లివింగ్ విల్ రాసే వ్యక్తికి లేదా కుటుంబ సభ్యులకు నియమ నిబంధనలు ఏమిటి, ఏయే డాక్యుమెంట్లు అవసరమవుతాయి, అమలు తీరు తెన్నులను వివరించటం వంటి సేవలు అందిస్తున్నారు.

అనేక దేశాల్లో ఉన్నదే..

చట్టబద్ధమైన రీతిలో లివింగ్ విల్ రాయటం అనే ప్రక్రియ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, కొలంబియా, డెన్మార్క్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో అమల్లో ఉంది. చాలా దేశాల్లో దీనికి చట్టబద్ధత ఉంది.

ఓబీసీల కోసం ప్రత్యేక ప్రణాళిక

ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే
- సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం
- బీసీనని చెప్పుకునే మోదీ 11 ఏళ్లలో బీసీలకు చేసిందేమీ లేదు
- ఓబీసీల కోసం ఇక రెట్టింపు వేగంతో పని చేయబోతున్నా: రాహుల్‌గాంధీ
- తెలంగాణలో చేసిన కులగణన ఓ రాజకీయ భూకంపమని వ్యాఖ్య
- ఏఐసీసీ ఓబీసీ విభాగం 'భాగీదారీ న్యాయ సమ్మేళనం'లో నేతలు


'భాగీదారీ న్యాయ సమ్మేళనం'లో బీసీ నేతలతో కలిసి అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ. చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి, మధుయాష్కీ, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి కొండా సురేఖ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: ఓబీసీల అభ్యున్నతి, సంక్షేమం కోసం కొత్త పథకాలు తీసుకురావాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. వెనుకబడిన వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందజేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. ఓబీసీలను అభ్యున్నతి వైపు ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై పార్టీ ఆధ్వర్యంలో ఒక నక్షా (ప్రణాళిక) సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. విభజించి పాలించడమే మోదీ ప్రభుత్వ విధానమని దుయ్యబట్టారు. తాను బీసీనని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ గడచిన 11 ఏళ్లలో ఓబీసీల కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. శుక్రవారం ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో ఏఐసీసీ ఓబీసీ విభాగం నిర్వహించిన 'భాగీదారీ న్యాయ సమ్మేళనం'లో ఆయన మాట్లాడారు.

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ విషం లాంటివి..

'తెలంగాణలో ప్రతి సామాజిక వర్గానికి సంబంధించి ఒక నివేదిక తయారు చేశారు. కర్ణాటకలో కూడా చేస్తున్నారు. దాని ఆధారంగా వారికి పథకాలు రూపొందిచాలని ముఖ్యమంత్రులకు సూచించాం. సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరాం. తెలంగాణ, కర్ణాటక సర్వేల్లో అగ్రకులాలకు చెందినవారు 5, 10 శాతం ఉన్నారని తెలుస్తోంది. వీళ్లే ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎందుకంటే వీళ్ల దగ్గర విద్య, మానసిక బలం ఉంది. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ విషం లాంటివి. ఆ విషాన్ని ఒక్కసారి రుచి చూద్దామనుకుంటే చనిపోతారు. ఓబీసీ కులగణన చేయాలని మొట్ట మొదటిసారిగా రాహుల్‌గాంధీ చెప్పారు. గతంలో ఎవరూ చెప్పలేదు. అలాంటి రాహుల్‌గాంధీకి మద్దతిస్తారా? లేక దేశాన్ని ముక్కలు చేసేవారికా? ఆలోచించుకోవాలి..'అని ఖర్గే అన్నారు.

మోదీ అబద్ధాలకు సర్దార్

'బీసీ అయిన నన్ను కాంగ్రెస్ వాళ్లు వేధిస్తున్నారని ప్రధాని మోదీ పదే పదే అంటున్నారు. మేము కాదు.. మోదీయే అందరినీ వేధిస్తున్నారు. అందరినీ మట్టిలో కలిపేసి ఆయన ఒక్కడే సజీవంగా ఉండాలనుకుంటున్నారు. మోదీజీ ఎప్పుడూ అబద్ధాలే చెబుతారు. ఆయన అబద్ధాలకు సర్దార్. పార్లమెంటులో కూడా అసత్యాలు చెబుతారు. అబద్ధాలు చెప్పే ప్రధాని దేశం, సమాజానికి మంచి చేయలేరు..'అని ఖర్గే ధ్వజమెత్తారు.

ఓబీసీ వర్గాలను రక్షించుకోవడంలో వెనుకబడ్డా: రాహుల్‌గాంధీ

ఓబీసీ వర్గాన్ని రక్షించే విషయంలో నేను వెనుకబడ్డా. మీ సమస్యలను ఆ సమయంలో నేను లోతుగా అవగాహన చేసుకోలేదు. 10, 15 ఏళ్ల ముందు దళితులు, ఆదివాసీల సమస్యలను అర్థం చేసుకోగలిగా. కానీ ఓబీసీల సమస్యలను లోతుగా అర్థం చేసుకోలేకపోయా. ఇది కాంగ్రెస్ పార్టీ తప్పు కాదు.. కచ్చితంగా నా తప్పే. ఆ సమయంలోనే కులగణన చేయించి ఉంటే..ఇప్పుడు నేను చేయించాలనుకున్నట్లుగా ఉండేది కాదు. ఓబీసీల కోసం ముందుగా నేను చేయలేకపోయిన పనిని ఇప్పుడు రెట్టింపు వేగంతో చేయబోతున్నా..'అని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తెలిపారు.

తెలంగాణ సర్కారు వద్ద ఉన్న డేటాకు తిరుగులేదు..

'తెలంగాణలో చేసిన కులగణన ఒక రాజకీయ భూకంపం. అది దేశ రాజకీయాలను కుదిపేసింది. దాని తర్వాత పరిణామాలు ఇంకా మీరు చూడలేదు. గతంలో ఒకసారి సునామీ వచ్చింది. రెండు మూడు గంటల తర్వాత దాని ప్రభావం కనిపించింది. అదే తెలంగాణలోనూ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం చేతుల్లో ఉన్న డేటాకు దేశంలో ఎక్కడా ఎదురులేదు. ఆ డేటా ఆధారంగా తెలంగాణలోని మొత్తం కార్పొరేట్ సంస్థల్లో ఎంతమంది ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ఉన్నారనేది ఒక్క నిమిషంలోనే చెప్పవచ్చు. అయితే తెలంగాణలో కార్పొరేట్లలో ఎంతమంది ఓబీసీ యజమానులు, దళిత యజమానులు ఉన్నారు? అక్కడ లక్షలు, కోట్ల రూపాయల ప్యాకేజీలు లభిస్తాయి. కానీ ఓబీసీలకు ఎంత ప్యాకేజీ లభిస్తోందని అడిగితే..నేను జీరో అంటాను. అక్కడ దళితులు, ఓబీసీలు, ఆదివాసీల్లో ఎవ్వరికీ ఇలాంటి ప్యాకేజీలు దక్కడం లేదు. దేశంలో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలే కూలీ పనిచేస్తారు..'అని రాహుల్ పేర్కొన్నారు.

ఉత్పాదక శక్తికి గౌరవం దక్కాలి

'ఏ దేశాన్ని అయినా నడిపించేది ఉత్పదక శక్తే. అలాంటి శక్తికి దేశం ఏం ఇస్తోంది? రోడ్లు, భవనాలు, కాలేజీలు, ఆసుపత్రులు, ఆలయాలు నిర్మించేది మీరే. ఈ పని కోసం దేశం మీకు ఏం ఇస్తోంది? నేను ఏదైనా అనుకుంటే అది సాధించే వరకు ఊరుకోను. కులగణన ఒక్కటే కాదు.. ఉత్పాదక శక్తికి దేశంలో గౌరవం దక్కాలన్నదే నా లక్ష్యం. దేశ ఉత్పాదక శక్తి చరిత్రను ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు కలిసి చెరిపేసే ప్రయత్నం చేశాయి. పాఠ్య పుస్తకాల్లో ఓబీసీల చరిత్ర ఎక్కడుంది? దేశంలో 55, 60 శాతం ఉన్న ఓబీసీల చరిత్రను కావాలనే చెరిపేశారు. ఎప్పుడైతే మీరు మీ చరిత్ర తెలుసుకుంటారో ఆ రోజు ఆర్‌ఎస్‌ఎస్ మీ శత్రువు అని తెలుసుకుంటారు. మా ప్రభుత్వాలు ఉన్నచోట ముందుగా కులగణన ఎక్స్‌రే, ఎంఆర్ఐ చేస్తాం. ఓబీసీలు ఎంత మంది ఉన్నారు? ఎక్కడున్నారు? భాగస్వామ్యం ఎంత? అనేది తేలుతుంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే కాదు.. జాతీయ స్థాయిలో కుల గణన, 50 శాతం అడ్డుగోడలు పడగొతాం..'అని కాంగ్రెస్ అగ్రనేత చెప్పారు.

ఇంగ్లిష్‌తో డబుల్ బ్యారెల్ ప్రోగ్రెస్

'చదువు ఉన్నవారు వేగంగా అభివృద్ధి చెందుతారని తెలంగాణ సర్వేలో తెలిసింది. విద్యతో పాటు మీ దగ్గర ఇంగ్లిష్ ఉంటే డబుల్ బ్యారెల్ ప్రోగ్రెస్ ఉంటుందని తేలింది. ఇంగ్లిష్‌ను దేశం నుంచి తొలగించేస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రాంతీయ భాషలు ఎంతో అవసరం. కానీ దాంతో పాటు ఇంగ్లిష్ కూడా అవసరం. అందుకే మా మూడో నినాదం ప్రైవేట్ విద్యా విధానంలో దళితులకు, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడమే..'అని రాహుల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోట్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ భగేల్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు స్ఫూర్తిని నింపాయి

పూర్తి స్థాయిలో సామాజిక న్యాయం జరిగేవరకు పోరాడతా... ఎక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోస్ట్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తనసుద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఎంతో స్ఫూర్తిని నింపాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'తెలంగాణలో కులగణన జరుగుతున్నప్పుడు తాను కొంత సందేహించానని, అయితే రేవంత్‌రెడ్డి తన అంచనాలకు మించి కులగణన విజయవంతంగా పూర్తి చేశారు'అంటూ రాహుల్‌గాంధీ చెబుతున్న వీడియోను ఆయన జతపరిచారు. రాహుల్‌గాంధీ మాటలు తెలంగాణలో సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అమలయ్యేంతవరకు ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించేలా తనకు ప్రేరణ కలిగించాయని ఆ ట్వీట్‌లో సీఎం రేవంత్ వెల్లడించారు.

ఇదండీ సంగతి (cartoon)



... నిన్నొకరినే కాదమ్మా ఆయన ప్రపంచాన్నే అదోలా చూస్తున్నారు...!!

తెలంగాణ మోడల్ సోషల్ జస్టిస్ 2.0

- భవిష్యత్ భారతానికి మార్గదర్శకం
- రాష్ట్ర కులగణన సర్వేకు రాహుల్‌గాంధీ కితాబు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక కుల గణన సర్వేపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశంసలు కురిపించారు. తెలంగాణ మోడల్‌ను 'సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయం)- 2.0'గా అభివర్ణించారు. ఇది భవిష్యత్ భారతానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం 'ఎక్స్'లో అయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 'తెలంగాణ రాష్ట్ర సృష్టికి సోనియాజీ చేసిన పోరాటం.. మాకు తెలంగాణ రాష్ట్ర ప్రజలతో, భాషతో, సంస్కృతితో ఉన్న లోతైన భావోద్వేగ సంబంధాన్ని మరింత సుస్థిరం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతరీతిలో సామాజిక-ఆర్థిక కుల సర్వే నిర్వహించింది. నిజాయితీగా, సంపూర్ణంగా, సంప్రదింపులతో కూడిన ప్రక్రియను అమలు చేసింది. ఇది భవిష్యత్‌లో జరిగే జనగణనకు ప్రామాణికంగా నిలవాలి..' అని రాహుల్ ఆకాంక్షించారు.

సర్వే ఆధారంగా రిజర్వేషన్లు

'కులగణన సర్వే ఆధారంగా ఓబీసీలకు స్థానిక సంస్థలలో, విద్యా రంగంలో 42% రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. దీనికి సంబంధించి బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందింది. ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. తెలంగాణ మోడల్ దూరదృష్టితో కూడినది. సమగ్రతను ప్రతిబింబించేది, డేటా ఆధారంగా ముందుకు సాగేదిగా ఉంది. ఇది సామాజిక న్యాయానికి కొత్తగా దారితీసే 2.0 వెర్షన్. ఇది దేశ ప్రగతికి దిక్సూచి అవుతుంది' అని రాహుల్ స్పష్టం చేశారు.

సదుద్దేశంతోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

బీసీ బిల్లు ఆమోదానికి కేంద్రంపై బీజేపీ నేతలు ఒత్తిడి తేవాలి: కాంగ్రెస్ నేతలు


మాట్లాడుతున్న పొన్నం. చిత్రంలో కొండా సురేఖ, వాకిటి శ్రీహరి

సాక్షి, న్యూఢిల్లీ: విద్య, ఉద్యోగం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సదుద్దేశంతో తమ ప్రభుత్వం బీసీ బిల్లు తీసుకొచ్చిందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులు ఆమోదం పొందేలా రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేదంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. శుక్రవారం ఢిల్లీలోని తాల్‌కటోరా స్టేడియంలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం నిర్వహించిన 'భాగీదారీ న్యాయ సమ్మేళనం'లో పాల్గొన్న అనంతరం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి పున్న కైలాశ్ నేతతో కలిసి తెలంగాణ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.

ఐక్యంగా ఉంటే.. భవిష్యత్ బీసీలదే

భవిష్యత్ అంతా బీసీలదే. బీసీ రిజర్వేషన్లు సాధించుకోవడం కోసం అందరం ఐక్యంగా ఉండాలి. దశాబ్దాల తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వస్తున్నాయి. బీజేపీ నేతలు బీసీల నోటి దాకా వచ్చిన కూడును తన్నే ప్రయత్నం చేయొద్దు.

– మంత్రి పొన్నం ప్రభాకర్

మతం పేరుతో రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారు

ఒక వైపు ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తామంటూనే.. మతం పేరిట తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఆమోదిస్తారా? లేక రిజక్ట్ చేస్తారా? అనేది ఏదో ఒకటి తేల్చి చెప్పండి.

– మంత్రి కొండా సురేఖ

సకల జనుల సమ్మెకు మించిన ఉద్యమం చూస్తారు

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే తెలంగాణ సాధన కోసం జరిగిన సకల జనుల సమ్మెను మించిన ఉద్యమాన్ని కేంద్రం చూడాల్సి వస్తుంది. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలపై విమర్శలు చేయడం సరికాదు.

– మంత్రి వాకిటి శ్రీహరి

మా చిత్తశుద్ధిని శంకించడమా?

బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని పంపించాం. దానిని పక్కన పెట్టి మా పార్టీ చిత్తశుద్ధినే బీజేపీ నేతలు శంకించడం విడ్డూరం.

– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఏ జ్ఞానము చేత మోహము కలుగదో,
ఏ జ్ఞానము చేత సమస్త జీవరాసులలో ఆత్మను,
ఆత్మలో జీవరాసులున్నట్లు తెలియునో అట్టి జ్ఞానమును పొందగలవు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 26 జూలై 2025

అరకోటి మంది ఓటర్లెక్కడ?

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా నవీకరణ సుప్రీంకోర్టులో విచారణ దశలోనే వున్నా, పార్లమెంటులో అలజడి రేగుతున్నా ఆ ప్రక్రియ తన దోవన తాను ముందుకెళ్తున్నది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ గురువారం ఆ వ్యవహారం గురించి వెల్లడించిన వివరాల ప్రకారం, లక్షమందికి పైగా ఓటర్ల ఆచూకీ లేదు. 21.6 లక్షల మంది మరణించారు. మరో 31.5 లక్షల మంది శాశ్వతంగా వేరే చోటుకు వలసపోయారు. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు (బీఎల్ఓలు) అడుగుతున్నా, మరో ఏడు లక్షల మంది ఇంతవరకూ తమ పత్రాలు దాఖలు చేయలేదు. తాము ఫలానా చోట ఉంటున్నామని రుజువులు చూపక పోయినా, బతికే ఉన్నామని చెప్పకపోయినా లేదా తగిన పత్రాలు అందజేయక పోయినా ఈ 61 లక్షల మంది ఓటర్లు జాబితా నుంచి శాశ్వతంగా కనుమరుగవుతారు. రాష్ట్ర ఓటర్లలో వీరు 7.7 శాతం. శుక్రవారం సాయంత్రంతో వీరందరికీ గడువు ముగిసిపోయింది. సవరించిన ఓటర్ల జాబితా ఆగస్టు 1న విడుదలవుతుంది. అయితే సెప్టెంబర్ 1లోగా ఎవరైనా జాబితాలో తమ పేరు లేదని ఫిర్యాదు చేస్తే పరిశీలించి, తగిన పత్రాలున్న పక్షంలో వారిని చేర్చి తుది జాబితా విడుదల చేస్తారు. నకిలీ లేదా విదేశీయులుగా గుర్తించిన వారిని తొలగించటం కోసం ప్రారంభించిన ఈ ప్రక్రియ దేశ చరిత్రలోనే మొట్టమొదటిది. 'పరిశుద్ధమైన' ఓటర్ల జాబితా రూపకల్పనే తమ లక్ష్యమని జ్ఞానేశ్ చెబుతున్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ స్వచ్ఛతా కార్యక్రమాన్ని స్వాగతించాల్సిందే. ఎందుకంటే ప్రజాస్వామ్య వ్యవస్థ సక్రమంగా నడవాలంటే మెజారిటీ ఆమోదం పొందిన ప్రభుత్వాలు ఏర్పడాలి. ప్రజల ఆదరణ ఉన్నవారే పాలకులు కావాలి. నకిలీ ఓటర్లు లేదా ఈ దేశ పౌరులు కానివారు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే స్థితి ఉంటే ఆ ఎన్నికలే ప్రహసన ప్రాయమవుతాయి. ఎన్నికలు సజావుగా పూర్తవుతున్నాయన్న భావన వల్లే ఫలితాలు వెలువడ్డాక అధికార మార్పిడి శాంతియుతంగా పూర్తవుతోంది. గత దశాబ్దాలతో పోలిస్తే ఎన్నికల హింస గణనీయంగా తగ్గింది. ఇలాంటి కారణాల వల్లే విదేశాల ఎన్నికలకు మన ఈసీ అధికారులు పరిశీలకులుగా వెళ్తున్నారు. వారు సూచిస్తున్న మార్పులకు ఎంతో విలువ ఉంటున్నది.

కానీ గత ఏడాది, రెండేళ్లుగా ఈసీ వ్యవహార శైలిపై విమర్శలూ, ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. వాటిపై అసలే స్పందించకపోవటం లేదా మరిన్ని సందేహాలు కలిగే రీతిలో జవాబీయటం రాజకీయ పక్షాలకు ఆశ్చర్యం కలిగిస్తోంది. బిహార్ ఎన్నికల జాబితా సంగతే తీసుకుంటే సుప్రీంకోర్టు సూచించిన ఆధార్, రేషన్ కార్డు వగైరాలు పరిశీలనకు పనికి రావని అది ఎందుకు తిరస్కరించిందో అంతుపట్టదు. ఆధార్‌ను ప్రారంభించినప్పుడు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ కార్డే ఇకపై సర్వస్వమని, దాని ఆధారంగానే పథకాల వర్తింపు అయినా, పౌరుల గుర్తింపయినా ఉంటుందన్నారు. కానీ జరుగుతున్నది అందుకు విరుద్ధం. మరి విశ్వసనీయత లేని ఆధార్‌ను అన్నిటికీ అనుసంధానం చేయటం ఎందుకు? ఇప్పటికీ ఆ కార్డు సంపాదించటానికి సాధారణ పౌరులు తలకిందులవుతున్నారు. పుట్టిన చోటే నవజాత శిశువులకు ఆధార్ అందేలా తాజాగా కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అటువంటి కార్డు ఓటరు గుర్తింపునకు పనికిరాదని ఈసీ ఎలా చెబుతుందో అర్థంకాని విషయం. పౌరుల్ని గుర్తించటమనే ప్రక్రియ అన్యులకు అసాధ్యమని, కేవలం తామే సమర్థులమని ఆ సంస్థ చెప్పదల్చుకుంటే దాన్నెవరూ అంగీకరించరు.

ఎన్నికల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తటంపై ఆంధ్రప్రదేశ్ మొదలుకొని మహారాష్ట్ర, హరియాణాల వరకూ ఎన్ని ఉదాహరణలైనా చూపొచ్చు. ఏపీ సంగతే తీసుకుంటే... అక్కడ ఓటింగ్‌కు గడువు ముగిసి కేవలం ప్రాంగణంలో ఉన్న వారితో పోలింగ్ పూర్తి చేయటానికి అర్ధరాత్రి వరకూ సమయం పట్టింది. అలా వేచివున్నవారి సంఖ్య ఏకంగా 51 లక్షలు! ఇది నమ్మేలా ఉందా? ఇక పోలింగ్ శాతంపై మొదటి, చివరి ఈసీ ప్రకటనల్లోని అంకెల మధ్య 12.5 శాతం తేడా వచ్చింది. ఇది గతంలో ఎప్పుడూ ఒక శాతం మించిలేదు. ఇందువల్ల సగటున ఒక్కో అసెంబ్లీ స్థానంలో అదనంగా 28,000 ఓట్లు, లోక్‌సభ స్థానంలో 1.96 లక్షల ఓట్లు అమాంతం పెరిగిపోయాయి. తటస్థ సంస్థల లెక్కల ప్రకారం ఇది 87 అసెంబ్లీ స్థానాల గెలుపోటముల్ని తారుమారు చేసింది! వేరే రాష్ట్రాల్లోనూ ఇలాంటి ధోరణే కనబడిందని అక్కడి విపక్షాలు భగ్గుమంటున్నాయి.

ఈ సందేహాలకు సక్రమమైన జవాబు చెబితే బిహార్‌లో చేపట్టిన 'సర్'పై పెద్దగా అభ్యంతరాలు వచ్చేవి కాదేమో! కానీ ఆ సంస్థ తనకు తోచినప్పుడు మాట్లాడటం తప్ప జవాబుదారీతనాన్నీ, బాధ్యతాయుత వర్తననూ కనబరచటం లేదు. సందేహాలు పటాపంచలు చేద్దామన్న పట్టుదలను ప్రదర్శించటం లేదు. ఈసీ న్యాయబద్ధంగానే వ్యవహరిస్తున్నాననుకోవచ్చు. కానీ అలా అందరూ అనుకునేలా తన వ్యవహార శైలి వుండాలి. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థకైనా ఇది తప్పనిసరి. అందునా ప్రభుత్వాల తలరాతలను మార్చే కీలకమైన వ్యవస్థగా ఉన్న ఈసీకి ఇది మరింత ప్రాణప్రదం. దేశంలో ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుంచి వలసలు ఎక్కువవుంటాయి. అలాంటిచోట ఇంత తక్కువ వ్యవధిలో ఎక్కడెక్కడినుంచో పనులు మానుకుని వచ్చి ఓటర్లుగా నమోదు చేసుకోవటానికి అవసరమైన పత్రాలు సేకరించి సమర్పించటం బడుగు జీవులకు సాధ్యమేనా? అందుకే సర్వోన్నత న్యాయస్థానం సూచించిన ఇతర ప్రత్యామ్నాయాల గురించి కూడా ఈసీ పరిశీలించాలి. ఈ మాదిరి సవరణకు దేశవ్యాప్త ఆదరణ లభించాలంటే ఇది తప్పనిసరి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.విదియ రా.11.23 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఆశ్లేష సా.5.28 వరకు తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.6.14 నుండి 7.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.32 నుండి 7.17 వరకు, **అమృతఘడియలు:** ప.3.54 నుండి 5.24 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అమెరికా కొరివితో తల గోక్కుందామా?

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

అమెరికాతో కుదుర్చుకొనే వాణిజ్య ఒప్పందాలపై కీలకమైన చర్చలు జరపడానికి భారత విదేశీ వాణిజ్య శాఖకు చెందిన ఓ బృందం అమెరికాలో పర్యటించి ఇటీవలనే స్వదేశం చేరుకొంది. అమెరికా కొన్ని నిర్దిష్టమైన చర్యల్ని ప్రతిపాదిస్తోంది. ప్రధానంగా ఎగుమతులు, దిగుమతులపై భారత్ విధిస్తున్న అన్ని రకాల ఆంక్షల్ని ఎత్తివేయాలని పట్టుబడుతున్నది. అమెరికా సూచనలను, పెంచుతున్న ఒత్తిళ్లను ఇప్పటివరకూ భారత్ అంగీకరించకపోవటం ఊరట కలిగించేదే. కాగా, ఆగస్ట్ మొదటి వారంలోనే తుది నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్యత భారత్ ముందుంది.

అమెరికా ఒత్తిడి మేరకు వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలను 'ఓపెన్ అప్' చేసినట్లయితే... భారత్ నుంచి ఎగుమతుల మాట అటుంచి, అమెరికా నుంచి అన్ని రకాల వ్యవసాయ, పాల ఉత్పత్తులు భారత మార్కెట్లను ముంచెత్తుతాయి. ప్రారంభంలో మెట్రోలు, తర్వాత దేశంలోని అన్ని నగరాలు, పట్టణాలలో అమెరికా పండ్లు, కూరగాయలు... చివరకు ఆకుకూరలు, పూలు దర్శనమిచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

ముందు స్వేచ్ఛ, అటుపై సంకెళ్లు

1990 ముందువరకు 'జనరల్ అగ్రిమెంట్ ఫర్ ట్రేడ్ అండ్ టారిఫ్ (గాట్) వ్యవస్థ అధ్యక్షుడు ఆర్థర్ డంకెల్ ప్రతిపాదించిన అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్య సమాజంలో భారత్ భాగస్వామి కాలేదు. కానీ, 1991లో పీవీ నరసింహారావు ప్రధాని అయ్యాక దేశంలో మొదలైన ఆర్థిక సంస్కరణల పర్వంలో భారత్ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) భాగస్వామి అయింది. దీనివల్ల మన వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ పెరిగి మంచి ధర లొస్తాయనీ, నాసిరకం స్వదేశీ వస్తువులకు బదులుగా మేలు రకం విదేశీ వస్తువులు కారుచౌకగా అందుబాటులోకి వస్తాయనీ పాలకులు ఊదరగొట్టారు. బహుళజాతి సంస్థల ఉత్పత్తులు మనతో పాటు కొన్ని వర్ధమాన దేశాల్లో కొంత మేర చౌకగా లభించిన మాట నిజం. అయితే, దానివల్ల స్వదేశీ సంస్థలు శీఘ్రగతిన తమ ప్రాభవాన్ని కోల్పోయాయి. అనేకం మూతబడ్డాయి. మరికొన్నింటిని బహుళజాతి సంస్థలే హస్తగతం చేసుకొన్నాయి. మోన్‌శాంటో వంటి బహుళజాతి సంస్థలు దేశీయ విత్తన రంగాన్ని గుప్పిట్లో పెట్టుకునే అవకాశం ఏర్పడింది.

ఇప్పుడు అమెరికాతో కుదుర్చుకొనే వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాల ఉత్పత్తులు కూడా భాగమైతే... దేశీయ రైతాంగం కుదేలవడం తథ్యం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 'డెడ్ లైన్'ను లెక్క చేయకుండా భారత్ కచ్చితమైన వైఖరిని తీసుకోవాలనీ, లేదంటే అమెరికా వలలో ఇండోనేషియా చిక్కుకొన్నట్లు అవుతుందనీ 'గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ)' ఇప్పటికే హెచ్చరించింది. ట్రంప్ వ్యక్తిగతంగా ఫోన్లు చేసి ఇండోనేషియా, కంబోడియా దేశాధినేతల్ని అమెరికా ఒప్పందాలకు అనుకూలంగా సంతకాలు చేయించారని.. అటువంటి పరిస్థితి భారత్ తెచ్చు కోరాదని పలువురు వాణిజ్య నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు.



◆ భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాలు, సుంకాల ఖరారు వంటి అంశాలలో కచ్చితమైన అవగాహన రావడానికి తుది గడువు ఆగస్ట్ తొలివారంగా నిర్ధారణ అయిన నేపథ్యంలో– అమెరికా ఒత్తిళ్లకు భారత్ తలొగ్గుతుందేమోనన్న అనుమానాలు భారత రైతాంగాన్ని పీడిస్తున్నాయి. ప్రత్యేకించి, దేశీయ వ్యవసాయ రంగాన్ని సరళతరం చేసి రైతులకు ఉన్న రక్షణల్ని తొలగించి అమెరికా వ్యవసాయ మార్కెట్లకు ఎర్రతివాచీ పరుస్తారేమోనన్న భయాందోళనలు కలుగుతున్నాయి.

ఇండోనేషియాలో ఏం జరిగింది?

అమెరికాతో ఇండోనేషియా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ప్రకారం, అమెరికా నుంచి వచ్చే అన్ని రకాల వస్తువులపై ఆ దేశంలో ప్రస్తుతం విధిస్తున్న సుంకాల్లో 99 శాతం కోతపడింది. దాంతో ఇండోనేషియా పారిశ్రామిక, సాంకేతిక, వ్యవసాయ ఉత్పత్తుల రంగాలపై అమెరికా గుత్తాధిపత్యం వహించే పరిస్థితి ఏర్పడింది. మరోవిధంగా చెప్పాలంటే... దాదాపు సున్నా సుంకాల కారణంగా ఇండోనేషియా మార్కెట్లను అమెరికా ఉత్పత్తులు ముంచెత్తుతాయి. అందువల్ల ఇండోనేషియాలో స్వదేశీ పరిశ్రమలకు గిరాకీ లేక మూతపడతాయి. అక్కడి వ్యవసాయదారులు ఇకపై వ్యవసాయం విరమించుకోవాల్సిందే. అయితే ట్రంప్ దయతలచి ఇండోనేషియా నుంచి వచ్చే ఉత్పత్తులపై తమ దేశంలో ప్రస్తుతం విధిస్తున్న 40% సుంకాలను 19%కు తగ్గించారు. అంటే, ఇండోనేషియాలోని అన్ని రకాల ఉత్పత్తి రంగాలు... అమెరికా ఎగుమతుల మీదనే ఆధారపడాలి. ఏదో సామెత చెప్పినట్లు, చెయ్యోడిని వదిలి కాలోడిని పట్టుకొన్న చందంగా ఉంది.

ప్రపంచంలోనే భారత్ వ్యవసాయ మార్కెట్ పెద్దది. ప్రస్తుతం దేశంలో 3,323 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు పండుతుండగా, అందులో దేశీయ అవసరాలకు సుమారు 280 లక్షల మెట్రిక్ టన్నులు ఖర్చవుతున్నట్లు అంచనా. సగటున ఏటా 45 నుంచి 50 బిలియన్ల డాలర్ల ఆహారోత్పత్తులను భారత్ ఎగుమతి చేస్తోంది. 29 బిలియన్ల డాలర్ల మేర దిగుమతి చేసుకుంటోంది. ఇందులో పప్పుదినుసులు, వంటనూనెలు, పండ్లు, కూరగాయలు అధికం. దశాబ్దంగా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరుగుతున్నాయి. దానివల్ల వ్యవసాయ వాణిజ్య మిగులు క్రమేపీ తగ్గుతోంది.

పప్పు ధాన్యాలు, వంటనూనె గింజల ఉత్పత్తికి ప్రోత్సాహకాలు తగ్గిస్తూ... దిగుమతులపై విధించిన సుంకాలను గణనీయంగా తగ్గించడంతో కొందరు వ్యాపారస్తులు విదేశాల నుండి కారుచౌకగా వీటిని దిగుమతి చేసుకొంటూ దేశీయ రైతాంగం పొట్టకొడుతున్నారు. ఫలితంగా, రైతులు వీటి సాగును విరమించుకొంటున్నారు, లేదా తగ్గించుకొంటున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా దాదాపు 50% క్షీణించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

అమెరికాతో వ్యవసాయ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే... భారత్‌లోకి అమెరికా ఉత్పత్తులు మాత్రమే వస్తాయన్న గ్యారంటీ లేదు. చైనా లేదా మరికొన్ని దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకొని, వాటినే భారత్‌కు ఎగుమతి చేసే అవకాశం ఉందని వాణిజ్య నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే పరిస్థితి మరింత దుర్భరం అవుతుంది.

భారత్ ఎగుమతి మార్కెట్లపై అమెరికా కన్ను

భారత్ ఎగుమతి మార్కెట్లను సైతం అమెరికా దెబ్బకొట్టడానికి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా, జపాన్‌పై విధించిన 25 శాతం దిగుమతి సుంకాన్ని 15 శాతానికి తగ్గించారు. దానివల్ల జపాన్ ఇప్పటివరకు భారత్ నుంచి దిగుమతి చేసుకొంటున్న బియ్యాన్ని కాదని, అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి మొగ్గుచూపుతోంది.


ఈ నేపథ్యంలోనే వాణిజ్య ఒప్పందాలలో వ్యవసాయ, పాల ఉత్పత్తి రంగాలను పూర్తిగా మినహాయించాలని 'ఇండియన్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఫార్మర్స్ మూమెంట్ (ఐసీసీఎఫ్ఎం)' కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అమెరికా తన దేశీయ రైతాంగానికి ఏటా సగటున వ్యవసాయ బడ్జెట్‌లో 1.5 ట్రిలియన్ డాలర్ల మేర సబ్సిడీలు అందిస్తూ, వాటిని విదేశీ మార్కెట్లలో లాభసాటిగా అమ్ముకోవడం ద్వారా సబ్సిడీల మొత్తానికి పదింతలు లాభాల్ని ఆర్జిస్తోంది. ఇటువంటి సూత్రాలను అన్ని రంగాలలో అమలు చేస్తున్న అమెరికాతో భారత్ సరైన ప్రాతిపదిక లేకుండా ఒప్పందం కుదుర్చుకోవడం అంటే కొరివితో తల గోక్కోవడమే.

ప్రస్తుతం 70 కోట్ల మంది భారతీయులు బతుకు తెరువు కోసం వ్యవసాయ రంగం మీదనే ఆధారపడుతున్నారు. దేశ ప్రజలకు ఆహార భద్రత అందిస్తూ, గ్రామీణ ప్రాంత అభివృద్ధికి, స్థిరమైన ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్న వ్యవసాయ, పాడి రంగాలకు సంబంధించి తీసుకొనే ప్రతి నిర్ణయమూ జాతి ప్రయోజనాల కోణంలో ఉండాలి.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు, కేంద్ర మాజీ కేంద్రమంత్రి

చదువు–సంస్కారం కోరుకున్న మనిషి

సందర్భం



బండారు దత్తాత్రేయ

టి.వి. నారాయణ (తక్కెళ్ల వెంకట నారాయణ) గారు 1925 జూలై 26న సికింద్రాబాదులోని బొల్లారంలో వెంకయ్య, నర్సమ్మ దంపతులకు జన్మించారు. ఆ రోజుల్లో సామాజిక అసమానతలకు, అంటరానితనానికి గురైనా, విద్యకు నోచుకోని దళిత సమాజంలో ఒక సామాన్య పేద కుటుంబంలో జన్మించినా వాటినన్నింటిని తట్టుకొని ప్రాథమిక విద్యను బొల్లారంలో, కళాశాల విద్యను నిజాం కాలేజీలో అభ్యసించారు. అంతటితో ఆగకుండా బెనారస్‌లోని హిందూ విశ్వ విద్యాలయంలో ఆంగ్లంలో పీజీ విద్యను, కర్ణాటకలో పీహెచ్‌డీని పూర్తి చేసుకున్నారు.

నారాయణ నిత్య విద్యార్థి. అన్ని విషయాల్లో నిష్ణాతుడు. అకుంఠిత దీక్షతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహనీయుడు. వీరి సతీమణి టి.ఎన్. సదాలక్ష్మి మాజీ మంత్రివర్యులు, తెలంగాణ ఉద్యమకారిణి, మంచి సాహసి. నాకు 1980లో తొలినాళ్లలో రాజకీయాల్లో ఎలా పనిచేయాలో తెలియజేశారు.

నారాయణ తెలంగాణ విమోచన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. నిరంకుశ నిజాం పాలన నుండి విముక్తి కోసం రజాకార్ల మీద పోరాటంలో భాగంగా స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో పనిచేసి జైలుకు సైతం వెళ్లి వచ్చారు. రజాకార్ల నుండి తప్పించుకోవడానికి అండర్ గ్రౌండ్‌కు కూడా వెళ్ళారు.

నారాయణ గారు మొదట్లో పాఠశాల ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి, స్కూల్స్ ఇన్‌స్పెక్టర్‌గా, సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా, బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సెక్రటరీగా పనిచేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ హోదాలో పదవీ విరమణ చేశారు. తదనంతరం 1978–80 కాలంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్ గానూ సేవలు అందించారు.



'పద్మశ్రీ' డా॥ టి.వి. నారాయణ శత జయంతి నేడు

◆ ఈ సేవా కార్యక్రమాలకు ఏ పేరు పెడదామని ఆలోచిస్తుండగా, ఆయనే స్వయంగా 'సేవా భారతి' అని నామకరణం చేశారు. ఇందులో చేపట్టే సంస్కార కేంద్రాల సిలబస్‌ను సైతం తయారు చేశారు.

ఆయన ఆర్య ప్రతినిధి సభ రాష్ట్ర అధ్యక్షుడిగానూ పని చేశారు. సామాజిక సేవలో భాగంగా వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం 'బంధు సేవ మండలి'ని స్థాపించారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో వారిలో పూర్తి స్వదేశీ భావన ఉండేది. ఎల్లప్పుడూ ఖాదీ వస్త్రాలను ధరించి వాటి వాడకాన్ని విరివిగా ప్రోత్సహించారు. వారి మాటల్లో, వేషంలో, ఆచరణలో అది స్పష్టంగా కనిపించేది.

ఆయన మంచి రచయిత. నిర్మాణాత్మకమైన సూచనలతో, జీవిత విలువల గురించి భారతీయ ఉపనిషత్, వేదాలలో ఉన్న అనేక అంశాలను వివరిస్తూ పుస్తకాలు రచించారు. వారి సేవలను గుర్తించిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2016లో వారిని 'పద్మశ్రీ'తో గౌరవించింది. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 'దళిత రత్న' పురస్కారం అందుకున్నారు.

నేను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)లో ఉమ్మడి రాష్ట్ర సేవ ప్రముఖ్‌గా నియమితులైన తరువాత, హైదరాబాద్‌లోని దళిత బస్తీల్లో సేవా కార్యక్రమాలు చేపట్టాం. దోమలగూడలోని పూల్ బాగ్ బస్తీలో దళిత పిల్లలను చేరదీసి వారు ప్రాథమికంగా శారీరక శుభ్రత పాటించేలా చర్యలు తీసుకునేవాళ్ళం. ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న నారాయణ 'ఇది చాలా మంచి కార్యక్రమం' అని ఎంతగానో ప్రోత్సహించారు. తాను కూడా ఇందులో భాగం అవుతానని అన్నారు. ఈ సేవా కార్యక్రమాలకు ఏ పేరు పెడదామని ఆలోచిస్తుండగా, ఆయనే స్వయంగా 'సేవా భారతి' అని నామకరణం చేశారు. ఇందులో చేపట్టే సంస్కార కేంద్రాల సిలబస్‌ను సైతం తయారు చేశారు. వేదాల సారాంశం, సుమతీ శతకాలు, రామాయణ శ్లోకాలు సేకరించి వాటిని పిల్లలకు బోధించే ఏర్పాటు చేశారు. ఆ యా సంస్కార కార్యక్రమాలు పేద, దళిత విద్యార్థుల్లోకి అత్యధికంగా తీసుకెళ్లాలని సూచించారు. తదనుగుణంగానే హైదరాబాద్‌లో వీటిని విస్తృతంగా నిర్వహించాం.

నేను రాజకీయాల్లోకి ప్రవేశించిన తరువాత కూడా ఆయన నన్ను ఎంతో ఆత్మీయతతో ప్రోత్సహించారు. నేను కేంద్ర మంత్రి అయ్యాక వారి ఇంటికి వెళ్తే నన్ను ప్రేమగా ఆశీర్వదించి, సన్మానించి సంతోషించారు. నారాయణ గారి శతజయంతి సందర్భంగా మనం అందరం కూడా విద్య పట్ల వారికున్న శ్రద్ధను; పేదలు, దళితుల పట్ల వారి అనురాగాన్ని; దేశం, ధర్మం మీద వారి చింతనను ఆదర్శంగా తీసుకోవడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

వ్యాసకర్త మాజీ గవర్నర్

ఉన్నత విద్యకు డిజిటల్ వేగం

అభిప్రాయం



ప్రొ॥ వి. బాలకిష్టారెడ్డి

భారత దేశ ఉన్నత విద్యకు ఓ విశిష్టత ఉంది. సవాళ్ళ మధ్యే పురోగతి సాధించడం దీని ప్రత్యేకత. దశాబ్ద కాలంలోనే ఉన్నత విద్యా సంస్థలు గణనీయంగా పెరిగాయి. 2013లో 651 యూనివర్సిటీలు ఉంటే, 2022 నాటికి 1,100కు చేరాయి. ఇదే కాలంలో కాలేజీల సంఖ్య 31,324 నుంచి 45 వేలకు పెరిగింది. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు ఇప్పుడు 4.14 కోట్లు దాటారు. ఇందులో మహిళల వాటా 49 శాతం.

అయితే, మార్కెట్ అవసరాలకు తగ్గ నైపుణ్యం విద్యార్థుల్లో లేకపోవడం వారి ఉపాధి అవకాశాలను తగ్గిస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య మౌలిక వసతులలో ఉన్న భారీ అంతరం మరో ప్రధాన సమస్య. టెక్నాలజీలో అధ్యాపకుల కొరత, పరిశోధనా రంగంలో తగిన నాణ్యత లేకపోవడం వంటివి కూడా ఆలోచించించాల్సిన సమస్యలే. అయితే డిజిటల్ టెక్నాలజీ ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది.

మారిన విద్యాస్వరూపం

కోవిడ్ తర్వాత ఉన్నత విద్య స్వరూపమే మారిపోయింది. డిజిటల్ బోధన అనివార్యంగా తెరపైకి వచ్చింది. ఇంటర్నెట్ అనుసంధానం, రిమోట్ లెర్నింగ్ సర్వసాధారణమైంది. కృత్రిమ మేధ, వర్చువల్ రియాలిటీ, వెబ్ ఆధారిత బోధనలే ఇక భవిష్యత్‌ను శాసిస్తాయనడం అతిశయోక్తి కాదు. అయితే, డిజిటల్ విద్యకు మౌలిక సదుపాయాలే కీలకం. సరైన అధ్యాపక వర్గమే ఆయువు పట్టు. బోధకులు, విద్యార్థులు ఇరువురిలో డిజిటల్ నైపుణ్యాలు ఉండి తీరాలి. 'డిజిటల్ సాధనాల ద్వారా విద్యను బలోపేతం చేయాలి' అన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు సాంకేతికత ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ, లెర్నింగ్ ఎనలిటిక్స్ ఇక మీదట విద్యారంగ పురోగతికి అదనపు సాధనాలుగా మారబోతున్నాయి.

కోవిడ్ మహమ్మారి వచ్చేనాటికి (2019) కంప్యూటర్, ఇతర డిజిటల్ డివైస్‌ల గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రాథమిక అవగాహన మాత్రమే ఉండేది. కోవిడ్ తర్వాత విద్యారంగంలో వీటి ప్రాధాన్యం అనూహ్యంగా పెరిగింది. తరగతి బోధనలో టచ్ స్క్రీన్లు, ప్రొజెక్టర్లు, ఆన్‌లైన్ నోట్‌బుక్స్, వాట్సాప్ మెసేజ్‌లు అంతర్భాగమయ్యాయి. జ్ఞాన సముపార్జనను టెక్నాలజీ మరింత సులభతరం చేసింది. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీ రంగ ప్రవేశం తర్వాత సరికొత్త బోధనా పద్ధతుల వైపు వెళ్ళాల్సి వస్తోంది.



◆ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ, లెర్నింగ్ ఎనలిటిక్స్ ఇక మీదట విద్యారంగ పురోగతికి అదనపు సాధనాలుగా మారబోతున్నాయి. అయితే, ఈ సాంకేతికతను అందుకోవడంలో గ్రామీణులు వెనుకబడిపోతున్నారు. ఈ వెనుకబాటుతనం పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలను మరింత పెంచే ప్రమాదం ఉంది. సాంకేతిక విప్లవంలో గ్రామీణులనూ భాగస్వాములను చేయడానికి చర్యలు చేపట్టాలి.

సాంకేతిక పునాదులు

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వాలు అందరికీ నాణ్యమైన విద్యను అందించడంపైనే దృష్టి పెట్టాయి. ఐఐటీల స్థాపన తర్వాత టెక్నాలజీతో కూడిన విద్యలో మార్పులు జరిగాయి. మౌలిక వసతుల కల్పన అవసరమైంది. ఈ కాలంలోనే శిక్షణా ప్రయోగశాలలు, గ్రంథాలయాలు అందుబాటులోకి వచ్చాయి. పరిశోధనలూ ఊపిరి పోసుకున్నాయి. ఇవన్నీ విద్యా వ్యవస్థ ఆధునీకరణకు తోడ్పడ్డాయి. 1970–80ల మధ్య యూనివర్సిటీలు ఆడియో విజువల్ సాధనాల వైపు వెళ్ళాయి. క్లాస్ రూముల్లోకి డిజిటల్ బోధన ప్రవేశించేలా వేగం పెరిగింది. 2009 తర్వాత హై స్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం, మార్పుల వేగాన్ని మరింత పెంచింది.

ఇదే కాలంలో ప్రైవేటు వర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీలూ పెరిగాయి. కంప్యూటర్ ఆధారిత బోధనా పద్ధతులు వచ్చాయి. డిజిటల్ అవగాహనతో కూడిన బోధనా విధానాలు అనివార్యమయ్యాయి. 2017లో 'స్వయం' ప్లాట్‌ఫామ్ సరికొత్త విప్లవాన్ని సృష్టించింది. ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సులభతరమైన మూల్యాంకన పద్ధతులు, డిజిటల్ లైబ్రరీలు విద్యా వనరులను పెంచాయి.

సాంకేతికత ఉన్నత విద్యలో మార్పులు తెచ్చినా... ఇది గ్రామీణ ప్రాంతాలకు ఇప్పటికీ అంతగా వెళ్ళలేదనే చెప్పాలి. డిజిటల్ మౌలిక వసతుల కొరత కనిపిస్తోంది. వర్చువల్ ప్రయోగశాలలు పల్లెపల్లెకూ చేరాలి. ఆన్‌లైన్‌లోనే ప్రయోగాలు నిర్వహించే కాలమిది. భౌతిక ప్రయోగశాలలు లేని ప్రాంతాల్లో ఇది మంచి మార్పు తెస్తుంది. ఈ దిశగా వేగంగా అడుగులు పడాలి. ఇవన్నీ పరిశోధన రంగానికి కొత్త బలాన్ని ఇస్తాయి.

'నేషనల్ అకడమిక్ డిపాజిటరీ' ఆవిష్కరణతో విద్యార్థి అన్ని సర్టిఫికెట్లు డిజిటల్ రూపంలో భద్రంగా ఉంటాయి. 'బ్లాక్‌చైన్' సాంకేతికత ద్వారా డేటాను భద్రంగా ఉంచుతున్నారు. ఆన్‌లైన్ నివేదికలు, డిజిటల్ పాఠ్య సామగ్రి, వ్యవస్థీకృత విద్యా విధానాల వేగం మరింత పెంచేందుకు కృషి జరగాలి.

కోవిడ్ తర్వాత ఊహాతీతంగా వెబ్‌నార్లు, సెమినార్లు, వర్క్‌షాపులు సర్వసాధారణం అయ్యాయి. ఆన్‌లైన్ వ్యవస్థకు అధ్యాపకులూ అనుసంధానం అవ్వాల్సి వచ్చింది. వాళ్ళు కొత్త పరికరాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. డిజిటల్ స్క్రీన్ ద్వారా విద్యార్థులను ఆకర్షించే మార్గాలను అన్వేషించడం అనివార్యమైంది. కంప్యూటింగ్, కమ్యూనికేషన్ టెక్నాలజీ కలిస్తే అది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అవుతుంది. ఈ తరహా టెక్నాలజీ విద్యా పరిమితిని విస్తృతం చేసింది. ఇక్కడి నుంచే ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యాలయాల్లోని అధ్యాపకుల పాఠాలు వినవచ్చు. ఎక్కడి నుంచైనా డిజిటల్ సర్టిఫికెట్లు పొందే వెసులుబాటు వచ్చింది.

సమస్యపై దృష్టి పెట్టాల్సిందే!

గ్రామీణ పేదలకు డిజిటల్ విద్య ఇప్పటికీ సవాల్‌గానే ఉంది. ఇంటర్నెట్ లేని పల్లెలు; స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు లేని పేద విద్యార్థులు ఇప్పటికీ ఉన్నారు. ఆన్‌లైన్ తరగతుల్లో పాల్గొనడం వారికి సాధ్యం కాదు. ఈ వెనుకబాటుతనం పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను మరింత పెంచే ప్రమాదం ఉంది. సాంకేతిక విప్లవంలో గ్రామీణ ప్రాంతాలనూ భాగస్వాములను చేయడానికి అవసరమైన చర్యలపై దృష్టి పెట్టాలి. ఆ ప్రాంతాలకు వనరులు సమకూర్చడంలో ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించాలి. నిజానికి స్వయం ప్లాట్‌ఫామ్... పాఠశాల నుంచి పీజీ స్థాయి వరకూ ఉచిత ఆన్‌లైన్ కోర్సులు అందిస్తోంది. ఈ సేవలను అందుకునే స్థితికి అందరూ రావాలి. ఇంటర్నెట్ అందుబాటులో లేని విద్యార్థులకు 32 టీవీ చానళ్ళ ద్వారా పాఠాలు అందిస్తున్నారు. అయితే, డిజిటల్ విద్యను మరింత చేరువ చేస్తేనే వీరికి ఉపయోగం. అత్యున్నత ప్రమాణాలతో విద్య అందించడం అప్పుడే సాధ్యమవుతుంది.

వ్యాసకర్త తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్
మొబైల్ : 99486 60916

దైవేచ్ఛ

జ్యోతిర్మయం

'ఎప్పుడూ ఎవరూ ప్రముఖ వ్యక్తి కాకూడదు, కావటానికి ప్రయత్నించకూడదు' అన్నది ఓ వ్యక్తి అభిప్రాయం. మనిషి పతనానికి పేరు ప్రఖ్యాతులు, ధనార్జన, ప్రజలు చూపించే గౌరవ మర్యాదలు కారణమని అతని దృఢ విశ్వాసం. కాబట్టి ఏ వ్యక్తి అయినా సామాన్య మానవునిగా జీవించి, మరణించాలని చెప్పేవాడు. అతని తల్లితండ్రులు మాత్రం మనిషి అన్నవాడు సమాజంలో ఒక ప్రముఖ వ్యక్తిగా ఎదగాలని, సన్మానాలు సత్కారాలు పొందటానికి కృషి చేయాలని అనేవారు.

అతడు అలా ఎన్నడూ జరగదని గట్టిగానే చెప్పేవాడు. అంతేకాదు, ప్రముఖ వ్యక్తి కావటం వల్ల ఎవరికైనా ఎన్ని కష్టాలు కల్గుతాయో వివరిస్తూ ఊరూరూ తిరిగి సభల్లో, సమావేశాల్లో వివరించేవాడు. దానితో తృప్తి చెందక సులభమైన భాషలో, 'ఒకడు ఎందుకు ప్రముఖుడు కాకూడదు?' అనే గ్రంథాన్నే రచించి ఆవిష్కరించాడు. ఆ గ్రంథాన్ని ప్రజలందరూ ఎగబడి కొన్నారు. ఆ కారణంగా అతనికి ఎంతో ధనం, పేరు ప్రఖ్యాతులు వచ్చినాయి. విచిత్రంగా అతడు వద్దనుకొన్నవన్నీ వచ్చి చేరాయి. 'ఓ నా దేవుడా! ఏమిటీ వింత? డబ్బు, కీర్తి ప్రతిష్ఠలు, సన్మానాలు–సత్కారాలు హానికరాలనీ, వాటిని దరి చేర్చరాదనీ నా జీవితమంతా బోధించాను. కానీ అవి నా కన్ను కప్పి నా వద్దకు వచ్చి చేరాయి' అని వాపోయాడు. 'తానొకటి తలిస్తే దైవం మరొకటి జరిపిస్తుంది' అనే పెద్దల వాక్యం అతనికి గుర్తుకొచ్చింది (పుటలు 201, 202 – ది ఆర్ట్ ఆఫ్ ఎన్‌లైటెన్‌మెంట్ –ఓషో).

ఈ జగత్తునంతా మానవాతీత శక్తి నడిపిస్తున్నది. ఆ ఎరుకతో నిరంతరం జీవించటమే నిజమైన భక్తి, అసలైన జ్ఞానం.

– రాచమడుగు శ్రీనివాసులు

మా సార్.. మాక్కావాలి

- డిప్యుటేషన్‌పై వెళ్లిన టీచర్‌ను తిరిగి పంపాలని డిమాండ్
- కిషన్‌దాస్‌పేటలో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



పాఠశాల ఎదుట ప్లకార్డులతో విద్యార్థులు, తల్లి దండ్రుల నిరసన

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): 'మా సార్.. మాక్కావాలి.. డిప్యుటేషన్‌పై పంపిన ఉపాధ్యాయుడిని వెంటనే తిరిగి పంపించండి'.. అంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల ఎదుట శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన తెలిపారు. కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఇన్నాళ్లు విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడిని ఇటీవల డిప్యుటేషన్‌పై మండలంలోని వేరే పాఠశాలకు పంపించారు. దీనిపై కిషన్‌దాస్‌పేట పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ తమ ఊరి బడిలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 97 మంది విద్యార్థులున్నారని, మరో 15 మంది ప్రీ ప్రైమరీలో చదువుతున్నారని వివరించారు. గతంలో నలుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యాబోధన సాగేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఒకరిని వేరే పాఠశాలకు పంపడంతో ముగ్గురే ఉన్నారన్నారు. ఈ ముగ్గురితో అన్ని తరగతులకు విద్యాబోధన కుదరక, విద్యార్థులు నష్టపోతున్నారని వాపోయారు. డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడిని తమ పాఠశాలకు పంపించే వరకు మధ్యాహ్న భోజనం తినబోమని విద్యార్థులు మొండికేశారు. దీంతో తల్లిదండ్రులు నచ్చజెప్పి వారితో భోజనాలు చేయించారు.

మహిళా మావోయిస్టు శ్రీవిద్య అరెస్ట్

- తలదాచుకునేందుకు ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్‌కు...

మియాపూర్(హైదరాబాద్): మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నార్ల శ్రీవిద్యను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని న్యూ హాఫీజ్‌పేట యూత్ కాలనీలోని ఓ భవనంలో మహిళా మావోయిస్టు నివాసముంటుందని విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం అక్కడకు వెళ్లి పోలీసులు తనిఖీలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం తిర్మలాపూరం గ్రామానికి చెందిన నార్ల శ్రీవిద్య అలియాస్ కరుణ అలియాస్ రూప అక్కడ ఉందని విచారించగా, ఆమె మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా పనిచేస్తున్నట్టు తెలిసింది. నార్ల శ్రీవిద్య జేఎన్‌టీయూలో 1998 సంవత్సరంలో బీటెక్ పూర్తిచేసింది. అనంతరం చైతన్య మహిళా సంఘంలో పనిచేసింది. ఆ తర్వాత 2006లో మావోయిస్టు పార్టీలోకి వెళ్లింది. విశాఖపట్నం, ఆ తర్వాత ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పనిచేసింది. ఈ సమయాల్లోనే గిరిజన పిల్లలు, యువతలో మావోయిస్టు భావజాలాన్ని పెంపొందించింది. 2007లో రాష్ట్ర కమిటీ సభ్యుడైన వాసుదేవరావు అలియాస్ ఆశన్నను పెళ్లి చేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్న నేపథ్యంలో తలదాచుకునేందుకు నగరానికి వచ్చింది. పక్కా సమాచారంతో పోలీసులు శ్రీవిద్యను అరెస్ట్ చేశారు. ఆమెను సంగారెడ్డి జిల్లాలోని కందిజైలుకు తరలించినట్టు తెలిసింది.

అప్పు చెల్లించలేదని ఇంటికి తాళం

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



రామారావు

శంకరపట్నం: అప్పు చెల్లించలేదని ఇంటికి తాళం వేశారని ఓ ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రం రామారావు (63) స్థానికంగా ఫొటోస్టూడియో నిర్వహిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన తనుకు ప్రకాశ్, తనుకు లక్ష్మీనారాయణ వద్ద రామారావు కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. వడ్డీ చెల్లించినప్పటికీ, అసలు చెల్లించాలని వారు ఒత్తిడి చేశారు. దీంతో పెద్దమనుషుల సమక్షంలో ఆరునెలలు గడువుపెట్టి రామారావు కాగితం రాసిచ్చాడు. అయితే గడువు రాకముందే ఈనెల 21న అప్పు చెల్లించాలంటూ ఒత్తిడిచేస్తూ రామారావు ఇంటికి తాళం వేశారు. అప్పు చెల్లించలేకపోతే పురుగుల మందు తాగమని ప్రకాశ్, లక్ష్మీనారాయణలు అనడంతో మనస్తాపానికి గురైన రామారావు శుక్రవారం గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించాలని వైద్యులు సూచించడంతో, జమ్మికుంటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మరణించాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

లోటు నుంచి సాధారణం దిశగా...

నెలాఖరు వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం: ఐఎండీ

సాక్షి, హైదరాబాద్: నైరుతి వర్షాలు జోరందుకున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వానలు రైతాంగానికి ఊరటనిస్తున్నాయి. సీజన్ ప్రారంభం నుంచి దాదాపు నెలన్నర పాటు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా..ఇప్పుడిప్పుడే కురుస్తున్న వానలు సాగు పనులకు కాస్త ఊతమిస్తున్నాయి. వర్షపాత గణాంకాలు లోటు నుంచి సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 31.48 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, శుక్రవారం నాటికి 30.48 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్ర వ్యాప్తంగా వర్షపాతాన్ని పరిశీలిస్తే.. 3 శాతం లోటు ఉంది. శనివారం ఉదయంకల్లా గణాంకాలు లోటు నుంచి సాధారణాన్ని చేరుకుంటాయని, నెలాఖరుకల్లా రాష్ట్ర వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షపాత గణాంకాలుంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

12 జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువగా...

12 జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షాలు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్‌లో సాధారణం కంటే 40 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 34 శాతం, రంగారెడ్డి జిల్లాలో 24 శాతం, నారాయణపేటలో 14 శాతం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 13 శాతం అధిక వర్షాలు కురిశాయి. భద్రాద్రి కొత్తగూడెం, మహబుబాబాద్, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, వనపర్తి, ఖమ్మం, ములుగు జిల్లాల్లో కూడా సాధారణం కంటే అధిక వర్షాలు కురిశాయి.

- మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఇంకా వర్షపాతం గణాంకాలు లోటులోనే ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతానికి కాస్త సమీపానికి వచ్చాయి.

తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లోని పశ్చిమ బెంగాల్ తీరం, బంగ్లాదేశ్ ప్రాంతంలో వాయుగుండం కేంద్రీకృతమైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఈశాన్య అరేబియన్ సముద్ర ప్రాంతం నుంచి మహారాష్ట్ర మీదుగా ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నట్టు వివరించింది దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల తేలికపాటి వర్షాలు, ఉత్తర ప్రాంత జిల్లాల్లోని కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముంది.



గార్ల సమీపంలో చెక్‌డ్యాంపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు



పాకాల ఏటి వరద ఉధృతితో రైల్వే వంతెన పైనుంచి వస్తున్న విద్యార్థులు

వారధి కట్టే సారథి లేడు!

ఉధృతంగా పాకాల ఏరు.. నిలిచిన రాకపోకలు

వంతెన కోసం 40 ఏళ్లుగా పోరు

గార్ల: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా గార్ల గ్రామ సమీపంలోని పాకాల ఏరు చెక్‌డ్యాం కమ్ రోడ్ పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాంపురం, మద్దివంచ గ్రామాల ప్రజలకు రహదారి లేక రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాల్లోని విద్యార్థులు మండల కేంద్రమైన గార్లలో చదువుతుంటారు. వీరు పాఠశాలకు వెళ్లాలంటే.. ఏటిపై నుంచి చెక్‌డ్యాం కమ్ రోడ్డు దాటి రావాలి. వర్షాలతో ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో.. పక్కనున్న రైల్వే వంతెన పైనుంచి రాకపోకలు సాగించాలి. ఉదయం, సాయంత్రం తల్లిదండ్రుల సహాయంతో బిక్కుబిక్కుమని నడుచుకుంటూ వస్తున్నారు. సాయంత్రం పాఠశాల వదిలాక.. తల్లిదండ్రులు వంతెన వద్దకు వచ్చి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నారు. విద్యార్థులు రైల్వే వంతెనపై నడుస్తున్నప్పుడు.. రైలు వస్తే భయంతో పక్కకు నిలబడతారు. రైలు వెళ్లిన తర్వాత నడిచి వెళ్తారు. నలభయ్యేళ్లుగా వంతెన నిర్మాణం చేపట్టాలని అనేక పోరాటాలు చేసినా, తమ గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రాంపురం, మద్దివంచ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో 3 నెలల పాటు ఈ ప్రాంత ప్రజలకు రైల్వే వంతెనే రహదారి అవుతుంది. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వంతెన నిర్మాణానికి చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గరిష్టానికి 11 అడుగుల దూరంలో సాగర్

- రోజుకు మూడు అడుగుల చొప్పున పెరుగుతున్న ప్రాజెక్టు నీటిమట్టం

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టానికి 11 అడుగుల దూరంలో ఉంది. గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు). ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 579 అడుగులు (280.1200 టీఎంసీలు). శుక్రవారం సాయంత్రం 6 గంటల లెక్కల ప్రకారం .. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,20,635 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. మరో 32 టీఎంసీల నీరు వచ్చి చేరితే సాగర్ పూర్తిగా నిండుతుంది. నాగార్జునసాగర్‌లో శుక్రవారం రాత్రి నుంచి పూర్తిస్థాయిలో విద్యుదుత్పాదన మొదలైంది. ఎగువ నుంచి వచ్చే వరదకు అనుగుణంగా విద్యుదుత్పాదన ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి విడుదలైన నీరు పులిచింతల జలాశయానికి చేరుతోంది.

శ్రీశైలం ప్రాజెక్టుకు నిలకడగా వరద

దోమలపెంట: ఎగువనున్న జూరాల, సుంకేశుల నుంచి వరద వస్తుండటంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద 2 గేట్ల ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 882.5 అడుగుల వద్ద 202.0439 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శ్రీశైలం ఆనకట్ట రెండు గేట్ల ద్వారా దిగువకు వెళుతున్న నీరు

మూసీ ప్రాజెక్టు రెండు గేట్ల ఎత్తివేత

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో సాగునీటి అధికారులు రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కేతేపల్లి–సూర్యాపేట మండలాల పరిధిలోని సోలిపేట వద్ద ఉన్న మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా.. శుక్రవారం 643.50 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వరద వస్తుండడంతో అధికారులు ప్రాజెక్టు 3, 8 నంబరు క్రస్ట్‌గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 1,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.



మూసీ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

వాగు దాటి.. వైద్యం చేసి

3 కిలోమీటర్లు నడిచి వెళ్లిన వైద్య సిబ్బంది

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి వద్ద జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో.. కొండాయి పల్లె దవాఖానా వైద్యుడు ప్రణీత్ కుమార్ తన సిబ్బందితో దొడ్లనుంచి పడవలో వాగు దాటారు. అక్కడి నుంచి మల్యాలకు 3 కిలోమీటర్ల మేర బురద రోడ్డు కావడంతో నడుచుకుంటూ వెళ్లారు. మల్యాలలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, కొండాయి, మల్యాల ముంపు బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, హెచ్‌ఎం శేషయ్య, జ్యోతి, లక్ష్మి ఉన్నారు.



మూడు కిలోమీటర్లు బురద రోడ్డులో నడిచి వెళ్తున్న వైద్యుడు, సహాయకుడు

ఉపాధ్యాయుడు కొట్టాడని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కొండమల్లేపల్లి: ఉపాధ్యాయుడు కొట్టాడని మనస్తాపం చెందిన విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజ్యాతండాకు చెందిన రమావత్ తన్య, పద్మ దంపతుల కుమారుడు రమావత్ సంతోష్ కొండమల్లేపల్లిలోని ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం పాఠశాల వదిలిపెట్టిన తర్వాత ఇంటికి వెళ్లే క్రమంలో స్కూల్ వ్యాన్‌లోకి ఎక్కడానికి విద్యార్థులు గుంపులుగా రావడంతో వరుస క్రమంలో రావాలని అక్కడ ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుడు.. సంతోష్‌ను కొట్టాడు. దీంతో సంతోష్ మనస్తాపానికి గురై ఇంటికి వెళ్లిన తర్వాత పురుగుల మందు తాగాడు. ఇంట్లో ఉన్న అతడి చెల్లెలు చూసి పొలంలో పనిచేస్తున్న తల్లిదండ్రులకు తెలపడంతో వారు ఇంటికి చేరుకుని సంతోష్‌ను దేవరకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం సంతోష్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు ఏమీ అందలేదని పోలీసులు తెలిపారు.

ఫీజులపై కమిటీ

మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు

- ఇంజనీరింగ్ కాలేజీల ప్రతిపాదనలపై పునఃసమీక్ష
- కాలేజీల ఆడిట్ రిపోర్టులను సమగ్రంగా పరిశీలించనున్న ఉన్నతాధికారులు
- మెజారిటీ కాలేజీల ఫీజుల్లో కోత తప్పదనే అభిప్రాయం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజులపై మళ్ళీ కదలిక వచ్చింది. ప్రైవేటు కాలేజీల ప్రతిపాదనను పునఃసమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సాంకేతిక విద్యా కమిషనర్ ఎ.దేవసేన, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఎస్.క్షితిజ, రాష్ట్ర ఆడిట్ విభాగం డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్యలను కమిటీలో సభ్యులుగా నియమించారు. వీరితో పాటు ఇద్దరు సబ్జెక్టు నిపుణులను సభ్యులుగా చేరుస్తారు. వీరిని కమిటీ చైర్మన్ నియమిస్తారు.

కోర్టు ఆదేశం మేరకే..

రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ మండలి (టీజీఎఫ్‌ఆర్‌సీ) ఇంజనీరింగ్ ఫీజులను ప్రతి మూడేళ్ళకోసారి సమీక్షిస్తుంది. 2022లో నిర్ణయించిన ఫీజులు 2024–25 వరకు వర్తించాయి. 2025–28కి సంబంధించిన ఫీజులపై ఆరు నెలలుగా ఎఫ్‌ఆర్‌సీ సమీక్ష చేపట్టింది. కాలేజీల ఆదాయ, వ్యయాలతో కూడిన ఆడిట్ నివేదికలను పరిశీలించి, ఫీజుల పెంపు ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. అయితే ఫీజుల పెంపును ప్రభుత్వం ఆమోదించలేదు. పాత ఫీజులతోనే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ చేపట్టాలని ఆదేశించింది. దీనిపై కొన్ని కాలేజీలు కోర్టును ఆశ్రయించడంతో.. ఆరు వారాల్లో ఫీజులను నిర్ణయించాలని ఈ నెల 11వ తేదీన కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఫీజుల సమీక్షకు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ కమిటీ మరోసారి ఆడిట్ రిపోర్టులను పరిశీలించి.. ఎఫ్‌ఆర్‌సీకి సిఫార్సు చేస్తుంది.

పూర్తిస్థాయి పరిశీలన

ఫీజులు పెంచాలని కోరుతున్న ప్రైవేటు కాలేజీలు గడచిన మూడేళ్ళ జమా ఖర్చులను ఎఫ్‌ఆర్‌సీ ముందు ఉంచాయి. మౌలిక వసతులు, లేబొరేటరీలు, కొత్త కోర్సులకు అవసరమైన ఫ్యాకల్టీకి పెరిగిన వేతనాలను ఇందులో పొందుపర్చాయి. ఎఫ్‌ఆర్‌సీ ఆడిటర్లు వీటిని పరిశీలించారు. అయితే ఎఫ్‌ఆర్‌సీ ఆడిటర్లు ప్రైవేటు కాలేజీలకూ ఆడిట్ పనులు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎఫ్‌ఆర్‌సీ ముందుకు వచ్చిన కాలేజీల జమా ఖర్చుల లెక్కలను వాళ్లే పరిశీలించి ఫీజుల పెంపు ప్రతిపాదనలు రూపొందించారనే విమర్శలు వచ్చాయి. దీంతో వీటన్నింటినీ పరిశీలించాలని ప్రత్యేక కమిటీకి ప్రభుత్వం సూచించినట్టు తెలుస్తోంది. కమిటీలో వివిధ రంగాల నిపుణులను చేర్చడాన్ని బట్టి ప్రైవేటు కాలేజీలకు సంబంధించిన ప్రతీ అంశాన్ని పరిశీలించే ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది. ఆడిట్ నివేదికలను ఆమూలాగ్రం పరిశీలించే ఉద్దేశంతోనే రాష్ట్ర ఆడిట్ విభాగం డైరెక్టర్‌ను కమిటీ సభ్యుడిగా చేర్చినట్టు చెబుతున్నారు. ఇక చాలా కాలేజీల భూముల్లో అనేక లొసుగులు ఉన్నట్టు ఆరోపణలున్నాయని, వీటిని కూడా వెలుగులోకి తెచ్చే ఉద్దేశంతో టౌన్ ప్లానింగ్ అధికారిని కమిటీలో చేర్చారని అంటున్నారు. దీన్నిబట్టి చూస్తే చాలా కాలేజీలకు ఫీజుల్లో కోత పెట్టే వీలుందని చెబుతున్నారు.

ఆమోదయోగ్యమైన ఫీజుల దిశగా సమీక్ష



ప్రభుత్వం నమ్మకంతో అప్పగించిన ఫీజుల సమీక్షను నిష్పక్షపాతంగా చేపడతాం. విద్యార్థులు, కాలేజీలు, విద్యా రంగ నిపుణుల అభిప్రాయాలు తీసుకుంటాం. అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఫీజులు ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన. ఈ దిశగా వీలైనంత త్వరగా సమీక్ష పూర్తి చేస్తాం.

– ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి (ఉన్నత విద్యా మండలి చైర్మన్)

కొత్త ఫీజులు ఎప్పట్నుంచి?

ఫీజులు పెంచుతారా? తగ్గిస్తారా? అనే సందేహాలు తాజాగా కాలేజీ వర్గాల నుంచి వస్తున్నాయి. ఇప్పుడు నిర్ణయించే ఫీజులు ఈ ఏడాది నుంచే అమలు చేస్తారా? లేదా? అనే సందిగ్ధత వారిని వెంటాడుతోంది. వాస్తవానికి ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో పాత ఫీజులతోనే చేపట్టారు. ఇప్పుడు ఫీజులు పెంచితే విద్యార్థుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. ఫీజులు పెంచితే అవే వర్తిస్తాయని కౌన్సెలింగ్ సమయంలో చెప్పలేదు. కాబట్టి కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థుల ఫీజులు పెంచితే అంగీకరించే అవకాశాలు తక్కువని అంటున్నారు. అయితే ఈ ఏడాది ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులే వచ్చే నాలుగేళ్ళు కొనసాగుతారని, పాత ఫీజులే కొనసాగితే ఈ నాలుగేళ్ళు తాము నష్టపోతామని కాలేజీలు అంటున్నాయి. పెరిగిన ద్రవోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని అయినా ఫీజులు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు కమిటీ ఏర్పాటు, సమీక్షను కోర్టులో సవాల్ చేసేందుకు కొన్ని కాలేజీలు సిద్ధమవుతున్నాయి.



డ్రైవర్‌కు మత్తెక్కింది.. కారు గోడెక్కింది!

'యమలీల' సినిమా చూసిన ప్రేక్షకులకు బ్రహ్మానందం చేసిన హాస్యభరితమైన ఓ సన్నివేశం గుర్తుండే ఉంటుంది. 'ఆవు గోడపైకెక్కి పేడ ఎలా వేసిందంటావు'? అని పిడకలను చూసి కోట శ్రీనివాసరావును ప్రశ్నించడం కడుపుబ్బా నవ్వు తెప్పిస్తుంది. అలాంటి ఓ దృశ్యమే దుండిగల్ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నిద్ర మత్తులో కారు నడుపుతున్న ఓ వ్యక్తి సడన్‌గా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి ఇలా ఓ ఇంటి గోడపైకెక్కి ఆగిపోయింది. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఓ కారు బౌరంపేట నుంచి మల్లంపేట వైపు వేగంగా దూసుకువచ్చింది. ఈ క్రమంలో మహేశ్వరం వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంటి ప్రహరీని ఢీకొంది. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన కారు నడుపుతున్న వ్యక్తి పరారయ్యాడు. ఉదయం నిద్రలేచి చూసిన ఆ ఇంటి కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. విషయాన్ని పోలీసులకు తెలపగా.. సదరు వ్యక్తి మద్యం తాగి వాహనం నడిపించాడా..? నిద్ర మత్తులో ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. గోడపై పార్కింగ్ చేసినట్లు ఉన్న కారు ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. 'అలా ఎలా పార్క్ చేశావు బ్రో' అంటూ నెటిజన్లు ట్రోలింగ్ చేశారు. – దుండిగల్

విశ్వానికి అంతముందా!

2,000 కోట్ల ఏళ్లలో సర్వం ముగుస్తుందా? ● అవునంటున్న తాజా సిద్ధాంతం

విశ్వ సిద్ధాంతం సరికొత్త మలుపు తిరిగింది. ఈ అనంత విశ్వం నిరంతరాయంగా, ఎప్పటికీ విస్తరిస్తూనే ఉంటుందన్నది ఇప్పటిదాకా సైంటిస్టులు నమ్ముతూ, చెబుతూ వచ్చిన మాట. కానీ అది నిజం కాదని, విశ్వానికి అంతముందని కొత్త సిద్ధాంత వ్యాసం ఒకటి చెబుతోంది. మరో 2,000 కోట్ల ఏళ్లకు విశ్వం కథ పూర్తిగా ముగిసిపోతుందని అది అంటోంది. దాంతోపాటే నక్షత్రాలు, గ్రహాలు, విశ్వ శక్తి... ఇలా సర్వమూ అంతమైపోతుందట. దీన్ని 'బిగ్ క్రంచ్'గా సదరు వ్యాసం పేర్కొంది. డార్క్ ఎనర్జీగా పిలిచే రహస్య విశ్వ చోదక శక్తి స్థిరంగా, సానుకూలాత్మకంగా కొనసాగుతుందన్న సిద్ధాంతంపై విశ్వ నిత్య విస్తరణవాదం ఆధారపడి ఉంది. కానీ డార్క్ ఎనర్జీ స్థిరంగా ఉండనే ఉండదని పరిశోధకులు తాజాగా చెబుతున్నారు. డార్క్ ఎనర్జీ సర్వే (డీఎస్ఎస్), డార్క్ ఎనర్జీ స్పెక్ట్రోస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్ (డీఈఎస్ఐ) అనే రెండు పెద్ద అంతర్జాతీయ ప్రాజెక్టుల తాలూకు తాజా డేటా ఆధారంగా వారు ఈ మేరకు సూత్రీకరించారు. డార్క్ ఎనర్జీ కాలక్రమంలో మారుతుందని పేర్కొన్న ఇటీవలి సర్వే ఆక్సియాన్–డార్క్ ఎనర్జీ మోడల్ (ఏడీఈ)ను సిద్ధాంతాన్ని ఇది సమర్థిస్తోంది. దీన్ని ప్రస్తుత సూత్రీకరణకు వర్తింపజేస్తే అంతరిక్షం ఎలా ప్రవర్తిస్తుందన్న దాన్ని లెక్కించే విశ్వ స్థిరాంకం నిజానికి ప్రతికూల శక్తి అయి ఉండొచ్చని చెప్పే సంకేతాలను సైంటిస్టులు గమనించారు. ఈ మొత్తం సిద్ధాంతంలో అతి కీలకమైన అంశం ఇదే. ప్రతికూల విశ్వ స్థిరాంకపు ఉనికి అంటే అంతిమంగా దాని విస్తరణను ఆకర్షణ శక్తి అధిగమించేస్తుంది. అప్పటినుంచి విశ్వం వృద్ధి చెందడం నిలిచిపోయి తిరోగమన బాట పడుతుంది. అంతిమంగా అది అంతమైపోతుంది. ఈ బిగ్ క్రంచ్ ఫలితంగా విశ్వంలోని సమస్త శక్తీ పీల్చుకుపోయి అత్యంత సాంద్రతతో కూడిన బిందువుగా మారుతుంది. ఇదే గనక నిజమైతే బిగ్ బ్యాంగ్ సిద్ధాంతమే తప్పని భావించాల్సి ఉంటుంది.

ఆయువు 3,330 కోట్ల ఏళ్లు

విశ్వం మొత్తం ఆయుష్షు 3,330 కోట్ల ఏళ్లని ఈ తాజా సిద్ధాంత వ్యాసం ప్రతిపాదించింది. విశ్వం పుట్టి 1,380 కోట్ల ఏళ్లు గడిచినట్టు సైంటిస్టులు తేల్చారు. ఆ లెక్కన దాని ఆయుఃప్రమాణంలో సగం ముగిసిపోయినట్టే లెక్క. అయితే దీన్ని పూర్తిగా విశ్వసించాలంటే మరింత కచ్చితమైన గణాంకాలు అవసరమని సైంటిస్టులు చెబుతున్నారు. ముఖ్యంగా డార్క్ ఎనర్జీ కాలంతో పాటుగా కచ్చితంగా మారుతుందన్న దానిలో నిజానిజాలు తేలాల్సి ఉంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



ప్రధాని మోదీతో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

మాల్దీవులతో బలీయ బంధం

ఆ దేశానికి రూ.4,850 కోట్ల రుణం ఇస్తాం

- భారత ప్రధాని మోదీ ప్రకటన
- మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో భేటీ
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు

మాలె: భారత్, మాల్దీవ్స్ విశ్వసనీయమైన మిత్రదేశాలు అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మాల్దీవ్స్‌తో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం చేసుకుంటామని, ద్వీప దేశానికి రూ.4,850 కోట్ల రుణం(లైన్ ఆఫ్ క్రెడిట్) ఇవ్వబోతున్నామని ప్రకటించారు. శుక్రవారం మాల్దీవ్స్ రాజధాని మాలెలో ప్రధాని మోదీ, మాల్దీవ్స్ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. అంతకు ముందు రెండు రోజుల పర్యటన నిమిత్తం బ్రిటన్ నుంచి శుక్రవారం ఉదయం మాల్దీవులకు చేరుకున్న మోదీకి ఘన స్వాగతం లభించింది. ఎయిర్‌పోర్టులో మొహమ్మద్ ముయిజ్జుతోపాటు సీనియర్ మంత్రులు ఆయనకు స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం రిపబ్లిక్ స్క్వేర్‌లో మోదీకి సైనికులు గౌరవ వందనం సమర్పించారు. ఇండియా–మాల్దీవ్స్ మధ్య కొన్ని రోజుల క్రితం సంబంధాలు బలహీనపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీ పర్యటన విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

సైనిక సామర్థ్యం పెంపునకు సహకారం

మాల్దీవులతో సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మోదీ స్పష్టంచేశారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక పెట్టుబడులు ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. భారత్ అమలు చేస్తున్న 'పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం', 'మహాసాగర్' విధానాల్లో మాల్దీవులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రక్షణ రంగంలో పరస్పర సహకారం ఇరుదేశాల మధ్య పరస్పర విశ్వాసానికి ఒక కొలమానం అని వివరించారు. మాల్దీవుల సైనిక సామర్థ్యం పెంపునకు భారత్ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి స్వాగతం పలకడం తన హృదయాన్ని హత్తుకుందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



మాల్దీవుల రక్షణ శాఖ కార్యాలయంపై ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పై ప్రధాని మోదీ చిత్రం

రక్షణ శాఖ కార్యాలయం ప్రారంభం

ఇండియా–మాల్దీవ్స్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఆర్థిక సంబంధాలు, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ చర్చలు జరుగుతున్నాయి. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్మారక తపాళ బిళ్లను మోదీ, ముయిజ్జు ఆవిష్కరించారు. వేర్వేరు కీలక రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి అవగాహనా ఒప్పందాలపై(ఎంఓయూ) ఇరు దేశాలు సంతకాలు చేశాయి. మాల్దీవ్స్‌లో భారత యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి మరో ఒప్పందం కుదిరింది. రూ.4,850 కోట్ల లైన్ ఆఫ్ క్రెడిట్‌పై రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. మాలె సిటీలో రక్షణ శాఖ కార్యాలయాన్ని మోదీ, ముయిజ్జు ప్రారంభించారు.

ఐదో రోజూ అదే తీరు

స్తంభించిన పార్లమెంట్ ఉభయ సభలు

- బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వెనక్కి తగ్గని విపక్షాలు
- లోక్‌సభ, రాజ్యసభ సోమవారానికి వాయిదా



పార్లమెంట్ వెలుపల నిరసనలో పాల్గొన్న ఖర్గే, ప్రియాంక తదితర ఎంపీలు

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో వర్షాకాల సమావేశాల్లో గందరగోళానికి ఇంకా తెరపడలేదు. విపక్ష సభ్యులు ఆందోళనలు, నిరసనలు, నినాదాల కారణంగా వరుసగా ఐదో రోజు శుక్రవారం సైతం ఉభయ సభలు స్తంభించాయి. పలుమార్లు వాయిదా పడ్డాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం ప్రారంభించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై విపక్షాలు మండిపడ్డాయి. దీనిపై పార్లమెంట్‌లో వెంటనే చర్చించాలని, కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశాయి. నినాదాలతో హోరెత్తించాయి. ప్రతిపక్షాల ఆగ్రహావేశాల వల్ల పరిస్థితి చెయ్యి దాటిపోతుండడంతో లోక్‌సభ, రాజ్యసభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు సభాపతులు ప్రకటించారు. చెప్పుకోదగ్గ కార్యకలాపాలేవీ జరగకుండానే వర్షాకాల సమావేశాల్లో తొలివారం ముగిసిపోవడం గమనార్హం.

లోక్‌సభలో నినాదాల హోరు

లోక్‌సభ శుక్రవారం ఉదయం ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు ప్రారంభించారు. స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. దీనిపై చర్చకు విపక్ష సభ్యులు అడ్డుతగిలారు. చేసేది లేక స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. విపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. ఓటర్ల జాబితా సవరణపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విపక్షాలు సహకరించాలని స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ కోరారు. అయినా విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. ఇప్పుడే చర్చ ప్రారంభించాలని తేల్చిచెప్పారు. వారిపై జగదాంబికా పాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన సభలో ఈ అలజడి ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల ఎవరికీ ఉపయోగం ఉండదని అన్నారు. సభ వాయిదా పడేలా చేయడం గొప్ప విషయం కాదని హితవు పలికారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోతే దేశమే నష్టపోతుందని చెప్పారు. చర్చించాల్సిన బిల్లులు చాలా ఉన్నాయని, సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. గోవాలో ఎస్టీలకు అసెంబ్లీ స్థానాలు కేటాయించేందుకు ఉద్దేశించిన కీలకమైన బిల్లుపై చర్చిద్దామని న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ చెప్పారు. అయినా విపక్షాల తీరులో మార్పు రాలేదు. దీంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు జగదాంబికా పాల్ ప్రకటించారు. 'కార్గిల్ విజయ్ దివస్' నేపథ్యంలో కార్గిల్ అమర వీరులకు లోక్‌సభలో నివాళులర్పించారు. ఎంపీలంతా కొంతసేపు మౌనం పాటించారు.

'ఓటు చోరీ బంద్ కరో'

పార్లమెంట్ ఎగువ సభలోనూ విపక్షాల ఆందోళన యథాతథంగా కొనసాగింది. వివిధ అంశాలపై రూల్ 267 కింద చర్చను కోరుతూ విపక్షాలు ఇచ్చిన 28 నోటీసులను తిరస్కరిస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చెప్పారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అంశాన్ని ప్రతిపక్ష ఎంపీలు లేవనెత్తారు. దీనిపై సభలో తక్షణమే చర్చించాలని పట్టుబట్టారు. ఉదయం రాజ్యసభ మొదలైన వెంటనే నినాదాలు మిన్నంటడడంతో రఘువంశ్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సమాధానం ఇస్తుండగా ప్రతిపక్ష ఎంపీలు బిగ్గరగా కేకలు వేశారు. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణను ఆపాలని డిమాండ్‌చేశారు. 'ఓటు చోరీ బంద్ కరో' అంటూ నినదించారు. కొందరు ఎంపీలు వెల్‌లోకి ప్రవేశించారు. వెనక్కి వెళ్లిపోవాలని, సభకు సహకరించాలని సభాపతి స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ ఘన్‌శ్యామ్ తివారీ పదేపదే విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోలేదు. దాంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ఘన్‌శ్యామ్ తివారీ ప్రకటించారు.

విపక్షాల నిరసన

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. మకరద్వారం మెట్లపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ అని రాసి ఉన్న పత్రాలను చించివేసి, చెత్తకుండీలో విసి రేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌పై పార్లమెంట్‌లో చర్చించాలని తేల్చిచెప్పారు.

కమల్ హాసన్ ప్రమాణం

ప్రముఖ సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌పీ) పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు డీఎంకే నాయకులు రాజాత్తి, ఎస్.ఆర్.శివలింగం, పి.విల్సన్ సైతం ఎగువ సభ సభ్యులుగా ప్రమాణం చేశారు.



సభకు సహకరించడానికి విపక్షాల అంగీకారం

నిరసనలు, నినాదాలు పక్కనపెట్టి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఇకపై సజావుగా సాగేందుకు సహకరిస్తామని ప్రతిపక్ష నేతలు చెప్పారు. వర్షాకాల సమావేశాల్లో నిత్యం గందరగోళ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం అన్ని పార్టీల సీనియర్ నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సభా కార్యకలాపాలకు సహకరించాలని కోరగా, ప్రతిపక్ష నాయకులు అందుకు అంగీకరించినట్లు పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. సోమవారం నుంచి నిర్మాణాత్మక చర్చలు సాగిద్దామని స్పీకర్ సూచించారు. ప్రజలకు మేలు కలిగేలా సభలో అర్థవంతమైన చర్చలు జరగాలన్నదే తన ఉద్దేశమని ఆయన వివరించారు. ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం పార్లమెంట్‌లో చర్చ ప్రారంభం కానుంది.

హెచ్ఐవీకి సూదిమందు

ఆమోదించిన ఈయూ

లండన్: హెచ్ఐవీ/ఎయిడ్స్‌ను అడ్డుకునే సూదిమందు 'లెనకపవిర్'కు యూరోపియన్ యూనియన్ (ఈయూ)కు చెందిన మెడిసిన్స్ ఏజెన్సీ ఆమోదం తెలిపింది. ఏడాదిలో రెండు పర్యాయాలు తీసుకునే ఈ ఔషధం వైరస్ వ్యాప్తిని నివారించడంలో సాయపడుతుందని పేర్కొంది. యూరప్‌లో దీనిని యెయ్‌టువో అనే పేరుతో గిలియడ్ సైన్సెస్ విక్రయాలు జరుపుతుంది. దీంతో ఈయూలోని 27 సభ్య దేశాలతోపాటు ఐస్‌ల్యాండ్, నార్వే, లీచిన్‌స్టైయిన్‌ల్లోనూ ఇది అందుబాటులోకి వస్తుంది. లెనకపవిర్‌తో హెచ్ఐవీ బాధిత మహిళలు, పురుషులకు చికిత్స చేయగా 100 శాతం ప్రభావవంతంగా పనిచేసినట్లు గతేడాది చేపట్టిన అధ్యయనంలో తేలింది. హెచ్ఐవీ మహమ్మారిని తరిమికొట్టడంలో లెనకపిర్ కీలక మలుపుగా మారనుందని ఐరాస ఎయిడ్స్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విన్నీ తెలిపారు. జూన్‌లో అమెరికా ప్రభుత్వ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ సైతం లెనకపవిర్‌ను ఆమోదించింది. ఐరాస ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెచ్ఐవీ వైరస్ నివారణలో లెనకపవిర్ ఎంతో సహాయకారికానుందని పేర్కొంది. ఒకసారి ఈ సూది మందు తీసుకుంటే ఆరు నెల్లపాటు హెచ్ఐవీ సోకకుండా ఆపగలుగుతుంది. కాగా, లెనకపవిర్‌ను తక్కువ ధరలో హెచ్ఐవీ కేసులు తీవ్రంగా ఉండే ఆఫ్రికా, ఆసియా, కరీబియన్ ప్రాంతాల్లోని 120 పేద దేశాలకు సరఫరా చేస్తామని గిలియడ్ సైన్సెస్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 4 కోట్ల హెచ్ఐవీ బాధితులుండగా 2024లో సుమారు 6.30 లక్షల మంది చనిపోయినట్లు అంచనా.

పాలస్తీనాకు మద్దతుగా ఫ్రాన్స్

పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామన్న మాక్రాన్ ● మాక్రాన్ తీరుపై అమెరికా, ఇజ్రాయెల్ ఆగ్రహం

పారిస్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ పాలస్తీనాకు మద్దతుగా నిలిచారు. ఆ దేశ సార్వభౌమత్వాన్ని ఫ్రాన్స్ గుర్తిస్తుందని మాక్రాన్ చెప్పారు. ఈ విషయాన్ని సెప్టెంబర్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో అధికారికంగా ప్రకటిస్తానన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. గాజాలో యుద్ధం ఆగిపోవడం, అక్కడి జనాభాను ఆకలి నుంచి రక్షించడమే ప్రస్తుతం మన ముందున్న అత్యవసర కర్తవ్యమని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు జరిగిన వెంటనే ఆయన ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చారు. యూదు వ్యతిరేకతను ఖండించారు. ఆ తరువాతి కాలంలో గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం, రానురాను పెరిగిన సంక్షోభం పట్ల ఆయన తీవ్ర నిరాశ చెందారు. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తామని గతంలో పలుమార్లు చెప్పిన ఆయన.. తాజాగా పునరుద్ఘాటించారు.

నిర్లక్ష్యపూరిత నిర్ణయం: అమెరికా

పాలస్తీనా పట్ల ఫ్రాన్స్ తీరును అమెరికా, ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించాయి. ఇది హమాస్ ప్రచారానికి ఉపయోగపడే నిర్లక్ష్య పూరిత నిర్ణయ మని విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. ''యూఎన్ జనరల్ అసెంబ్లీలో పాలస్తీనా రాజ్యాన్ని గుర్తించాలనే మాక్రాన్ ప్రణాళికను అమెరికా తిరస్కరిస్తుంది. ఈ నిర్లక్ష్య నిర్ణయం హమాస్ ప్రచా రానికి ఉపయోగపడుతుంది. శాంతిని దెబ్బ తీస్తుంది'' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

ఫ్రాన్స్ తీరు సిగ్గుచేటు: ఇజ్రాయెల్

ఇక మాక్రాన్ ప్రకటనపై ఇజ్రాయెల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పాలస్తీనాను గుర్తించడమంటే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమేనని, ఇది ఇజ్రాయెల్ అస్తిత్వానికి ముప్పు కలిగిస్తుందని ప్రధాని బెంజమిన్ నెతాన్యాహూ అన్నారు. గాజా ఇజ్రాయెల్‌ను నిర్మూలించే లాంచ్ ప్యాడ్ అవుతుందని, దాని పక్కన శాంతియుతంగా జీవించలేమని తెలిపారు. ఫ్రాన్స్ నిర్ణయం సిగ్గుచేటని ఇజ్రాయెల్ ఉప ప్రధాని యారివ్ లెవిన్ అన్నారు. అది ఫ్రెంచ్ చరిత్రపై ఒక నల్ల మచ్చని, ఉగ్రవాదానికి నేరుగా సహాయమందించడమని చెప్పారు. తాము ఆక్రమించిన వెస్ట్ బ్యాంక్‌కు ఇజ్రాయెల్ సార్వభౌమత్వాన్ని వర్తింపజేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

స్వాగతించిన హమాస్..

ఫ్రాన్స్ ప్రకటనను పాలస్తీనియన్ అథారిటీ సీనియర్ అధికారి హుస్సేన్ అల్–షేక్ స్వాగతించారు. ఇది అంతర్జాతీయ చట్టాల పట్ల ఫ్రాన్స్ నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. పాలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కులకు, రాజ్య స్థాపనకు మద్దతివ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాలస్తీనా గుర్తింపు విషయంలో ప్రపంచంలోని అన్ని దేశాలు, యూరోపియన్ దేశాలు ఫ్రాన్స్‌ను అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు.



మోదీకంత సీన్ లేదు!

- ఆయనదంతా షో మాత్రమే..!
- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోదీదంతా కేవలం షో మాత్రమే. అనవసరంగా ఆయనకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. ఆయనకంత సత్తా లేదు'అంటూ తేలిగ్గా తీసిపారేశారు. 'ప్రధాని మోదీని పట్టించుకోవాల్సిన అవసరమే లేదు. మీడియానే ఆయన్ను అతిగా చూపిస్తోంది'అంటూ ఆరోపించారు. 'ప్రధాని మోదీని రెండు మూడు సార్లు కలిశాను. ఒకే గదిలో కూర్చున్నాను'అని చెబుతూ రాహుల్ గాంధీ..ఆయన తనకు పెద్ద సమస్య కాదని, దమ్ము లేని వ్యక్తిగా భావిస్తున్నానన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన భాగీదారి న్యాయ్ సమ్మేళన్‌లో రాహుల్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో అధికార యంత్రాంగంలో అణగారిన, బలహీన వర్గాల ప్రజల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని చెప్పారు. దళితులు, వెనుకబడిన కులాలు, గిరిజనులు, మైనారిటీలు దేశ జనాభాలో 90 శాతం వరకు ఉండగా, బడ్జెట్ తయారయ్యాక పంచిపెట్టే హల్వా వీరెవరికీ అందడం లేదన్నారు. ఈ 90 శాతం మందే దేశ ఉత్పాదక శక్తి అని చెప్పారు. కార్పొరేట్ సంస్థల్లో లక్షలు, కోట్లలో వేతన ప్యాకేజీలు అందుకునే వారిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల వారు లేరనే విషయం ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో వెల్లడైందని ఆయన వివరించారు. అదే సమయంలో, ఉపాధి హామీ కార్మికులు, గిగ్ వర్కర్లు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారే ఉన్నారని వివరించారు. 2004లో యూపీఏ–1 హయాంలో రాజకీయాల్లోకి ప్రవేశించిన తాను ఓబీసీల స్థితిగతులను గురించి తెలుసుకునే ప్రయత్నం చేయకుండా తప్పు చేశానంటూ రాహుల్ ఒప్పుకున్నారు. ఇకపై ఆ తప్పును సరిదిద్దుకుంటానని చెప్పారు. సెంట్రల్ యూనివర్సిటీల విధాన నిర్ణయాలు, బోధన సిబ్బందిలో అణగారిన వర్గాల వారిని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అనంతరం రాహుల్ ఎక్స్‌లో ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది.

థాయ్‌లాండ్–కాంబోడియా ఘర్షణలు

వేలాదిగా ఇళ్లు వదిలి వెళ్తున్న ప్రజలు

సురిన్: థాయ్‌లాండ్–కాంబోడియా సరిహద్దుల్లో ఘర్షణలు రెండోరోజూ కొనసాగుతుండటంతో ఆ ప్రాంతాల్లోని ప్రజలు వేలాదిగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. సరిహద్దులోని నాలుగు ప్రావిన్స్‌లకు చెందిన 58 వేల మందిని తాత్కాలిక షెల్టర్లలో ఉంచినట్లు థాయ్ ప్రభుత్వం తెలిపింది. సరిహద్దులకు సమీపంలోని 4 వేల మందిని ఖాళీ చేయించినట్లు కాంబోడియా పేర్కొంది. ఘర్షణల్లో తమ వాళ్లు 14 మంది చనిపోయినట్లు థాయ్‌లాండ్ ప్రకటించగా, కాంబోడియా శుక్రవారం ఒక్కరు చనిపోయినట్లు ధ్రువీకరించింది. శుక్రవారం సరిహద్దు ప్రాంతాల్లోని ప్రావిన్స్‌ల్లో థాయ్, కాంబోడియా బలగాలు కాల్పులకు దిగాయి. ఈ పరిణామాలపై ఆసియాన్ ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే ఘర్షణలను నిలిపివేయాలని ఇరుదేశాలకు ఆసియాన్ అధ్యక్ష స్థానంలో ఉన్న మలేసియా పిలుపునిచ్చింది. ఐరాస భద్రతా మండలి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. ఇలా ఉండగా, ఘర్షణల నేపథ్యంలో సరిహద్దుల్లో ఉన్న థాయ్‌లాండ్‌కు చెందిన ఏడు ప్రావిన్స్‌లకు వెళ్లవద్దని భారత పర్యాటకులకు బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది.

విద్యార్థుల ఆత్మహత్యలు వ్యవస్థాగత లోపమే: సుప్రీం

మానసిక ఆరోగ్య సంక్షేమం కీలకం ● సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన

న్యూఢిల్లీ: యువత, ముఖ్యంగా విద్యార్థుల బలవన్మరణాలు పెరిగిపోతుండటం ఆందోళనకరమని సుప్రీంకోర్టు పేర్కొంది. ''ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం. ఈ జాఢ్యాన్ని నిర్లక్ష్యం చేయలేం''అని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. విశాఖపట్నానికి చెందిన ఓ 17 ఏళ్ల నీట్ విద్యార్థి ఆత్మహత్య కేసు విచారణను సీబీఐకి బదలాయించాలన్న పిటిషన్‌ను శుక్రవారం విచారించింది. ఈ అంశంపై 15 మార్గదర్శకాలు జారీ చేసింది. ''విద్యా సంస్థల్లో విద్యార్థి–కౌన్సెలర్ నిష్పత్తిని గరిష్ట సంఖ్యకు పెంచాలి. ముఖ్యంగా పరీక్షలు, కౌన్సెలింగ్ తదితరాల వేళ వీటి అవసరం చాలా ఎక్కువగా ఉంటుంది. సూసైడ్ హెల్ప్‌లైన్ నంబర్లు, టెలీ–మానస్ తదితర జాతీయ సేవల చిరునామా, ఫోన్ నంబర్లను విద్యా సంస్థలు, హాస్టళ్లు, తరగతి గదులతో పాటు వెబ్‌సైట్లలో కూడా ప్రముఖంగా కనిపించేలా ఉంచాలి. బోధన, బోధనేతర సిబ్బంది అందరూ ఏటా కనీసం రెండుసార్లు తప్పనిసరి మానసిక శిక్షణ తీసుకోవాలి. సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్ చేయగలిగి ఉండాలి. విద్యార్థుల్లో ఆత్మహత్యకు సంబంధించిన ధోరణులను తొలి దశలోనే గుర్తించి, సరిగా స్పందించగలిగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి. మానసిక ఆరోగ్య అక్షరాస్యత, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, జీవ కళా విద్య వంటివాటికి తరగతి గదుల్లో చోటివ్వాలి. విద్యాపరమైన ఒత్తిళ్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ విద్యా సంస్థలే నివారణ చర్యలు చేపట్టాలి''అని పేర్కొంది. ''2022లో భారత్‌లో 1.7 లక్షల పైచిలుకు ఆత్మహత్యలు నమోదయ్యాయి. వాటిలో 7 శాతానికి పైగా, అంటే 13,044 విద్యార్థుల ఆత్మహత్యలే. వీటిలోనూ 2,248 ఆత్మహత్యలు నేరుగా పరీక్షల ఫలితాలతో సంబంధమున్నవే కావడం మరింత బాధాకరం''అంటూ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలను ఉటంకిస్తూ ధర్మాసనం పేర్కొంది. ''స్కూళ్లు, కోచింగ్ సెంటర్లు, కాలేజీలు, శిక్షణ కేంద్రాల వంటివాటిలో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఇది ఒక రకంగా మానసిక ఆరోగ్య సంక్షోభం. ఇదే విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. మానసిక ఆరోగ్యం రాజ్యాంగం కల్పించే జీవించే హక్కులో భాగం''అని గుర్తు చేసింది. దీనిపై 90 రోజుల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించింది.

లోక్‌సభలోనే అభిశంసన చర్యలు

- కేంద్ర ప్రభుత్వ తీర్మానాన్ని స్వీకరించనున్న స్పీకర్ ఓం బిర్లా
- ప్రతిపక్షాలపై పైచేయి సాధించాలని బీజేపీ నిర్ణయం

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే తీర్మానాన్ని మాత్రమే లోక్‌సభలో చర్చకు స్వీకరించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఆ తర్వాత ఆయనపై విచారణ కోసం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తారని తెలిపాయి. జస్టిస్ వర్మ అవినీతికి పాల్పడినట్లు కమిటీ విచారణలో తేలితే అభిశంసన ప్రక్రియ ప్రారంభిస్తారని పేర్కొన్నాయి. జస్టిస్ వర్మ అభిశంసన కోసం రాజ్యసభలో ఇప్పటికే విపక్ష 'ఇండియా' కూటమి ఒక తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ తీర్మానాన్ని అప్పటి ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ స్వీకరించడం వివాదాస్పదంగా మారింది. చివరకు అదే ఆయన పదవికి ఎసరుపెట్టింది. రాజ్యసభలో ప్రతిపక్షాల తీర్మానాన్ని ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టబోతున్నట్లు తెలిసింది. జస్టిస్ వర్మ విషయంలో తామే పైచేయి సాధించాలని అధికార బీజేపీ నిర్ణయించుకుంది. ఆయనను పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా న్యాయ వ్యవస్థలో అవినీతిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమన్న సంకేతాలను ఇవ్వదలిచింది. అంతేకాకుండా న్యాయ వ్యవస్థ కంటే పార్లమెంటే అత్యున్నతం అని తేల్చిచెప్పాలని బీజేపీ భావిస్తున్నట్లు సమాచారం.

లక్ష ఏళ్లనాటి సమాధులు

ఇజ్రాయెల్‌లోని గుహలో వెలుగులోకి...

ఇజ్రాయెల్‌లో ఏకంగా లక్ష ఏళ్ల నాటి అతి పురాతన సమాధుల సమూహం వెలుగు చూసింది. దీన్ని ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన శవాల దిబ్బల్లో ఒకటిగా భావిస్తున్నారు. నాటి ఆదిమ మానవుల మృతదేహాలను ఇక్కడ గుంతల్లో జాగ్రత్తగా సమాధి చేసినట్టు కనుగొన్నారు. సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని టిన్‌షమెట్ గుహలోని ఈ సమాధుల సమూహానికి గురించిన వివరాలను ఇటీవలే అకాడమిక్ జర్నల్‌లో ప్రచురించారు. చనిపోయిన వారి గౌరవార్థం మృతదేహాల పక్కన పాతిపెట్టిన పలు వస్తువులు, అవశేషాలను అక్కడినుంచి తవ్వితీశారు. ఇది మానవ జాతికి సంబంధించి వెలుగు చూసిన అతి గొప్ప ఆవిష్కరణ అని తవ్వకాల బృందం డైరెక్టర్లలో ఒకరు, హీబ్రూ యూనివర్సిటీ ఆర్కియాలజీ ప్రొఫెసర్ యోసి జైద్నెర్ అన్నారు. ఈ దిబ్బల్లో మృతదేహాలను గర్భస్థ పిండం ఆకృతిలో పాతిపెట్టారు. ఇవి లక్ష నుంచి లక్షా 10 వేల ఏళ్ల నాటివని వివరించారు.

గుహ మొదట్లోనే పుర్రె

టిన్‌షమెట్ ప్రాంతంలో పురాతత్వ శాస్త్రవేత్తలు 2016 నుంచీ తవ్వకాలు సాగిస్తున్నారు. గుహ మొదట్లో రాతి గుండా బయటికి చొచ్చుకుని వచ్చినట్టుగా ఉన్న ఓ పుర్రెను గుర్తించారు. లోపల సమాధుల్లో శవాల పక్కన గులకరాళ్లు, జంతువుల అవశేషాల వంటివి కనిపించాయి. వీటిలో చాలావరకు నాటి రోజువారీ జీవితంలో ఉపయోగం లేనివే. దాంతో ఇవి అప్పటి ఆచారం ప్రకారం మృతుల గౌరవార్థం ఉంచినవేనని తేల్చారు. ఇవన్నీ రాతియుగం నాటివిగా, అంటే సుమారు 2.5 లక్షల నుంచి 30 వేల ఏళ్ల మధ్యనాటివిగా తేలింది. ఈ వివరాలను నేచర్‌హ్యూమన్ బిహేవియర్ జర్నల్‌లో ప్రచురించారు. ఇక్కడ రెండు అస్థిపంజరంతో కూడిన పూర్తిస్థాయి పుర్రెలు, మూడు పుర్రెలు, ఎముకలతో పాటు అలంకరణ సామగ్రి వంటివి కూడా దొరికాయి. అప్పట్లోనే మనిషి కేవలం తిండి, స్వీయరక్షణకు పరిమితం కాకుండా ఇతరత్రా అంశాలను కూడా నేర్చుకున్నట్టు దీన్నిబట్టి తెలుస్తోందని పురాతత్వవేత్తలు అభిప్రాయపడుతున్నారు. సున్నితత్వం దృష్ట్యా ఈ గుహ భాగాలను అతి చిన్న పరికరాలతో జాగ్రత్తగా తొలుస్తున్నారు. ఈ నేపథ్యంలో అందులోని పూర్తి విశేషాలు బయట పడాలంటే మరికొన్నేళ్లు పడుతుందని భావిస్తున్నారు. ఇవి ఇజ్రాయెల్‌లోని 100 ఏళ్ల క్రితం స్కుల్‌లో, 50 ఏళ్ల నాడు ఖఫ్జేలో బయటపడ్డ గుహలను తలపిస్తున్నాయి. మృతదేహాలను గాలికి వదిలేయకుండా ఇలా ఒక పద్ధతి ప్రకారం అంత్యక్రియలు జరిపే ఆచారం బహుశా 2 లక్షల ఏళ్ల క్రితమే పురుడుపోసుకుని ఉంటుందని పురాతత్వవేత్తలు అంచనా వేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
హైదరాబాద్
శనివారం । 26 । జూలై । 2025



వైద్య రంగంలో నర్సులది కీలక పాత్ర
వైద్య రంగంలో నర్సులది కీలక పాత్ర అని, సమాజానికి వీరు విశిష్ట సేవలు అందిస్తున్నారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు.
-8లో



కొత్త ట్రెండ్.. కో- లివింగ్..
నగరంలో నయా కల్చర్ ట్రెండింగ్‌లో ఉంది.. వ్యక్తిగత గృహాలు, హాస్టళ్లకు ప్రత్యామ్నాయంగా పలు బ్రాండెడ్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.
- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
28.0/21.0
వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 28, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





గచ్చిబౌలిలో..

నగరాన.. అదే వాన..



బేగంపేట్‌లో రహదారిని ముంచెత్తిన వరద

ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు కురిసిన వర్షంతో నగరం తడిసిముద్దయింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు పడగా.. రాత్రి కుండపోతగా కురిసింది. నగటున 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.
- సాక్షి, సిటీబ్యూరో

ఆర్టీసీ ప్రయాణికులకు రాయితీల బొనాంజా

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి విజయవాడ, బెంగళూర్ నగరాలకు టికెట్ చార్జీల్లో ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. ఈ మేరకు టికెట్ ధరలు 16 నుంచి 30 శాతం వరకు తగ్గించినట్లు ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు గరుడ ప్లస్ బస్సు టికెట్ ధర రూ.635 నుంచి రూ.444కి, గరుడ క్లాస్ రూ.592 నుంచి రూ.438కి తగ్గించినట్లు పేర్కొన్నారు. రాజధాని ఏసీ రూ.533 నుంచి రూ.448కి, లగ్జరీ సూపర్ క్లాస్ రూ.815 నుంచి రూ.685కి తగ్గించారు. బెంగళూరు మార్గంలోనూ సర్వీసులపై టికెట్ ధరలు తగ్గించారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ.946 నుంచి రూ.757కి తగ్గించారు. లహరి ఏసీ స్లీపర్ బస్సుల్లో బెర్త్ ధర రూ.1569 నుంచి రూ.1177కి తగ్గించారు. లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో సీటు ధర రూ.1203 నుంచి రూ.903కి, బెర్త్ ధర రూ.1569 నుంచి రూ.1177కి తగ్గించినట్లు శ్రీలత చెప్పారు. ఈ రాయితీలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్‌లకు కూడా వర్తిస్తాయి. శ్రావణ మాసంలో అధిక ప్రయాణాలు ఉంటాయని, రాయితీలతో ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుందని ఆమె చెప్పారు.

జంట జలాశయాలకు వరద తగ్గుముఖం

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఉస్మాన్‌సాగర్ జలాశయంలోకి పరీవాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, దోబీపేట్ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద పూర్తిగా తగ్గింది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్ పేట్, నర్కూడ, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం నీరు ఈసీ నది ద్వారా జలాశయాలకు చేరుతోంది. ఉస్మాన్‌సాగర్ జలాశయానికి వరద ఆగి పోగా, హిమాయత్ సాగర్ జలాశయానికి మాత్రం 250 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

ముష్కి చెరువుపై హైడ్రా దృష్టి

ఎఫ్‌టీఎల్‌లో మట్టి తొలగింపునకు ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: మణికొండ సమీపంలోని ముష్కి చెరువు పరిరక్షణపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. దాని ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో కొందరు మట్టి వేసినట్లు గుర్తించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తక్షణం తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై శుక్రవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు నెలాఖరు నాటికి ఆ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన మట్టితో పాటు పైభాగంలో ఏర్పాటు చేసిన బండ్‌ను సైతం తొలగించాలని బాధ్యులకు స్పష్టం చేసిన రంగనాథ్.. అలా చేయని పక్షంలో క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అభివృద్ధి పేరిట చెరువు ఎఫ్‌టీఎల్‌లో బండ్ నిర్మించి పై భాగాన్ని చెరువు నుంచి వేరు చేస్తున్నారని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విచారణ చేపట్టారు. సీఎస్‌ఆర్ నిధుల కింద చెరువును అభివృద్ధి చేస్తున్న తత్వ రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు పనులు చేపట్టిన ధృవాన్ష్ అనే ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధులు కూడా ఈ సమీక్షకు హాజరయ్యారు. చెరువు విస్తీర్ణం మొత్తం 50 ఎకరాల వరకూ ఉండగా చుట్టూ ఎగువ భాగంలో కూడా బండ్ నిర్మించడంతో కేవలం 12 ఎకరాలకు పరిమితం అవుతోందని ముష్కి చెరువు పరిరక్షణ సమితి ప్రతినిధులు హైడ్రా ఎదుట స్పష్టంచేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న రంగనాథ్.. అభివృద్ధి పనుల పేరిట నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులో మట్టి పోయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మట్టిని తొలగించి పూర్తి స్థాయిలో చెరువును కాపాడి అభివృద్ధి పనులు కొనసాగించాలని సూచించారు.



మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పెట్రోల్‌లో నీళ్లు!

- వాహన ఇంజిన్లపై తీవ్ర ప్రభావం
- పట్టని పౌరసరఫరాల యంత్రాంగం

బంకుల్లోని ట్యాంకుల్లోకి వరద నీరు

- నగర శివారు సాగర్ రోడ్డులోని ఓ ప్రధాన చమురు కంపెనీకి చెందిన పెట్రోల్ బంకులో రవీందర్ అనే వాహనదారు లీటర్ పెట్రోల్ పోయించుకున్నాడు. వాహనం కొద్దిదూరం వెళ్లిన తర్వాత మొరాయించింది. బైక్ మెకానిక్ దగ్గరికి వెళ్లగా పెట్రోల్ ట్యాంక్‌లో నీళ్లు ఉన్నట్లు వెల్లడించారు. కంగుతిన్న సదరు వినియోగదారు కలెక్టర్‌తో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.
- నెల రోజుల క్రితం చైతన్యపురిలోని జాతీయ రహదారిపై ఉన్న బంక్‌లో పెట్రోల్ పోయించుకోగా కొద్ది దూరం వెళ్లిన తర్వాత వాహనాలు మొరాయించాయి. అనుమానంతో వినియోదారులు ఖాళీ బాటిల్ తీసుకెళ్లి పెట్రోల్ పోయించారు. బాటిల్ అడుగున నీరు ఉండటంతో ఆందోళనకు దిగారు.
- రెండేళ్ల క్రితం హయత్‌నగర్‌లోని బంక్‌లో నీళ్లతో కూడిన పెట్రోలు వచ్చిందని వాహనదారులు ఆందోళన చేపట్టారు. ఫిర్యాదు రావడంతో పౌరసరఫరాల అధికారులు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించి చేతులు దులుపుకొన్నారు. బంక్ యాజమానిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- సాక్షి, సిటీబ్యూరో



ఇథనాల్‌లో పెట్రోల్ మిళితం..

నగర పరిధిలోని పలు బంకుల్లో పెట్రోల్, డీజిల్‌తో పాటు నీళ్లు కూడా వస్తున్నాయి. పెట్రోల్ బంకుల నిర్వహణలో నిర్లక్ష్యం వినియోగదారులకు శాపంగా తయారైంది. ఇప్పటికే పెట్రోల్ బంకుల కాసుల కక్కుర్తి నాణ్యతలో కల్తీ, తక్కువ కొలతలతో వాహనదారులు నష్టపోతుండగా... తాజాగా పెట్రోల్‌లో కలుస్తున్న నీళ్లు వాహనాల ఇంజిన్లను దెబ్బతీస్తున్నాయి. బంకుల యాజమానులకు కాసుల ధ్యాస తప్ప నాణ్యమైన పెట్రోల్, డీజిల్ పోయాలన్న ధ్యాసే లేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంకుల్లోని ఇంధన నాణ్యతను పరిశీలించాల్సిన పౌరసరఫరా అధికారగణం పట్టించుకోకపోవడంతో పంపింగ్‌పై పెట్రోల్ డీలర్ల నిర్లక్ష్యం మరింత పెరిగినట్లయింది.

ఆయిల్ కంపెనీల నుంచి ఇథనాల్‌తో కూడిన పెట్రోల్ సరఫరా నిల్వలపై ప్రభావం చూపుతున్నాయి. వాస్తవంగా ఇథనాల్ మిళితమైన పెట్రోల్ నిల్వల్లో నీటిచుక్క కలిసినా.. క్రమంగా పెట్రోల్ మొత్తం నీరుగా మారుతోంది. ప్రధాన చమురు సంస్థలు అధికారికంగానే ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రాం కింద పెట్రోల్లో 10 శాతం ఇథనాలన్ను కలుపుతున్నట్లు కంపెనీల ఇన్వాయిస్‌లు స్పష్టం చేస్తున్నా యి. ఇంధనంలో ఇథనాల్‌ను కలపడం వల్ల పెట్రోల్‌లోని ఆక్టేన్ సంఖ్య పెరుగుతుంది. అయితే.. ధర కూడా తగ్గించాల్సి ఉంటుంది. కానీ చమురు సంస్థలు వీటిని పట్టించుకోకుండా పెట్రోల్‌లో సుమారు 10 శాతం ఇథనాల్ కలిపి సరఫరా చేస్తూ పూర్తి ధరను కోట్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

దెబ్బతీస్తున్న వర్షాకాలం..

పెట్రోల్ బంకుల్లో ఇథనాల్‌తో కూడిన పెట్రోల్ నిల్వలపై వర్షాకాలం తీవ్రంగా దెబ్బతీస్తోంది. ట్యాంకుల నిర్వహణలో నిర్లక్ష్యంతో కొద్దిపాటి వర్షపు నీరు చేరినప్పటికీ నిల్వలు క్రమంగా నీళ్లగా మారడం సర్వసాధారణంగా తయారైంది. రోజువారీ స్టాక్ సరఫరా ఆలస్యమైతే బంకుల నిర్వాహకులు అడుగు నిల్వలను సైతం వాహనాలకు పోస్తుండటంతో పెట్రోల్‌తో పాటు నీరు కూడా పంపింగ్ అవుతోంది. వాహనం స్టార్ట్ అయినా కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఆగిపోతోంది. నీళ్లు కలిసి పెట్రోల్‌తో ఇంజిన్‌పై ప్రభావం పడుతోంది. బోరు పిస్టల్ పనికి రాకుండా పోయి త్వరగా మార్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

శాంపిల్స్ సేకరణ అంతంతే

పెట్రోల్ బంకుల్లో శాంపిల్స్ సేకరణ, వాటి పరీక్షలు నామమాత్రంగా మారాయి. పౌర సరఫరాల శాఖ అధికారులు ఏడాదికోసారి కూడా పెట్రోల్ బంకులను సందర్శించి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపించి పరీక్షలు నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదు. వాస్తవంగా సంబంధిత అధికారులు సాధారణ విధుల్లో భాగంగా పెట్రోల్ బంకుల నుంచి సందర్శించి కల్తీ కట్టడి కోసం శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌లకు పంపి పరీక్షించాల్సి ఉంటుంది. అధికారులు వద్ద కూడా పరీక్షలు నిర్వహించేందుకు పరికరాలు అందుబాటులో ఉండాలి. అవీ అందుబాటులో లేకుండా పోయాయి. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యతను పరీక్షించేందుకు అధికారికంగా రెడ్‌హిల్స్‌లో ఎఫ్‌ఎస్‌ఎల్ ల్యాబ్ ఉంది. అక్కడికి శాంపిల్స్‌ను పరీక్షకు పంపించిన దాఖలాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. వినియోగదారులు మాత్రం నీళ్ల పెట్రోల్‌తో నష్టపోతున్నారు.

అంతా సిద్ధం.. అమ్ముకుంటే ఆదాయం

'రియల్ ఎస్టేట్' బాగానే ఉన్నా విక్రయాలకు వెనుకంజ

ప్రాంతం	మొత్తం ఎకరాల్లో	హెచ్ఎండీఏ ప్లాట్లు	విక్రయించినవి	ప్రస్తుతం ఉన్నవి
లేమూరు	83.47	164	-	164
తొర్రూరు	117.375	885	392	493
కుర్మల్‌గూడ	16.75	145	86	59
బాచుపల్లి	27.36	206	204	2
మేడిపల్లి	53.21	208	91	117 (కొన్ని ప్లాట్లు కోర్టు కేసుల్లో ఉన్నాయి)
మోకిల	165.37	908	189	719 (కొన్ని స్థలాల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంది)
బుద్వేల్	182.10	17	12	4
ప్రతాప్‌సింగారం	126.12	24	-	24
బహదూర్‌పల్లి	40.00	221	152	69
ఇన్ముల్‌నెర్వా	92.69	327	-	-

- సర్కార్ పిలుపు కోసం ఎదురుచూపులు
- లే అవుట్‌లు సిద్ధం చేసిన హెచ్ఎండీఏ



సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ లే అవుట్‌లలో స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ సర్కార్ నుంచి అనుమతి లభించకపోవడంతో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ఆరు నెలల క్రితమే భూముల విక్రయం ద్వారా ఆదాయాన్ని ఆర్జించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ అప్పట్లో రియల్‌ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొనడం వల్ల విరమించుకున్నారు. కొద్ది రోజులుగా 'రియల్' రంగంలో సానుకూల వాతావరణం నెలకొంది. ఇటీవల హౌసింగ్‌బోర్డు స్థలాల అమ్మకాలకు సముచితమైన స్పందన లభించింది. మరోవైపు నగర శివార్లలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణరంగం ఊపందుకుంటోంది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ భూములకు సైతం డిమాండ్ బాగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కొనుగోలుదారుల ఆసక్తి..

ప్రైవేట్ వెంచర్‌ల కంటే హెచ్ఎండీఏ లే అవుట్‌లలో కొనుగోలు చేసేందుకే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. రోడ్లు, పారిశుద్ధ్య, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించడం, ఎలాంటి వివాదాలు లేని స్థలాలు కావడంతో సామాన్య, మధ్యతరగతి వర్గాలు మొదలుకుని సంపన్నులు, బిల్డర్‌లు, రియల్టర్లు తదితర అన్ని వర్గాలకు చెందిన వాళ్లు కూడా హెచ్ఎండీఏ భూములను, స్థలాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. గతంలో వివిధ ప్రాంతాల్లో హెచ్ఎండీఏ విక్రయించిన స్థలాలకు భారీ ఎత్తున స్పందన లభించడమే ఇందుకు నిదర్శనం.

కాలయాపన ఎందుకు..

ప్రస్తుతం పలు ప్రాంతాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇన్ముల్‌నెర్వా, లేమూరు, కుర్మల్‌గూడ, తొర్రూరు, ప్రతాప్‌సింగారం తదితర ప్రాంతాల్లో స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కొన్ని చోట్ల హెచ్ఎండీఏ సొంత స్థలాల్లో లేఅవుట్‌లను అభివృద్ధి చేయగా, ప్రతాప్ సింగారం, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన భూములను అభివృద్ధి చేశారు. ఈ వెంచర్‌లలో రైతులకు 60 శాతం ప్లాట్‌లు కేటాయించగా చెందిన మిగతా 40 శాతం స్థలాల్లో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా స్థలాలను విక్రయించవచ్చు. 'ప్రస్తుతం అన్ని విధాలుగా సానుకూలంగా ఉంది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొంటేనే కొనుగోలుదార్ల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభిస్తుంది' అని హెచ్ఎండీఏ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. బుద్వేల్, మోకిల వంటి చోట్ల గతంలో హెచ్ఎండీఏ స్థలాలకు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం అక్కడ ఇంకా కొన్ని స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కోకాపేట్‌లో ఎకరం రూ.వంద కోట్లకు అమ్ముడైంది. బుద్వేల్‌లోనూ భారీ ఆదాయం లభించింది. వివిధ ప్రాంతాల్లో ఎన్నారైలు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆశించే మధ్యతరగతి వర్గాలు సైతం హెచ్ఎండీఏ స్థలాలను కొనుగోలు చేశాయి.

కాసులుంటేనే పరుగులు..

సికింద్రాబాద్ నుంచి డెయిరీఫాం, శామీర్‌పేట్ మార్గాల్లో ఎలివేటెడ్ కారిడార్‌లతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణానికి హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. డెయిరీఫాం ఎలివేటెడ్‌కు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లకు టెండర్‌లు కూడా ఖరారయ్యాయి. దీంతో నిధుల కేటాయింపు హెచ్ఎండీఏకు ఒక సవాల్‌గా మారింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న భూములను, ప్లాట్‌లను విక్రయించడం వల్ల కనీసం రూ.5000 కోట్ల వరకు ఆర్జించే అవకాశం ఉంది.

హెచ్ఎండీఏను సందర్శించిన జేడీఏ బృందం

సాక్షి, సిటీబ్యూరో: జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (జేడీఏ) అధికారుల బృందం శుక్రవారం అమీర్‌పేట్‌లోని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)ను సందర్శించింది. జేడీఏ కమిషనర్ ఆనంది నేతృత్వంలో ప్లానింగ్ డైరెక్టర్ ప్రీతి గుప్తా, అదనపు చీఫ్ టౌన్ ప్లానర్ అంకుర్ దధీచ్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రుషికేష్ కొల్హే తదితర ప్రతినిధులు హెచ్ఎండీఏను సందర్శించారు. ప్రణాళికా విభాగం పనితీరు, మెట్రోపాలిటన్ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర సీనియర్ అధికారులు జేడీఏ ప్రతినిధులతో సమావేశమయ్యారు. హెచ్ఎండీఏ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపైన కమిషనర్ సమగ్రమైన వివరాలను అందజేశారు.



సర్ఫరాజ్ అహ్మద్‌తో జేడీఏ బృందం సభ్యులు

ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ వరకు వివిధ రంగాల్లో అభివృద్ధి కోసం ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్-2050, రహదారుల అభివృద్ధి ప్రణాళికలు, కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ), ఆర్థికాభివృద్ధి ప్రణాళిక, బ్లూ-గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళికలపై వివరించారు. ల్యాండ్‌పూలింగ్ కోసం అమలు చేసే పథకాలను ప్రస్తావించారు. రైతుల వద్ద నుంచి సేకరించిన భూములను అభివృద్ధి చేసిన తర్వాత రైతులకు తిరిగి 60 శాతం భూమిని ఇస్తున్నామని, 40 శాతం భూమిని మాత్రం హెచ్ఎండీఏ తీసుకుంటుందని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని జీఐఎస్ సాంకేతికతో మ్యాపింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా త్రీడీ డిజిటల్ ట్విన్, కాంప్రెహెన్సివ్ బిల్డింగ్ రెగ్యులేషన్స్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. మెట్రోపాలిటన్ నగరాల అభివృద్ధిలో వివిధ ప్రాంతాల్లో అమలయ్యే ప్రాజెక్టులపై పరస్పరం అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సమావేశంలో డీటీసీపీ డైరెక్టర్ ఎస్.దేవేందర్ రెడ్డి, ప్లానింగ్ డైరెక్టర్లు కె.విద్యాధర్, రాజేంద్ర ప్రసాద నాయక్‌లతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్వీపింగ్ మెషిన్ల పేరిట దోపిడీకి చెక్

- కొత్త టెండర్లకు అనుమతి నిరాకరణ

నిధుల 'స్వీప్' కుదరదిక

సాక్షి, సిటీబ్యూరో: నిధుల దుబారాను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అందుకు తాజా ఉదాహరణగా.. స్వీపింగ్ మెషిన్ల పేరిట జరుగుతున్న నిధుల దోపిడీని అడ్డుకోవాలని భావించడమే. అందుకనుగుణంగా స్వీపింగ్ మెషిన్ల కాంట్రాక్టు ముగిశాక తిరిగి కాంట్రాక్టుకు పిలవకపోవడం. ఏళ్ల తరబడి స్వీపింగ్ పేరిట నిధులు దండుకుంటున్నవారు తిరిగి వాటిని తీసుకునేలా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

కార్మికుల భద్రత పేరిట దోపిడీ

వీధులను శుభ్రపరిచే కార్మికులు రాత్రుళ్లు రోడ్లను శుభ్రం చేసేటప్పుడు వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకని స్వీపింగ్ మెషిన్లను వినియోగంలోకి తెచ్చారు. స్వీపింగ్ మెషిన్లు నిజంగా పనిచేస్తే అది ప్రయోజనమే.. కానీ.. జీహెచ్ఎంసీలో ఇటీవలి కాలం వరకు పనిచేసిన స్వీపింగ్ మెషిన్లు అలంకారప్రాయమేనన్నది తనిఖీలు జరిపిన ఆయా సందర్భాల్లో వెల్లడైంది. పని చేయనప్పటికీ 38 స్వీపింగ్ మెషిన్ల పేరిట ఏటా జీహెచ్ఎంసీ ఖజానా నుంచి దాదాపు రూ.47 కోట్లు చెల్లింపులు చేశారు. ఇలంబర్తి కమిషనర్‌గా ఉన్నప్పుడు వీటి పనితీరుపై అనుమానం వచ్చి తనిఖీలు చేయించగా, బండారం బట్టబయలైంది. నిబంధనలు ఉల్లంఘించినందుకు రెండునెలల్లోనే రూ. 6 లక్షల పెనాల్టీలు పడ్డాయి. పలు మార్లు హెచ్చరికల తర్వాతే అన్ని పెనాల్టీలు పడ్డాయంటే, అంతకుముందు అసలు అవి రోడ్లను ఊడ్చాయో, లేదో ఊహించుకోవచ్చు. స్వీపింగ్ మెషిన్ల కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపులు జోన్లస్థాయిలోనే ఉండటంతో సర్కిళ్ల డీసీలు, ఏఎంఓహెచ్‌ల పాత్ర కూడా ఉందనే ఆరోపణలున్నాయి.

ఇండోర్ పేరు చెప్పి..

ప్రతిసారీ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో మొదటిస్థానంలో నిలిచే ఇండోర్‌లో స్వీపింగ్ మెషిన్లున్నాయి. అయితే అక్కడ అవి కచ్చితంగా పని చేస్తాయి. అంతేకాదు.. రోడ్లను శుభ్రంగా ఊడ్చడమే కాక, ఊడ్చినప్పుడు దుమ్ము లేవకుండా వెంటనే నీరు చల్లే స్ప్రింకర్లు ఉండటాన్ని గుర్తించి, అలాంటివే హైదరాబాద్‌లో వినియోగిస్తామన్నారు. కానీ.. పాత పద్ధతిలోనే మెషిన్ల చీపుర్లు రోడ్లను తాకకుండా, గాలికి దుమ్ము జనం కళ్లలో పడేలా ఉన్న వాహనాలు మాత్రమే జీహెచ్ఎంసీలో తిరిగాయి. ఊడ్వాల్సినన్ని రోజులు.. ఊడ్వాల్సినంత దూరం ఊడ్చనప్పటికీ చెల్లింపులు జరిగాయనే ఆరోపణలున్నాయి. నిజంగాస్వీపింగ్ మెషిన్ల వల్ల ప్రయోజనముంటే.. వాటిని అద్దెకు తీసుకునే బదులు, కొనుగోలు చేసి, జీహెచ్ఎంసీయే నిర్వహించవచ్చు. ప్రతీదీ ప్రైవేటుకివ్వడం, కమీషన్లు దండుకోవడం అలవాటైనే కొందరు అధికారులు.. ప్రైవేటులోనే నిర్వహణ బాగుంటుందని చెప్పడం రివాజుగా మారింది.



రోడ్ల నిర్వహణ లేకున్నా..

జీహెచ్ఎంసీ ప్రధాన రహదారుల మార్గాల్లోని దాదాపు 811 కిలోమీటర్ల రోడ్లను సీఆర్ఎంపీ కింద రోడ్ల నిర్మాణం, నిర్వహణ బాధ్యతల్ని ఐదేళ్లపాటు పెద్ద ఏజెన్సీలకు కాంట్రాక్టుకిచ్చింది. కాంట్రాక్టులో భాగంగా రోడ్లు శుభ్రం చేసే బాధ్యత కూడా వాటికుండేది. వాటి కాంట్రాక్టు ముగిశాక, తిరిగి రోడ్ల నిర్వహణనైతే ఇంతవరకు ఎలాంటి ఏజెన్సీలకు ఇవ్వనప్పటికీ, కేవలం స్వీపింగ్ మెషిన్లతో ఊడ్చే పనుల్ని మాత్రం స్వీపింగ్ కాంట్రాక్టర్లకు అప్పగించి ఆర్నెల్లలో రూ.12.49 కోట్లు ధారపోశారు. వాటి వల్ల అప్పుడు కలిగిన ఫలితమెంత? ఇప్పుడేమైనా తేడా ఉందా? అంటే ప్రజల నుంచి ఎలాంటి తేడా లేదనే సమాధానమే వస్తోంది. గత నెలాఖరుతో వాటి ఆ కాంట్రాక్టు గడువు ముగిసిపోవడంతో.. స్వీపింగ్ మెషిన్లతో ఊడ్చనందున నగర ఇమేజే మారిపోనుందనే ప్రచారాన్ని కొందరు ప్రముఖుల ద్వారా చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సైతం స్వీపింగ్ మెషిన్లు అవసరమంటూ, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం గమనార్హం.

చెత్త.. వ్యాధులు కనిపించవా ?

స్వీపింగ్ మెషిన్లు లేకపోతే పర్యావరణంపై ప్రభావం పడుతుందని, స్వచ్ఛ నగరంగా గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్‌కు అవి అవసరమని కొందరు పేర్కొంటుండగా.. వాటికంటే ముందు నగరంలో లోపించిన పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రోడ్లపై తిరగాల్సిన స్వీపింగ్ యంత్రాల కంటే ఇళ్ల నుంచీ స్వచ్ఛ ఆటోలు చెత్త సేకరించేలా శ్రద్ధ చూపాలంటున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రాధాన్యతలకనుగుణంగా పనిచేస్తే మంచిదంటున్నారు.

సికింద్రాబాద్ డీఆర్ఎంగా గోపాలకృష్ణన్



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డీఆర్ఎంగా డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన 1998 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్టీఎస్) అధికారి. ఈ నియామకానికి ముందు ఆయన సికింద్రాబాద్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా పనిచేశారు. డాక్టర్ గోపాలకృష్ణన్ ఐ.ఐ.టి ఢిల్లీ నుండి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బి.టెక్, ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎఫ్.ఎం.ఎస్) నుండి ఎంబీఏ పూర్తిచేశారు. అలాగే సింగపూర్ యూనివర్సిటీ టెక్నాలజీ అండ్ డిజైన్ (ఎస్.యూ.టి.డి) నుండి ఇంజనీరింగ్ సిస్టమ్స్ అండ్ డిజైన్‌లో పీహెచ్‌డీ చేశారు. అత్యంత సంక్లిష్టమైన ముంబై సబర్బన్ రైల్వే వ్యవస్థలో కార్యకలాపాలు, వాణిజ్య విధులను సమర్థవంతంగా నిర్వహించారు. రైల్వే బోర్డులో దేశవ్యాప్తంగా పెట్రోలియం లాజిస్టిక్స్‌కు నాయకత్వం వహించారు. భారతీయ రైల్వేల డేటా అనలిటిక్స్ యూనిట్ స్థాపించి సంవత్సరాలు నాయకత్వం వహించారు. ఈ యూనిట్ భారతీయ రైల్వేల కోసం కృత్రిమ మేధస్సు, డేటా స్ట్రాటజీని అభివృద్ధి చేసింది. అలాగే 4.8 లక్షలకు పైగా ఇళ్లల్లో మొట్టమొదటి నేషనల్ హౌస్ హోల్డ్ ట్రావెల్ సర్వేను రూపొందించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు.

రుణాల పేరిట రూ.1.5 కోట్లు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలోని తెల్లాపూర్‌లో ఉంటున్న ఓ వ్యక్తి తాను ముంబైలో ఉంటున్నట్లు ఆన్‌లైన్‌లో ప్రచారం చేసుకున్నాడు. ఫిన్‌పెయిర్ పేరుతో వెబ్‌సైట్ ఏర్పాటు చేసి వ్యాపారాభివృద్ధికి రుణం ఇస్తానంటూ ఎర వేశాడు. నమ్మి ముందుకు వచ్చిన నగర వ్యాపారి నుంచి రూ.1.5 కోట్లు స్వాహా చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడు డి.నాగరాజును అరెస్టు చేసినట్లు డీసీపీ దార కవిత శుక్రవారం వెల్లడించారు. తెల్లాపూర్ రోడ్డులోని హోనర్ వివాంటీస్‌లో నివసించే నాగరాజు ఆన్‌లైన్‌లో ఫిన్ పెయిర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశాడు. దీనికోసం ఓ వెబ్‌సైట్‌ను రూపొందించిన ఇతగాడు అందులో ఇది ముంబై కేంద్రంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నాడు. వివిధ రకాలైన వ్యాపారులను వారి వ్యాపారాభివృద్ధి కోసం తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామంటూ ఆన్‌లైన్ వేదికగా ప్రచారం చేశాడు. నగరానికి చెందిన ఓ వ్యాపారి (39) ఆన్‌లైన్‌లో వచ్చిన ఈ ప్రకటన చూసి ఆకర్షితుడయ్యాడు. తనకు రుణం కావాలంటూ ఆ ప్రకటనలో పొందుపరచగా...అది చూసిన నాగరాజు 2023 జూన్‌లో సదరు వ్యాపారిని సంప్రదించాడు. వ్యాపారి పూర్వాపరాలు, రుణం అవసరాలను తెలుసుకున్న నాగరాజు భారీ మొత్తం తక్కువ వడ్డీకి ఇవ్వడానికి అంగీకరించాడు. ఆపై వివిధ రకాలైన రుసుముల పేరు చెప్పి ఆ ఏడాది నవంబర్ నుంచి దశల వారీగా రూ. కోటీ 55 లక్షలు స్వాహా చేశాడు. అప్పటి నుంచి త్వరలో రుణం మంజూరై ఖాతాలో పడుతుందంటూ నమ్మబలుకుతున్నాడు. ఎట్టకేలకు మోసపోయానని తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.సతీష్ రెడ్డి నేతృత్వంలోని బృందం నిందితుడిని అరెస్టు చేసింది. ఇతడు ఇలాంటి నేరాలు ఇంకా ఏవైనా చేశాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తోంది.

ఆస్పత్రిలో పసికందును వదిలివెళ్లిన మహిళ



సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఓ గుర్తు తెలియని మహిళ పసికందును వదిలేసి వెళ్లింది. ఇన్‌స్పెక్టర్ కె.నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం..ప్రసూతి ఆసుపత్రికి ఓ గుర్తుతెలియని మహిళ 7 నుంచి 8 నెలలు వయసున్న పసికందుతో వచ్చింది. వచ్చిన 10 నిమిషాల తర్వాత తనతో పక్కన చెకప్ కోసం వేచిఉన్న సునిత అనే మహిళకు ఆ పసికందును ఇచ్చి బాత్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వస్తానని చెప్పి ఎంతకు తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆసుపత్రి అధికారులను సంప్రదించగా వారు సీసీ టీవీ పుటేజీని పరిశీలించగా ఆ మహిళ ఆడ శిశువును వదిలేసి ఆసుపత్రి నుంచి తప్పించుకొని పోయినట్లుగా గమనించారు. వెంటనే ఆసుపత్రి ఆర్ఎంఓ సుల్తాన్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..వారు ఆసుపత్రికి చేరుకొని సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. శిశువును లక్డీకాపూల్‌లోని శిశు కేంద్రానికి తరలించారు.

వైద్యరంగంలో నర్సులది కీలకపాత్ర

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



పట్టాలు అందుకున్న విద్యార్థులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

చందానగర్: వైద్య రంగంలో నర్సులది కీలకపాత్ర అని, సమాజానికి వీరు విశిష్ట సేవలు అందిస్తున్నారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి, బన్సీలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళా దక్షిత సమితి చేస్తున్న సేవలు భేష్ అని కొనియాడారు. ఈ స్నాతకోత్సవానికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆస్పత్రుల్లో ఇప్పుడు డిజిటలైజేషన్ పేరుతో రోబోటిక్ తదితర యంత్ర పరికరాలతో ఆపరేషన్లు చేస్తున్నారని, కానీ మానవ స్పర్శతో రోగులకు వ్యాధి సగం నయమవుతుందన్నారు. డాక్టర్లు రోగులకు ఆరోగ్యంపై సలహాలు ఇస్తారు కానీ రోగి దగ్గర ఉండి నర్సులు సేవ చేయడం గొప్ప వరమన్నారు. నర్సుల సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ నర్సింగ్ అనేది కేవలం ఉద్యోగం కాదు, అదో దైవకార్యం లాంటిదన్నారు. మహిళా దక్షిత సమితి అధ్యక్షురాలు సరోజ్ బజాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల నాలుగవ బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు పట్టాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఆ వైద్యులకు అధిక వేతనం ఇవ్వాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ వైద్యులు, ప్రొఫెసర్లకు సంబంధించి పలు సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.బి.కిరణ్, కార్యదర్శి డా.ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పనిచేసే వైద్యులు, ప్రొఫెసర్లకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోరామన్నారు. అదనపు డీఎంఈ, ప్రొఫెసర్ పోస్టుల పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో అసోసియేట్ పదోన్నతులు కౌన్సిలింగ్ ద్వారా చేయాలని, అప్పుడే సీనియారిటీ ప్రకారం వస్తుంద అందులో పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పోల్చితే గ్రామీణ జిల్లాల్లో పనిచేసే వారికి వేతనం తక్కువగా వస్తుంది. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఇతర రాష్ట్రాల మాదిరిగా మారుమూల ప్రాంతాల వారికి వేతనం ఎక్కువ ఉండాలని కోరామన్నారు.

జల్సాలకు బానిసై చోరీలు

యువతి అరెస్టు..రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు

జీడిమెట్ల: ఇంటి తాళం తెరిచి..ఇంట్లో ఉన్న బంగారు, వెండి నగలు దొంగిలించిన యువతిని జగద్గిరిగుట్ట పోలీసులు చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ ఏసీపీ నరేష్‌రెడ్డి తదితరులు వివరాలు వెల్లడించారు. ఈ నెల 18న జగద్గిరిగుట్ట అల్విన్‌కాలనీకి చెందిన చిరంజీవి ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరచి ఉన్నాయి. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి బీరువా తలుపులు తెరచి చూడగా అందులో ఉంచిన 22.3 తులాల బంగారం, 5 తులాల వెండి నగలు కనిపించలేదు. చిరంజీవి వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ కెమెరాలు పరిశీలించగా..

దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు స్థానికంగా ఉన్న పలు సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో ఓ యువతి బ్యాగు వేసుకుని అనుమానాస్పదంగా వెళ్లడం కన్పించింది. సీసీ పుటేజీ ద్వారా ఆమె ఫోటోలు సేకరించి వివిధ పీఎస్‌లకు పంపగా ఆ యువతి పేరు ఆరోహి(21) అని, జల్సాలకు బానిసై చోరీలకు పాల్పడుతోందని, ఇటీవలే జైలుకు కూడా వెళ్లి వచ్చిందని, ఆమెపై బోరబండ పీఎస్‌లో రెండు కేసులు ఉన్నట్లు తేలింది. దీంతో పోలీసులు శుక్రవారం సనత్‌నగర్‌లోని యువతి ఇంటికి వెళ్లి ఆమెను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకుంది. ఆమె వద్ద 22.3 తులాల బంగారం, 5 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న జగద్గిరిగుట్ట ఇన్స్‌పెక్టర్ నర్సింహ, డీఐ నరేంద్రరెడ్డి, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, ఎస్సై నర్సింలు, హెడ్ కానిస్టేబుల్ ఇలేజర్, కానిస్టేబుల్ పరమేశ్వరరెడ్డి, పాషాలను ఉన్నతాధికారులు అభినందించారు.

100 మీటర్ల పరిధిలో 50 లారీల చెత్త

- బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు
- క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: టోలీచౌకీ సమీపంలోని విరాట్‌నగర్ బుల్కాపూర్ నాలాలో వ్యర్థాల తొలగింపు పనులు నడుస్తున్నాయి. శుక్రవారం 100 మీటర్ల పరిధిలో ఉన్న చెత్తను బయటకు తీయగా దాన్ని ఏకంగా 50 లారీల్లో తరలించాల్సి వచ్చింది. ఈ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. నాలాల్లో వరద సాఫీగా సాగేలా చూడాలని సూచించారు. నాలాల్లో ఎక్కడైనా ఆటంకాలు ఉంటే వెంటనే తొలగించాలని, వరద నీరు సాఫీగా సాగితేనే అనేక ప్రాంతాలకు వరద ముప్పు తప్పుతుందని పేర్కొన్నారు. విరాట్‌నగర్‌లోని ఇరుకు సందులో లారీలు వెళ్లేందుకు వీలు లేకపోయినా స్థానికుల సహకారంతో చెత్తను తొలగించే పనులను చేపట్టారు. అడిక్‌మెట్ పరిధిలోని పద్మా కాలనీలో ఇటీవల కూలిపోయిన నాలా రిటైనింగ్ వాల్ పరిసరాలను ఏవీ రంగనాథ్ పరిశీలించారు. ఆరు నుంచి ఎనిమిది మీటర్ల వెడల్పుతో దాదాపు 500 మీటర్ల మేర బాక్సు డ్రైన్ నిర్మించి, పైన వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించాలని అక్కడి స్థానికులు హైడ్రా కమిషనర్‌ను కోరారు. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నాలా విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

- 6.65 కేజీల గంజాయి స్వాధీనం



పోచారం: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడలో గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సాయంత్రం పోలీసులు సోదాలు నిర్వహించగా మహమ్మద్ నవాజ్ ఖాన్ అనే వ్యక్తి ఇంట్లో ఎండు గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఇతను సమీపంలోని సాయినగర్‌లో ఉంటున్న స్నేహితుడు షేక్ మహబూబ్ ఆలం వద్ద కిలో ఎండు గంజాయిని కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లలో నింపి..ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 చొప్పున విక్రయిస్తున్నాడు. మొత్తం 230 గ్రాముల గంజాయి దొరికింది. అనంతరం షేక్ మహబూబ్ ఆలం ఇంట్లో సోదాలు నిర్వహించగా 6.42 కిలోల ఎండు గంజాయి దొరికింది. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట, జైప్రకాష్‌నగర్‌కు చెందిన కాంపెల్లి తిరుపతి నుండి గంజాయి కొనుగోలు చేసినట్లు ఆలం అంగీకరించాడు. నిందితుల వద్ద లభించిన మొత్తం 6.65 కిలోల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, నవాజ్‌ఖాన్, షేక్ మహబూబ్ ఆలంలను కోర్టులో హాజరుపరిచారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు రవి, సంగీత, ఎస్ఐ నందిని, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నా జోలికి వస్తే అడ్డంగా నరికేస్తా

టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఇంటి యజమాని చిందులు..పోలీసులకు ఫిర్యాదు

ఫిలింనగర్: 'నా జోలికి వస్తే అడ్డంగా నరికేస్తా' అంటూ జీహెచ్ఎంసీ సర్కిల్–18 టౌన్ ప్లానింగ్ అధికారులను బెదిరిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడిన నిందితుడిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని శ్రీవెంకటేశ్వర కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో ప్లాట్‌నెంబర్ 224/ఏ యజమాని రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా సొసైటీ అధ్యక్షుడు అటు హైడ్రాకు, ఇటు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశాడు. దీంతో జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం ప్రహరీని పరిశీలించడానికి వచ్చారు. అధికారులు సర్వే చేస్తున్న సమయంలో ఇంటి యజమానిగా చెప్పుకుంటున్న నూకారపు రామకృష్ణ ఆగ్రహంతో ఊగిపోతూ అక్కడికి చేరుకుని అధికారులపై దుర్భాషలాడారు. అంతుచూస్తానంటూ తన కారులో నుంచి కత్తి తీసి నరికేస్తానంటూ బెదిరించాడు. తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశాడు. కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు నిందితుడు నూకారపు రామకృష్ణపై బీఎన్ఎస్ సెక్షన్ 132, 351 (2) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

జలాశయాలకు వరదపై అప్రమత్తంగా ఉండాలి



హిమాయత్‌సాగర్ జలాశయం నీటి మట్టం పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులోని జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదపై అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం అధికారులతో కలిసి ఆయన మొదట హిమాయత్‌సాగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. వరద నీటి ఇన్‌ఫ్లో వివరాలతో పాటు అక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. జంట జలాశయాల పరివాహక ప్రాంతాలలో గస్తీ పెంచాలని అన్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగరానికి మంచినీరు సరఫరా చేసే గండిపేట్ కాండూట్‌కు అమర్చిన ప్రెషర్ ఫిల్టర్‌ను పరిశీలించి పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అశోక్ రెడ్డి సూచించారు. అనంతరం ఓఅండ్ఎం డివిజన్–18 మణికొండ డివిజన్ ఆఫీస్‌ను సందర్శించి అధికారులతో నీటి సరఫరా వివరాలను ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం బ్రిజేష్, జీఎంలు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ ఓ హోటల్ యజమాని నుంచి రూ.2 లక్షల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు శుక్రవారం మధ్యాహ్నం రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. కొన్ని రోజుల క్రితమే రవికుమార్ సెలక్షన్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఓ హోటల్ నిర్వాహకుడిని కొన్ని రోజులుగా డబ్బులు ఇవ్వాలంటూ ఉపకమిషనర్ వేధిస్తున్నాడు. అపరిశుభ్రంగా కిచెన్ ఉండటంతో పాటు అక్రమ నిర్మాణం ఉందంటూ వేధిస్తున్నాడు. దీంతో యజమాని కమిషనర్‌తో సంప్రదింపులు జరపగా రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ విషయాన్ని హోటల్ యజమాని హైదరాబాద్ సిటీ రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం మధ్యాహ్నం రూ.2 లక్షలను హోటల్ యజమాని ఉప కమిషనర్ సర్కిల్ కార్యాలయంలో అందిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



పట్టుబడిన ఉప కమిషనర్ రవికుమార్

కారు సీటు కింద భద్రపరిచి..

హోటల్ యజమాని నుంచి డబ్బులు తీసుకున్న ఉప కమిషనర్ రవికుమార్ తన బ్యాగ్‌లో భద్రపరుచుకున్నాడు. వెంటనే ఆ బ్యాగ్‌ను తన కారు సీటు వెనుక భాగంలో భద్రపరిచాడు. ఏసీబీ అధికారులు భద్రపరిచిన డబ్బును స్వాధీనం చేసుకుని రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. డబ్బులకు అప్పటికే ఏసీబీ అధికారులు కెమికల్‌ను పూసి ఉంచారు. ఉప కమిషనర్ చేతులను సైతం నీటి ద్వారా పరిశీలించి డబ్బు తీసుకున్నట్లుగా నిర్ధారించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో వరలక్ష్మి అండ్ తేజ్ స్పెషల్ డిజైనర్ దుస్తులు, నగల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- సైఫాబాద్‌లోని రవీంద్రభారతిలో సాయంత్రం 5.30 గంటలకు కూచిపూడి ఆర్ట్స్ అకాడమి ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో అన్వితరాణి కూచిపూడి రంగప్రవేశం కార్యక్రమం జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

అంబేడ్కర్ వర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ వాయిదా

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ, ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రెన్స్ టెస్ట్‌ను ఆగస్టు 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 10వ తేదీ (ఆదివారం) జరగాల్సిన పరీక్షను సాంకేతిక కారణాలతో 24వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఆగస్టు 14 అని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు రాష్ట్రంలోని ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో మాత్రమే ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

ఎస్పీఓ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగంలో ఖాళీగా ఉన్న 116 స్పెషల్ పోలీసు ఆఫీసర్ (ఎస్పీఓ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఏఆర్ డీసీపీ రక్షిత మూర్తి శుక్రవారం ప్రకటించారు. తాత్కాలిక ప్రాతిపదికన నియమించే ఈ ఉద్యోగాలకు మాజీ సైనికులు, పారా మిలటరీ ఉద్యోగులు, పోలీసులు మాత్రమే అర్హులు. తెలంగాణ స్థానికులకు ప్రాధాన్యం ఉంటుంది. వచ్చే నెల ఐదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆసక్తి ఉన్న వారు పేట్లబుర్జులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న ఎస్పీఓస్ ఆఫీస్‌లో సంప్రదించాలి.

బోనాల్లోనూ బరితెగించారు!

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం జరిగిన బోనాల వేడుకలు, ఊరేగింపుల్లో పోకిరీలు రెచ్చిపోయారు. విచక్షణా రహితంగా, అనుచితంగా తాకుతూ మహిళలు, యువతులను వేధించారు. షీ–టీమ్స్ నిఘాలో మొత్తం 644 మంది పట్టుబడినట్లు డీసీపీ డాక్టర్ ఎన్‌జేపీ లావణ్య శుక్రవారం ప్రకటించారు. దీనికోసం షీ–టీమ్స్ రహస్య కెమెరాలు వినియోగించాయి. చిక్కిన పోకిరీల్లో 552 మంది మేజర్లు, 92 మంది మైనర్లు ఉన్నారు. రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన రామ్ ఆనంద్ (51), నీలకాంత్ (48), బాల్‌రాజు (36), లక్ష్మణ్ (42), దినేష్‌లపై (34) కేసులు నమోదు చేసిన షీ–టీమ్స్ న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా..ఏడు రోజుల చొప్పున జైలు శిక్షలు పడ్డాయి.

చిక్కని చిరుత

మణికొండ: పోలీసు గ్రే హౌండ్స్‌లో కనిపించిన చిరుత అటవీ శాఖ అధికారులకు చిక్కడం లేదు. నాలుగు రోజుల నుంచి గ్రే హౌండ్స్‌తో పాటు చిలుకూరు జింకల పార్కులో తిరిగిన చిరుత శుక్రవారం తెల్లవారు జామున ఔటర్ రింగ్ రోడ్డు దాటి సర్వీసు రోడ్డులో ఉన్న ట్రెక్ పార్కు వైపు వచ్చింది. తెల్లవారు జామున 2.30 గంటల సమయంలో ఔటర్‌పై వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ దాన్ని చూసి అకస్మాత్తుగా బ్రేక్ వేసినట్లు అతను అటవీ అధికారులకు తెలిపాడు. దాంతో అటవీ అధికారులు శుక్రవారం ట్రెక్ పార్కులోను రెండు బోన్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుతపులికి కావాల్సినంత ఆహారం లభిస్తుండటం, వందల ఎకరాల విస్తీర్ణమైన అటవీ ప్రాంతం ఉండటంతో అందులోనే తిరుగుతుందని, దాన్ని పట్టుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని చిలుకూరు అటవీ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ఉదయం సమయంలో ట్రెక్ పార్కులోకి వాకింగ్‌కు ప్రజలు రావద్దని, గ్రేహౌండ్స్, చిలుకూరు జింకల పార్కు పరివాహకంలో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

డీపీ ఫ్రాడ్‌లో ఇరువురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఓ కంపెనీ ఎండీ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టి, ఆ సంస్థ ఉద్యోగితో చాటింగ్ చేసి రూ.1.94 కోట్లు స్వాహా చేసిన కేసులో ఇద్దరు నిందితులను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన అజయ్ సాహు, ఉత్తరప్రదేశ్ వాసి వైష్ణ అని పోలీసులు ప్రకటించారు.

నాలాలో సిల్ట్ తొలగింపు షురూ

- బసవతారకనగర్ నాలాను పరిశీలించిన రంగనాథ్
- అప్పటికప్పుడే పనులు ప్రారంభం

'సాక్షి' కథనంపై స్పందించిన హైడ్రా కమిషనర్

సాక్షి ఎఫెక్ట్..



బసవతారకనగర్‌లో నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

బంజారాహిల్స్: 'రంగనాథా.. చూడవా మా బాధ' శీర్షికన ఈనెల 24న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలోని నాలా కొన్నేళ్లుగా వ్యర్థాలతో నిండిపోయి వానాకాలంలో వరద రు ముందుకువెళ్లలేక వెనక్కి వచ్చి వీధులతో పాటు ఇళ్లను ముంచెత్తుతున్న వైనాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం సంబంధిత అధికారులు, జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీఈ హరేరామ్, ఏఈ మోహనరావుతో కలిసి నాలాను పరిశీలించారు. నాలా పూర్తిగా వ్యర్థాలతో నిండి ఉండడంతో వెంటనే డీసిల్టింగ్ మిషన్లను తెప్పించి తొలగింపు పనులను చేపట్టి పర్యవేక్షించారు. ప్రస్తుతానికి సిల్ట్ మొత్తం తొలగిస్తామని, తర్వాత శాశ్వతంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇందుకోసం రూ.20–30 లక్షల వరకు ఖర్చవుతుందని వాటిని తమ శాఖనే భరిస్తుందన్నారు. బుల్కాపూర్ నాలాలో సిల్ట్ తీసిన తర్వాత వెంటనే గ్రిల్ ఏర్పాటు చేయాలని, నాలాలో కింద బెడ్ లేకపోవడం వల్లే ఈ పరిస్థితులు తలెత్తాయని ఇంజినీర్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మరోవైపు నాలాకు రెండువైపులా ఆక్రమణల సమస్య ఏళ్లుగా ఉందని వెల్లడించారు. పోచమ్మగుడి నుంచి లిబ్రా హోటల్ వరకు 1.6 కిలోమీటర్లు ఉండని, ఇందులో సగం నాలాలో మాత్రమే సిల్ట్ తీసేందుకు అవకాశం ఉందని ఇంజినీర్లు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఇలాంటి వార్తల వల్లే సమస్యలు పరిష్కారం: రంగనాథ్

'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తను చూశాను. ఇలాంటి మంచి వార్తలు రాస్తే అందరికీ సమాచారం తెలుస్తోంది. పైగా ప్రజా సమస్యలు కూడా పరిష్కారమవుతాయి.

నాలాపై మొత్తం 7 కల్వర్టులు ఉన్నాయని, ఇవన్నీ రోడ్డు లెవల్స్‌లో ఉన్నాయని, ఎగువ ప్రాంతాల్లోని వారు నాలాపై చెత్త వేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చెత్త సేకరించే వాహనాలు అన్ని చోట్లకు వెళ్లకపోవడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రంగనాథ్ స్పందిస్తూ మిషనరీ సపోర్ట్ తాము చేస్తామని, రెగ్యులర్‌గా చెత్త తీసేందుకు కూడా వాహనాలు పంపిస్తామని హామీనిచ్చారు.

రెండు నియోజకవర్గాల మధ్యలో..

ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్, అంబేడ్కర్‌నగర్, బీజేఆర్‌నగర్, బసవతారకనగర్ బస్తీలతో పాటు హకీంపేట కుంట ఇవన్నీ బుల్కాపూర్ నాలా కిందకి వస్తుండగా, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాలతో పాటు షేక్‌పేట, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధిలో ఉండడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. 2 నియోజకవర్గాలు, 2 డివిజన్ల మధ్యలో ఈ నాలా ఉండడంతో ప్రజాప్రతినిధులు కూడా ఎవరికీ వారే వాళ్లే చూసుకుంటారన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఫలితంగా జీహెచ్ఎంసీ ఇంజినీర్లు పట్టించుకోక నాలాల్లో సిల్ట్ పెరిగిపోయి సమస్య మరింత జఠిలం అవుతోంది.



సిల్ట్ తొలగిస్తున్న దృశ్యం

'బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలి'

పంజగుట్ట: తెలంగాణను ఎడారిగా మార్చే బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సిగ్నల్ మీడియా ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'బనకచర్ల ప్రాజెక్టు రాజకీయాలు' అనే అంశంపై శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పెద్దలు పక్షపాత వైఖరితో ఉండవద్దని, వారి ప్రభుత్వంలో చంద్రబాబు భాగస్వామ్యం ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌కు లబ్ధి చేకూరేలా చేయవద్దన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. బనకచర్లపై ప్రభుత్వం ఆల్‌పార్టీ మీటింగ్ పెట్టేందుకు కూడా సిద్ధంగా ఉందని, తెలంగాణ ప్రజలు వ్యతిరేకిస్తున్న ఈ ప్రాజెక్టును ప్రభుత్వం ఎందుకు ఒప్పుకుంటుందని ప్రశ్నించారు. సామాజిక విశ్లేషకులు వి.ప్రకాశ్ మాట్లాడుతూ.. పోలవరం నుంచి ఉభయగోదావరి జిల్లాలకు నీటి తరలింపునకు ఏపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమే బనకచర్ల ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్టులో రేవంత్‌రెడ్డి కుట్ర కూడా ఉందని ఆరోపించారు. రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం ప్రతినిధి దొంతుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్టు విషయమై తెలంగాణ ప్రభుత్వం అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి అడ్డుకోవాలన్నారు. శ్రీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. బనకచర్ల సమావేశాలను కేంద్రం బహిష్కరించాలని, ఒకవేళ మీటింగ్‌కు సీఎంను ఆహ్వానిస్తే పిలిస్తే తాము రాము అని స్పష్టంగా చెప్పాలన్నారు. సాగునీటి రంగ నిపుణులు నైనాల గోవర్ధన్, పృథ్వీరాజ్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, చాడ కిషన్ రెడ్డి, అశోక్, బుచ్చన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

బంజారాహిల్స్: సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయన ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత బంజారాహిల్స్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కౌశిక్ రెడ్డి సోషల్ మీడియా చానల్ అయినా తెలుగు స్క్రైబ్ ద్వారా సీఎంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య కూడా తలెత్తే అవకాశం ఉందని వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కల్వ సుజాత

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

హిమాయత్‌నగర్ : ఒడిస్సా నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్న ఓ పాత నేరస్తుడిని ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) టీం శుక్రవారం అరెస్ట్ చేసింది. విశాల్ సింగ్ గతంలో ధూల్‌పేట్ ప్రాంతంలో గంజాయి వ్యాపారం చేశాడు. అయితే 'ఆపరేషన్ ధూల్‌పేట్' నేపథ్యంలో వ్యాపారాన్ని హైదర్‌గూడకు మార్చాడు. ఫెర్నాండెజ్ ఆసుపత్రి సమీపంలో గంజాయిని విక్రయిస్తుండగా ఎస్ఐ బాలరాజు నేతృత్వంలోని బృందం అతడిని పట్టుకుని 1.161 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం నిందితుడిని నారాయణగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.ధర్మనాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఆచార్య ఘంటా చక్రపాణిని నియమించడం, అలాగే యూనివర్సిటీలో సీఎం చేతుల మీదుగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డికి, ఉపకులపతికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉపకులపతి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి ప్రత్యేక చొరవ చూపడం, అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్ తేవడంతో ఉపకులపతి, రిజిస్ట్రార్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, ఉపాధ్యక్షుడు వసంతరావు, సంయుక్త కార్యదర్శి మాలోతు బుద్ధ, కోశాధికారి రెడ్యా నాయక్, దేవుల, ఎస్.లక్ష్మయ్య ఆనంద్‌పవర్, బోజు శ్రీనివాస్, చంద్రకళ, ప్రేమ్‌కుమార్, యాకేశ్, ఉదయాని, పాండు, మంజుల, రుషేనద్రమని, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

ఖబ్రస్థాన్‌కు స్థలం కేటాయించాలి

రహమత్‌నగర్ : బోరబండ డివిజన్‌లో ఖబ్రస్థాన్‌కు స్థలం కేటాయించాలని స్వరాజ్‌నగర్ మసీదు కమిటీ అధ్యక్షుడు, బస్తీ నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం ప్రార్థనల అనంతరం మసీదు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ముక్రం, షేక్ షరీఫ్, యూసుఫ్, వహీం జావేద్, మోయిజ్ ఫయాజ్‌ఖాన్, మునీర్,గౌస్, జహంగీర్, జావీద్ ఖాన్ మాట్లాడుతూ.. 15ఏళ్లుగా పాలకులు, ప్రభుత్వాలు మారుతున్న సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. పీలీ దర్గా వద్ద ఉన్న ప్రభుత్వం స్థలంలో కొంత భూమి కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి, వక్ఫ్ బోర్డు చైర్మన్ దృష్టికి మరోసారి తీసుకెళ్తామని తెలిపారు.

ప్రత్యేక ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: తాజ్‌కృష్ణ హోటల్‌లో డిజైనర్ వేర్స్, యాక్సెసరీస్, జ్యువలరీ ఉత్పత్తుల ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ఆకృతి సంస్థ డైరెక్టర్ శశీనాథ శుక్రవారం ప్రారంభించారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, తీజ్ పండగల సందర్భంగా ఈనెల 25 నుంచి 27 వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



మన్నె ప్రేమ్‌కుమార్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ మండల తహసీల్దార్‌గా మన్నె ప్రేమ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు నాంపల్లి మండల తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఖైరతాబాద్ మండల పరిధిలోకి యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, ఖైరతాబాద్, సోమాజిగూడ డివిజన్లు వస్తాయి.

సమస్యలు పరిష్కరించండి



సమస్యలు విన్నవిస్తున్న యూసుఫ్‌గూడ నాయకులు

రహమత్‌నగర్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని యూసుఫ్‌గూడ డివిజన్ నాయకులు కోరారు. ఈ మేరకు రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎన్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.


చిన్నారెడ్డికి ఉద్యమకారుల వినతి



చిన్నారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఉద్యమకారులు

రహమత్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు కోరారు. ఈమేరకు జ్యోతిరావు ఫూలే భవన్‌లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సురేందర్ రెడ్డి, గగన కుమార్, చంద్రశేఖర్, గౌస్, జగన్, మాణిక్య, సురేందర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నేరవేర్చాలని విన్నవించారు. స్పందించిన చిన్నారెడ్డి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్ చౌహాన్

హిమాయత్‌నగర్: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ బర్త్‌డే సందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ చౌహాన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 200 మంది అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. వినోద్ నాయక్, శింబు నాయక్, ఆర్.రాజశేఖర్, వినోద్ నాయక్, జేడీ నాయక్, సతీశ్ కొండపల్లి, రమేశ్, వినోద్, రవీందర్, కృష్ణ, రూప, సంధ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహిళల 'ఆరోగ్యం-జాగ్రత్తలపై' అవగాహన

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బాబూ జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(అటానమస్)లో ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ ఎం.విజయకుమార్ నేతృత్వంలో మహిళా సాధికారిక విభాగాధిపతి డా.ఎన్.దీపిక ఆధ్వర్యంలో మహిళల రుతుచక్రంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్' సాహస్ ఎన్జీవో సంస్థ కో-ఆర్డినేటర్ మౌనిక హాజరై మాట్లాడారు. రుతు పరిశుభ్రత పద్ధతులు, డిస్పోజబుల్ ప్యాడ్లు, ఆరోగ్యం, పర్యావరణ ప్రభావాలు మొదలైన వాటిని విద్యార్థులకు వివరించారు. సురక్షితమైన, స్థిరమైన పద్ధతుల ద్వారా మెన్సువల్ కప్పులు, క్లాత్ అనుకూల ప్రత్యామ్నాయలు వాడడం ద్వారా, మహిళలు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా పర్యావరణాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతూ ఆర్థికంగా కూడా లాభాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ సూర్య కుమారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామలక్ష్మి, అధ్యాపకులు జ్యోతి, రత్నకల్యాణి, వై.ఉమ, అరుణ, రేష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న మౌనిక

యువకుడిపై కత్తితో దాడి

వెంగళరావునగర్: యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి కార్మికనగర్ ప్రాంతంలో వ్యక్తిని కత్తితో పొడిచారంటూ మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదు వచ్చింది. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లగా షేక్ తాజుద్దీన్ ఎడమచేతికి గాయమై ఉండగా ఆసుపత్రికి తరలించారు. వివరాలు అడగ్గా షేక్ ఫరీద్, అన్వర్ తనను పిలవగా వచ్చానని అయితే డబ్బుల విషయమై వాగ్వాదం జరగగా అందులో ఒకరు కత్తితో దాడి చేయగా చేతిని అడ్డుపెట్టగా ఎడమ చేతికి గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ పార్కింగ్‌లపై కొరడా

బంజారాహిల్స్: మాసబ్‌ట్యాంక్ తెలుగు సంక్షేమ భవన్ వైపు రోడ్డుకిరువైపులా వాహనాలను ఏళ్ల తరబడి అక్రమంగా పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుచించుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏళ్ల తరబడి నిలిపిన 50 వరకు పాత వాహనాలను తొలగించారు. అలాగే కొద్ది రోజులుగా నిలిపిన వాహనాలకు వీల్‌క్లాంప్స్ వేశారు. సుమారు 50 మంది అక్రమ పార్కింగ్‌దారులకు జరిమానా విధించారు. ఇప్పుడు వాహనాల రాకపోకలు సులభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మరోసారి వాహనాలు పార్కింగ్ చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని ఏసీపీ అక్కడివారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



వాహనాలు తొలగిస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

నిబంధనలకు విరుద్ధంగా ఇంజినీరింగ్ ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ వర్గీకరణ నిబంధనలకు విరుద్ధంగా ఇంజినీరింగ్ సీట్లు కేటాయించారని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నామ సైదులు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల రోస్టర్ విధానంలో ఇప్పటికే మాలలకు అన్యాయం జరిగిందని తాజాగా కేటాయించిన ఇంజినీరింగ్ సీట్లలో సైతం తీరని అన్యాయం జరిగిందన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు క్షమాపణ చెప్పాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వెంటనే క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఇంటిని ముట్టడిస్తామని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీసీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ హెచ్చరించారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టలేమనడం అవివేకమన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించి ఇప్పుడు బీజేపీ వ్యతిరేకించడం సిగ్గుచేటు అన్నారు.



'చిత్రపురికాలనీపై ఆరోపణలు అవాస్తవం'



మాట్లాడుతున్న చిత్రపురికాలనీ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్

బంజారాహిల్స్: చిత్రపురికాలనీపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఆ కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలనీలో అవినీతి జరిగినట్లు కొందరు మాట్లాడుతున్నారని, వారు ఆధారాలు తీసుకువస్తే బహిరంగంగా మాట్లాడేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామని, కానీ ఎవరూ రాలేదన్నారు. చిత్రపురికాలనీలో జాయిన్ కావాలంటే ఖచ్చితంగా సినీ కార్మికులే ఉండాలని, ప్రస్తుతానికి 60 శాతం మాత్రమే ఉన్నారన్నారు. 2009లో అనుమతులు తీసుకుని రోహౌస్‌లు నిర్మించామని తర్వాత 2017లో కూడా మరికొన్ని పర్మిషన్లతో జీ ప్లస్ 2గా మరికొన్ని నిర్మించామన్నారు. శ్రావణంలో అన్ని రకాల సౌకర్యాలతో మొత్తం 51 అంతస్తుల సఫైర్ షూట్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కొత్త ప్రాజెక్ట్ పూర్తికాకుంటే కాలనీ మనుగడకే ముప్పు ఉంటుందన్నారు. చిత్రపురికాలనీపై ఉన్న సుమారు రూ.170 కోట్ల అప్పు తీర్చాలంటే సఫైర్ సూట్ కేవలం 48 నెలల్లో పూర్తిచేస్తే ఆ అప్పును తీర్చే అవకాశం ఉందన్నారు. సినీ జర్నలిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, అలాగే 24 క్రాఫ్ట్‌లో తమ అసోసియేషన్ ద్వారా వస్తే ప్లాట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గతంలో లోన్స్ కట్టలేని పరిస్థితుల్లో వేలం వేసే పరిస్థితి వచ్చిందని, అప్పుడు చదలవాడ శ్రీనివాస్ చిత్రపురికాలనీకి అండగా నిలబడ్డారన్నారు. సభ్యులను తొలగించాలంటే రెండు ప్రక్రియలు మాత్రమే ఉంటాయని, ఒకటి సరైన సమయంలో డబ్బులు చెల్లించకపోవడం, లేదా సినీ కార్మికులు కానీ వారిని తీసేస్తామన్నారు.

ఎమ్మెస్సార్ సతీమణికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ఎం.సత్యనారాయణరావు నివాసానికి శుక్రవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్ వెళ్లారు. ఇటీవల ఎమ్మెస్సార్ సతీమణి సుగుణదేవి మృతి చెందగా, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేకించి సొంత జిల్లా కరీంనగర్ అభివృద్ధిలో తనదైన ముద్రవేసిన ఎమ్మెస్సార్‌కు జీవితాంతం సుగుణదేవి తోడునీడగా నిలిచారని ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు.

ఓయూ సెక్యూరిటీ సిబ్బందిపై వీసీ సీరియస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెక్యూరిటీ సిబ్బంది పై వీసీ ప్రొ.కుమార్ శుక్రవారం మండిపడ్డారు. ఈ నెల 21న వనభోజనాల సందర్భంగా బయటి వ్యక్తులు క్యాంపస్‌లో మద్యం సేవించి విద్యార్థుల పై దాడి చేయడం పట్ల వీసీ ఆగ్రహం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గార్డులకు షోకాజ్‌నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

వెంకటేశ్వరకాలనీ: రామకృష్ణానగర్, పంజగుట్ట దోబీఘాట్ బస్తీల్లో అధికారులు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టారు. హౌసింగ్ ఎస్ఈ విజయ్‌కుమార్, డీఈ రాములు, ఏఈ శిల్ప, సర్వేయర్ భీమ్లా నాయక్‌తో పాటు ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, రామకృష్ణానగర్, పంజగుట్ట దోబీఘాట్ బస్తీల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించడమే కాకుండా స్థానికులతో మాట్లాడి ఈ నిర్మాణాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.



దోబీఘాట్ బస్తీలో సర్వే చేస్తున్న అధికారులు

అవస్థల మధ్యే బ్యాడ్మింటన్ పోటీలు షురూ



గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బకెట్లు



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

వెంగళరావునగర్: పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్ ఆధ్వర్యంలో అంతర్‌ప్రాంత బ్యాడ్మింటన్ పోటీలు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో గురువారం ప్రారంభమయ్యాయి. అయితే 2 రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్టేడియం రూఫ్ నుంచి అనేక ప్రాంతాల నుంచి నీళ్లు కారుతూ కోర్టు ఆవరణలోనే పడుతున్నాయి. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది పైనుంచి కురుస్తున్న వాన నీటిని అడ్డుకునేందుకు స్టేడియంలో దాదాపు 20 బకెట్లు తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఎంతో పేరుగాంచిన ఈ స్టేడియంలో సమస్యలు ఎదురవడంతో క్రీడాకారులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. ఈ విషయమై స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రాజ్‌వీర్‌ను వివరణ కోరగా స్టేడియం మరమ్మతు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని నిధులు మంజూరు కాగానే రెనొవేషన్ చేయిస్తామని తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్: శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఫిలింనగర్ దైవసన్నిధానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు సహస్ర పుష్పార్చన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.



ఫిలింనగర్ దైవసన్నిధానంలో..



పెద్దమ్మ గుడిలో భక్తులు..



నగరంలో నయా కల్చర్ ట్రెండింగ్‌లో ఉంది.. వ్యక్తిగత గృహాలు, హాస్టళ్లకు ప్రత్యామ్నాయంగా పలు బ్రాండెడ్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. నెలలు, వారాలు, రోజులకు సైతం అద్దెకు ఇచ్చేందుకు గానూ సకల సౌకర్యాలతో కూడిన ప్రైవేట్ స్పేసెస్ అందుబాటులోకి వస్తున్నాయి. తొలుత వ్యక్తిగత నివాస గృహాలు, ఆ తర్వాత హాస్టళ్లు, సర్వీస్ అపార్ట్‌మెంట్స్ నగరంలో నివాసితుల కోసం అద్దెకు ఇచ్చేవారు. క్రమంగా ఇది రూపాంతరం చెందుతూ కో-లివింగ్ స్పేస్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. గత కొంత కాలంగా నగరంలో కినిపిస్తున్న ఈ ధోరణి మరింత పుంజుకోనుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



కొత్త ట్రెండ్.. కో-లివింగ్..

దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో శరవేగంతో విస్తరిస్తున్న కో-లివింగ్ స్థలాలు అంటే అర్థం సామూహిక జీవన ప్రదేశాలు అని. వీటిలో వ్యక్తులకు వంటగదులు, లివింగ్ రూములు, వినోద స్థలాలు వంటి సాధారణ ప్రాంతాలను పంచుకుంటుంటారు. అయితే ప్రైవేట్ బెడ్‌రూమ్‌లను నిర్వహిస్తారు. ఈ స్థలాలు సరసమైన, సౌకర్యవంతమైన, సామాజిక జీవనాన్ని కోరుకునే యువ నిపుణులు, విద్యార్థులు ఆకర్షించే విధంగా ఉంటాయి. విద్యాలయ క్యాంపస్‌లలో సరిపడా జాగా దొరకని విద్యార్థులు, ఫ్రెష్‌గా కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులుగా మారిన వారు.. ఇలా విభిన్న వర్గాల వారికి ఇవి చక్కని సేవలు అందిస్తున్నాయి. నెల వారీ అద్దెలతో పాటు రోజుల వారీగా కూడా చెల్లించే వెసులుబాటు నగరంలో ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి, ఇతరత్రా స్వల్ప వ్యవధి పనుల నిమిత్తం వచ్చే వారికి ఉపయుక్తంగా ఉంటోంది.

వ్యయం తక్కువ.. సౌకర్యాలు ఎక్కువ..

సంప్రదాయ నివాసాలతో పోల్చుకుంటే 25–35 శాతం తక్కువ అద్దెల్లో లభిస్తుండడంతో నగరంలో కో-లివింగ్ కల్చర్ అభివృద్ధి చెందుతోంది. సింగిల్ ఆక్యుపెన్సీ కో-లివింగ్ అద్దెలు ప్రస్తుతం నెలకు రూ.10,500 నుంచి రూ.17,300 వరకూ ఉన్నాయి. అదే సంప్రదాయ 1 బీహెచ్‌కే కు కనీసం రూ.15,000 నుంచి రూ.26,500 వరకూ ఉన్నాయి. అయితే ఇందులో కోలివింగ్‌లో మాదిరిగా ఫర్నిచర్, కిచెన్ నీడ్స్, ఇంటర్నెట్ వంటివి మనమే ఏర్పాటు చేసుకోవాలి. అదే కో-లివింగ్‌లో ప్రైవేట్ గదులు, షేర్డ్ కిచెన్‌లు, వర్క్ స్పేస్‌లతో పాటు హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను కూడా అందిస్తున్నాయి.

నగరంలో పెరుగుతున్న నయా కల్చర్

- వ్యక్తిగత గృహాలు, హాస్టళ్లకు ప్రత్యామ్నాయంగా
- అందుబాటులోకి పలు బ్రాండెడ్ సేవలు
- నెలలు, వారాలు, రోజులకు సైతం అద్దెకు
- సకల సౌకర్యాలతో ఆకట్టుకుంటున్న వైనం
- పలు చోట్ల అనైతిక కార్యకలాపాలపై ఆరోపణలు

మరో ఐదేళ్లలో పది లక్షలకు..

నగరంలో కో-లివింగ్ మార్కెట్ డిమాండ్‌లో గణనీయమైన పెరుగుదలను చూస్తోంది. ఇక్కడ వ్యవస్థీకృత కో-లివింగ్ ప్రస్తుతం 0.3 మిలియన్ల పడకల నుంచి 2030 నాటికి దాదాపు ఒక మిలియన్ (10లక్షలు) పడకలకు చేరుకుంటుందని మార్కెట్ నిపుణుల అంచనా. 'కో-లివింగ్ రంగం వేగవంతమైన వృద్ధి దశలోకి ప్రవేశిస్తోంది. సౌకర్యవంతమైన, కమ్యూనిటీ-కేంద్రీకృత జీవనానికి పెరుగుతున్న ప్రాధాన్యత ఈ ట్రెండ్‌కి మద్దతు ఇస్తున్నాయి. కో-లివింగ్ రంగంలో పెట్టుబడిదారుల భాగస్వామ్యం వల్ల 2030 నాటికి మార్కెట్ వ్యాప్తి ప్రస్తుత 5 శాతం నుంచి 10 శాతానికి పైగా ఉంటుందని అంచనా' అని అసెట్స్ అనాలసిస్‌కు పేరొందిన కొలియర్స్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాదల్ యాగ్నిక్ అంటున్నారు.



యజమానులు వేరే.. ఆపరేటర్లు వేరే..

చాలా వరకూ కో-లివింగ్ స్పేస్‌లు ఆస్తి యజమానులతో 3–9 సంవత్సరాల పాటు కొనసాగే లీజింగ్ ఒప్పందాలపై ఆధారపడి ఉంటాయి. రోజువారీ కార్యకలాపాలను, అద్దెదారులకు స్థలాలను ఇవ్వడాన్ని ఆపరేటర్లు నిర్వహిస్తారు. ఇవేకాక నిర్వహణ/ఆదాయ భాగస్వామ్యం ఫ్రాంఛైజింగ్ వంటివీ ఉన్నాయి. తద్వారా కో-లివింగ్ హాస్టళ్ల వేగవంతమైన పెరుగుదలకు యువత, ఐటీ నిపుణులు, విద్యార్థులు దోహదం చేస్తున్నారు.





రంగంలోకి.. బ్రాండెడ్ స్పేస్‌లు సైతం..

ఈ కో-లివింగ్‌కు మెట్రో నగరాల్లో శ్రీకారం చుట్టిన బ్రాండ్స్ నగరానికి కూడా తరలివస్తున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా పేరున్న జోలో, హెలో వరల్డ్, ది కోవీ, కప్లివ్, హౌజ్.. తదితర బ్రాండ్స్ ఈ తరహా కో-లివింగ్ స్పేస్‌లను విభిన్న నగరాలకు విస్తరిస్తున్నాయి. వీటికి డిమాండ్ గమనిస్తున్న స్థానిక భవనాల యజమానుల్లో కొందరు ఇదే మార్గానికి మళ్లుతుండడం గమనార్హం.

అదే రీతిలో ఆరోపణలు..

ఓ వైపు కో-లివింగ్ కల్చర్ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటుండగా.. మరోవైపు ఈ తరహా స్పేస్‌లపై ఆరోపణలు కూడా అదే స్థాయిలో ఊపందుకుంటున్నాయి. కొంతమంది కో-లివింగ్ స్పేస్‌ల యజమానులు అబ్బాయిలు, అమ్మాయిలు గదులను పంచుకోడానికి అనుమతించడం వంటి వివాదాస్పద ధోరణులకు కారణమవుతున్నారని, మరికొందరు మరో అడుగు ముందుకేసి మగవాళ్ల కోసం ప్రత్యేకంగా 'ఒక అమ్మాయిని ఏర్పాటు చేయడం వంటి చట్ట వ్యతిరేక చర్యలకూ పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కొత్త తరహా కల్చర్ ఎటు దారితీస్తుందో చూడాలి..



సంతానలేమి సమస్యకీ ఏఐ

- పరీక్షలపై అవగాహన పెరగాలి
- ఐవీఎఫ్ దినోత్సవంలో సినీనటి లయ

సాక్షి, సిటీబ్యూరో: ఫెర్టిలిటీ సమస్యలపై దంపతుల్లో అవగాహన పెరగాలని ప్రముఖ సినీనటి లయ అభిప్రాయపడ్డారు. మగవారి వీర్యకణాలను ఏఐ టెక్నాలజీ ద్వారా పరీక్షించే లెన్స్‌హుక్ ఎక్స్–12 ప్రో సాంకేతికతను నగరానికి చెందిన ఫర్టీ–9 ఫెర్టిలిటీ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ టెక్నాలజీని ప్రారంభించిన సందర్భంగా లయ మాట్లాడారు. డయాబెటిస్, బీపీ పరీక్షల్లానే సంతానలేమి పరీక్షలు కూడా ఎటువంటి సంకోచం లేకుండా చేయించుకోవాలని, ఈ విషయంలో భార్యా భర్తలు ఇరువురూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏఐ టెక్నాలజీ ద్వారా నిమిషాల వ్యవధిలో వేల సంఖ్యలో వీర్యకణాలను పరిశీలించి డీఎన్‌ఏ లోపాలను గుర్తించి సరైన చికిత్స అందించేందుకు తోడ్పడుతుందని, తద్వారా మగవారిలో వీర్యకణాల నాణ్యతను పెంచవచ్చని సంస్థకు చెందిన డాక్టర్ జ్యోతి చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీఈవో వినేష్ గదియా తదితరులు పాల్గొని మాట్లాడారు.



రమణీయం కూచిపూడి నృత్యం

150 మంది కళాకారులతో ప్రదర్శన

సందర్శకులను అలరించిన పలు రూపకాలు

గన్‌ఫౌండ్రీ : అమృత ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కూచిపూడి నృత్యాంజలి పేరిట రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అహూతులను ఆకట్టుకున్నాయి. నాట్య గురువు డాక్టర్ కె.సాయిగీత ఆధ్వర్యంలో సుమారు 150 మంది శిష్యులు ప్రదర్శించిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. భామా కలాపం, తాండవ నృత్యకరీ, కృష్ణ శబ్దం, జతిస్వరం, ఆనంద తాండవం, దశావతార శబ్దం వంటి అంశాలపై సాగిన నృత్య రూపకాలు ప్రేక్షకులను అలరించాయి. విద్యార్థి దశ నుంచే ఇంటువంటి శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ఎండీ సీహెచ్ శేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్ గ్యాలరీలో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్

- ఆకట్టుకుంటున్న చిత్రాలు, ఫొటో గ్రాఫ్‌లు
- ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 వరకు అందుబాటులో





మాదాపూర్ : కళాకారులు వేసిన చిత్రాలు, తీసిన ఫొటోలను మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. వేర్వేరు విభాగాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన నాలుగు ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుడు నన్నుత రాజేశ్వర్ వేసిన చిత్రాలను రిటైర్డ్ ప్రొఫెసర్ అంజనీరెడ్డి ప్రారంభించారు. ప్రదర్శనలో మొత్తం 55 చిత్రాలు అందుబాటులో ఉన్నాయి. 27 వరకూ సందర్శకులకు అందుబాటులో ఉంటాయి.

27 వరకూ ప్రదర్శన..

కళాకారిణి శాంతి వింజమూరి వేసిన చిత్ర ప్రదర్శనను ప్రొఫెసర్ నరసింహం వడ్లమాని ప్రారంభించారు. ప్రదర్శనలో 40 చిత్రాలు అందుబాటులో ఉన్నాయి. 27 వరకూ సందర్శనకు ఉంచనున్నట్లు ముఖ్య అతిథి సినీనటుడు నోయల్ సీన్ తెలిపారు.

చతురంగ కళా ప్రదర్శన..

కోల్‌కతాకు చెందిన నలుగురు చిత్ర కళాకారులు వేసిన చిత్రాలను ప్రముఖ కళాకారుడు చిన్నిశ్రీపతి ప్రారంభించారు. ప్రదర్శనలో 51 చిత్రాలు అందుబాటులో ఈనెల 31వ తేదీ వరకూ ఉంచనున్నట్లు తెలిపారు.

50 ఫొటోగ్రాఫ్స్..

ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ప్రారంభించారు. ప్రదర్శనలో 50 ఫొటోలు అందుబాటులో ఉన్నాయి. ఈనెల 27వ తేదీ వరకూ సందర్శనకు ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సివ్ ప్రిన్సిపల్ జోష్నరాణి, పలువురు ఫొటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు.





క్యాంపస్‌లో.. క్లిక్ క్లిక్..

- సెల్‌ఫోన్‌లో అరుదైన 'నత్త చిత్రం'
- జీవవైవిధ్యానికి కేంద్రంగా హెచ్‌సీయూ

రాయదుర్గం : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ బయోడైవర్శిటీకి నిలయంగా సాగుతోంది. అందులో భాగంగా పలు రకాల జీవజాతులకు, పచ్చదానినికీ, జీవవైవిధ్యానికీ కేరాఫ్ అడ్రస్‌గా కొనసాగుతోంది. కాగా హెచ్‌సీయూ క్యాంపస్‌లోని సెంటర్ ఫర్ మోడలింగ్, సిమ్యులేషన్ అండ్ డిజైన్ (సీఎంఎస్‌డీ) ముందు తారసపడిన నత్తను ఐఓఈ (ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్) డైరెక్టరేట్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎం నిఖిల్ తన సెల్‌ఫోన్‌లో బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్ జీవవైవిధ్యానికి నిలయమని స్పష్టం చేయడానికి ఈ చిత్రమే ఒక నిదర్శనంగా పేర్కొన్నారు. అరుదైన పలు జంతువులు, పక్షులకు కేంద్రంగా హెచ్‌సీయూ నిలుస్తుందని గుర్తు చేసుకున్నారు.

> ప్రతికూల పరిస్థితుల్లోనూ హాట్‌కేకుల్లా ఫ్లాట్లు అమ్ముడుపోవాలంటే.. పునాదుల్లోనే సగానికిపైగా అమ్మకాలు జరగాలంటే.. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఏడాదిలో గృహ ప్రవేశం చేయాలంటే.. వీటిన్నింటికీ ఒకే సమాధానం చిన్న ప్రాజెక్టులు. నిజం చెప్పాలంటే చిన్న ప్రాజెక్టులు విస్తీర్ణంలోనే చిన్నవి.. వసతుల్లో మాత్రం పెద్ద ప్రాజెక్టులకు ఏమాత్రం తీసిపోవు. పైపెచ్చు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఉండటం చిన్న ప్రాజెక్టులకు మరింత కలిసొచ్చే అంశం.
> – సాక్షి, సిటీబ్యూరో

చిన్న ప్రాజెక్టులు.. పెద్ద లాభాలు!

విస్తీర్ణంలోనే చిన్నవి.. వసతుల్లో మాత్రం పెద్దవే..

- ఏడాదిలో గృహ ప్రవేశం.. వసతులు, గ్రీనరీకి ఏర్పాట్లు
- అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో చిన్న ప్రాజెక్టులే మేలు

ప్రతికూల పరిస్థితుల్లో ఆదుకుంటాయంటున్న నిపుణులు

బడా ప్రాజెక్టులు నిర్మించాలంటే రూ.కోట్లలో పెట్టుబడి కావాలి. అమ్మకాలు బాగుంటే పర్వాలేదు.. కానీ, సీన్ రివర్స్ అయ్యిందో ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడం కష్టం. దీంతో అటు కొనుగోలుదారులు, ఇటు నిర్మాణ సంస్థలకూ తలనొప్పే. ప్రతికూల పరిస్థితుల్లో గొప్పకు పోయి పెద్ద మొత్తంలో బ్యాంకు రుణాలు తెచ్చి ప్రాజెక్ట్‌లు ప్రారంభించి అమ్మకాలు లేక బోర్డు తిప్పేసిన సంస్థలు అనేకం. అందుకే ఎలాంటి పరిస్థితుల్లోనైనా హాట్‌కేకుల్లా ప్రాజెక్ట్ అమ్ముడుపోవాలంటే చిన్న ప్రాజెక్ట్‌లే మేలని సూచిస్తున్నారు నిపుణులు. కొద్దిపాటి పెట్టుబడితో ప్రాజెక్ట్‌ను ప్రారంభించి.. పునాదుల్లోనే సగానికి పైగా అమ్మకాలు చేసుకునే వీలుంటుంది కూడా.

ఏడాదిలో గృహప్రవేశం..

డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో కొద్ది పాటి స్థలంలోనే చిన్నపాటి నిర్మాణాలు చేపడుతున్నాయి నిర్మాణ సంస్థలు. అప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతం కావడం, ఆధునిక వసతులూ కల్పిస్తుండటంతో కొనుగోలుదారులూ వీటిల్లో ఫ్లాట్లు కొనేందుకు ముందుకొస్తున్నారు. చిన్న ప్రాజెక్ట్‌ల మార్కెట్‌లో లాభాలు తక్కువగానే ఉంటాయి. అయినా నిర్మాణం చేపట్టడానికి సిద్ధం. ఎందుకంటే ఈ నిర్మాణాలు ఏడాది లేక 15 నెలల్లో పూర్తవుతాయి. దీంతో త్వరగానే కొనుగోలుదారుల సొంతింటి కల నెరవేరడంతో పాటు మార్కెట్‌లో తమ కంపెనీ బ్రాండింగ్ పెరుగుతుందనేది నిర్మాణ సంస్థల వ్యూహం. అయితే చిన్న ప్రాజెక్ట్‌లు నిర్మించాలంటే స్థలం అంత సులువుగా దొరకదు. పోటీ ఎక్కువగా ఉంటుంది.

వసతులకు కొదవేంలేదు..

గతంలో డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్ట్‌ల్లో వసతులు కల్పించకపోయినా గిరాకీకి ఢోకా ఉండేది కాదు. కానీ, ప్రస్తుతం కొనుగోలుదారుల అభిరుచిలో మార్పు వచ్చింది. ధర ఎక్కువైనా.. వసతుల విషయంలో రాజీపడటం లేదు. దీంతో చిన్న ప్రాజెక్ట్‌ల్లోనూ ఆరోగ్యం కోసం వాకింగ్, జాకింగ్ ట్రాక్స్, యోగా, జిమ్, మెడిటేషన్ హాల్, ఆహ్లాదకరమైన ల్యాండ్ స్కేపింగ్‌లతో పాటు స్విమ్మింగ్ పూల్, బేబీ, మదర్ కేర్ సెంటర్, లైబ్రరీ.. వంటి ఏర్పాట్లు ఉంటున్నాయి. అంతేకాకుండా చిన్న ప్రాజెక్ట్‌లో ఉండే కొన్ని ఫ్లాట్లే ఉంటాయి. ఫ్లాట్‌వాసులందరూ కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఉంటారు. ఉమ్మడి కుటుంబాల లోటు తీరుతుందనేది కొనుగోలుదారుల అభిప్రాయం.







అఫర్డబుల్.. ట్రబుల్

- అందుబాటు గృహాల నిర్మాణానికి అనాసక్తి
- లగ్జరీ ఇళ్ల నిర్మాణానికే డెవలపర్ల మొగ్గు
- సామాన్యుల సొంతింటి కల మరింత దూరం

సాక్షి, సిటీబ్యూరో: సామాన్యుడి సొంతింటి కల మరింత దూరమవుతోంది. అందుబాటు గృహాల నిర్మాణాలు తగ్గుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఇసుక, సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో పాటు డెవలపర్లు విలాసవంతమైన ఇళ్ల నిర్మాణానికే మొగ్గు చూపిస్తున్నారు. గతంలో ప్రభుత్వాలు కూడా సామాన్య, మధ్య తరగతి కోసం వేర్వేరు పథకాల ద్వారా సొంతింటి కలను నెరవేర్చేవి. కేంద్రం ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై గృహరుణ ఆధారిత వడ్డీ సబ్సిడీతో కొనుగోలుదారులకు భారం తగ్గి ఈఎంఐ చెల్లింపుల్లో కొంత వెసులుబాటు లభించేది. ఎంఐజీ విభాగంలో 1,800 చ.అ. విస్తీర్ణం వరకు ఈ పథకం అమలు చేసినప్పుడు ఎక్కువ ప్రయోజనం పొందారు. ఇప్పుడిది ఎల్ఐజీ వరకే పరిమితమైంది. దీంతో సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది.

ప్రైవేటీకరణ..

పట్టణాల్లో హౌసింగ్ బోర్డుల ఆధ్వర్యంలో గృహ నిర్మాణం చేపట్టినప్పుడు అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని కాలనీలను నిర్మించేవారు. అధిక ఆదాయం, మధ్య, తక్కువ ఆదాయ వర్గాలుగా హెచ్ఐజీ, ఎంఐజీ, ఎల్ఐజీగా విభజించి ఇళ్లు, స్థలాలను విక్రయించే పరిస్థితి ఉండేది. అయితే డిమాండ్‌కు అనుగుణంగా, కొనుగోలుదారుల అవసరాలకు తగ్గట్టుగా నిర్మాణాలు చేపట్టడంలో హౌసింగ్ బోర్డులు వెనకబడటంతో ప్రైవేట్ రంగం విజృంభించింది. మొదట్లో అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్న ఇళ్ల నిర్మాణం చేపట్టినా.. తర్వాత డిమాండ్ ఉన్న ప్రీమియం ఇళ్లవైపు వ్యవస్థీకృత రియల్ ఎస్టేట్ మొగ్గింది. భూముల ధరలు అనూహ్యంగా పెరగడంతో సరసమైన ధరల ప్రాజెక్టులు చేపట్టలేకపోతున్నామని.. విలాసవంతమైన ఇళ్ల నిర్మాణం చేపడితే విక్రయాలు బాగుంటున్నాయని బిల్డర్లు అంటున్నారు.

తగ్గిన కొనుగోలు శక్తి..

మధ్యతరగతి వర్గాల్లో అత్యధిక శాతం మంది గృహ రుణం ద్వారానే ఇల్లు కొంటుంటారు. అధిక వడ్డీ రేట్లు, రుణ లభ్యత తగ్గిపోవడంతో సొంతింటి కల సవాల్‌గా మారింది. భూముల ధరలు పెరగడం.. ఆ మేరకు ఇంటి ధరలను పెంచాల్సి రావడంతో అందుబాటు ధరల్లో ఇళ్ల లభ్యత తగ్గిపోయింది. బిల్డర్ ఎవరైనా ముందుకొచ్చి సరసమైన ధరల ఇళ్ల నిర్మాణం చేపడితే వాటిని విక్రయించడం పెద్ద సవాల్‌గా మారిందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఆయా వర్గాల్లో మేరకు కొనుగోలు శక్తి లేకపోవడమే దీనికి కారణం. అన్ని వనరులను సమీకరించుకుని కొంతమంది కొనుగోలు చేస్తున్నారు.



రిటైల్‌లోనూ టాప్

దేశంలో అత్యధిక రిటైల్ స్పేస్ లీజులు మన దగ్గరే..

హైదరాబాద్‌లో ఇళ్లు, కార్యాలయ స్థలాలకే కాదు రిటైల్ స్పేస్‌కు కూడా డిమాండ్ అధికంగానే ఉంది. ఈ ఏడాది రెండో త్రైమాసికం(క్యూ2)లో దేశంలోనే అత్యధిక రిటైల్ స్పేస్ లీజులు మన దగ్గరే ఎక్కువగా జరిగాయి. 2025 క్యూ2లో 8 లక్షల చ.అ. స్థల లావాదేవీలు పూర్తయ్యాయని, దీంతో కలిపి ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరం (హెచ్1)లో నగరంలో 15 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లీజులు జరిగాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. గతేడాది హెచ్1తో పోలిస్తే ఇది 11 శాతం అధికం. 2027 నాటికి నగరంలోకి 28 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ సరఫరా అవుతుందని, ఇందులో వచ్చే రెండు త్రైమాసికాలంలో సుమారు 17 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ వినియోగంలోకి కూడా వస్తుందని అంచనా వేసింది.

– సాక్షి, సిటీబ్యూరో



- హైదరాబాద్‌లో 7.6 లక్షల చ.అ. లావాదేవీలు
- 2027 నాటికి 28 లక్షల చ.అ. స్థలం సరఫరా
- బాచుపల్లి, కొంపల్లి ప్రాంతాలు హాట్ స్పాట్లు
- 57 శాతం రిటైల్ స్పేస్ లీజులు ఈ ప్రాంతాల్లోనే..
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదికలో వెల్లడి

బాచుపల్లి, కొంపల్లి హాట్‌స్పాట్లు..

ఈ ఏడాది రెండో త్రైమాసికం(క్యూ2)లో దేశంలోని 8 ప్రధాన నగరాలలో 22.4 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లావాదేవీలు పూర్తయ్యాయి. గతేడాది క్యూ2లో జరిగిన 23.9 లక్షల చ.అ. జరిగాయి. ఈ ఏడాది క్యూ1లో 23.7 లక్షల చ.అ.లు జరిగాయి. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హైస్ట్రీట్ ప్రాంతాలలో రిటైల్ స్పేస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. 89 శాతం లీజులు ఈ ప్రాంతాల్లోనే జరిగాయి. బాచుపల్లి, కొంపల్లి ప్రాంతాలు రిటైల్ స్పేస్‌కు హాట్ స్పాట్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ క్యూ2లో ఈ ప్రాంతాలలో 57 శాతం లీజులు జరిగాయి. అమీర్‌పేట, నిజాంపేట వంటి ప్రధాన ప్రాంతాలలో 43 శాతం రిటైల్ స్పేస్ లీజులు పూర్తయ్యాయి.



ఫుడ్ అండ్ బేవరేజెస్, ఫ్యాషన్..

ఫుడ్ అండ్ బేవరేజెస్(ఎఫ్అండ్‌బీ) బ్రాండ్లు ఎక్కువగా రిటైల్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయి. ఈ విభాగం వాటా 34 శాతంగా ఉండగా.. ఫ్యాషన్ బ్రాండ్ల వాటా 14 శాతంగా ఉంది. ఈ క్యూ2లో కొత్తగా గ్రేడ్-ఏ మాల్స్ సరఫరా జరగకపోవడంతో మాల్స్‌లో వేకన్సీ రేట్ 1.85 శాతంగా ఉంది. ఇక, హై స్ట్రీట్ ప్రాంతాలలో రిటైల్ స్పేస్ అద్దెలకు ఆదరణ ఎక్కువగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జూబ్లీహిల్స్ వంటి హై స్ట్రీట్‌లో అద్దెలు 13.6 శాతం మేర పెరిగాయి. అత్తాపూర్, మదీనాగూడ, చందానగర్ ప్రాంతాల్లోనూ రిటైల్ అద్దెలు ఆశాజనకంగానే వృద్ధి చెందుతున్నాయి.

ఈ క్యూ2లో నగరాల వారీగా రిటైల్ స్పేస్ లీజింగ్: (చ.అ. లక్షల్లో)

నగరం	చ.అ.
హైదరాబాద్	7.6
ముంబై	5.2
ఢిల్లీ-ఎన్‌సీఆర్	3
పుణె	2.3
బెంగళూరు	1.8
చెన్నై	1.6
కోల్‌కతా	50 వేలు
అహ్మదాబాద్	40 వేలు



విద్య, వైద్యం కావాల్సిందే..

ప్రాజెక్ట్ ఆవరణలో నిర్మాణాలు ఉంటేనే కొనుగోలు

- కొనుగోలుదారుల అభిరుచిలో సరికొత్త మార్పులు
- అందుకు తగ్గట్టుగానే ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్న బిల్డర్లు

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటివరకు ఫ్లాట్‌ను విక్రయించాలంటే క్లబ్ హౌజ్, స్విమ్మింగ్ పూల్, ఏసీ జిమ్ వంటి ఆధునిక సదుపాయాలిస్తే చాలనుకునే వారు బిల్డర్లు. కానీ, ఇప్పుడలా కుదరదు. ఎందుకంటే కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులొచ్చాయి. తమ పిల్లలు చదువుకునేందుకు పాఠశాల, ఆధునిక ఆస్పత్రి వంటివి కూడా ఉంటేనే ఫ్లాట్ కొంటామంటున్నారు. అవి కూడా ప్రాజెక్ట్ దగ్గర్లో కాదు ఏకంగా ప్రాజెక్ట్ ఆవరణలోనే ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో బిల్డర్లు బడిబాట పడుతున్నారు. ప్రాజెక్ట్‌ల్లో ఫ్లాట్లే కాదు పాఠశాల, ఆస్పత్రి వంటివి కూడా నిర్మిస్తున్నారు. నగరంలో ఈ తరహా నిర్మాణాలు క్రమంగా పెరుగుతున్నాయి.

- సొంతింటి ఎంపికలో విద్యాలయాలు, ఆస్పత్రులు కీలకంగా మారుతున్నాయి. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆస్పత్రికి వెళ్లేందుకు ఎక్కువ దూరం ప్రయాణం చేయడం, వర్షం కురుస్తున్నప్పుడు ఇంటి నుంచి కిలో మీటర్ల దూరముండే స్కూల్‌కు తమ పిల్లలు పంపించడం తల్లిదండ్రులు ఏమాత్రం ఇష్టపడట్లేదు. అందుకే ఫ్లాట్‌ను కొనుగోలు చేసే ముందు పిల్లల అవసరాలు, ఆరోగ్యాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. మరీ ఎక్కువగా వర్షాకాలంలో బస్సుల కోసం వేచి చూడటం తల్లిదండ్రులకు చిరాకు కలిగిస్తోంది. పిల్లలు వర్షంలో తడవకుండా ఇంటి నుంచే నేరుగా పాఠశాలకు వెళ్లగలరా? హఠాత్తుగా అనారోగ్యం తలెత్తితే వెంటనే ఆస్పత్రికి వెళ్లేందుకు వీలుగా ప్రాజెక్ట్‌లోనే ఆస్పత్రి ఉందా? వంటి అంశాలను తెలుసుకుంటున్నారు. అందుకే ఫ్లాట్‌ను కొనేముందు క్లబ్ హౌజ్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి ఆధునిక సదుపాయాలే కాదు ప్రాజెక్ట్ ఆవరణలోనే పాఠశాల, ఆస్పత్రి వంటివి ఉంటేనే ఫ్లాట్ కొనేందుకు ముందుకొస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.



శరవేగంగా అభివృద్ధి..

కొనుగోలుదారుల అభిరుచిలో వచ్చిన మార్పుతో ఆయా ప్రాజెక్ట్‌లు ఉండే ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. ఎలాగంటే కొనుగోలుదారుల కోసం, తమ వ్యాపారం కోసం తమ ప్రాజెక్ట్ ఆవరణలో పాఠశాలలు, ఆస్పత్రులు నెలకొల్పేందుకు బిల్డర్లు ఆయా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటారు. కొన్ని కంపెనీలైతే ప్లే స్కూళ్లు, రీసెర్చ్ సెంటర్లకూ ప్రాజెక్టుల్లోనే స్థానం కల్పిస్తాయి. దీంతో ప్రాజెక్ట్ ఉన్న ప్రాంతం విద్యాలయాలు, ఆస్పత్రులతో కళకళలాడతాయి. దీంతో దేశ, విదేశీ కంపెనీలు ఆయా ప్రాంతాల్లో షాపింగ్ మాళ్లు, మల్టీప్లెక్స్‌ల వంటివి ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయి. దీంతో ఆయా ప్రాంతాలు రియల్ బూమ్‌తో శరవేగంగా అభివృద్ధి చెందుతాయి.

రంగులు మార్చే లైటింగ్

ఎల్ఈడీ లైట్లతో ఇంటి అందం రెట్టింపు

లైట్ల ధర ఎక్కువైనా.. విద్యుత్ ఖర్చు తక్కువ

> గదిలోకి రాగానే లైట్లు వాటంతటవే ఆన్.. బయటకు వెళ్లిపోగానే ఆఫ్ అవుతాయి.. రోజును, మన మూడ్‌కు తగినట్టుగా గదిలోని లైట్ రంగును మార్చుకోవచ్చు.. మనం ఏ రంగు చొక్కా వేసుకుంటే లైట్ కూడా అదే రంగు కాంతిని వెదజల్లుతుంది.. ఇంట్లో వేసి ఉన్న లైట్లను సెల్‌ఫోన్ల నుంచి ఆపరేట్ చేయవచ్చు.. టీవీ సౌండ్ పెంచినట్టుగా లైటింగ్‌ను కూడా ఎక్కువ, తక్కువ చేసుకోవచ్చు.. అరే ఏంటివి అనుకుంటున్నారా? లైట్ ఎమిటింగ్ డయోడ్(ఎల్ఈడీ) లైట్ల వింత ఇదీ.. – సాక్షి, సిటీబ్యూరో

గదిని బట్టి రంగు..

బల్బు, ట్యూబ్‌లైట్లలో డే లైట్, వామ్ లైట్ అనే రెండు రంగులు మాత్రమే ఉంటాయి. అదే ఎల్ఈడీ లైట్లలో మనం కోరుకున్న రంగు మార్కెట్‌లో దొరుకుతుంది. అంతేకాదు ఇంట్లో గదిని బట్టి, ఆయా రోజును బట్టి కూడా లైట్ రంగును మార్చుకోవచ్చు కూడా. ఈమధ్య కాలంలో నగరవాసుల్లో ఈ విధమైన అభిరుచి బాగా పెరిగిపోయింది. పూజ గదిలో ఎరుపు, గార్డెనింగ్‌లో ఆకుపచ్చ, పడక గదిలో నీలం, హాల్‌లో వామ్ లైట్, స్టడీ రూంలో డే వైట్ లైట్, ఆఫీసుల్లో ప్యూర్ వైట్, జువెల్లరీ, బట్టల దుకాణాల్లో వామ్ లైట్, రెస్టారెంట్లు, పబ్బుల్లో నీలం, ఎరుపు, ఆరెంజ్ రంగులను వినియోగిస్తారు.



రోజుకో రంగు..

రోజును బట్టి ఇంట్లో లైట్ రంగును మార్చుకోవాలనే అభిరుచి కూడా నగరవాసుల్లో ఈమధ్య బాగా పెరిగిపోయింది. ఇందుకు తగ్గట్టుగానే ఒకే ఎల్ఈడీ లైట్‌తో రోజుకో రంగును వెదజల్లేలా సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సోమవారం- ఎరుపు, మంగళవారం- ఆకుపచ్చ, బుధవారం- నీలం, గురువారం- వామ్ లైట్, శుక్రవారం- పర్పుల్, శనివారం- ఆరెంజ్, ఆదివారం- తెలుపు రంగులను ఎంపిక చేసుకునేందుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు.



సెల్‌ఫోన్ నుంచే ఆపరేటింగ్..

ప్రస్తుతం ఎల్ఈడీ లైట్లలో లైట్ ఆటోమిషన్ ట్రెండ్ నడుస్తోంది. ఈ రకమైన ఎల్ఈడీ లైట్లు గదిలోకి రాగానే దానంతటదే లైట్ ఆన్ అవుతుంది. వెళ్లిపోగానే ఆఫ్ అవుతుంది. టీవీ సౌండ్ పెంచినట్టుగా రిమోట్ సహాయంతో లైట్ వెలుతురు (లుమిన్స్)ను ఎక్కువ, తక్కువ చేసుకోవచ్చు కూడా. ఇక వెబ్ బేస్ట్ సొల్యూషన్స్ ఎల్ఈడీ లైట్లయితే ఇంటర్నెట్ సహాయంతో ఐ-ఫోన్, ఐప్యాడ్‌ల నుంచే ఆపరేట్ చేసుకోవచ్చు. ఇవి ఎక్కువగా రెస్టారెంట్లు, పబ్బులు, గేమింగ్ జోన్లు, థియేటర్లు, షాపింగ్ మాల్స్‌లో వినియోగిస్తుంటారు.



ధర ఎక్కువైనా..

బల్బు, సీఎఫ్ఎల్, ట్యూబ్‌లైట్లతో పోల్చుకుంటే ఎల్ఈడీ లైట్ల ధర కాస్త ఎక్కువే. కానీ, విద్యుత్ వినియోగం మాత్రం చాలా తక్కువగా ఉంటుంది. 18 ఓల్టుల ఎల్ఈడీ లైట్ ధర రూ.1,500–1,800 మధ్య ఉంటుంది. 1,000 చ.అ. ఇంటికి రూ.8 లక్షలతో వెబ్ బేస్ట్ సొల్యూషన్స్ ఎల్ఈడీ లైట్లను అమర్చుకోవచ్చు. 300 గజాల ఇండిపెండెంట్ హౌజ్ గార్డెనింగ్‌కు రూ.3 లక్షలు ఖర్చవుతుంది. ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఫంక్షన్ హాల్‌కు రూ.40 లక్షలు, షాపింగ్ మాల్స్‌కు చదరపు అడుగుకు రూ.500 నుంచి రూ.1,000 వరకు ఖర్చవుతుంది.

క్లుప్తంగా...

కేబినెట్ భేటీ వాయిదా

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారానికి వాయిదా పడింది. పలువురు మంత్రులు, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఢిల్లీలోనే ఉండిపోవాల్సిరావడంతో శుక్రవారం జరగాల్సిన మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 28కి వాయిదా వేశారు. ఢిల్లీ నుంచి మూడు రోజుల పర్యటన ముగించుకొని సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్నారు. మంత్రులు ఐదారుగురు అందుబాటులో లేని కారణంగానే సమావేశం వాయిదా పడినట్లు తెలిసింది.

రేర్ డేటా నిజమైతే తక్షణమే బయటపెట్టాలి

ఎమ్మెల్సీ కవిత సవాల్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ చెబుతున్న రేర్ డేటా నిజమైతే తక్షణమే దాన్ని బయటపెట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల వారీగా, కులాల వారీగా కుల సర్వే వివరాలను బహిర్గతం చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే తప్పుల తడకగా ఉందని, దాన్ని కాంగ్రెస్ పార్టీ సమాజపు ఎక్స్‌రేగా అభివర్ణించడాన్ని ఆమె తప్పుపట్టారు. కుల సర్వే పారదర్శకంగా జరగలేదని, 2014లో 52 శాతమున్న బీసీల జనాభా 2024కు వచ్చేసరికి 46 శాతానికి ఎలా తగ్గిందని ప్రశ్నించారు. దీన్ని బట్టే ప్రభుత్వం చేసిన కుల సర్వేకు విలువ లేదని తేలిపోయిందని స్పష్టం చేశారు.

ప్రైవేటు హ్యాకర్లతో ఫోన్లు ట్యాప్: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు హ్యాకర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సినీనటుల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. గతంలో మిస్ వరల్డ్ పోటీదారుల ఫోన్లను కూడా రేవంత్ ప్రభుత్వం ట్యాప్ చేయించిందన్నారు. తన ఫోన్ ట్యాపింగ్ గురించి గతేడాది డిసెంబర్ 5న ఫిర్యాదు చేసినా నేటికీ కేసు నమోదు చేయలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే సంజయ్‌తో కలిసి శుక్రవారం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన భార్య ఫోన్‌ను కూడా ట్యాప్ చేస్తున్నారని, ఇద్దరు మంత్రుల సంభాషణను రేవంత్ విన్నాడని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ సర్వసాధారణం అని ఢిల్లీలో మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో రేవంత్ అంగీకరించారన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై తాడోపేడో తేల్చుకునేందుకు మంత్రులు ఢిల్లీలో మకాం వేయడం వల్లే శుక్రవారం జరగాల్సిన కేబినెట్ భేటీ రద్దయిందని కౌశిక్‌రెడ్డి చెప్పారు. మోసం చేయడం రేవంత్‌కు వెన్నతో పెట్టిన విద్య అని సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేయిస్తున్నాడన్నారు.

పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు

మొయినాబాద్: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారని.. అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

జీవో 49 మళ్లీ తెస్తే రాజీనామా చేస్తా

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



జన్నారం: ప్రభుత్వం ఇటీవల రద్దు చేసిన జీవో 49ని మళ్లీ తీసుకువస్తే తన పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో శుక్రవారం నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అటవీ ఆంక్షల పేరుతో అటవీ అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే తరిమి కొడతారని హెచ్చరించారు. ప్రజల క్షేమం కోసం ఎంత దూరమైనా వెళ్తానని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పశువుల మేత కోసం గిరిజనులు, ఆదివాసీలను అడవులకు వెళ్లకుండా ఆపితే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఇసుకకు ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వరంగల్ విమానాశ్రయ భూసేకరణకు రూ.205 కోట్లు

సాక్షి, హైదరాబాద్: వరంగల్ శివారులోని మామునూరులో విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఈ నిధుల కేటాయింపునకు గత మార్చిలోనే ఉత్తర్వు వెలువడగా, వాటికి సంబంధించి బడ్జెట్ రిలీజ్ ఆర్డర్(బీఆర్‌ఓ)ను శుక్రవారం జారీ చేసింది.


మలయాళ సినీ హీరో మోహన్‌లాల్ నటించిన కొత్త పాత్ర ఒకటి ఇంటర్నెట్‌లో ఇప్పుడు ఆలోచన రేకెత్తిస్తోంది. అది సినిమా పాత్ర కాదు. 'విన్స్‌మెరా' బ్రాండ్ జ్యూయల్స్ యాడ్. ముచ్చటైన ఒక నెక్లెస్‌ను చూసి ఆగలేక, దాన్ని తన మెడలో వేసుకుని, అద్దంలో చూసుకుని మురిసిపోతున్న పురుషుడిగా మోహన్‌లాల్ అందులో నటించారు. ఊరికే మురిసిపోలేదు. స్త్రీ హృదయంతో పరవశించి నాట్య మయూరం అయ్యారు. ఆభరణాలను ధరించి మోహన్‌లాల్ మైమరిచిపోతే, ఆయన్ని చూసి నెటిజన్‌లు ముగ్ధులైపోయారు. అంతపెద్ద హీరో స్త్రీ మనోభావాలతో నటించటం విశేషమే అయినా, అలాంటి యాడ్‌ను ఒక బ్రాండ్ వాణిజ్య ప్రకటనగా విడుదల చేయటం సాహసమే.

వ్యాపార ప్రకటనల్లో సరికొత్త ధోరణి

మగాళ్లలోని ఆడతనాన్నీ స్పృశిస్తున్న వైనం

ఆకట్టుకుంటున్న మోహన్‌లాల్ యాడ్





బ్రాండ్ పురుష్

వీళ్లలో స్త్రీత్వమూ ఉంది

మగవాళ్లలో ధీరత్వం ఉండాలి. స్త్రీలలో లాలిత్యం ఉండాలి. ఇదీ శతాబ్దాలుగా మన సమాజంలో వేళ్లూనుకుని ఉన్న భావన. ఇదే వ్యాపార ప్రకటనల్లోనూ ప్రతిఫలిస్తూ వస్తోంది. అందుకు తగ్గట్లే స్త్రీ, పురుషులు వేర్వేరు ఉత్పత్తులకు ప్రచారం ఇస్తూ కనిపిస్తుంటారు. ఇప్పుడీ ధోరణిలో మార్పు వస్తోంది. మార్కెట్‌లోని ప్రముఖ బ్రాండ్‌లు తమ వ్యాపార ప్రకటనల్లో పురుష ధీరత్వాల తెరల్ని మెల్లగా తొలగించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రముఖ మార్కెటింగ్ డేటా విశ్లేషణ సంస్థ 'కాంతార్'.. ఈ మార్పు వేగంగా జరగటం లేదని, గతేడాది 450 కంటే ఎక్కువ ప్రకటనల్లో దాదాపు 94 శాతం సంప్రదాయ పురుష మూస పాత్రలే ఉన్నాయని తన తాజా నివేదికలో వెల్లడించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఒక శాతం గానే ప్రగతిశీలత..: గత ఏడాది యాడ్స్‌లో కనిపించిన పురుషాధిక్య మూసపాత్రల డేటాను విశ్లేషిస్తూ 'ది ఇండియన్ మాస్క్యులినిటీ మేజ్' పేరిట కాంతార్ ఈ నివేదికను విడుదల చేసింది. భారతీయ పురుషుల్లో స్వచ్ఛంగా ఇంటి బాధ్యతలను స్వీకరిస్తున్న ధోరణి కనిపిస్తున్నప్పటికీ వ్యాపార ప్రకటనలు 1 శాతం మాత్రమే ఆ ధోరణిని ప్రతిఫలిస్తున్నాయని నివేదిక పేర్కొంది. అయితే ప్రకటనదారులు కొంత ప్రగతిశీలంగా మారిన మాటను కాదనలేమని, అందుకు నిదర్శనంగా రేమండ్, ఏరియల్, తనిష్క్, గుడ్‌నైట్, విమ్ వంటి బ్రాండ్‌లు గతంలో తయారు చేసిన వ్యాపార ప్రకటనల్ని చూడవచ్చని పరిశ్రమలోని వారు అంటున్నారు.

'పవర్' వైపే బ్రాండ్‌ల మొగ్గు..: మార్కెట్‌లో ముఖ్యమైన బ్రాండ్లు తమ అమ్మకాలు పెంచుకోడానికి వ్యాపార ప్రకటనల్లో నేటికీ 'స్టార్' పవర్ పైనే ఆధారపడుతున్నాయి. ప్రేక్షకులు రణ్‌వీర్ సింగ్ లేదా విరాట్ కోహ్లీ వంటి ఇమేజ్ ఉన్న వారి పైనే మొగ్గు చూపుతున్నాయి. ఇందుకు భిన్నంగా లక్స్ తన ప్రకటన కోసం షారుఖ్ ఖాన్‌ను గులాబీ రేకులు ఉన్న బాత్ టబ్‌లో ఉంచటం చూస్తే.. ప్రకటనలు ఇప్పుడు పురుషత్వపు అతిశయోక్తి భావనల నుంచి దూరంగా జరిగే సాహసం చేస్తున్నాయని స్పష్టమౌతోంది. మోహన్‌లాల్‌తో విన్స్‌మెరా ప్రకటన ఇందుకు తాజా ఉదాహరణ.

సంస్కరణలకు పిలుపు

దేశంలోని ఎనిమిది నగరాల్లో 880 మంది పట్టణ భారతీయ పురుషులపై (18–45 సంవత్సరాల వయస్సు) కాంతార్ దేశవ్యాప్త సర్వే నిర్వహించింది. 12 భాషల్లో 150కి పైగా చానళ్లలో ప్రసారమైన 450కి పైగా టీవీ ప్రకటనల్ని నిశితంగా పరిశీలించింది. ప్రపంచంలోనే అది పెద్ద మార్కెట్ అయిన భారత్‌లోని బ్రాండ్‌లు తాము రూపొందించే ప్రకటనల్లో స్త్రీ, పురుష సమానత్వాన్ని కనబరచవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

నివేదికలోని ముఖ్యాంశాలు

భారతీయ పురుషుల్లో ధీరత్వమే కాదు.. మహిళల్లా సుతిమెత్తనితనమూ ఉంది. ఇంకా చెప్పాలంటే ప్రతి పురుషుడిలోనూ స్త్రీత్వమూ ఉంది. ఎంతోమంది మగాళ్లు ఇంటి బాధ్యతలనూ పంచుకుంటున్నారు. కానీ ప్రకటనల ప్రపంచం ఈ మార్పులకు అనుగుణంగా లేదు.

యువకులు (ముఖ్యంగా జెన్ జెడ్) భావోద్వేగాల పరంగా మునుపటి తరం కన్నా భిన్నంగా ఉన్నారు. మార్పునకు సిద్ధంగా ఉన్నారు. ఇంతకాలం స్త్రీల బాధ్యతలు అనుకుంటూ వస్తున్న పనులను తమకై తామే స్వీకరిస్తున్నారు. అయితే వ్యాపార ప్రకటనలు ఇంకా ఒకప్పటి మగధీరత్వాన్నే కీర్తిస్తూ ఉన్నాయి.

మిలీనియల్స్‌లో 41 శాతం, జెన్ జడ్ పురుషుల్లో 31 శాతం మంది వ్యాపార ప్రకటనలలోని పురుష పాత్రలు తమ మనస్తత్వానికి పూర్తి భిన్నంగా, ప్రతికూలంగా ఉన్నాయని భావిస్తున్నారు.

అదే సమయంలో, 'నిజమైన పురుషులు ఏడవరు' అనే మాటను 71 శాతం మంది పురుషులు అంగీకరిస్తున్నారు.

మార్పు, లాభం.. రెండూ!

వ్యాపారపరంగా చూస్తే స్త్రీ, పురుష మూస పాత్రల్ని బద్దలు కొట్టటం కేవలం ప్రగతి శీలతే కాదు, లాభదాయకం కూడా అని కాంతార్ వ్యాఖ్యానించింది. పురుషులలోని సున్నితమైన సంరక్షణ స్వభావాన్ని, భావోద్వేగాలను.. పురుషులను స్త్రీల పట్ల సానుభూతిపరులుగా, భావోద్వేగపరులుగా చూపించే ప్రకటనలు ఆయా బ్రాండ్ల అమ్మకాలు పెరిగేందుకు తోడ్పడుతున్నాయని అంటోంది.

సర్వే హైలైట్స్

ప్రకటనల్లో కేవలం **6%** పురుష పాత్రలు మాత్రమే స్త్రీల పట్ల గౌరవాన్ని, భావోద్వేగ సహానుభూతిని చూపించాయి.

94% ప్రకటనల్లో సంప్రదాయ పురుష పాత్రలే ఉన్నాయి.

ప్రకటనల్లో **43%** వాయిస్ ఓవర్‌లు పురుషులవే. స్త్రీలవి **31%** మాత్రమే. మిశ్రమ కథనాల వాయిస్ ఓవర్‌లలో కూడా పురుషుల ఆధిక్యమే కనిపిస్తోంది.

కేవలం **1%** పురుషులు మాత్రమే ప్రకటనల్లో పిల్లల సంరక్షణ, ఇంటి పనుల్లో కనిపించారు.

హెచ్‌సీయూ భూముల్లో సీఎంకు కమీషన్లు

క్విడ్ ప్రో కో కింద బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ. 1,600 కోట్ల కాంట్రాక్టు

- బీజేపీ ఎంపీకి కమీషన్లు ఇస్తుంటే రాహుల్ మౌనం ఎందుకు?
- రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ నడుమ రాజకీయ అక్రమ సంబంధం
- సోనియా ఉత్తరాన్ని అర్థం చేసుకోలేని రేవంత్‌పై జాలి వేస్తోంది
- బీఆర్‌ఎస్‌వీలో రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ విలీన కార్యక్రమంలో కేటీఆర్



విద్యార్థి సేన పరిషత్ విలీన కార్యక్రమంలో కేటీఆర్. చిత్రంలో ప్రశాంత్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గ్యాదరి కిశోర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకం, తాకట్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏపీకి చెందిన బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ కమీషన్లు ఇప్పించాడని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆరోపించారు. అందుకు ప్రతిఫలంగా (క్విడ్ ప్రో కో) కింద రూ. 1,600 కోట్ల విలువ చేసే ఫోర్త్ సిటీ రోడ్డు కాంట్రాక్టును ఆయనకు సీఎం అప్పగించారన్నారు. బీజేపీ ఎంపీకి కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి రూ. వందల కోట్ల విలువ చేసే కాంట్రాక్టులు ఇస్తుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ నేతలతో కాంగ్రెస్ సీఎం కుమ్మక్కు అవుతున్న సంగతి రాహుల్‌కు కనిపించడం లేదా అని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగంలో తెలంగాణ రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ కేటీఆర్ సమక్షంలో విలీనమైంది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నడుమ రాజకీయ అక్రమ సంబంధం కొనసాగుతోందని మండిపడ్డారు.

లేఖను చదవలేని రేవంత్‌కు దొంగ డిగ్రీ ఉందేమో?

'సోనియాగాంధీ రాసిన ఉత్తరంలో ఏముందో చదవడం రాక మురిసిపోతున్న రేవంత్‌రెడ్డిని చూస్తే జాలేస్తోంది. సీఎం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాలేనని సోనియా గాంధీ చెప్పిన మాటను అర్థం చేసుకోలేక తనను ప్రశంసించిందని మురిసిపోతున్నాడు. సోనియా లేఖను కూడా చదివే తెలివి రేవంత్‌రెడ్డికి లేదు. లెటర్‌ను కూడా చదవలేని రేవంత్ రెడ్డికి దొంగ డిగ్రీ ఉందేమోనని అనుమానం వస్తోంది' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీసు అధికారులు వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులకు తాము అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు.

ఆఫర్ లెటర్లతో గప్పాలు

'ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వని రేవంత్‌రెడ్డి.. ఆఫర్ లెటర్లు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నాడు. చరిత్ర ఉన్నంతకాలం తెలంగాణ రాష్ట్రం కోసం విద్యార్థులు చేసిన పోరాటాలు, అమరవీరుల బలిదానాలను ప్రజలు చెప్పుకుంటారు. నల్లగొండ జిల్లా కేసీఆర్ పాలనలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. విద్యార్థులు సహా అన్ని వర్గాలకు మోసపూరిత హామీలు ఇచ్చి రేవంత్ అధికారంలోకి వచ్చాడు. హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రోజుకో ఆరోపణ మాపై చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు' అని కేటీఆర్ మండిపడ్డారు. సమావేశంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు తూటాతో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

లింగంపేట ఆత్మగౌరవ గర్జన సభలో కేటీఆర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే తూటాతో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటే అహంకారంతో విర్రవీగుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఆయనకు తొత్తులుగా పనిచేస్తున్న అధికారులకు బుద్ధి వస్తుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు వ్యాఖ్యానించారు. 'పాలన చేతగాక రాష్ట్రాన్ని తెర్లు జేసింద్రు. గురుకులాల్లో నూరు మంది పోరగాండ్లు చనిపోయింద్రు. అందాల భామలకు లక్ష రూపాయల భోజనం పెట్టిన ప్రభుత్వానికి.. పిల్లలకు వంద రూపాయల భోజనం పెట్టడానికి చేతులు రావడం లేదు. మీది కెల్లి బలుపు మాటలు.. ఇలాంటి ప్రభుత్వానికి ఓటు తూటానే సరైన సమాధానం' అని కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ గర్జన సభలో లింగంపేటకు చెందిన దళిత నేత ముదాం సాయిలును సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ లింగంపేటలో అంబేడ్కర్ జయంతి రోజున అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు దళిత నేత ముదాం సాయిలు బట్టలూడదీశారన్నారు. కానీ తాము అదే అంబేడ్కర్ సాక్షిగా సాయిలును గౌరవించామన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే కేసీఆర్ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని.. తెలంగాణ ఏర్పడిన తర్వాత 125 అడుగులతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్ ప్రభుత్వ అరాచకాలు, దారుణాల నుంచి తెలంగాణ ప్రజలను రక్షించేది ఒక్క కేసీఆర్ నాయకత్వమేనన్నారు. కాగా, కేసీఆర్ దెబ్బతో తెలంగాణను వదిలివెళ్లిన చంద్రబాబు మళ్లీ తెలంగాణలో టీడీపీ జెండా ఎగరాలని కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 'బనకచర్ల'పై ఢిల్లీలో సమావేశానికి వెళ్లబోనన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. చంద్రబాబు పిలవగానే ఉరికి సంతకం పెట్టి గోదావరి నీళ్లను రాసిచ్చారని దుయ్యబట్టారు.

సీఎం రేవంత్‌కు గోబెల్స్ లేదా భాస్కర్ అవార్డు ఇవ్వాలి

- ముందు బీసీ నేతలు మహేశ్‌కుమార్ లేదా పొన్నంప్రభాకర్‌కు సీఎం పదవి ఇవ్వాలి
- డిప్యూటీ సీఎంపై సివిల్, క్రిమినల్ చర్యలకు ముందుకెళతా
- కేంద్రంపై నెపం నెట్టకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
- మీడియాతో ఇష్టాగోష్టిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నోబెల్స్ స్థానంలో గోబెల్స్..ఆస్కార్‌కు బదులు భాస్కర్ అవార్డుకు సిఫార్సు చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుదల, ఇతర అంశాలపై ఇష్టం వచ్చినట్టు అబద్ధాలు చెబుతున్నారని..ప్రధాని మోదీని కన్వర్టెడ్ బీసీ అంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలంటున్న రేవంత్ రెడ్డి..ముందు తన సీఎం పదవిలో బీసీ నేతలైన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ లేదా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూర్చోబెట్టాలని కోరుతున్నామని చెప్పారు. బీజేపీకి బీసీల మద్దతుగా మెండుగా ఉండటంతో దానిని దూరం చేయాలనే దురుద్దేశంతోనే రేవంత్‌రెడ్డి అనేక రకాలుగా పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై సివిల్, క్రిమినల్ చర్యలకు కోర్టులను ఆశ్రయిస్తానని తెలిపారు. కాళేశ్వరం అవినీతిలో ఒక అధికారి దగ్గరే రూ.150 కోట్లు దొరికాయని, అయితే ఇందులో రాజకీయ నేతలను మాత్రం టచ్ చేయలేదని చెప్పారు. ఇక వారి దగ్గర ఎంత పెద్ద మొత్తం ఉందో అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా అనేక అంశాలపై మాట్లాడారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం టికెట్లు

రాష్ట్రంలో పార్టీ సొంతంగా అధికారంలోకి రావాలని కోరుకుంటున్నదని, అందుకు తగ్గట్టుగానే ప్రజల ఆదరణ పెరుగుతున్నందున వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని రాంచందర్‌రావు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోవడం లేదని స్పష్టం చేశారు. కేంద్రంపై నెపాన్ని పెట్టి తప్పించుకోకుండా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్‌చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేలా ఒత్తిడి తెస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ నుంచి బీసీలకు 42 శాతం టికెట్లు కేటాయించనున్నట్టు ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో నిలిచేందుకు పార్టీలో తీవ్రపోటీ నెలకొందన్నారు. రాష్ట్ర పార్టీలోనూ సంస్థాగత పదవుల కోసం పోటీ ఉందని, అయితే కమిటీలో 20 మందికే అవకాశం ఉంటుందని, మొత్తం పదవుల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. హైడ్రా అనేది అట్టర్ ఫ్లాప్ కార్యక్రమమని, పేదల ఇళ్లు కూల్చినట్టే ఈ ప్రభుత్వం కూడా అలాగే కూలిపోతుందన్నారు. తాను కూడా బీసీనన్న (బ్రాహ్మిణ్ కమ్యూనిటీ) వ్యాఖ్యతో రామచందర్‌రావు మీడియా ప్రతినిధుల్లో నవ్వులు పూయించారు.

అనర్హుల చేతికి ఇందిరమ్మ ఇళ్లు

బిల్లుల చెల్లింపు సమయంలో గుర్తింపు

1,950 ఇళ్ల కేటాయింపు రద్దు

వాటిని అర్హులకు తిరిగి కేటాయించాలంటూ కలెక్టర్లకు లేఖలు



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హుల ఎంపికకు జరిగిన సర్వేలో పెద్దఎత్తున తప్పులు దొర్లినట్టు వెలుగులోకి వస్తోంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో..1,950 ఇళ్లు అనర్హులకు అందాయని, వాటిని రద్దు చేసి అంతే సంఖ్యలో అర్హులను ఎంపిక చేసి ఆ ఇళ్లు మంజూరు చేయాలంటూ తాజాగా గృహనిర్మాణ శాఖ సంబంధిత జిల్లా కలెక్టర్లకు సూచించటం విశేషం. అనర్హుల గుర్తింపునకు ఇంకా సర్వే కొనసాగుతోంది.

అర్హులు అనర్హులుగా.. అనర్హులు అర్హులుగా..

తొలి విడతలో ఇందిరమ్మ ఇళ్లను సొంతజాగా ఉన్నవారికే ఇవ్వాలని నిర్ణయించారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఇలాంటి వివరాల ఆధారంగా సర్వే చేసి అర్హులను తేల్చారు. ఈ సర్వే పక్కాగా జరిగిందని, లోపాలకు అవకాశం లేదని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. సర్వే యావత్తు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగింది. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన సిబ్బందిలో కొందరు దరఖాస్తులను సరిగ్గా పరిశీలించకుండా తోచిన వివరాలు నమోదు చేశారు. దీంతో అర్హులు అనర్హులుగా, అనర్హులు అర్హులుగా నమోదయ్యారు. ఆ వివరాల ఆధారంగా ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసింది. అలా మంజూరైన ఇళ్లలో వేల సంఖ్యలో అనర్హులున్నారని ఫిర్యాదులు అందాయి. బిల్లులు మంజూరయ్యే సమయంలో లోపాలున్నట్టు గృహనిర్మాణ శాఖ కూడా గుర్తించింది. తొలి విడతలో ఇళ్లు మంజూరు జరగాల్సిన వారి స్థానంలో, తదుపరి విడతలో ఇళ్లను పొందాల్సిన వారున్నట్టు ఆ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఆ సంఖ్య 12,700గా అప్పట్లో తేలింది. వారందరి వద్దకు మళ్లీ సిబ్బందిని పంపి రీసర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 90 శాతం సర్వే పూర్తయింది. అందులో సింహభాగం మంది అర్హులేఅని తేల్చారు. వివరాలు నమోదు చేసే సమయంలో కొన్ని తప్పులు దొర్లాయి తప్ప, వారంతా వాస్తవానికి అర్హులేనని గుర్తించారు. కానీ, 1,950 మందికి నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు మంజూరయ్యాయని తేల్చారు. ఇప్పుడు ఈ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల పేర్లను జాబితా నుంచి తొలగించి వారి స్థానంలో అర్హులను ఎంపిక చేయాలంటూ కలెక్టర్లకు లేఖలు రాశారు. అంటే, ఈ 1,950 మంది విషయంలో సర్వే సరిగా జరగలేదని తేలింది. సర్వే మొత్తం పూర్తయ్యాక మరికొంత మంది ఇలాంటి వారు తేలే అవకాశముంది.

వారి స్థానంలో వేరే వారికి ఇళ్లు: గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్

అనర్హుల పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించి వారి స్థానంలో అర్హులకు ఇళ్లను మళ్లీ మంజూరు చేస్తామని గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా 1,950 మందికి ఇళ్లు మంజూరైనట్లుగా ఇప్పటి వరకు గుర్తించామని, వారి స్థానంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లను తిరిగి కేటాయించమని కలెక్టర్లకు సూచించామని తెలిపారు. ఈ 1,950 మందిలో ఆర్సీసీ స్లాబ్ ఇంటిలో నివసిస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, గతంలో ప్రభుత్వ పథకంలో ఇళ్లు పొందినవారున్నారని తెలిపారు. ఇంతకంటే ఎక్కువ సంఖ్యలో ఇళ్లు రద్దు చేస్తున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు.

పీఏసీఎస్‌లలో విత్తనోత్పత్తి అవకాశాలను పరిశీలించండి

వ్యవసాయ వర్సిటీ, నాబార్డు అధికారులతో మంత్రి తుమ్మల భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారా విత్తనోత్పత్తికి గల అవకాశాలను పరిశీలించాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రైతులకు వారి గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనాన్ని అందించేందుకు వీలుగా పీఏసీఎస్‌ల పరిధిలోని రైతులను విత్తనోత్పత్తి కోసం ఎంపిక చేసే ప్రతిపాదనను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, నాబార్డు అధికారులతో శుక్రవారం ఆయన సచివాలయంలో సమావేశమయ్యారు. నాబార్డు ఆర్థిక సహకారం, వ్యవసాయ వర్సిటీ సాంకేతిక సహకారంతో ఈ ప్రాజెక్టు అమలైతే బాగుంటుందని, వరి, కంది, సోయాబీన్, వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలోని రెండు ఎఫ్‌పీవోలను ఎంపిక చేయాలని, ఈ సంఘాల పరిధిలో విత్తనోత్పత్తిపై అనుభవం ఉన్న రైతులను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ అల్దాసు జానయ్య, పరిశోధనల డైరెక్టర్ బలరాంలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నవంబర్ 19న వెయ్యి 'అంగన్‌వాడీ'ల ప్రారంభం

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న వెయ్యి అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించనున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శుక్రవారం ఆమె సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం భారీగా వర్షాలు కురుస్తున్నందున అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీల భవనాల్లో ఇబ్బందులుంటే వెంటనే సంబంధిత జిల్లా అధికారికి తెలియజేయాలన్నారు. జిల్లా అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలని సూచించారు. కాగా, సైదాబాద్‌లోని జువనైల్ హోం నుంచి ఐదుగురు బాలలు తప్పించుకుపోయిన ఘటనపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు సూపర్‌వైజర్లను సస్పెండ్ చేయాలని, సూపరింటెండెంట్‌కు మెమో జారీ చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా తప్పించుకుపోయిన ఐదుగురిలో ముగ్గురి ఆచూకీ లభించిందని బాలల సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు చార్వాక్ మంత్రికి వివరించారు.భారీవర్షాలతో గ్రామీణ రహదారులు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున.. సత్వరమే పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆమె గ్రామీణ తాగునీటి సరఫరా, శానిటేషన్, రోడ్లు, వనమహోత్సవంపై జిల్లా అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆయా అంశాలపై ప్రతీరోజు పర్యవేక్షణ కోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ ఆఫీస్‌లో డీఈ, ఎస్ఈలతో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఫినిష్ంగ్ టచ్!



వన్ ఫైన్ ఆఫ్టర్‌నూన్..

ఏమండీ.. ఈ రోజు సీ ఫిష్ తేకూడదు.. తిని చాలా రోజులైంది అని భార్య ముద్దుగా అడగడంతో.. బద్ధకంగానే బయటకు బయల్దేరాడు కొంగ బావ. అటు చేపలకు ముందుగానే ఇన్ఫర్మేషన్ లీకవడంతో అవి అలర్ట్ అయిపోయాయి. చాలాసేపు చూసినా చేపల జాడ కనపడలేదు. ఇంతలో విషయం తెలియని ఓ చిన్న చేప ఊరి మీద పెత్తనానికి బయల్దేరింది. బావ కళ్లలో ఆనందం. చటుక్కుమని ఎగిరి.. లటుక్కుమని పట్టేసుకున్నాడు. ఇక్కడే పేద్ద ట్విస్టు.. బాహుబలి క్లైమాక్సులో కట్టప్ప సడన్‌గా విలనైనట్లు.. చేపలను పట్టడానికి వచ్చిన కొంగబావ పాలిట చేపే విలనైంది. ఆ చిన్న చేపను మింగేయడానికి ఓ పెద్ద చేప అమాంతం నోరు తెరుస్తూ వచ్చింది.



ఇంతకీ.. ఈ చిన్న చేప ఎవరికి దక్కింది..
కొంగ బావకా? పెద్ద చేపకా?

మా వైపు చూడకండి.. మాక్కూడా తెలియదు..
ఎందుకంటే.. ఈ ఫొటోను తీసిన షావ్‌పింగ్ లిన్(చైనా) తర్వాత ఏం జరిగిందో మాకు చెప్పలేదు. అంతేకాదు.. ఈ చిత్రానికి వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలో రెండో బహుమతిని కట్టబెట్టిన 'ది ఆర్టిస్ట్ గ్యాలరీ' వాళ్లకు కూడా చెప్పలేదు.. అయినా.. మీ కోసం అడిగితే.. ఏం చెప్పాడో తెలుసా?

వో బు హ్యు గాసు నీ..
అంటే.. చైనీసులో **నే చెప్ప** అని..

\- సాక్షి
సెంట్రల్ డెస్క్

పథకాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

ఉత్తర్వులు జారీచేసిన సీఎస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను జిల్లాల్లో పర్యవేక్షించడానికి ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. తక్షణమే ఈ అధికారులు వారికి కేటాయించిన జిల్లాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించాలని, అత్యవసర సమయాల్లో ఆయా జిల్లాల్లో పర్యటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఈ ఐఏఎస్ అధికారులను నియమించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ (ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల), మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ (కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల), మహిళా శిశు సంక్షేమ కార్యదర్శి అనితా రామచంద్రన్ (నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట), రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు (నిజామాబాద్, కామారెడ్డి), సీఈవో సెర్ప్ దివ్య (రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్), కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి ఎస్.రవి (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, గద్వాల), ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక (వరంగల్, మహబూబాబాద్, జనగాం, భూపాలపల్లి, ములుగు), గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ (మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట), ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.సురేంద్రమోహన్ (ఖమ్మం, కొత్తగూడెం), పురపాలక శాఖ కార్యదర్శి ఇలంబర్తి (హైదరాబాద్) ఆ జిల్లాలను పర్యవేక్షిస్తారు.

డీలిమిటేషన్ పిటిషన్ డిస్మిస్

- ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన కోరుతూ దాఖలైన రిట్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు
- రాజ్యాంగ నిబంధనల ప్రకారం 2026 తర్వాతే డీలిమిటేషన్ ప్రక్రియ సాధ్యమని స్పష్టీకరణ
- ఈ విషయంలో కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌తో పోల్చుకోవడం సరికాదని వ్యాఖ్య
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వేర్వేరు నిబంధనలు వర్తిస్తాయని వెల్లడి
- కేంద్రం నిర్ణయంలో వివక్ష లేదన్న జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచేలా నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 'ఈ పిటిషన్‌లో చట్టబద్ధత ఏదీ కనబడలేదు. అందుకే దీన్ని డిస్మిస్ చేస్తాం'అని ధర్మాసనం పేర్కొంది. 2014 నాటి ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ను అమలు చేయాలని... దాని ప్రకారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచేందుకు డీలిమిటేషన్ ప్రక్రియను కేంద్రం ప్రారంభించేలా ఆదేశించాలని ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్రపాలిత ప్రాంతంగా మార్చిన జమ్మూకశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన కోసం నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం.. ఇదే విషయంలో ఏపీ, తెలంగాణను మినహాయించడం వివక్షేనని.. ఇది రాజ్యాంగ విరుద్ధమని పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. అయితే సుప్రీం ధర్మాసనం మాత్రం జమ్మూకశ్మీర్ యూటీ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి ఏపీ, తెలంగాణను మినహాయించడం రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3)కి లోబడే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ఉందని.. దాని ప్రకారం 2026 తర్వాత నిర్వహించే తొలి జనాభా లెక్కల అనంతరమే నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టడం సాధ్యమవుతుందని తేల్చిచెప్పింది.

అనుమతిస్తే ఇక పిటిషన్ల వరద: సుప్రీం ధర్మాసనం

జమ్మూకశ్మీర్‌లో ఇప్పటికే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడంపై పిటిషనర్ చేసిన వివక్ష వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు మధ్య నియోజకవర్గాల పునర్విభజనలో వర్తించే నిబంధనలు వేర్వేరుగా ఉన్నాయని.. అందుకే జమ్మూకశ్మీర్‌కు జారీ చేసిన నోటిఫికేషన్‌ను రాష్ట్రాల పరిస్థితులతో సరిపోల్చడం తగదని వ్యాఖ్యానించింది. ఇలాంటి విజ్ఞప్తులను స్వీకరిస్తే దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇలాంటి పిటిషన్ల వరదలా కోర్టులను ముంచెత్తే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. అలాంటి పరిణామాలకు తాము తలవంచలేమని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. అందువల్ల ఏపీ, తెలంగాణ అసెంబ్లీ స్థానాల పెంపుపై దాఖలైన ఈ పిటిషన్‌ను విచారణయోగ్యమైనదిగా గుర్తించకుండానే డిస్మిస్ చేస్తున్నట్లు ధర్మాసనం తేల్చిచెప్పింది.



యాదగిరిగుట్టలో వ్రత పూజ టికెట్ ధర రూ.1,000కి పెంపు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీసత్యనారాయణ వ్రత పూజ టికెట్ ధరను పెంచారు. రూ.800గా ఉన్న టికెట్ ధర రూ.1,000కి పెంచి.. శుక్రవారం నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. మొదటి టికెట్‌ను ఆలయ ఈవో వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తీసుకుని వ్రత పూజ నిర్వహించారు. రూ.1,000 టికెట్ కొనుగోలు చేసి వ్రత పూజలో పాల్గొన్న వారికి వ్రత సామగ్రితో పాటు శ్రీస్వామి వారి కల్యాణ శెల్లా, కనుమ, స్వామివారి చిన్న విగ్రహాన్ని అందజేశారు.

నూతన ప్రసాద కౌంటర్ ప్రారంభం

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాఢ వీధిలో అఖండ దీపారాధన పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ప్రసాదం కౌంటర్‌ను ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ శుక్రవారం ప్రారంభించారు.

మరిన్ని అంతరిక్ష పరిశోధనలు

- భారత్ వాటా 2 నుంచి 10 శాతానికి పెంచుతాం
- నాసా సహకారంతో 30న నిసార్ మిషన్ ప్రారంభం
- జీపీ బిర్లా స్మారకోపన్యాసంలో ఇస్రో చైర్మన్ నారాయణన్
- జీపీ బిర్లా స్మారక అవార్డు స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: అంతరిక్ష పరిశోధనల్లో భారత్ వాటా పది శాతానికి పెంచుతామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చెప్పారు. ప్రస్తుతం భారత్ వాటా 2 శాతంగా ఉందని, దీనిని 10 శాతానికి పెంచేందుకు ఇస్రో ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశించుకుందని తెలిపారు. శుక్రవారం బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో జీపీ బిర్లా ఆర్కియలాజికల్, ఆస్ట్రోనామికల్ అండ్ సైంటిఫిక్ ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్ నిర్మలా బిర్లా చేతుల మీదుగా నారాయణన్ ప్రతిష్టాత్మక జీపీ బిర్లా స్మారక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జీపీ బిర్లా స్మారకోపన్యాసం చేశారు. ఇస్రో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

నిసార్ ఓ కీలక ప్రాజెక్టు: ఈనెల 30న ఇస్రో నిసార్ (నాసా–ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్) మిషన్ ప్రారంభం కానుందని నారాయణన్ తెలిపారు. భూ పర్యావరణం, వాతావరణ మార్పులు, విపత్తుల నిర్వహణ వంటి కీలక అంశాలపై లోతైన అధ్యయనం చేయడమే ఈమిషన్ ఉద్దేశమన్నారు. ఇది ఇస్రో, నాసా మధ్య సహకారంతో జరిగే ఒక ముఖ్యమైన ప్రాజెక్టు అని వెల్లడించారు. ఈ ఏడాది ఇస్రో అత్యంత బిజీగా ఉంటుందన్నారు. జీఎస్ఎల్వీ ఎంకే–2/ఐఆర్ఎన్ఎస్ఎస్–1కె మిషన్, గగన్‌యాన్–1లో భాగంగా మానవ రహిత స్పేస్‌క్రాఫ్ట్ ప్రయోగం వంటి పలు కార్యక్రమాలు షెడ్యూల్‌లో ఉన్నాయని తెలిపారు. జీపీ బిర్లా స్మారక అవార్డు తనకు లభించడం గొప్ప గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బిర్లా కుటుంబానికి నారాయణన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును ఇస్రో బృందం తరఫున స్వీకరిస్తున్నానని, ఇస్రోలోని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సిబ్బంది అందరి కృషి ఫలితమే ఈ గుర్తింపు అని అన్నారు.

గేమ్ ఛేంజర్ 'కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్'

- టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టండి
- పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు



మంత్రి శ్రీధర్ బాబుకు జ్ఞాపికను అందజేస్తున్న తైవాన్ ప్రతినిధుల బృందం

సాక్షి, హైదరాబాద్: ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, 'రైజింగ్ తెలంగాణ'లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. తైవాన్ టెక్స్‌టైల్ ఫెడరేషన్ (టీటీఎఫ్) అధ్యక్షుడు జస్టిన్ వాంగ్ నేతృత్వంలోని 11 మంది ప్రతినిధుల బృందం శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ) గేమ్ ఛేంజర్‌గా నిలుస్తూ తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసిందని మంత్రి చెప్పారు. ఈ పార్కులో ఫంక్షనల్ టెక్స్‌టైల్స్ తదితరాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని మంత్రి తెలిపారు.

అంతర్జాతీయ భాగస్వామ్యాలతో అభివృద్ధి

'అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ పారిశ్రామికాభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని శ్రీధర్‌బాబు ప్రకటించారు. టెక్స్‌టైల్స్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టం డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఈఎస్‌డీఎం) తదితర రంగాల్లో తైవాన్ పెట్టుబడులకు తెలంగాణ అనుకూలంగా ఉంటుందన్నారు. పెట్టుబడులకు తైవాన్ పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే 'తెలంగాణ–తైవాన్ మాన్యుఫాక్చరింగ్ జోన్', ప్రత్యేక టెక్స్‌టైల్ క్లస్టర్‌లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, రాష్ట్ర టెక్స్‌టైల్స్ డైరెక్టర్ ధరణి, టీటీఎఫ్ సెక్షన్ చీఫ్ ఆర్థర్ చియాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఇ గవర్నెన్స్'లో ఎస్తోనియా సహకారం

ఇ–గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన 'ఎస్తోనియా'సహకారం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో మంత్రితో భేటీ అయ్యింది. ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్‌లో సహకారంతో పాటు వాణిజ్యం, ఏఐ సాంకేతికతలో కూడా కలిసి పనిచేయాలనే ఆకాంక్షను శ్రీధర్‌బాబు వెలిబుచ్చారు. సెప్టెంబర్‌లో తమ దేశం సందర్శించాలని ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ చేసిన అభ్యర్థనకు శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు.

రూ.లక్ష కోట్ల దోపిడీకి మళ్లీ 'స్టార్టప్'

ఏపీ రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ఒప్పందం పునరుద్ధరణ ఎజెండాగా సింగపూర్ పర్యటనకు సీఎం చంద్రబాబు

నేడు తనయుడు, మంత్రి లోకేష్, పురపాలక మంత్రి నారాయణతో కలిసి ప్రయాణం.. 6 రోజుల పాటు పర్యటన

స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులో గతంలో కీలక పాత్ర పోషించిన సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్

ఫార్ములా–1 ఒప్పందంలో ముడుపులు తీసుకున్న కేసులో జైలు శిక్ష అనుభవించి విడుదలైన ఈశ్వరన్

ఈ పర్యటనలో ఆయనతో చంద్రబాబు అధికారికంగా భేటీ అవుతారా? అనధికారికంగా కలుస్తారా?



సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ఒప్పందం పునరుద్ధరణే ఎజెండాగా ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనకు సిద్ధమయ్యారు. తనయుడు, మంత్రి నారా లోకేష్, పురపాలక మంత్రి నారాయణతో కలిసి శనివారం నుంచి ఆరు రోజులు ఆ దేశంలో పర్యటించనున్నారు. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పన నుంచి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు వరకు గతంలో సింగపూర్ మంత్రిగా ఉన్న ఈశ్వరన్ కీలక పాత్ర పోషించారు. గతంలో ఈయనతో కలిసి రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారు చంద్రబాబు. అయితే, 'ఫార్ములా–1 కార్ రేసింగ్ ఒప్పందం'లో ముడుపులు తీసుకున్న కేసులో ఈశ్వరన్ జైలుకెళ్లారు. జూన్ 5న విడుదలయ్యారు. ఇప్పుడు సింగపూర్ పర్యటనలో రాజధాని స్టార్టప్ ఏరియా ప్రణాళిక అమలుకు చంద్రబాబు సిద్ధమయ్యారనే ఆరోపణలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అయన కొత్తగా ఎవరిని తెరపైకి తెస్తారు..? తన మిత్రుడు ఈశ్వరన్‌తో అధికారికంగా భేటీ అవుతారా? లేదంటే అనధికారికంగా కలుస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

అంతర్జాతీయ ప్రమాణాలతో కాదు..
అంతర్జాతీయ కుంభకోణం

అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మిస్తానంటూ 2014లో చంద్రబాబు బీరాలు పలికారు. కానీ, రాజధాని ఎక్కడ వస్తుందో ముందే తన కోటరీకి లీక్ చేసి 'ఇన్‌సైడర్ ట్రేడింగ్'కు పాల్పడి చంద్రబాబు, ఆయన బినామీలు తక్కువ ధరకే రైతుల భూములు కొట్టేసి రూ.లక్ష కోట్లు దోచుకున్నారు. ఇక ఈశ్వరన్ తనకు ప్రాణ స్నేహితుడని.. రాజధాని నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చేందుకు ముందుకొచ్చిందంటూ గొప్పలు పోయారు. ఈ క్రమంలో ఈశ్వరన్‌తో కలిసి మరో దోపిడీకి తెర తీశారు. అదే రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు. ఇందులో చంద్రబాబు ప్రభుత్వం అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ స్కాంకు పథకం వేసింది.

స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు కుంభకోణం ఇదీ

స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు కింద 1,691 ఎకరాలను సింగపూర్ సంస్థల కన్సార్షియంకు ప్రభుత్వం అప్పగిస్తుంది. 371 ఎకరాలను రోడ్లు, పార్కులు, మురుగు కాల్వల వంటి మౌలిక సదుపాయాలకు కేటాయించాల్సి ఉంటుంది. తొలి విడతగా 50 ఎకరాలు, రెండో దశలో 200 ఎకరాలను సింగపూర్ సంస్థలకు ఉచితంగా అప్పగిస్తుంది. మిగతా 1,070 ఎకరాలను ప్లాట్లుగా వేసి విక్రయిస్తారు. సింగపూర్ సంస్థల కన్సార్షియం, సీసీడీఎంసీ (కేపిటల్ సిటీ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ)తో కలిసి ఏర్పాటు చేసే ఏడీపీ (అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్)కి ప్రభుత్వం 1,691 ఎకరాలను అప్పగించింది. ఎకరం రూ.4 కోట్లు (కనీస ధర)గా నిర్ణయించింది. మొత్తం విలువ రూ.6,764 కోట్లు. ఈ భూమికి రోడ్లు, నీటి సౌకర్యం, వరద మళ్లింపు వంటి సదుపాయాలన్నీ ప్రభుత్వం సొంత ఖర్చు రూ.5,500 కోట్లతో కల్పించనుంది. ఏడీపీలో సీసీడీఎంసీ వాటాగా రూ.221.9 కోట్లు పెట్టుబడి పెడుతుంది. ఈ మొత్తం రూ.12,485.90 కోట్ల పెట్టుబడిలో సీసీఎండీసీకి దక్కే వాటా 42 శాతమే. కేవలం రూ.306 కోట్లు మాత్రమే పెట్టే సింగపూర్ కన్సార్షియంకు దక్కే వాటా 58 శాతం. సింగపూర్ కన్సార్షియంకు తొలుత 50, తర్వాత 200 ఎకరాలను ఉచితంగా కట్టబెట్టేందుకు నాటి చంద్రబాబు సర్కార్ అంగీకరించింది.

కన్సార్షియం ముసుగులో...

–1,691 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టుకు స్విస్ చాలెంజ్ విధానంలో సింగపూర్ సంస్థల కన్సార్షియం (అసెండాస్–సిన్‌బ్రిడ్జ్–సెంబ్‌కార్ప్) నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. ఈ విధానం నిబంధనలకు విరుద్ధమని హైకోర్టు ఆక్షేపించింది. స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని సింగపూర్ సంస్థల కన్సార్షియం గోప్యంగా ఉంచడం ఏమిటని అక్షింతలు వేసి స్టే ఇచ్చింది. అయినా, నాటి రాష్ట్ర ప్రభుత్వం రహస్యంగా ఉంచేందుకే ప్రయత్నించింది. దీని ఖరీదు అక్షరాలా రూ.66 వేల కోట్లు. చివరకు హైకోర్టు ఆదేశాలతో వివరాలు బయటపెట్టింది. వాస్తవానికి కన్సార్షియం ముసుగులో చంద్రబాబు బినామీ పెట్టుబడులు పెట్టారు. సింగపూర్ మంత్రిగా ఉన్న ఈశ్వరన్ సహకరించారు. మరోవైపు పైసా పెట్టుబడి పెట్టకుండా బాబు బినామీల గుప్పిట్లోని మేనేజ్‌మెంట్ కంపెనీ, సింగపూర్ సంస్థల కన్సార్షియంలు రూ.కోట్లు కొట్టేయడానికి స్కెచ్ వేశారు. 1,691 ఎకరాల స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులోనే కనీసంగా రూ.66 వేల కోట్లు కొల్లగొడుతుంటే 54వేల ఎకరాల రాజధాని నిర్మాణంలో ఎన్ని లక్షల కోట్లు కాజేయడానికి స్కెచ్ వేశారో ఊహకు కూడా అందని విషయం.

వింత వింత నిబంధనలతో...

స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు 20 ఏళ్లు అమల్లో ఉంటుంది. ముందుగా ప్రభుత్వం రద్దు చేస్తే కన్సార్షియం పెట్టుబడికి 150 శాతం మేర అపరాధ రుసుం చెల్లించాలి. ఆ సంస్థల బ్యాంకు రుణాలను ప్రభుత్వమే చెల్లించాలి. కన్సార్షియమే వైదొలగినా వాటి పెట్టుబడిని 100 శాతం ప్రభుత్వం చెల్లించాలి. బ్యాంకు రుణాలనూ కట్టాలి. పైగా వివాదం తలెత్తితే లండన్ కోర్టులో తేల్చుకోవాలి. అంటే, స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు పూర్తిగా సింగపూర్ కన్సార్షియం చేతుల్లో ఉండేలా ప్లాన్ చేశారు. మేనేజ్‌మెంట్ కంపెనీని అడ్డుపెట్టుకుని తమ పథకాన్ని అమలు చేయడానికి ఎత్తు వేశారు. ఎకరం భూమి కనీస ధర రూ.4 కోట్లు ఉండగా నామమాత్ర మొత్తాన్ని అంటే ఓ పాతిక లక్షలో యాభై లక్షలో కలిపి అమ్మినట్లు చూపిస్తారనుకుందాం. అది మాత్రమే వైట్ మనీ. మిగతా అంతా బ్లాక్ మనీ. చెప్పుచేతల్లో ఉండే మేనేజ్‌మెంట్ కంపెనీయే లావాదేవీలను చూస్తుంది కాబట్టి ఎకరం రూ.20 కోట్లకు అమ్మినా అడిగేవారుండరు. బ్లాక్ మనీ అంతా చినబాబు ద్వారా చంద్రబాబు చేతుల్లోకి వెళుతుంది.

–రాజధానిలో అత్యంత ప్రధానమైన ప్రాంతంలో అప్పట్లో గజం కనిష్ఠంగా రూ.40 వేలు పలికింది. దీన్నిబట్టి ఎకరం విలువ రూ.20 కోట్ల వరకు ఉంటుంది. 20 ఏళ్లలో ఎకరం రూ.50 కోట్లకు పైగా పలుకుతుందని చంద్రబాబే చెబుతున్నారు. ఈ లెక్కన ఎకరం రూ.50 కోట్ల చొప్పున 1,070 ఎకరాలను అమ్మి రూ.53,500 కోట్లను చంద్రబాబు అండ్ కో సింగపూర్ సంస్థల కన్సార్షియం సొమ్ము చేసుకోవడానికి ప్లాన్ వేశాయి. తొలుత 50, రెండో దశలో 200 ఎకరాలను కన్సార్షియంకు ఉచితంగా కట్టబెట్టడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ 250 ఎకరాలను ఎకరం రూ.50 కోట్ల చొప్పున అమ్ముకున్నా రూ.12,500 కోట్ల మేర సొమ్ము చేసుకోవడానికి ఆ సంస్థలు ప్లాన్ వేశాయి. అంటే గరిష్ఠంగా రూ.లక్ష కోట్లను చంద్రబాబు అండ్ కో, సింగపూర్ సంస్థలు కాజేయడానికి పథకం పన్నాయని స్పష్టమవుతోంది. 1,691 ఎకరాల స్టార్టప్ ఏరియా ప్రాజెక్టులోనే ఈ స్థాయిలో దోచుకుంటే 34 వేల ఎకరాల రాజధానిలో ఇంకే స్థాయిలో దోపిడీ చేయడానికి ప్లాన్ వేశారన్నది అంచనాలకే అందడం లేదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

స్కూళ్లు, కాలేజీల వద్ద పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై చర్యలు

తెలంగాణ టొబాకో కంట్రోల్ బోర్డుకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: స్కూళ్లు, కాలేజీల వద్ద పొగాకు ఉత్పత్తుల విక్రయాల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ఆరోగ్య శాఖ, పొగాకు నియంత్రణ విభాగాన్ని.. రాష్ట్రపతి భవన్ ఆదేశించింది. పొగాకు నియంత్రణ కోసం 22 ఏళ్లుగా అలుపెరుగని, కృషి చేస్తున్న పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ విజ్ఞప్తికి రాష్ట్రపతి భవన్ స్పందించింది. ఆయన సూచనను పరిగణనలోకి తీసుకుని నేషనల్ టొబాకో కంట్రోల్ బోర్డ్ తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసింది. రాష్ట్రపతి భవన్ అధికారులు రఘునందన్ నుంచి నివేదిక, రాష్ట్రపతికి రాసిన లేఖను స్వీకరించి పొగాకు బోర్డుకు, ఆరోగ్య శాఖకు తగిన నిర్దేశాలు జారీ చేశారు. ఈ సమాచారాన్ని మాచనకు శుక్రవారం ఈ–మెయిల్ చేశారు. ఈనెల 16న మాచన రాష్ట్రపతి భవన్‌కు రావాలని ఆహ్వానం అందినా అనివార్య కారణాల వల్ల రాష్ట్రపతిని కలిసే అవకాశం కలగలేదు.

ఐఏఎస్ శ్రీలక్ష్మి పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలంటూ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గాలి జనార్దన్‌రెడ్డి చెందిన ఓఎంసీకి గనులు కేటాయించడంలో ఆమె కీలకపాత్ర పోషించారన్న అభియోగాలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసుకు తనకు సంబంధం లేదని, తనను నిర్దోషిగా ప్రకటించాలని కోరుతూ గతంలో తెలంగాణ హైకోర్టులో శ్రీలక్ష్మి పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. మరోసారి వాదనలు విని ఓఎంసీ కేసులో ఆమె పాత్రను తేల్చాలని హైకోర్టును అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశంతో హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విని.. గతవారం తీర్పు రిజర్వు చేశారు. ఆమె పిటిషన్‌ను అనుమతించలేమంటూ శుక్రవారం తుది ఉత్తర్వులు వెలువరించారు. దీంతో గాలి జనార్దన్‌రెడ్డికి గనులు కేటాయించడంలో శ్రీలక్ష్మి పాత్రపై సీబీఐ విచారణ జరపనుంది.

జహీరాబాద్ నోడ్‌లో 3,245 ఎకరాల్లో 'యాక్టివేషన్ ఏరియా'

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు కింద జహీరాబాద్ నోడ్ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,360 కోట్లు అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్‌ప్రసాద్ రాజ్యసభలో వెల్లడించారు. జహీరాబాద్ నోడ్‌లో 3,245 ఎకరాల్లో యాక్టివేషన్ ఏరియాను ప్రారంభ దశ అభివృద్ధికి కేటాయించామని శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్రమంత్రి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద అమలు చేయనున్నారు. ఈ పారిశ్రామిక ప్రాంతాన్ని ఆటోమొబైల్, ట్రాన్స్‌పోర్ట్ ఎక్విప్‌మెంట్, ఎలక్ట్రికల్ పరికరాలు, లోహ–లోహేతర ఖనిజాలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అభివృద్ధి చేస్తారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ ద్వారా కేంద్రం రూ.596 కోట్లు ఈక్విటీ, రూ.655 కోట్లు రుణంగా అందించనుంది.

డ్రోన్ నుంచి క్షిపణి ప్రయోగం సక్సెస్

కర్నూలులోని నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్‌లో డీఆర్‌డీఓ ప్రయోగం

గతంలో అభివృద్ధిచేసిన యూఎల్‌పీజీఎం–వీ2 అధునాతన వెర్షన్ ఇది

యుద్ధతంత్రంలో భారత డ్రోన్ ముందంజ

అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాల ఛేదన


డ్రోన్ ద్వారా క్షిపణిని ప్రయోగిస్తున్న దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ/కర్నూలు (సెంట్రల్)/ఓర్వకల్ : దేశ రక్షణ సామర్థ్యాలకు మరింత ఊతమిస్తూ డీఆర్‌డీఓ చేపట్టిన యూఏవీ లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ క్షిపణి (యూఎల్‌పీజీఎం–వీ3) ప్రయోగ పరీక్ష విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌ఓఏఆర్)లో డీఆర్‌డీఓ మానవ రహిత డ్రోన్ వైమానిక వాహనం ద్వారా శుక్రవారం ఈ క్షిపణి ప్రయోగం చేపట్టింది. గతంలో డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన యూఎల్‌పీజీఎం–వీ2 అధునాతన వెర్షన్ ఇది. యూఎల్‌పీజీఎం–వీ3 అనేక రకాల లక్ష్యాలను ఛేదించగలిగిన హై డెఫినిషన్ డ్యూయల్ చానల్ సీకర్‌తో అమర్చబడి ఉంటుంది. దీనిద్వారా మైదానం, అధిక ఎత్తు ప్రాంతాల నుంచి ప్రయోగించొచ్చు. ఇది పగలు, రాత్రి పనిచేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. లక్ష్యం, లక్ష్య పాయింట్ నవీకరణకు రెండు మార్గాల డేటా లింక్‌ను కలిగి ఉంటుంది.

క్షిపణుల ప్రయోగాలకు కేంద్రంగా ఎన్‌ఓఏఆర్..

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పాలకొలను సమీపంలో ఉన్న డీఆర్‌డీఓకు చెందిన నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ (ఎన్‌ఓఏఆర్) క్షిపణుల ప్రయోగాలకు కేంద్రంగా మారింది. గతంలో కూడా డీఆర్‌డీఓ యూఎల్‌పీజీఎం–వీ2 క్షిపణి పరీక్ష కోసం ఎన్‌ఓఏఆర్ వేదికనే వినియోగించింది. ప్రస్తుతం ప్రయోగించిన యూఎల్‌పీజీఎం–వీ3 క్షిపణి ప్రయోగానికి కూడా అదే వేదికై ంది. ఈ ఆయుధం మానవ రహిత విమానాలను కూల్చేందుకు వినియోగిస్తారు. ఇక్కడ జరుగుతున్న ప్రయోగాలతో భారత డ్రోన్ యుద్ధతంత్రంలో ముందంజ వేస్తోంది. దాదాపు 2,200 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్ఫేర్ రేంజ్. దీనిని 2016–17లో ప్రారంభించారు. సాధారణంగా.. ఇండోర్‌లో పరీక్షించే ఈడబ్ల్యూ ఆయుధాలు అందుబాటులోకి రావాలంటే ఏడాది నుంచి రెండేళ్ల సమయం పడుతుంది. కానీ, బాహ్య ప్రదేశాల్లో పరిరక్షించేవి వేగంగా దళాల్లోకి చేరే అవకాశం ఉంటుంది.

అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాల ఛేదన కోసం..

ఇక్కడ పరీక్షించే ఆయుధాల్లో రాడార్లు, ట్రాన్స్‌మీటర్లు, యాంటెనాలు, సెన్సార్లు, కమ్యూనికేషన్ పరికరాలతోపాటు డైరెక్ట్ ఎనర్జీ (లేజర్) వెపన్స్ కూడా ఉంటున్నాయి. యూఎల్‌పీజీఎం శ్రేణి ఆయుధాలను తపస్ బీహెచ్, అర్చర్ ఎన్‌ఈ యూఏవీల కోసం అభివృద్ధి చేశారు. వీటిని చాలా తక్కువ ధరతో ఉత్పత్తి అవుతాయి. ఈ క్షిపణులు అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదిస్తాయి. అత్యంత సమీపం నుంచి జరిగే పోరాటాల్లో ఫైర్ అండ్ ఫర్‌గెట్ వ్యవస్థ ఆధారంగా పనిచేస్తాయి.

రక్షణ మంత్రి అభినందనలు..

యూఏవీ లాంచ్ ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ ఫ్లైట్ ట్రయల్స్ విజయవంతం కావడంతో రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ డీఆర్‌డీఓను అభినందించారు. కీలక రక్షణ సాంకేతిక పరిజ్ఞానాలను భారత్ అందిపుచ్చుకుని ఉత్పత్తిచేసే స్థాయికి చేరుకుందని హర్షం వ్యక్తంచేశారు. ఈ ప్రయోగం విజయవంతం కోసం ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లను కూడా ఆయన అభినందించారు.

వినాలా విన్నపాలు.. సైగలు చేస్తే చాలు!

బధిరుల మొర అధికారులకు అర్థమయ్యేలా సైన్ లాంగ్వేజ్‌లో శిక్షణ

కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న ప్రయత్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రజావాణి లాంటి వేదికల ద్వారా ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తుండగా బధిరులు సైగల ద్వారా చెప్పే విషయాలు మాత్రం అధికారులకు అర్థంకావడంలేదు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. ఇకపై బధిరుల సమస్యలను అర్థం చేసుకొనేందుకు వీలుగా ప్రభుత్వ ఉన్నతాధికారులకు సైన్ లాంగ్వేజ్ (సైగల భాష)పై శిక్షణ ఇప్పిస్తున్నారు. తదుపరి దశలో పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

ప్రామాణికంగా ఐఎస్ఎల్ భాషలో..

దేశంలో గతంలో బధిరుల కోసం రూపొందించిన సైన్ లాంగ్వేజ్‌లో అనేక రకాలు ఉండేవి. ఉత్తరాదిలో ఒకలా, దక్షిణాదిలో మరోలా.. రాష్ట్రానికో సిలబస్ ఉండేది. దీంతో వేర్వేరు ప్రాంతాల బధిరులు కలిసినప్పుడు సైతం వారి భావాలను వ్యక్తపరచడంలో సమస్యలు ఎదురయ్యేవి. ఈ గందరగోళాన్ని తొలగిస్తూ కేంద్రం ఇటీవల ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (ఐఎస్ఎల్)ను అమల్లోకి తెచ్చింది. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి బధిరుల బాధలను ప్రభుత్వ ఉద్యోగులు స్వయంగా తెలుసుకొని వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్న ఉద్దేశంతో ఉద్యోగులకు ఐఎస్ఎల్ లాంగ్వేజ్‌లో బేసిక్ శిక్షణ ప్రారంభించారు. ఇందులో పలకరింపు, పేరు, చిరునామా, వృత్తి, సమస్య ఏంటి? అనే విషయాలపై కొంచెం అవగాహన కల్పిస్తున్నారు. క్రమంగా ఐఎస్ఎల్ సిలబస్ ప్రకారం.. పూర్తిస్థాయిలో శిక్షణ ఇప్పించనున్నారు. ఇటీవల పలు సందర్భాల్లో కొందరు బధిరులు తనను కలిసి సమస్యలను చెప్పుకోగా అర్థం చేసుకోలేకపోయానని కలెక్టర్ పమేలా భావించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే బధిరులు ఈ తరహాలో ఎన్ని ఇబ్బందులు పడుతున్నారోనని ఆందోళన చెందారు. ఈ సమస్యను అధిగమించేందుకు తనతోపాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి సైన్ లాంగ్వేజ్‌లో శిక్షణ పాఠాలు ప్రారంభించారు. తొలి విడతలో 100 మంది జిల్లా స్థాయి ఉద్యోగులకు ఉదయం 50 మంది, సాయంత్రం 50 మంది చొప్పున శిక్షణ ఇప్పిస్తున్నారు.



సైన్ భాష నేర్చుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

తెలుగు నేర్చుకొని.. ఉర్దూ నేర్చుకుంటూ..

ఒడిశాకు చెందిన పమేలా సత్పతి బహుభాషా కోవిదురాలు. ఆమెకు ఒడియా, హిందీ, ఆంగ్లం విద్యార్థి దశ నుంచే వచ్చు. ఐఏఎస్ అయ్యాక ప్రజలతో మమేకం అయ్యేందుకు తెలుగు నేర్చుకున్నారు. కరీంనగర్‌కు వచ్చాక.. భూరికార్డులన్నీ ఉర్దూలో ఉండటంతో ఒక టీచర్‌ను ఏర్పాటు చేసుకొని ఆ భాష కూడా నేర్చుకుంటున్నారు.

క్లుప్తంగా...

జస్టిస్ నవీన్‌రావుకు హెచ్‌సీఏ బాధ్యతలు

- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో 2025–26 సీజన్‌లో జరిగే లీగ్ మ్యాచ్‌ల నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించేందుకు హైకోర్టు ఏకసభ్య కమిటీని నియమించింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావుకు ఈ బాధ్యతలను అప్పగించింది. గతంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎల్.నాగేశ్వర్‌రావు మాదిరిగానే ఈయన కూడా హెచ్‌సీఏ విధులను పర్యవేక్షిస్తారని స్పష్టం చేసింది. హెచ్‌సీఏ ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అప్పటివరకు హెచ్‌సీఏ కార్యకలాపాల పర్యవేక్షణకు జస్టిస్ నవీన్‌రావు కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జస్టిస్ నవీన్‌రావు కమిటీని నియమిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజు అరెస్టు

- 17 రోజులుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడు



సాక్షి, హైదరాబాద్: సీఐడీ అధికారులను గడిచిన 17 రోజులుగా ముప్పు తిప్పలు పెట్టిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవరాజ్ ఎట్టకేలకు వారి చేతికి చిక్కాడు. ఆయనను పుణేలో అరెస్టు చేసిన సీఐడీ అధికారులు శుక్రవారం మేడ్చల్– మల్కాజిగిరి కోర్టులో ప్రవేశపెట్టారు. ఐపీఎల్ నిర్వహణ సమయంలో హైదరాబాద్ సన్‌రైజర్స్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో సీఐడీ కేసు నమోదు చేసింది. దర్యాప్తులో హెచ్‌సీఏలో జరిగిన అవకతవకలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తోంది. సీఐడీ అధికారులు 17 రోజుల క్రితం కేసు నమోదు చేసి, ఉప్పల్ స్టేడియానికి వెళ్తుండగా, ఆ సమాచారాన్ని ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ద్వారా తెలుసుకున్న దేవరాజ్ అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. గడిచిన 17 రోజులుగా 7 రాష్ట్రాల్లో ఆయన ప్రయాణించినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. ఆరు ప్రత్యేక బృందాలతో గాలించి ఎట్టకేలకు దేవరాజ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆయనకు రిమాండ్ విధించారు.

సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కోవాలి

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు మరింత సమర్థంగా పనిచేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ కోరారు. దీనికి నిరంతర అభ్యాసం, పరస్పర సహకారంతోపాటు సాంకేతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలను పెంపొందించుకోవడం, సైబర్ క్రైమ్ దర్యాప్తు, డిజిటల్ ఫోరెన్సిక్స్ తదితర అంశాలపై శుక్రవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ.. 2024తో పోలిస్తే 2025 ప్రథమార్థంలో సైబర్ నేరాలు 13 శాతం తగ్గాయన్నారు. ఇదే సమయంలో దేశంలో సైబర్ నేరాలు 37 శాతం పెరిగాయని చెప్పారు. టీజీసీఎస్‌బీ, రాష్ట్రంలోని అన్ని విభాగాలు తీసుకున్న చర్యలు నేరాల తగ్గుదలకు దోహదపడ్డాయని ఆమె పేర్కొన్నారు. ఈ సంవత్సరం బాధితులు రూ.726 కోట్లు నష్టపోగా, రూ.102 కోట్లు రికవరీ చేసి తిరిగి వారికి చెల్లించామని శిఖాగోయల్ వివరించారు.

కుటుంబ సభ్యుల పేరిట మురళీధర్‌రావు ఆస్తులు

- మూడో రోజు మురళీధర్‌రావును ప్రశ్నించిన ఏసీబీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఇరిగేషన్ మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తు ముమ్మరం చేసింది. మురళీధర్‌రావు తన అక్రమార్జనలు కుటుంబ సభ్యుల పేరిట పెట్టినట్టుగా ఏసీబీ కీలకమైన సమాచారం సేకరించింది. కుమారుడు సాయి అభిషేక్ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసిన ఆస్తుల వివరాలు సేకరిస్తోంది. ఏపీ, తమిళనాడులో ఆస్తులు, వివిధ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించింది. ఆరు బ్యాంకు లాకర్లను గుర్తించింది. సాయి అభిషేక్ పేరుతో పాటు కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న లాకర్లను ఓపెన్ చేసేందుకు యత్నించింది. ఇందులో మూడు లాకర్లను ఓపెన్ చేసి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. మరో మూడు లాకర్లు ఓపెన్ చేయాల్సి ఉంది. కోర్టు అనుమతితో ఐదు రోజుల కస్టడీలో భాగంగా శుక్రవారం ఏసీబీ విచారించింది. శనివారం మరోసారి మురళీధర్‌రావును ఏసీబీ అధికారులు ప్రశ్నించనున్నారు.

రెండు దశల్లో పాలమూరు-రంగారెడ్డి

తొలిదశలో 45 టీఎంసీల తరలింపునకే ప్రాజెక్టు పరిమితం | నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అభ్యంతరాల నేపథ్యంలో సర్కారు కొత్త వ్యూహం

సాక్షి, హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని విభజించి రెండు దశల్లో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టుకు నీటి కేటాయింపుల సమస్య ఎదురుకావడంతో ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. తొలిదశలో 45 టీఎంసీలను తరలించడానికి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేసి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం పొందడానికి ప్రయత్నాలు చేస్తోంది. త్వరలోనే డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించనుంది. సీడబ్ల్యూసీ 45 టీఎంసీలతో ప్రాజెక్టుకు అనుమతినిస్తే ఆ మేరకు సాగునీటి అవసరాల కోసం పనులు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.

90 టీఎంసీలతో ప్రాజెక్టుకు శ్రీకారం

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నారాయణపేట, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీటిని అందించడానికి 60 రోజుల్లో రోజుకు 1.5 టీఎంసీల చొప్పున మొత్తం 90 టీఎంసీల కృష్ణా జలాలను తరలించడానికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నార్లాపూర్‌లో 8.51 టీఎంసీలు, ఏదులలో 6.55 టీఎంసీలు, వట్టెంలో 16.74 టీఎంసీలు, కరివెనలో 17.34 టీఎంసీలు ఉద్దండాపూర్‌లో 16.03 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టిన రిజర్వాయర్ల పనులు తుది దశలో ఉన్నాయి. నార్లాపూర్ రిజర్వాయర్‌తో పాటు పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది.

నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను 2022 సెప్టెంబర్ 3న రాష్ట్ర ప్రభుత్వం సీడబ్ల్యూసీకి సమర్పించింది. అయితే ప్రాజెక్టుకు రాష్ట్రం కేటాయించిన 90 టీఎంసీల లభ్యతపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు తెలిపింది. అయితే కృష్ణా బేసిన్‌లో మైనర్ ఇరిగేషన్‌లో 2012–13 నుంచి 2022–23 మధ్య కాలంలో పొదుపు చేసిన 45.68 టీఎంసీలను ఈ ప్రాజెక్టుకు కేటాయించినట్టు తెలంగాణ తెలియజేసింది. కాగా పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా బేసిన్‌కు గోదావరి జలాలు తరలిస్తే దానికి బదులుగా నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకునే హక్కు ఉండేలా 1978 ఆగస్టు 4న బచావత్ ట్రిబ్యునల్ ఎదుట ఒప్పందం జరిగింది. దీని ప్రకారం లభించిన జలాల్లో ఎగువ రాష్ట్రాలు వాడుకోగా ఉమ్మడి ఏపీకి మిగిలిన 45 టీఎంసీలు మొత్తం తమ రాష్ట్రానికే చెందుతాయని తెలంగాణ వాదిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ 45 టీఎంసీలను సైతం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించినట్లు తెలిపింది. ఈవిధంగా మొత్తం 90 టీఎంసీల నీటి లభ్యత ఈ ప్రాజెక్టుకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌లో పేర్కొనగా, దీనిపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది.



అనుమతుల అంశాన్ని పరిశీలించలేమన్న జల సంఘం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నాగార్జునసాగర్ ఎక్కువ రాష్ట్రాలకు లభ్యతలోకి వచ్చిన జలాల్లో ఉమ్మడి ఏపీ వాటా అయిన 45 టీఎంసీలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం అప్పగించిన విషయాన్ని సీడబ్ల్యూసీ గుర్తు చేసింది. ట్రిబ్యునల్ పరిధిలో ఉన్న నేపథ్యంలో ఆ నీళ్ల ఆధారంగా 'పాలమూరు' ప్రాజెక్టుకు అనుమతుల జారీ అంశాన్ని పరిశీలించలేమని తేల్చి చెప్పింది. అదే సమయంలో మైనర్ ఇరిగేషన్‌లో 45.68 టీఎంసీలను ఎలా పొదుపు చేశారో చెప్పాలని కోరింది. ఈ నేపథ్యంలోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సాగర్ ఎగువన ఉమ్మడి ఏపీకి అందుబాటులోకి వచ్చిన 45 టీఎంసీల జలాలను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా పక్కన బెట్టింది.

ప్రస్తుతానికి 'మైనర్ ఇరిగేషన్ 45 టీఎంసీలు' పైనే దృష్టి

రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ కింద చెరువులు, క్లస్టర్ల వారీగా నీటి వాడకం వివరాలు, తద్వారా పొదుపు అవుతున్న 45 టీఎంసీల వివరాలను ఇటీవల సీడబ్ల్యూసీకి పంపించింది. అలాగే ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఇరు రాష్ట్రాల సీఎంలతో జరిగిన సమావేశంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 45 టీఎంసీలతో అనుమతినిస్తే డిస్ట్రిబ్యూటరీల పనులు చేసుకుంటామని తెలిపింది. దీనికి ముందు ప్రాజెక్టుకు 45 టీఎంసీల నీటితో అనుమతినివ్వాలని కోరుతూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. అలాగే నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, ఈఎన్సీ(జనరల్) కూడా వేర్వేరుగా లేఖలు రాశారు.

పాలమూరు-రంగారెడ్డికి రెండోదశ పర్యావరణ అనుమతి రావాల్సి ఉంది. వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి పొందడానికి వీలుగా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తెలంగాణకు 2017 అక్టోబర్‌లోనే టీఓఆర్ (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) జారీ చేసింది. దీంతో 2022 ఆగస్టులో ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. సుదీర్ఘ విరామం అనంతరం పర్యావరణ అనుమతి కోసం దరఖాస్తు చేసింది. రెండోదశ పర్యావరణ అనుమతి వస్తే ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. 45 టీఎంసీల ప్రాజెక్టుకు కీలకమైన సీడబ్ల్యూసీ అనుమతి లభిస్తే రెండోదశ పర్యావరణ అనుమతికి కూడా ఇబ్బందులు తొలగిపోతాయి.

రెండోదశకు పర్యావరణ అనుమతికి సీడబ్ల్యూసీ క్లియరెన్సే కీలకం

ఇప్పటికే అటవీ, తదితర అనుమతులు

ఈ ప్రాజెక్టుకు 2019లో తొలి, రెండోదశ అటవీ అనుమతులు రాగా, 2021 సెప్టెంబర్ 3న వైల్డ్ లైఫ్ క్లియరెన్స్, 2023 మార్చి 17న కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సీఈఏ), 2008లో సీఎస్ఆర్ఎంఎస్, 2023 జూలై 17న మోటా క్లియరెన్స్, 2023 జూలై 28న కేంద్ర భూగర్భ జల మండలి అనుమతులు లభించాయి. కాగా పర్యావరణ అనుమతుల కోసం నీటి లభ్యత విషయంలో సీడబ్ల్యూసీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకోవాలని గతంలో కేంద్ర పర్యావరణ శాఖ షరతు పెట్టింది. దీంతో సీడబ్ల్యూసీ క్లియరెన్సే ప్రాజెక్టుకు కీలకంగా మారింది.

న్యాయవాదులు లేకుండా 'న్యాయం' సాధ్యంకాదు

- హెచ్‌సీఏఏ సన్మానంలో హైకోర్టు సీజే ఏకే సింగ్ వెల్లడి



సీజే జస్టిస్ ఏకే సింగ్‌ను సన్మానిస్తున్న హెచ్‌సీఏఏ కార్యవర్గం. చిత్రంలో జగన్, విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'న్యాయవాదులు లేకుండా న్యాయం అందించడం సాధ్యం కాదు.. బాధితులకు మీతోనే అది అందుతుంది'అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ చెప్పారు. న్యాయమూర్తుల్లో చాలామంది న్యాయవాదుల బార్ నుంచి వచ్చిన వాళ్లేనని, ఈ సంస్థ (కోర్టు)లో ప్రతి ఒక్కరూ యజమానులే అన్నారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఏడో సీజేగా జస్టిస్ ఏకే సింగ్ శనివారం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతూ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సీజే మాట్లాడుతూ.. 'మీరు నన్ను స్వాగతించిన తీరు సంతోషకరం. హైకోర్టును నడిపించేది సీజే మాత్రమే అన్న అభిప్రాయం నాకు లేదు. న్యాయవాదులు, రిజిస్ట్రీ సభ్యులు, ఇతర సిబ్బంది అందరిపై గౌరవం ఉంది. అంతా నా అన్నదమ్ములు. ఎవరి పాత్ర వారు ఇక్కడ పోషిస్తాం. రాగద్వేషాలకు అతీతంగా న్యాయం అందాలి. న్యాయవాదులతో కలసి పనిచేయడం ద్వారా ఈ సంస్థను మరింత బలోపేతం చేయాలని ఎదురుచూస్తున్నా'అని వెల్లడించారు. ఈ సందర్భంగా సీజే, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)లు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, కార్యదర్శులు విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి, డిండికి నికర జలాలు కేటాయించండి

- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ వాదన
- విచారణ ఆగస్టు 28–29కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ), కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలకు 75 శాతం నీటి లభ్యత ఆధారంగా నికర జలాలను కేటాయించాలని బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌ను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపదని వాదించింది. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణానది జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు పంపిణీ చేయడంపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తలపత్ర సభ్యులుగా ఏర్పాటైన కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2 బుధవారం నుంచి శుక్రవారం వరకూ విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున తుది వాదనలు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వినిపించారు. ఈ వాదనలను ముగించడానికి మరో రెండు రోజులు సమయం కావాలని చేసిన విజ్ఞప్తికి ట్రిబ్యునల్ సానుకూలంగా స్పందించింది. ఆగస్టు 28–29 తేదీల్లో తెలంగాణ ప్రభుత్వం తరఫున తుది వాదనలు ముగించాలని.. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ సర్కార్ తరపున తుది వాదనలు వింటామని స్పష్టం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి కృష్ణా జలాల కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ మ్యాప్‌లతో సహా వైద్యనాథన్ వివరించారు. కేడబ్ల్యూడీటీ-1(బచావత్ ట్రిబ్యునల్)లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్ల తెలంగాణ ప్రాంతానికి కాల్వల ద్వారా అందాల్సిన 174.3 టీఎంసీలు దక్కకుండా పోయాయన్నారు. అప్పట్లో జరిగిన అన్యాయం వల్ల ఇప్పుడు ఎత్తిపోతల పథకాలే తెలంగాణకు శరణ్యంగా మారాయని వివరించారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు సమస్యను పరిష్కరించడంపై 2009–10లో కేడబ్ల్యూడీటీ-2 విచారణ సందర్భంగా.. ఎత్తు పెంచడానికి అంగీకరిస్తే అందులో నుంచి 60 టీఎంసీలు ఉపయోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు అవకాశం కల్పిస్తామని కర్ణాటక సర్కార్ చేసిన ప్రతిపాదనను అప్పట్లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిందని ఎత్తిచూపారు. అప్పట్లోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఉంటే ఆ 60 టీఎంసీల ప్రయోజనం పొందడంతోపాటు కర్ణాటక సర్కార్‌తో బేరసారాలాడి కాల్వల ద్వారా మరిన్ని నీళ్లను వినియోగించుకునే అవకాశం ఉండేదన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద 6.6 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండాలని 1956లో ప్రణాళిక సంఘం ఆ ప్రాజెక్టును ఆమోదిస్తే.. ఆ ఆయకట్టును 5.4 లక్షల ఎకరాలకు ఉమ్మడి రాష్ట్రం తగ్గించి అన్యాయం చేసిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని ఇప్పుడు సరిదిద్దాలని కోరారు. తెలంగాణలో అత్యంత కరువు పీడిత ప్రాంతాలు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించడానికి చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల, వాటి కింద నీటిని నిల్వ చేయడానికి చేపట్టిన జలాశయాలను వివరిస్తూ.. ఆ ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయించాలని కోరారు.

నేటి నుంచి లాసెట్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద కోర్సుల్లో ప్రవేశానికి శనివారం నుంచి కౌన్సెలింగ్ చేపడుతున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన షెడ్యూల్ విడుదల చేశారు. 26న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. వచ్చే నెల 4 నుంచి 14 వరకు మూడు, ఐదేళ్ల లాసెట్‌కు, 25 నుంచి సెప్టెంబర్ 1 వరకు పీజీ లాసెట్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సెప్టెంబర్ 16, 17 తేదీల్లో మూడు, ఐదేళ్ల లా కోర్సులకు వెబ్ ఆప్షన్లు ఇవ్వొచ్చు. పీజీ లా కోర్సులకు సెప్టెంబర్ 3, 4 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఉంటాయి. వచ్చే నెల 22న లా కోర్సుల సీట్ల కేటాయింపు, సెప్టెంబర్ 8న పీజీ లా కోర్సుల సీట్ల కేటాయింపు చేపడతారు.

ఆగస్టు 1 నుంచి పీజీఈసెట్

ఎంటెక్, ఎంఫార్మసీ, ఎం ఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి ఆగస్టు 1 నుంచి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేపడతారు. 11, 12 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఉంటాయి. 16వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది.

వైద్య కోర్సుల ప్రవేశ గడువు పొడిగింపు

30వరకు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశ రిజిస్ట్రేషన్లు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల రిజిస్ట్రేషన్ల గడువును కాళోజీ విశ్వవిద్యాలయం పొడిగించింది. ప్రవేశాల్లో స్థానికత నిర్ధారణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమల్లో భాగంగా.. ఈనెల 30 వరకు గడువును పొడిగిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రేషన్లకు https://tsmedadm.tsche.in వెబ్‌సైట్ ద్వారా ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఏవైనా సమస్యలు వస్తే సాంకేతిక సహకారం కోసం 9392685856, 9059672216, 7842136688 నంబర్లకు కాల్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శివబాలకృష్ణ ఇంట్లో ఈడీ మళ్లీ సోదాలు

- రెండు రోజుల్లో అనేక బినామీ సంస్థల్లో పెట్టుబడులు కనుగొన్న అధికారులు
- సోదరుడు నవీన్‌కుమార్‌తో కలిసి రియల్ సంస్థల్లో రూ.వందల కోట్ల పెట్టుబడులు
- 120 ఎకరాలు, రూ.వందల కోట్ల విలువైన స్థిరాస్తులు గుర్తించిన ఈడీ
- ట్రిపుల్ ఆర్ పరిసరాల్లోనూ భూములు కొనుగోలు చేసినట్టు అనుమానిస్తున్న దర్యాప్తు సంస్థ

సాక్షి, హైదరాబాద్: సోదాలు చేసే కొద్దీ హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, రెరా మాజీ కార్యదర్శి శివబాలకృష్ణ అక్రమ ఆస్తులు భారీ సంఖ్యలో వెలుగుచూస్తున్నాయి. ఆయన బినామీ పేర్లతో పలు రియల్ ఎస్టేట్ సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెట్టినట్టు ఈడీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటివరకు గుర్తించిన దాంట్లో 120 ఎకరాల భూమి, రూ.వందల కోట్లు విలువ చేసే స్థిర, చరాస్తులకు సంబంధించి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఏసీబీ సేకరించిన ఆధారాల మేరకు శివబాలకృష్ణ పెట్టుబడులు, బినామీ ఆస్తుల వివరాలు ఈడీ సేకరిస్తోంది. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా ఈనెల 2న రాజేంద్రనగర్ మణికొండలోని శివబాలకృష్ణ ఇల్లు, చైతన్యనగర్‌లోని ఆయన సోదరుడు నవీన్‌కుమార్ ఇంటిలోనూ ఈడీ సోదాలు చేసింది. ఈ సోదాల్లో శ్రీకృష్ణ కన్‌స్ట్రక్షన్స్, కొరిజోన్ స్పేసెస్ కన్‌స్ట్రక్షన్స్, ఉదయ ఎస్ఎస్‌వీ ప్రాజెక్టు కంపెనీలు సహా బినామీ పేర్లతో ఉన్న డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. శివబాలకృష్ణ సహా ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా ఈడీ అధికారులు గురు, శుక్రవారాల్లోనూ సోదాలు నిర్వహించారు. లక్డీకాపూల్, కొండాపూర్, రామంతాపూర్‌లోని శ్రీకృష్ణ కన్‌స్ట్రక్షన్స్, క్యారీస్ స్పైసెస్, ఉదయ ఎస్ఎస్‌వీ ప్రాజెక్ట్ కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. శివబాలకృష్ణ సోదరుడు నవీన్‌కుమార్‌తో కలిసి కంపెనీలు, బినామీల పేర్లతో రూ.వందల కోట్లు రియల్ ఎస్టేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్టు గుర్తించారు. ఆయా కంపెనీల డైరెక్టర్ల ఇళ్లలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌ఎండీఏ అడ్డాగా రియల్ ఎస్టేట్ సంస్థలతో క్విడ్ ప్రో కోకు పాల్పడ్డట్టు ఈడీ విచారణలో వెలుగు చూసినట్టు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినందుకు ప్రతిఫలంగా ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల్లో షేర్స్ తీసుకున్నట్టు సమాచారం. రీజినల్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లోనూ పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేసినట్టు ఈడీ అనుమానిస్తున్నది.

అక్రమ అనుమతులతో క్విడ్ ప్రో కో

బాలకృష్ణ ఇల్లు, రెరా ఆఫీస్‌లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా బినామీల పేర్లతో కూడబెట్టిన ఆస్తులు, రియల్ ఎస్టేట్‌లో పెట్టిన పెట్టుబడులపై ఆరా తీస్తున్నారు. సిటీ శివారు ప్రాంతాల్లోని హెచ్‌ఎండీఏ పరిధిలో రియల్ ఎస్టేట్ కంపెనీలకు లబ్ధి చేసే విధంగా శివబాలకృష్ణ ప్లాన్ చేసినట్టు ఈడీ గుర్తించింది. శివబాలకృష్ణ రియల్ ఎస్టేట్ కంపెనీలతో ఉన్న సంబంధాలపై వివరాలు సేకరిస్తున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో వైద్యుడికి బెదిరింపులు

బాధితుడు భద్రాచలం వాసి



డాక్టర్ నారాయణ

భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన నేత్ర వైద్యుడు నారాయణరావును డిజిటల్ అరెస్టు పేరుతో సీబీఐ అధికారులమని చెబుతూ సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడ్డారు. మాజీ ఎమ్మెల్యే భూపతిరావు అల్లుడు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక బావ అయిన నారాయణరావు భద్రాచలంలో క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఆయనకు గురువారం ఉదయం 11 గంటలకు బెంగళూరు నుంచి సీబీఐ అధికారులమంటూ గుర్తుతెలియని వ్యక్తులు వీడియో కాల్ చేశారు. 'బెంగళూరులో మీపై 17 కేసులు నమోదయ్యాయి. మీ ఆధార్ కార్డు దుర్వినియోగమైంది. మీ పేరుతో ఉన్న మరో ఫోన్ నంబర్‌ను ఉపయోగించి చట్టవ్యతిరేక పనులు జరిగినందున డిజిటల్ అరెస్టు చేస్తున్నాం. తలుపులు, కిటికీలన్నీ మూసేసి విచారణలో పాల్గొనాలి. బెంగళూరులో మా ఎదుట హాజరుకావాలి'అని పేర్కొన్నారు. అలా మధ్యాహ్నం వరకు బెదిరించాక కాల్ కట్ అయింది. సాయంత్రం మళ్లీ గంటసేపు బెదిరించడంతో నారాయణ విషయాన్ని తన కుమారుడు, న్యాయవాది ఉదయ్‌కు చెప్పగా ఇది పూర్తిగా సైబర్ నేరగాళ్ల పని అని బదులిచ్చారు. దీంతో మళ్లీమళ్లీ వచ్చిన ఫోన్లకు నారాయణ స్పందించలేదు. దీనిపై శుక్రవారం నారాయణరావు మాట్లాడుతూ వాట్సాప్ డీపీ ఫొటో చూసి ఆందోళన చెందానని, కొన్ని ఫొటోలు పంపి అందులో వ్యక్తులు తెలుసా అని ఆరా తీస్తూ భయపెట్టారని తెలిపారు.

వకుళాభరణం ఇంటికి దత్తాత్రేయ

- 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకం అందజేత



పుస్తకాన్ని అందజేస్తున్న దత్తాత్రేయ

సాక్షి, హైదరాబాద్: బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌కు 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అందజేశారు. ఆయన శుక్రవారం వకుళాభరణం నివాసానికి వచ్చి పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. బీసీ ఉద్యమకారుడు, బీసీ వర్గాల మేధావి, బీసీ కమిషన్ చైర్మన్‌గా వకుళాభరణం సేవలు గొప్పవని కొనియాడారు. అనంతరం వకుళాభరణం మాట్లాడుతూ.. దత్తాత్రేయ గంగా జమునా సంగమం వంటి విలువలతో జీవించే రాజకీయ నాయకుడని ప్రశంసించారు. ఆయన తన ఇంటికి స్వయంగా రావడం గౌరవపూర్వకమైన క్షణమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వకుళాభరణం సతీమణి సుధాశ్రీ, కుమారుడు ప్రహల్లాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులతో సీఎస్ భేటీ

- వర్షాలు, యూరియా సరఫరాపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, యూరియా సరఫరా, రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి ప్రభుత్వ సూచనల మేరకు నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సమయంలో ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎస్ రామకృష్ణారావు వారిని నియమించడంతోపాటు తాజా భేటీలో ప్రత్యేకంగా దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకాధికారులుగా నియమితులైన వారు ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని, ప్రభుత్వం అమలు చేసే పథకాలు పకడ్బందీగా ప్రజలకు చేరే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చూడడం, రేషన్‌కార్డుల పంపిణీ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించడంతోపాటు ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేయాలని సీఎస్ వారికి సూచించారు. ఈ సందర్భంగా ప్రకృతి విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు, వరదలతోపాటు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా, ఎదుర్కోవడానికి తగిన సిబ్బంది, పరికరాలు, వాహనాలు సిద్ధంగా ఉన్నాయని, 2,000 మంది ఆపద మిత్రలను సిద్ధం చేసి ఉంచామని వివరించారు. ఆపద మిత్రల సేవలను కలెక్టర్లు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ, సహకార శాఖ సమన్వయంతో యూరియా పక్కదారి పట్టకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు రవాణా శాఖ కమిషనర్ ఈ సందర్భంగా వివరించారు.

● సైన్స్ ఏం చెబుతోంది?

పరగడుపునే నీళ్లు తాగితే...

మన శరీరం ఆరోగ్యంగా, హైడ్రేటెడ్ గా ఉండటానికి నీళ్ల తాగటం చాలా అవసరం. ఇది అలసటను తగ్గించడం, మానసిక స్థితిని మెరుగుపరచడం, బరువు తగ్గడానికి సహాయపడటం వరకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, నీళ్ళు ఎప్పుడు తాగడం మంచిదంటే ప్రతిరోజు ఉదయాన్నే నిద్రలేచిన వెంటనే ఒక లీటర్ మంచి నీళ్ల తాగాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకో తెలుసుకుందాం..



మనం రోజూ రాత్రి పూట 7-8 గంటలు నిద్రపోతాం. ఈ సమయంలో ఏమీ తినం, తాగం కాబట్టి, ఉదయం నిద్రలేవగానే, కడుపు ఖాళీగా ఉంటుంది. డీహైడ్రేషన్‌కు గుర వుతారు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో నీరు తాగడం వల్ల శరీరం డీహైడ్రేషన్ నుంచి కోలుకోవడానికి సహాయ పడుతుంది. మీ కడుపు ఖాళీగా ఉన్నప్పుడు మీ శరీరం నీటిని వేగంగా గ్రహిస్తుంది. తెల్లవారుజామునే నిద్రలేచి వీలైనంత త్వరగా నీరు త్రాగి హైడ్రేట్ చేసుకోవాలి. ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగడం వల్ల రోజంతా హైడ్రేటెడ్ గా ఉండేందుకు సహాయపడుతుంది

నీరు తాగడం మన శరీరాన్ని డిటాక్స్ చేయడానికి సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఖాళీ కడుపుతో నీరు తాగడం శోషరస వ్యవస్థను సమతుల్యం చేస్తుంది. ఇది రోగనిరోధక వ్యవస్థలో ముఖ్యమైన భాగం, ఇది వ్యాధులతో పోరాడడాన్ని సులభతరం చేస్తుంది.

ఉదయాన్నే ఖాళీ కడుపుతో నీళ్ల తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల ఏర్పడే ప్రమాదం తగ్గుతుంది. నీరు మీ కిడ్నీలోని యాసిడ్‌ను పలుచన చేస్తుంది, కాబట్టి రాళ్ల ఏర్పడే అవకాశం తగ్గుతుంది. ప్రతిరోజూ ఉదయం అల్పాహారానికి ముందు నీరు తాగడం వల్ల పేగులు శుభ్రపడతాయి. ఇది హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది.

పొట్టలోని యాసిడ్ పలచబడి జీర్ణక్రియకు సహాయపడుతుంది. చర్మం తేమగా ఉండి ముడతలు తగ్గుతాయి. బరువును కూడా తగ్గించుకోవచ్చు.

ఉదయం లేచిన తర్వాత మంచినీళ్లను తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. చాలా రకాల సమస్యలకు దూరంగా ఉండవచ్చు. ఎన్నో ప్రయోజనాలని పొందవచ్చు. ఉదయాన్నే రోజంతా యాక్టివ్‌గా మీ పనులు మీరు చేసుకుంటారు.



ప్రకృతే వారి బ్లాక్‌బోర్డ్

అక్కడ బడిలో వారికి బ్లాక్ బోర్డు ఉండదు. రెండవ తరగతి దాటేంత వరకు పరీక్షలే ఉండవు. తమకు కావలసిన ప్రాథమిక విజ్ఞానాన్ని తరగతి గది నుంచి కాకుండా ప్రకృతి నుంచే గ్రహిస్తారు. కిలకిలలాడుతూ కమ్మటి కథలు చెబుతారు. ప్రకృతి నుంచి, స్వీయ అనుభవం నుంచి పిల్లలు సంతోషంగా నేర్చుకుంటారు. సంతోషంగా ఉన్నప్పుడు పిల్లలకు విజ్ఞానం మరింత బాగా వంట బడుతుంది అని అంటారు లడఖ్ లోని మారుమూల గ్రామం అయిన నిమ్మో గ్రామ విద్యా కమిటీ సలహాదారు చేతన్ ఆంగ్చుక్.

లడఖ్‌లోని నిమ్మో హామ్లెట్‌లో, పిల్లలు బ్లాక్‌బోర్డ్‌ల నుండి నేర్చుకోరు. వారు జీవితం నుండే నేర్చుకుంటారు. ఇక్కడ 2వ తరగతి వరకు అధికారిక పరీక్షలనేవి ఉండవు. బదులుగా, యువ అభ్యాసకులు తమ రోజులను వ్యవసాయం, కథ చెప్పడం వారి గ్రామాన్ని చుట్టిరావడంలో సంతోషంగా గడుపుతారు. ఎందుకంటే అసలైన అభ్యాసం వాస్తవ ప్రపంచ అనుభవాలతో ప్రారంభమవుతుంది.

'విలేజ్ యాజ్ ఎ స్కూల్'గా ప్రారంభించిన ఈ వినూత్న నమూనాలో నిమ్మో పర్వతాలు, పచ్చటి పంట పొలాలు, సామాజిక జీవితమే బహిరంగ తరగతి గదులుగా మారిపోతాయి. మొక్కలపై పాఠాలు పాఠ్యపుస్తకాలలో గాక పొలాలలో జరుగుతాయి. గ్రామ ఎన్నికలను దగ్గరగా చూడటం నుంచి పౌర విద్య అంటే ఏమిటో తెలుస్తుంది. అంతేకాదు, స్థానిక సంస్కృతి వారి సిలబస్‌ను రూపొందిస్తుంది.



లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (L-A-H-D-C) మద్దతుతో, ఈ నమూనా అధికారికంగా ప్రారంభించడానికి ముందు 3 సంవత్సరాల కమ్యూనిటీ సమీకరణను తీసుకుంది. నేడు, దీనిని లడఖ్‌లోనే కాకుండా భారత దేశం అంతటా గ్రామీణ విద్యకు ఒక బ్లూప్రింట్‌గా అంటే నమూనాగా చూస్తున్నారు. ఎందుకంటే కొన్నిసార్లు, ఉత్తమ ఉపాధ్యాయుడు పుస్తకంలో కనిపించకపోవచ్చు. తరగతి గది బయట వేచి చూస్తుంటారు.

ఇలాంటి విద్యా విధానం ఇక్కడ సాధ్యం అవుతుందో లేదో తెలియదు కానీ అక్కడ మాత్రం చాలా సత్ఫలితాలనే ఇస్తోంది మరి...

విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ ఆశయంతో నడిచిన శాంతినికేతన్ తరహా విద్యాబోధన అక్కడ జరుగుతున్నట్లే ఇక్కడ కూడా వస్తే బాగుంటుంది కదా...



లైఫ్@360

● కలాం సూత్రాలు



విద్యార్థుల భవితకు...

విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును, వారి వ్యక్తిత్వ వికసనాన్ని దృష్టిలోపెట్టుకుని, వేనాడు(కేరళ)లోని జవహర్ నవోదయ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విద్యార్థుల చేత ఒక ప్రతిజ్ఞ చేయించారు. అది తన జీవితంలో మరచిపోలేని రోజని ఆయన తన పుస్తకంలో రాసుకున్నారు. ఆ ప్రతిజ్ఞలోని పదిసూత్రాలు ఇవి....

1. నేను ఒక పెద్ద లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాని సాధనకోసం కష్టపడతాను. చిన్న లక్ష్యం పెట్టుకోవడం నేరమని గుర్తించాను.

2. చిత్తశుద్ధితో పనిచేసి సమగ్ర విజయం సాధిస్తాను.

3. నేను నా కుటుంబంలో, నా సమకాలీన సమాజంలో, దేశంలో, ప్రపంచంలో ఒక మంచి సభ్యుడిగా ఉంటాను.

4. కుల, జాతి, భాష, మత, రాష్ట్ర భేదాలు లేకుండా ఎవరో ఒకరి జీవితాన్ని రక్షించడానికి లేదా వృద్ధిలోకి తీసుకురావడానికి నేను ప్రయత్నిస్తాను.

5. ఎక్కడ ఉన్నా, నా దేశానికి ఏం చేస్తున్నా ''నేనేం ఇవ్వగలను'' అని ఆలోచిస్తాను.

6. సమయ ప్రాముఖ్యతను ఎప్పుడూ గుర్తుంచుకుంటాను. జవసత్వాలతో ఉన్న నా కాలాన్ని వృథా కానివ్వను. దీనినే నేను ఆదర్శంగా భావిస్తాను.

7. స్వచ్ఛమైన భూగ్రహ వాతావరణంకోసం, స్వచ్ఛమైన ఇంధన శక్తికోసం సర్వదా ప్రయత్నిస్తాను.

8. ఈ దేశ యువ ప్రతినిధిగా నా లక్ష్యాలన్నింటినీ విజయవంతంగా సాధించడానికి సాహసంతో పనిచేస్తాను. ఇతరుల విజయాలనుకూడా అదే స్ఫూర్తితో ఆస్వాదిస్తాను.

9. నేను నా విశ్వాసమంత యువకుడిని/యువతిని. సందేహమంత వృద్ధుడను/వృద్ధురాలను. అందువల్ల నా హృదయంలో విశ్వాసమనే దీపాన్ని వెలిగిస్తాను.

10. నా దేశ పతాకం నా హృదయంలో ఎప్పుడూ రెపరెపలాడుతూనే ఉంటుంది. నా దేశానికి కీర్తి, వైభవం తీసుకు వస్తాను.

ఆ రోజున తనలోంచి వచ్చిన భావావేశాన్ని పదిసూత్రాలుగా మలచి కలాం అక్కడ విద్యార్థులతో చేయించిన ఈ ప్రతిజ్ఞా పాఠాన్ని ప్రతి విద్యార్థీ ప్రతిరోజూ ఒకసారి ఇంట్లో కుడిచేయి ముందుకు చాపి నిజాయితీగా ప్రతిజ్ఞలాగా చదువుకోవాలి. విద్యాలయాలు కూడా ఇలా పిల్లల చేత ప్రతిజ్ఞ చేయిస్తే... విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు, స్నేహితులు, వారి ఊరు, ఈ దేశం అన్నీ గర్వపడే పౌరులుగా తయారవుతారు.

(30న కలాం వర్ధంతి సందర్భంగా)

అందానికి ఐస్ కాంతులు

ముఖ సౌందర్యాన్ని పెంచుకోవడం కోసం బోలెడంత ఖరీదు పెట్టి మార్కెట్‌లో దొరికే రకరకాల సౌందర్య సాధనాలను ప్రయోగించి, డబ్బును, సమయాన్ని వృథా చేసుకోవడం కన్నా ఒక క్రమ పద్ధతిలో ముఖం మీద ఐస్ రుద్దడం గొప్ప చర్మ సంరక్షణ చర్యేగాక సౌందర్యాన్ని పెంచుతుందంటున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం..

ముఖం మీద ఐస్ అప్లై చేయడం వల్ల కలిగే ప్రయోజనాల్లో తక్షణ మెరుపు, మొటిమలను తగ్గించడం వంటివి కీలకమైనవి. కొందరికి కళ్ళ చుట్టూ ఉబ్బెత్తుగా... సంచుల్లా కనిపిస్తాయి. ఇందుకు చేయవలసిందల్లా వాటిపై ఐస్‌క్యూబ్స్‌ను రుద్దడమే. ఎందుకంటే..

ఐసింగ్ రక్త నాళాలను సంకోచింపచేస్తుంది. మంటను తగ్గిస్తుంది. ఇది మీ ముఖంపై కనిపించే అలసటను తగ్గిస్తుంది, రక్త ప్రవాహాన్ని మెరుగుపరచి ముఖం చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది.

ఐస్‌తో ఆ మెరుపు..

ఫ్రాంటియర్స్ ఇన్ ఫిజియాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, మొటిమల మీద ఐస్‌ను ఉపయోగించడం వల్ల రక్త ప్రవాహం మెరుగుపడుతుంది. కొందరికి చర్మంపై ఉండే సూక్ష్మ రంధ్రాలు పైకి తెరుచుకుని ఉండి అందవికారంగా కనిపిస్తుంది. అలాంటి వారికి ఆ రంధ్రాలను కుదించడం ద్వారా, అధిక నూనె ఉత్పత్తి నివారణ జరిగి ముఖం జిడ్డోడకుండా చేస్తుంది.

కళ్ళ చుట్టూ వాపును తగ్గిస్తుంది..

ముఖంపై క్రమం తప్పకుండా ఐస్‌తో సున్నితంగా మర్దన చేయడం వల్ల విస్తరించిన రక్తనాళాలు కుంచించుకుపోతాయి. అందువల్ల, కళ్ళకింద వాపు తగ్గుతుంది. కళ్ళ కింద సంచులను తగ్గించడానికి అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆప్తాల్మాలజీ 15-20 నిమిషాలు కోల్డ్ కంప్రెస్ వేయమని సిఫార్సు చేస్తుంది.

వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తుంది..

మంచు చల్లదనం చర్మ రంధ్రాలను బిగించడానికి సహాయపడుతుంది, తద్వారా ముడతలు, సన్నని గీతలు వంటి వృద్ధాప్య సంకేతాలను పరిమితం చేస్తుంది, చర్మాన్ని దృఢంగా, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

దద్దుర్లు నయం చేస్తుంది..

స్కిన్ ట్యానింగ్‌ను చికిత్స చేయడానికి ఐస్‌తో రుద్దడం మేలైన మార్గం, ఐస్‌తో రుద్దడం వల్ల సూర్యరశ్మి వల్ల కందిన చర్మం తిరిగి వెనకటి మెరుపును సంతరించుకుంటుంది.



ఈ జాగ్రత్తలు అవసరం..

● చర్మం ఆరోగ్యంగా కనిపించేలా ఆ ఐస్‌ను సున్నితంగా స్క్రబ్ చేయండి. ● కొన్ని ఐస్ క్యూబ్‌లను పలుచటి వాష్‌క్లాత్ లేదా రుమాలులో చుట్టి ముఖంపై అప్లై చేసుకోవచ్చు. ● మీ చర్మానికి అదనపు పోషకాలను అందించడానికి మీరు టమోటా గుజ్జు, కలబంద రసం, దోసకాయ రసం వంటి వాటిని ఐస్‌ట్రేలో ఫ్రీజ్ చేసి, వాటితో కూడా ప్రయత్నించవచ్చు. ● ముఖంపై రోజుకు ఒకటి కంటే ఎక్కువ సార్లు ఐస్ రాసుకోకండి. ● ఐస్ రాసేటప్పుడు మీకు మంటగా అనిపించినా లేదా ఏదైనా అసౌకర్యంగా అనిపించినా, ఆ ప్రక్రియను ఆపివేసి, అవసరమైతే వైద్యుడిని సంప్రదించాలి.

సాక్షి సినిమా



● ప్రభాస్

సెప్టెంబరులో సెట్స్‌కి...

ప్రభాస్ అభిమానులకు శుభవార్త. ఆయన హీరోగా సందీప్ రెడ్డి వంగా ('అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్) దర్శకత్వంలో 'స్పిరిట్' సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అని ఆయన అభిమానులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'కింగ్‌డమ్' సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్స్ కోసం సందీప్ రెడ్డి వంగా ఒక పాడ్‌కాస్ట్ వీడియో చిత్రీకరించారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' సినిమా గురించి అప్డేట్ ఇవ్వమని విజయ్ దేవరకొండ కోరగా.. ''సెప్టెంబరు నుంచి 'స్పిరిట్' సెట్స్‌కి వెళుతుంది. షూటింగ్ మొదలు పెట్టి నాన్‌స్టాప్‌గా పూర్తి చేస్తాం'' అంటూ ఏమాత్రం ఆలోచించకుండా సమాధానమిచ్చారు సందీప్ రెడ్డి. ఈ సినిమాలో ప్రభాస్‌కి జోడీగా 'యానిమల్' మూవీ ఫేమ్ త్రిప్తి దిమ్రీ నటిస్తారు. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ బ్యానర్లపై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్, మురాద్ ఖేతానీ ఈ చిత్ర నిర్మాతలు. సెప్టెంబరు నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్న ఈ చిత్రం తొమ్మిది భాషల్లో విడుదల కానుంది.




● చిరంజీవి

విశ్వంభరకు బై బై

'విశ్వంభర' సినిమా షూటింగ్‌కు చిరంజీవి బై బై చెప్పారు. చిరంజీవి హీరోగా నటించిన సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ మూవీ 'విశ్వంభర'. ఈ సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహించారు. త్రిషా కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో హీరోయిన్ ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో వేసిన సెట్‌లో చిరంజీవి, బాలీవుడ్ నటి మౌనీ రాయ్ పాల్గొనగా చిత్రీకరించిన ఓ స్పెషల్ సాంగ్‌తో 'విశ్వంభర' సినిమా చిత్రీకరణ ముగిసింది. చిరంజీవి, మౌనీ రాయ్‌లతో పాటు వంద మంది డ్యాన్సర్స్ ఈ పాటలో పాల్గొన్నారు. గణేష్ ఆచార్య ఈ పాటకు కొరియోగ్రఫీ చేశారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించిన ఈ సాంగ్‌కు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఇక ఈ 'విశ్వంభర' సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందించారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది. ఈ పని పూర్తి కాగానే 'విశ్వంభర' రిలీజ్ డేట్‌పై ఓ స్పష్టత వస్తుంది. ఈ సినిమా సెప్టెంబరులో విడుదలయ్యే అవకాశం ఉందని తెలిసింది.

నేను మనిషిని కాను... ఆయుధాన్ని



● ఎన్టీఆర్, హృతిక్ రోషన్

''నేను ప్రమాణం చేస్తున్నాను... నేను నా పేరుని, గుర్తింపుని, నా ఇంటిని, కుటుంబాన్ని అన్నింటినీ వదిలేసి ఒక నీడగా మారిపోతాను... ఒక ఊరూ పేరూ లేని, రూపం లేని నీడలాగా' అంటూ హృతిక్ రోషన్ చెప్పే డైలాగులతో 'వార్ 2' చిత్రం ట్రైలర్ ఆరంభమైంది. హృతిక్ రోషన్, కియారా అద్వానీ జోడీగా నటించిన చిత్రం 'వార్ 2'. ఈ సినిమా ద్వారా హీరో ఎన్టీఆర్ బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో అడుగుపెడుతున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా పాన్ ఇండియా స్థాయిలో నిర్మించారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో భాగంగా ఆరవ చిత్రంగా రానున్న 'వార్ 2' ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని శుక్రవారం విడుదల చేసింది చిత్రయూనిట్. 'నేను మాట ఇస్తున్నాను... ఎవ్వరూ చేయలేని పనులను నేను చేసి చూపిస్తాను', 'ఎవ్వడూ పోరాడలేని యుద్ధాన్ని నేను పోరాడతాను...', 'ఆలోచించకుండా దాటేస్తాను.. ఇప్పుడు నేను మనిషిని కాను... ఒక ఆయుధాన్ని... యుద్ధంలో ఆయుధాన్ని... చస్తా లేదా చంపుతా' అంటూ ఎన్టీఆర్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''గొప్ప నటులైన ఎన్టీఆర్-హృతిక్ రోషన్ నువ్వా నేనా అని పోటీ పడి నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వార్ 2'' అని మేకర్స్ పేర్కొన్నారు.

ఆగస్టులో సుందరకాండ

నారా రోహిత్ హీరోగా నటించిన 'సుందరకాండ' చిత్రం ఆగస్టు 27న రిలీజ్ కానుంది. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్ హీరోయిన్లు. సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. జూలై 25న నారా రోహిత్ బర్త్‌డే సందర్భంగా 'సుందరకాండ'ని ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ''ఈ చిత్రంలో హీరో జీవితంలోని వివిధ దశల్లోని రెండు ప్రేమ కథలను చూపిస్తున్నాం. శ్రీదేవితో మొదటి ప్రేమ, వృతి వాఘానితో కలిసి రెండో ప్రేమకథని ప్రేక్షకులు చూస్తారు'' అని యూనిట్ పేర్కొంది.



● నారా రోహిత్

తెలుగు ఫిలిం చాంబర్ ఎన్నికలు నిర్వహించాలి

''తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి... లేకుంటే పోరాటం చేస్తాం'' అంటూ పలువురు నిర్మాతలు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తెలుగు ఫిల్మ్ చాంబర్ ప్రొడ్యూసర్స్ సెక్టార్ మాజీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నిర్మాతలు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ రామారావు మాట్లాడుతూ– ''తెలుగు ఫిలిం చాంబర్‌కు 50 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. ఇలాంటి గొప్ప అసోసియేషన్‌ని క్రమశిక్షణ ప్రకారం కొనసాగేలా చేయాలి'' అన్నారు. సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''ప్రస్తుత అసోసియేషన్‌లోని కొందరు తమ స్వార్థంతో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నెల 30న జరిగే ఈసీ మీటింగ్‌ని తిరుపతిలో నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, న్యాయ పోరాటం చేస్తాం'' అని తెలిపారు. ''తెలుగు ఫిలిం చాంబర్ కమిటీలో మేమే కొనసాగుతాం అంటూ నిరంకుశంగా మాట్లాడటం తప్పు. ఈ ఎన్నికల విషయంలో సీఎం రేవంత్ రెడ్డిగారిని కలవబోతున్నాం'' అన్నారు ప్రతాని రామకృష్ణ గౌడ్. అశోక్ కుమార్ మాట్లాడుతూ– ''ఈ నెల 30వ తేదీతో ఇప్పుడున్న కమిటీ గడువు ముగుస్తుంది. వెంటనే షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరపాలి. ఈ విషయంపై మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డిగార్లకు వినతి పత్రం ఇచ్చాను'' అన్నారు. ''ఈ ఎన్నికలు వాయిదా వేసి, ఇప్పుడున్న కమిటీనే కొనసాగించాలని చూడటం నిబంధనలకు విరుద్ధం'' అని విజయేందర్ రెడ్డి పేర్కొన్నారు. నిర్మాతలు బసిరెడ్డి, మోహన్ గౌడ్‌లతో పాటు పలువురు నిర్మాతలు పాల్గొన్నారు.

● విలేకరుల సమావేశంలో నిర్మాతలు



● రామకృష్ణ గౌడ్, అశోక్ కుమార్

ఫుల్ థ్రిల్



● అభినయ కృష్ణ

సముద్ర ఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మిస్టీరియస్ థ్రిల్లర్ సినిమాకి 'కామాఖ్య' అనే టైటిల్ ఖరారైంది. అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, సినిమాను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ''కామాఖ్య' సినిమా కోసం ఓ ప్రత్యేకమైన కథను రెడీ చేశారు అభినయ కృష్ణ. ఈ సినిమాలో మంచి థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: గ్యాని, కెమెరా: రమేశ్ కుశేందర్ రెడ్డి.

ఆస్తిశేషులు అనరు కదా...!



● నరేశ్, రబియా

నరేశ్ అగస్త్య, రబియా ఖాతూన్ హీరో హీరోయిన్లుగా, రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'. విపిన్ దర్శకత్వంలో ఉమాదేవి కోట నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ''వరుణ్ నోట్లో నుంచి మాట కూడ రాదు... నేనెందుకు వరుణ్ గురించి ఇంత ఆలోచిస్తున్నా...', 'ఎనీ ప్రాబ్లమ్...', 'అవును... నేను, ప్రాబ్లమ్స్ కవల పిల్లలమేమో!, 'చివరికి ఎన్ని కోట్లు సంపాదించినా మనం పోయాక కీర్తిశేషులు అంటారు కానీ... ఆస్తిశేషులు అనరు కదా నాన్న!'' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ– ''మంచి కథతో రూపొందించిన ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి'' అన్నారు. ''మంచి ఎంటర్‌టైనర్ మూవీ ఇది'' అన్నారు రబియా. ''చక్కని భావోద్వేగాలు ఉన్న కుటుంబకథా చిత్రం ఇది. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తే భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేస్తాను'' అని తెలిపారు ఉమాదేవి. ''ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం'' అన్నారు విపిన్. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు సక్సెస్ చేయాలని నటుడు రాజా కోరారు.

ఒకే రోజు 15 సినిమాలకి శ్రీకారం



● రామ సత్యనారాయణ

నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఒకే రోజు 15 సినిమాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ఈ విషయాన్ని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ''దివంగత నిర్మాత డి. రామానాయుడు తర్వాత అత్యధిక చిత్రాలు నిర్మించిన వ్యక్తిగా, శతాధిక చిత్ర నిర్మాతల్లో రెండవ నిర్మాతగా ఆ ఘనత నా సొంతమైంది. మా భీమవరం టాకీస్‌పై ప్రపంచ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఒకేసారి 15 చిత్రాలను ప్రారంభించనున్నాను. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఈ అరుదైన ఘట్టానికి శ్రీకారం చుడుతున్నాను. ప్రపంచ రికార్డుగా నమోదు కానున్న ఈ చారిత్రక ఘట్టానికి హైదరాబాద్‌లోని సారథి స్టూడియో వేదిక కానుంది. సినిమాతో పాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ ప్రపంచ రికార్డుకు ప్రత్యక్ష సాక్షులు కానున్నారు'' అని తుమ్మలపల్లి రామసత్యనారాయణ తెలిపారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
721	225
81,463	24,837

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,142	△	85
డోజోన్స్	44,893	△	200
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,117	▽	21
డాక్స్	24,246	▽	50
షాంఘై	3,594	▽	12
నికాయ్	41,456	△	15

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	84.68	87.61
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	113.75	118.01
€	యూరో	భారతీయ	99.27	103.14
¥	జపాన్ యెన్ (100)	భారతీయ	58.08	59.57
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	54.32	58.12
S$	సింగపూర్ డాలర్	భారతీయ	65.18	68.84
SAR	సౌదీ రియాల్	భారతీయ	22.20	23.68
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	22.66	23.91
¥	చైనా యువాన్	భారతీయ	11.19	13.02

తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి మహీంద్రా 3ఎక్స్‌వో రెవ్ఎక్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహనాల తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌వో పోర్ట్‌ఫోలియోలో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన రెవ్ఎక్స్ సిరీస్‌ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లో ఆవిష్కరించింది. బుకింగ్స్‌తో పాటు డెలివరీలు కూడా ప్రారంభమైనట్లు సంస్థ సేల్స్ విభాగం జోనల్ హెడ్ (సౌత్) అరుణాంగ్షు రాయ్ శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇందులో ఎం, ఎం(ఓ), ఎ అని మూడు వేరియంట్లు ఉన్నాయి. వేరియంట్‌ను బట్టి ధర రూ. 8.94 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. అలాగే ప్రీమియం లెదరెట్ సీట్లు, సన్‌రూఫ్, బిల్ట్‌ఇన్ అలెక్సా, డ్యూయల్ టోన్ ఇంటీరియర్స్, తదితర ఫీచర్లు ఉంటాయని రాయ్ చెప్పారు. గతేడాది ఆవిష్కరించిన 3ఎక్స్‌వో కేవలం 11 నెలల్లోనే 1 లక్ష యూనిట్ల విక్రయాల మార్కును అధిగమించినట్లు ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 10,000 పైచిలుకు యూనిట్లు అమ్ముడైనట్లు పేర్కొన్నారు.

కొలువులకు లైవ్ ఈవెంట్ల దన్ను

2030–32 నాటికి 1.2 కోట్ల తాత్కాలిక ఉద్యోగాల కల్పన • ఎస్ఎల్‌బీ సర్వీసెస్ అంచనా

ముంబై: లైవ్ ఈవెంట్లు, కాన్సర్ట్‌ల వ్యవస్థ దేశీయంగా గణనీయంగా ఉద్యోగాల కల్పనకు తోడ్పడనుంది. దేశవ్యాప్తంగా ఏటా 100 పైగా భారీ కాన్సర్టులు (కచేరీలు) జరగనున్న నేపథ్యంలో 2030–32 నాటికి 1.2 కోట్ల పైచిలుకు తాత్కాలిక కొలువులు రానున్నాయి. గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ ఈ విషయాలు వెల్లడించింది. లైవ్ ఈవెంట్లు, కాన్సర్టులు ఉపాధితోపాటు ఆర్థిక వ్యవస్థకు కూడా చోదకాలుగా ఉంటున్నాయని సంస్థ సీఈవో సచిన్ అలగ్ తెలిపారు. కొత్త పరిణామాలతో ప్రొడక్షన్, లాజిస్టిక్స్, సెక్యూరిటీ, హాస్పిటాలిటీ, డిజిటల్ మీడియా వ్యాప్తంగా నిపుణులకు డిమాండ్ పెరుగుతోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి కార్యక్రమాలు ఎక్కువగా హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, బెంగళూరులాంటి మెట్రోల్లోనే జరుగుతున్నప్పటికీ, క్రమంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు కూడా తెరపైకి వస్తున్నాయని అలగ్ చెప్పారు. 'షిల్లాంగ్, గౌహతి, పుణే, జైపూర్, కొచ్చి, లక్నో, ఇండోర్, చండీగఢ్ లాంటి నగరాలు లైవ్ ఈవెంట్లకు హాట్ స్పాట్‌లుగా మారుతున్నాయి' అని పేర్కొన్నారు.



వివిధ విభాగాల్లో వేల కొద్దీ అవకాశాలు..

ఒక్కో కాన్సర్టుతో వివిధ విభాగాల్లో 15,000 నుంచి 20,000 స్వల్పకాలిక ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ తెలిపింది. వేదిక నిర్వహణ, జన సమూహాల నియంత్రణ, ఫుడ్..బెవరేజ్ సర్వీసులు, డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, ఆర్టిస్టులకు సర్వీసుల్లాంటి విభాగాలు వీటిలో ఉన్నాయి. కాన్సర్ట్ ఎకానమీ అనేది అటు ట్రావెల్, టూరిజం, హాస్పిటాలిటీ, ఫుడ్ అండ్ బెవరేజెస్ రంగాలకు కూడా ప్రయోజనం చేకూర్చనుంది. ఉదాహరణకు 2024లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కోల్డ్‌ప్లే కచేరీతో స్థానిక ఎకానమీకి రూ. 72 కోట్ల జీఎస్‌టీ సహా రూ. 641 కోట్ల ఆదాయాన్ని సమకూర్చింది. ఫ్లయిట్లకు డిమాండ్ 300–350 శాతం ఎగిసింది. రైళ్ల బుకింగ్స్ 8 శాతం పెరిగాయి. హోటల్ టారిఫ్‌లు రికార్డు స్థాయికి (కొన్ని గదుల టారిఫ్‌లు రోజుకు రూ. 90,000) ఎగిశాయి.

ఫుల్‌టైమ్ కొలువుల్లోకి రూపాంతరం..

ఈ కాన్సర్టుల బూమ్ అనేదిక ఏదో స్వల్పకాలిక వ్యవహారం కాదని, 10–15 శాతం తాత్కాలిక కొలువులు పూర్తి స్థాయి ఉద్యోగాలుగా కూడా మారుతున్నాయని అలగ్ చెప్పారు. ముఖ్యంగా ఆడియో ఇంజనీరింగ్, డిజిటల్ వ్యూహం, ఈవెంట్ టెక్నాలజీ, ప్రొడక్షన్ నిర్వహణ వంటి విభాగాల్లో ఈ ధోరణి కనిపిస్తోందని పేర్కొన్నారు. తాత్కాలిక ప్రాజెక్టులు పునరావృతం అవుతుండటం, కొత్త నైపుణ్యాల్లో శిక్షణ లాంటి అంశాలు దీర్ఘకాలికంగా అవకాశాలను అందిపుచ్చుకోవడంలో గిగ్ లేదా ఫ్రీలాన్స్ వర్కర్లకు ఉపయోగకరంగా ఉంటోందని అలగ్ చెప్పారు. ఏటా 100 పైగా కాన్సర్టులు ఉంటాయనే అంచనాల కారణంగా రాబోయే కొన్నేళ్లలో వీటిపంగా రూ. 15,000 కోట్లకు పైగా ఆదాయం రావచ్చని అంచనాలు ఉన్నట్లు వివరించారు. టికెటింగ్, హాస్పిటాలిటీ, రవాణా ద్వారా ప్రత్యక్ష ఆదాయాలు, పర్యాటకం, స్థానికంగా ఉపాధి కల్పన, వంటి అంశాలు ఇందుకు తోడ్పడతాయని అలగ్ చెప్పారు.

ఫీనిక్స్ మిల్స్ చేతికి సీపీపీ వాటా

డీల్ విలువ రూ. 5,449 కోట్లు

న్యూఢిల్లీ: భాగస్వామ్య కంపెనీ(జేవీ) ఐలాండ్ స్టార్ మాల్ డెవలపర్స్‌లో సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు గల 49 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు రియల్టీ రంగ సంస్థ ఫీనిక్స్ మిల్స్ తాజాగా పేర్కొంది. వృద్ధి ప్రణాళికల్లో భాగంగా ఇందుకు రూ. 5,449 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది.



ప్రస్తుతం ఐలాండ్ స్టార్ మాల్‌లో ఫీనిక్స్ మిల్స్‌కు 51 శాతం, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్(సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్)కు 49 శాతం చొప్పున వాటా ఉంది. తాజా డీల్ తదుపరి ఐలాండ్ స్టార్‌లో ఫీనిక్స్ వాటా 100 శాతానికి చేరనుంది. ఇందుకు రెండు సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఫీనిక్స్ మిల్స్ తెలియజేసింది. ఒప్పందానికి కంపెనీ బోర్డు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించింది. మూడేళ్ల కాలంలో రూ. 5,449 కోట్ల నగదును సీపీపీకి నాలుగు దశల్లో చెల్లించనున్నట్లు వివరించింది. జేవీ మొత్తం 4.5 మిలియన్ చదరపు అడుగుల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది.

సెన్సెక్స్ 721 పాయింట్లు డౌన్

- నిఫ్టీ 225 పాయింట్లు క్షీణత
- ఫైనాన్షియల్, ఐటీ షేర్లలో అమ్మకాలు
- 2 రోజుల్లో రూ. 8.67 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: ఐటీ, ఫైనాన్షియల్, ఆయిల్ .. గ్యాస్ సంస్థల షేర్లలో భారీగా అమ్మకాలు వెల్లువెత్తడంతో దేశీ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 721 పాయింట్లు తగ్గి 81,463 వద్ద, నిఫ్టీ 225 పాయింట్లు క్షీణించి నెల రోజుల కనిష్ఠం 24,837 వద్ద క్లోజయ్యింది. ఆసియా, యూరప్ మార్కెట్లలో ట్రెండ్ బలహీనంగా ఉండటం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం పడిందని విశ్లేషకులు తెలిపారు. కార్పొరేట్ ఫలితాలు ఒక మోస్తరుగా ఉండటం, అంతర్జాతీయంగా పరిస్థితులు అంత మెరుగ్గా లేకపోవటంలాంటి అంశాల వల్ల దేశీయంగా ఈక్విటీల్లో అమ్మకాలు వెల్లువెత్తినట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. లార్జ్ క్యాప్ స్టాక్స్ వేల్యుయేషన్లు అధిక స్థాయిలో ఉండటంతో పాటు ఎఫ్ఐఐలు నికరంగా పెద్ద ఎత్తున షార్ట్ పొజిషన్లు తీసుకోవడం సైతం తోడు కావడంతో ఒత్తిడి మరింతగా పెరిగిందని వివరించారు. కంపెనీల ఆర్థిక ఫలితాలు నిరుత్సాహపర్చేవిగా ఉండటంతో ప్రామాణిక సూచీలు ప్రారంభం నుంచి నష్టాల్లోనే కొనసాగాయని, సెషన్ ముందుకెళ్లే కొద్దీ పరిస్థితి మరింత తీవ్రమైందని రెలిగేర్ బ్రోకింగ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా వివరించారు. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగిస్తుండటం వల్ల కూడా మార్కెట్‌పై ఒత్తిడి మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. రెండు రోజులు వరుసగా ఈక్విటీ మార్కెట్లు నష్టపోవడంతో రూ. 8.67 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది.

- సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్ 4.73 శాతం క్షీణించింది. పవర్ గ్రిడ్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్ నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే, సన్ ఫార్మా, భారతి ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం లాభపడ్డాయి.

హైదరాబాద్‌లో 2వ జీసీసీ లీడర్‌షిప్ సదస్సు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ తాజాగా 2వ జీసీసీ లీడర్‌షిప్ సదస్సుకు ఆతిథ్యమివ్వనుంది. జూలై 30న లీడర్‌షిప్ ఫెడరేషన్ నిర్వహించే ఈ కాంక్లేవ్‌లో దేశ విదేశ దిగ్గజాలు, ప్రభుత్వ సంస్థలు, ఇన్నోవేషన్ హబ్‌లకు చెందిన 300 మంది సీనియర్ లీడర్లు పాల్గొనున్నారు. చౌకగా సర్వీసులను అందించే వ్యాపార విభాగాల స్థాయి నుంచి అంతర్జాతీయంగా కొత్త ఆవిష్కరణలకు చోదకాలుగా జీసీసీలు ఎదుగుతున్న తీరుపై ఇందులో చర్చిస్తారని లీడర్‌షిప్ ఫెడరేషన్ అడ్వైజరీ బోర్డు సభ్యుడు రాబిన్ జె తెలిపారు. ఈసారి సదస్సులో జెన్ఏఐ–ఆటోమేషన్, వర్క్‌ఫోర్స్ పరివర్తన తదితర అంశాలు ప్రధాన అజెండాగా ఉంటాయని పేర్కొన్నారు.

బీవోబీ లాభం రూ.4,541 కోట్లు

ముంబై: బ్యాంక్ ఆఫ్ బరోడా జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.4,541 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.4,458 కోట్లతో పోల్చితే 2 శాతం పెరిగింది. నిర్వహణ లాభం మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 15 శాతం వృద్ధి చెంది రూ.8,236 కోట్లకు చేరింది. ముఖ్యంగా వడ్డీయేతర ఆదాయం 88 శాతం పెరిగి రూ.4,675 కోట్లకు చేరుకోవడం ఇందుకు అనుకూలించింది. నికర వడ్డీ ఆదాయం 1.4 శాతం క్షీణించి రూ.11,435 కోట్లకు పరిమితమైంది. మొత్తం వడ్డీ ఆదాయం మాత్రం 5 శాతం పెరిగి రూ.31,091 కోట్లుగా ఉంది. రుణ ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. వసూలు కాని స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 10.7 శాతం తగ్గి రూ.25,572 కోట్లుగా ఉన్నాయి. మొత్తం రుణాల్లో



స్థూల ఎన్‌పీఏల నిష్పత్తి 2.88 శాతం నుంచి 2.28 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పీఏలు 0.09 శాతం తగ్గి 0.60 శాతంగా ఉన్నాయి. దేశీ రుణ ఆస్తులు 12.4 శాతం వృద్ధితో రూ.9,91,363 కోట్లకు చేరాయి. అంతర్జాతీయంగా రుణాలు 12.6 శాతం పెరిగి రూ.12,07,056 కోట్లుగా ఉన్నాయి.

బీవోబీ షేరు 1% నష్టంతో రూ.243 వద్ద క్లోజైంది.



వెన్నెల, తన్వీ శర్మలకు పతకాలు ఖాయం

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-19 మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన వెన్నెల కలగొట్ల, పంజాబ్ అమ్మాయి తన్వీ శర్మ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను అందుకోనున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో వెన్నెల 21-18, 17-21, 21-17తో జన్యాపోర్న్ మీపాంథోంగ్ (థాయ్‌లాండ్)పై... తన్వీ శర్మ 21-19, 21-14తో థలిత విర్యావన్ (ఇండోనేసియా)పై నెగ్గారు. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో యిన్ యి కింగ్ (చైనా)తో తన్వీ శర్మ... లియు సి యా (చైనా)తో వెన్నెల తలపడతారు. ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో భారత్‌కు పతకాలు ఖాయం కావడం 13 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిసారి 2012లో పీవీ సింధు సింగిల్స్ విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించింది.





సెమీఫైనల్లో సాత్విక్ జోడీ

చాంగ్జౌ: చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 21–18, 21–14తో ఓంగ్ యెవ్ సిన్–టియో ఈ యి (మలేసియా) జోడీపై నెగ్గింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో భారత ప్లేయర్ ఉన్నతి 16–21, 12–21తో అకానె యామగుచి (జపాన్) చేతిలో ఓటమి పాలైంది.



కైరో: ప్రపంచ స్క్వాష్ జూనియర్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్‌కు కాంస్య పతకం లభించింది. సెమీఫైనల్లో అనాహత్ సింగ్ 6–11, 12–14, 10–12తో నాదీన్ ఎల్‌హమీ (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయింది. దీపిక పల్లికల్ (2010లో కాంస్యం), జోష్నా చినప్ప (2005లో రజతం) తర్వాత ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో పతకం నెగ్గిన మూడో భారతీయ క్రీడాకారిణిగా అనాహత్ గుర్తింపు పొందింది.

యశ్ దయాళ్‌పై పోక్సో కేసు

జైపూర్: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు పేస్ బౌలర్ యశ్ దయాళ్ మరో కేసులో చిక్కుకున్నాడు. ఈసారి అతనిపై పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు రావడంతో 27 ఏళ్ల యశ్ దయాళ్‌పై జైపూర్ పోలీసులు పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదివరకే యశ్‌పై ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ కేసు నమోదైంది. ఘజియాబాద్‌కు చెందిన యువతి... దయాళ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడంతో కేసు నమోదు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి... ఐదేళ్లుగా తనతో సహజీవనం చేశాడని, శారీరకంగా, మానసికంగా హింసించాడని ఫిర్యాదులో పేర్కొంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

టెస్టు చేజారిపోతోంది!

ఇప్పటికే 186 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లండ్

మాంచెస్టర్‌లో మూడు రోజూ భారత్‌కు నిరాశ తప్పలేదు. ఇంగ్లండ్ దూకుడు కొనసాగగా, పస లేని బౌలింగ్‌తో భారత్ డీలా పడింది. రూట్ రికార్డుల సెంచరీకి తోడు పోప్, స్టోక్స్ కూడా రాణించడంతో ఆతిథ్య జట్టు పూర్తిగా పైచేయి సాధించింది. మన బౌలర్లు 89 ఓవర్లు శ్రమించి ఐదు వికెట్లు తీయగలిగినా... ఇంగ్లండ్ ఆధిక్యం దాదాపు రెండు వందలకు చేరింది. ఈ స్థితిలో నాలుగో రోజు ప్రత్యర్థిని వీలైనంత వేగంగా నిలువరించడంతో పాటు మిగిలిన లోటును పూరించేందుకు మన బ్యాటర్లు పోరాడాల్సి ఉంటుంది.

- తొలి ఇన్నింగ్స్‌లో 544/7
- రూట్ భారీ సెంచరీ
- పోప్, స్టోక్స్ అర్ధ సెంచరీలు



మాంచెస్టర్: భారత్‌తో జరుగుతున్న నాలుగో టెస్టుపై ఇంగ్లండ్ పట్టు బిగించింది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 544 పరుగులు చేసింది. ఆ జట్టు ప్రస్తుతం 186 పరుగుల ఆధిక్యంలో ఉంది. జో రూట్ (248 బంతుల్లో 150; 14 ఫోర్లు) భారీ సెంచరీతో కదం తొక్కగా... ఒలీ పోప్ (128 బంతుల్లో 71; 7 ఫోర్లు), బెన్ స్టోక్స్ (134 బంతుల్లో 77 బ్యాటింగ్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. పోప్‌తో మూడో వికెట్‌కు 144 పరుగులు జోడించిన రూట్... ఐదో వికెట్‌కు స్టోక్స్‌తో 142 పరుగులు జత చేశాడు. స్టోక్స్‌తో పాటు డాసన్ (21 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నాడు.

వికెట్ కోల్పోకుండా...

ఓవర్‌నైట్ స్కోరు 225/2తో ఆట కొనసాగించిన పోప్, రూట్ ఇంగ్లండ్‌ను మరింత మెరుగైన స్థితికి చేర్చారు. రెండో రోజు తరహాలోనే భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. రూట్ 22 పరుగుల వద్ద ఉన్నప్పుడు సులువైన రనౌట్ చేసే అవకాశం వచ్చినా భారత్ చేజార్చుకుంది. సిరాజ్ బౌలింగ్‌లో రూట్ బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ఆడగా... మరోవైపు నుంచి పోప్ దూసుకొచ్చాడు. దాంతోఆలస్యంగా రూట్ పరుగు కోసం వెళ్లాల్సి వచ్చింది. జడేజా విసిరిన బంతి నాన్‌స్ట్రయికింగ్ స్టంప్స్‌కు నేరుగా తగల్లేదు. అయితే దగ్గరలో ఒక్క బ్యాకప్ ఫీల్డర్ ఉన్నా రూట్ రనౌటయ్యేవాడు! దీనిపై జడేజా తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. 93 బంతుల్లో పోప్ హాఫ్ సెంచరీని అందుకోగా, 99 బంతుల్లో రూట్ అర్ధసెంచరీ పూర్తయింది. తొలి సెషన్‌లో భారత్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోగా, ఇంగ్లండ్ 28 ఓవర్లలో 107 పరుగులు చేసింది.

సుందర్ ఆలస్యంగా వచ్చినా...

రెండో రోజు ఆటలో భారత్ 46 ఓవర్లు వేయగా, స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కు ఒక్క ఓవర్ కూడా ఇవ్వకపోవడం చర్చకు దారి తీసింది. మూడో రోజు కూడా చాలా ఆలస్యంగా లంచ్‌కు కాస్త ముందు అతనికి కెప్టెన్ బంతిని అప్పగించాడు. ఇన్నింగ్స్ 69వ ఓవర్‌తో సుందర్ మొదలుపెట్టాడు. అప్పటికే జడేజా 12 ఓవర్లు వేశాడు. అయితే రెండో సెషన్ మొదలు కాగానే సుందర్ తన విలువేమిటో చూపించాడు. 8 పరుగుల వ్యవధిలో అతను 2 వికెట్లు తీసి భారత్‌కు ఊరట అందించాడు. సుందర్ వేసిన చక్కటి బంతిని ఆడలేక పోప్ స్లిప్‌లో రాహుల్‌కు క్యాచ్ ఇవ్వగా... షాట్ కోసం ముందుకొచ్చిన బ్రూక్ (3) స్టంపౌటయ్యాడు. స్పిన్‌కు వికెట్లు దక్కడంతో భారత్ కొత్త బంతిని తీసుకోవడంలో 10 ఓవర్లు ఆలస్యం చేసింది. అయితే రూట్, స్టోక్స్ కలిసి మళ్లీ ఇంగ్లండ్‌ను ముందంజలో నిలిపారు. కంబోజ్ వేసిన బంతిని ఫైన్‌లెగ్ దిశగా ఆడి బౌండరీ రాబట్టడంతో 178 బంతుల్లో రూట్ శతకం పూర్తయింది.



రెండో సెషన్‌లో ఇంగ్లండ్ 28 ఓవర్లలో 2 వికెట్లు చేజార్చుకొని 101 పరుగులు సాధించింది.

మరో 3 వికెట్లు...

టీ తర్వాత కూడా రూట్, స్టోక్స్ భాగస్వామ్యం కొనసాగింది. భారత బౌలర్లు వీరిని ఇబ్బంది పెట్టడంలో విఫలమయ్యారు. ఈ క్రమంలో 97 బంతుల్లో స్టోక్స్ ఈ సిరీస్‌లో తొలి హాఫ్ సెంచరీని నమోదు చేశాడు. అయితే కొద్ది సేపటికే తీవ్ర అలసటతో అతను రిటైర్డ్‌హర్ట్‌గా మైదానం వీడాడు. మరోవైపు 150 మార్క్‌ను అందుకున్న వెంటనే రూట్... జడేజా బౌలింగ్‌లో ముందుకొచ్చి డిఫెన్స్ ఆడబోయి స్టంపౌటయ్యాడు. సిరీస్‌లో మంచి ఫామ్‌లో ఉన్న జేమీ స్మిత్ (9), క్రిస్ వోక్స్ (4) కూడా తక్కువ వ్యవధిలో పెవిలియన్ చేరారు. ఈ దశలో మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన స్టోక్స్... డాసన్‌తో కలిసి జాగ్రత్తగా ఆడుతూ రోజును ముగించాడు. చివరి సెషన్‌లో ఇంగ్లండ్ 33 ఓవర్లలో 111 పరుగులు సాధించింది. మూడో రోజు 89 ఓవర్లు ఆడిన జట్టు 3.58 రన్‌రేట్‌తో 319 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) రాహుల్ (బి) జడేజా 84; డకెట్ (సి) (సబ్) జురేల్ (బి) కంబోజ్ 94; పోప్ (సి) రాహుల్ (బి) సుందర్ 71; రూట్ (స్టంప్డ్) (సబ్) జురేల్ (బి) జడేజా 150; బ్రూక్ (స్టంప్డ్) (సబ్) జురేల్ (బి) సుందర్ 3; స్టోక్స్ (బ్యాటింగ్) 77; స్మిత్ (సి) (సబ్) జురేల్ (బి) బుమ్రా 9; డాసన్ (బ్యాటింగ్) 21; వోక్స్ (బి) సిరాజ్ 4; ఎక్స్‌ట్రాలు 31; **మొత్తం (135 ఓవర్లలో 7 వికెట్లకు) 544. వికెట్ల పతనం:** 1-166, 2-197, 3-341, 4-349, 5-499, 6-515, 7-528. **బౌలింగ్:** బుమ్రా 28-5-95-1, అన్షుల్ కంబోజ్ 18-1-89-1, సిరాజ్ 26-4-113-1, శార్దుల్ 11-0-55-0, జడేజా 33-0-117-2, సుందర్ 19-4-57-2.



దిగ్గజాలను దాటి రెండో స్థానానికి...


టెస్టుల్లో ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ అద్భుత ఫామ్ కొనసాగుతోంది. శుక్రవారం సెంచరీతో చెలరేగిన రూట్... అత్యధిక పరుగుల జాబితాలో సచిన్ టెండూల్కర్ (15,921) తర్వాత రెండో స్థానానికి (13,409) చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు 13,259 పరుగులతో ఉన్న అతను తన 30వ పరుగుతో రాహుల్ ద్రవిడ్ (13,288)ను, 31వ పరుగుతో జాక్వస్ కలిస్ (13,289)ను దాటాడు. ఆ తర్వాత 120వ పరుగుతో రికీ పాంటింగ్ (13,378)ను అధిగమించాడు. ఆ సమయంలో కామెంటరీ బాక్స్‌లోనే ఉన్న పాంటింగ్... రూట్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. గత నాలుగైదేళ్లుగా అతని ఫామ్‌ను చూస్తే సచిన్‌ను దాటవచ్చని జోస్యం చెప్పాడు. సెంచరీల జాబితాలో కూడా సంగక్కర (38)తో సమంగా నాలుగో స్థానానికి చేరాడు. సచిన్ (51), కలిస్ (45), పాంటింగ్ (41) మాత్రమే ముందున్నారు. భారత్‌పై అత్యధిక సెంచరీలు (12) సాధించిన ఆటగాడిగా కూడా నిలిచిన రూట్... స్టీవ్ స్మిత్ (11)ను వెనక్కి నెట్టాడు.





Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఔషధవనంలో అపురూప ఆలయం




ఎత్తయిన కొండ శిఖరంపై తిరుమలనాథస్వామి ఆలయం



కొలువుదీరిన భూదేవి, శ్రీదేవి సమేత తిరుమలనాథస్వామి

భక్తుల కొంగుబంగారం.. తిరుమలనాథస్వామి

- తిరుమలయ్యగుట్టపై భూదేవి, శ్రీదేవి సమేతుడై కొలువైన స్వామి
- వనపర్తి చిట్టడవిలో.. ఆహ్లాదకర వాతావరణంలో ఆలయం
- సంస్థానాధీశుల కాలంలో 300 ఏళ్ల క్రితం విగ్రహాల ప్రతిష్ట
- ఎత్తయిన కొండపై సహజసిద్ధమైన కోనేరు
- శ్రావణమాసంలో పెద్దఎత్తున ప్రత్యేక పూజలు



తిరుమలయ్యగుట్ట

వనపర్తి: వనపర్తి జిల్లా కేంద్రానికి అత్యంత సమీపం లోని చిట్టడవిలో.. ఎత్తయిన కొండ శిఖరంపై భూదేవి, శ్రీదేవి సమేతుడై కొలువుదీరిన తిరుమలనాథ స్వామి భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. వనపర్తి సంస్థానాధీశుల కాలంలో సుమారు 300 ఏళ్ల క్రితం ఈ కొండపై స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ప్రాంత ప్రజలు ఏటా శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించేలా.. పశువుల కాపరులు, అడవి తల్లిని నమ్ముకున్న ముదిరాజ్‌లు దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకునే సంప్రదాయాన్ని ప్రారంభించారు. వనపర్తి పట్టణం నుంచి పెబ్బేరు వెళ్లే ప్రధాన రహదారిలో.. 5 కిలోమీటర్ల దూరంలో స్వామివారి ఆలయ ముఖద్వారం ఉంటుంది. అక్కడే ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు.

ఆలయ చరిత్ర

శతాబ్దాల క్రితం వనపర్తి సంస్థానాధీశులు వేటకు వెళ్లినప్పుడు ఎత్తయిన కొండ ప్రాంతం, ఆహ్లాదకరమైన వాతావరణం, వేల అడుగుల ఎత్తులో విశాలమైన రాతిచాప, అక్కడే సహజసిద్ధంగా ఏర్పడిన కోనేరు (నీటి కొలను) ఉండటం చూశారు. శిఖరాగ్రాన స్వామివారిని ప్రతిష్ఠించాలని నిర్ణయించుకుని.. ఏకశిలపై స్వామి, అమ్మవార్ల విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ట చేసినట్లు చరిత్ర కథనం. ఏటా శ్రావణ మాసంలోని శనివారాల్లో అక్కడికి వేలాది మంది భక్తులు వచ్చి పూజలు చేస్తారు. వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామానికి చెందిన కొందరిని ఆలయ ధర్మకర్తలుగా, పెద్దగూడెంలోని ఓ ముదిరాజు కుటుంబాన్ని పూజలు చేసేందుకు నియమించారు. నాటి నుంచి నేటివరకు ఆయా కుటుంబాల వారే స్వామివారిని సేవించుకుంటూ.. ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

తాటిచెట్టు మెట్ల నుంచి..

మొదట్లో గుట్టపై నుంచి స్వామివారు కొలువుదీరిన శిఖరాగ్రానికి చేరుకునేందుకు సంస్థానాధీశులు తాటిచెట్ల కాండంతో మెట్లను ఏర్పాటు చేసినట్లు భక్తులు చెబుతారు. 1993 ప్రాంతంలో దాతల సహాయంతో ఇనుప మెట్లను, ఇటీవల కాంక్రీట్ మెట్లను ఏర్పాటు చేశారు. శ్రీరంగాపురం రంగనాయకస్వామి, పెద్దగూడెంలోని కోదండరామ స్వామి ఆలయాలతోపాటు తిరుమలనాథస్వామి ఆలయాల్లో సంస్థానాధీశులు విగ్రహ ప్రతిష్ఠ చేయించి పూజ లు చేసేవారని స్థానికులు పేర్కొంటారు. ప్రస్తుత రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హయాంలో తారురోడ్డును నిర్మించారు. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది.

ఔషధ మొక్కలకు పుట్టినిల్లు..

తిరుమలనాథస్వామి కొలువుదీరిన కొండపై ఎన్నో ఔషధ మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. ఏటా శ్రావణ మాసంలో పచ్చని చెట్లు, ఎన్నో రకాల ఔషధ మొక్కలతో పాటు.. చేతికి అందేంత ఎత్తులో వెళ్తున్న మేఘాలు.. చల్లని జల్లులతో ఆహ్లాదకరమైన వాతావరణం మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఇక్కడికి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని, జాతరను తిలకించి.. ప్రకృతిని ఆస్వాదిస్తారు.

సుదూర ప్రాంతాల నుంచి..

వనపర్తికి 5 కిలోమీటర్ల దూరంలో వెలిసిన తిరుమలనాథస్వామిని దర్శించుకొని.. మొక్కులు తీర్చుకునేందుకు జిల్లాతోపాటు గద్వాల, మహబూబ్‌నగర్, కర్ణాటకలోని రాయచూరు, బళ్లారి, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. కర్ణాటక ప్రాంతవాసులు.. ఇక్కడికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటారు. శ్రావణ మాసంలో ప్రతి శనివారం ఇక్కడ అన్నదానం చేస్తారు.

తొలి శనివారం..

శ్రావణ మాసంలో వచ్చే తొలి శనివారం తిరుమలనాథస్వామి గుట్టపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు కల్యాణ మహోత్సవం జరిపిస్తారు. సామాన్యుల నుంచి కోటీశ్వరులు సైతం ఒకేచోట నేలపై కూర్చొని స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేయిస్తారు. భక్తులతోనే కల్యాణ మహోత్సవం నిర్వహించడం ఇక్కడి విశేషం.

బీసీని ముఖ్యమంత్రిని చేయండి

- కాంగ్రెస్‌కు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిగా చేయాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. ఒక అగ్ర కులస్తునిగా తానీ డిమాండ్ చేస్తున్నానని చెప్పారు. తెలంగాణలో 10 శాతం లేని అగ్రకులాలకు ఏడు మంత్రి పదవులు, 56 శాతం ఉన్న బీసీలకు మూడు మంత్రి పదవులు ఎందుకిచ్చారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రిజర్వేషన్ల విషయంలో మభ్యపెడుతున్న కాంగ్రెస్‌ను చూసి బీసీ బిడ్డలు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. శాస్త్రీయంగా కులగణన సర్వే నిర్వహించినప్పుడు.. ఎవరు, ఎంతమంది ఉన్నారో పూర్తి వివరాలు బయటపెట్టాలని కోరారు.

ముందు మీ కుటుంబాన్ని చక్కదిద్దుకోండి

- కేటీఆర్‌కు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచన



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ముందు తన కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలని మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. తన సంగతి చూసుకున్నాక.. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురించి ఆయన మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. అందుబాటులో ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో భాగంగా.. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తేవాలని చూస్తున్న 42 శాతం బీసీ రిజర్వేషన్ల గురించి బీఆర్‌ఎస్, బీజేపీలకు మాట్లాడే అర్హత లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఈ ఆర్డినెన్సును అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గుజరాత్‌లో మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల గురించి.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

కౌశిక్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్సీ బల్మూరి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ప్రజలు రాళ్లతో కొట్టి పిచ్చాస్పత్రిలో చేరుస్తారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో బల్మూరి విలేకరులతో మాట్లాడుతూ వారి తరహాలోనే అందరూ ఫోన్ ట్యాపింగ్ చేసి హీరోయిన్ల జీవితాలతో ఆడుకుంటారని అనుకుంటే ఎలా అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దివ్యాంగ పథకాల బకాయిలు చెల్లించండి

- టీవీసీసీ చైర్మన్ వీరయ్య వినతి

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల సంక్షేమ పథకాలకు సంబంధించి.. పదేళ్లుగా పేరుకుపోయిన బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్‌డీఎఫ్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్‌ను శుక్రవారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ వికలాంగుల సహకార సంస్థకు వివిధ రకాల పథకాల కింద రావలసిన బకాయిల వివరాలతో వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర పభుత్వ సహకారం అందకపోవడంతో నిధులు విడుదలలో జాప్యం జరిగిందని ఎన్‌డీఎఫ్‌డీసీ అధికారులు తెలిపారు. త్వరలో తెలంగాణలో పర్యటిస్తామని, బకాయిలపై సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వీరయ్య ఎన్‌డీఎఫ్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్, కార్పొరేషన్ కంపెనీ కార్యదర్శి ఆర్‌కే మిశ్రా, ప్రాజెక్ట్ హెడ్ డాక్టర్ వినీత్ రాణా, ఏజీఎం వేణుగోపాల్ రావుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి అందాల్సిన నిధులపై వినతి పత్రాన్ని అందజేశారు.

రామగుండంలో 100 పడకల మల్టీ స్పెషాలిటీ
ఈఎస్‌ఐ హాస్పిటల్‌కు టెండర్ దశ

- పెద్దపల్లి లోకసభ పరిధిలో కార్మికుల కోసం ఏర్పాటు
- లోక్‌సభలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: రామగుండంలోని బొగ్గు గనుల కార్మికులకు ఆరోగ్య సేవ లు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 100 పడకల ఈఎస్‌ఐ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించనుంది. ఈ ఆస్పత్రికి 2018 సెప్టెంబర్ 20న ఈఎస్‌ఐసీ ఇన్ ప్రిన్సిపల్ ఆమోదం ఇచ్చిందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. రామగుండంలో ఏర్పాటు చేస్తున్న ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రాజెక్టు ప్రస్తుతం టెండరింగ్ దశలో ఉందని, టెండర్ కుదుర్చుకున్న తర్వాత నిర్మాణం పూర్తి చేయడానికి 2 సంవత్సరాల గడువు ఉందన్నారు. ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, ఐ, డెంటల్, పీడియాట్రిక్స్ వంటి విభాగాలు ఏర్పాటు చేయనున్నట్టు కేంద్రం తెలిపింది. మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్, సీఎస్ఎస్‌డీ, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్ వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ సేవలు రెండూ అందించనున్నారు. వైద్య సిబ్బంది నియామకానికి 2023 డిసెంబర్ 15న జరిగిన 192వ కార్పొరేషన్ సమావేశంలో ఆమోదించిన కొత్త నిబంధనలు అమ ల్లో ఉంటాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాగా బొగ్గు గనుల ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రత్యేక నిధుల కేటాయింపుపై కేంద్రం వివరాలు ఇవ్వలేదు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రధానమంత్రి ఆరోగ్య సురక్షా యోజన బడ్జెట్ అంచ నా రూ.9,839 కోట్లుగా ఉందని కేంద్రమంత్రి తెలిపారు.

జర్నలిస్టులకు ఎయిమ్స్‌లో ఉచిత వైద్యం అందేలా చూడండి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి టీయూడబ్ల్యూజే విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పనిచేస్తున్న జర్నలిస్టులకు భువనగిరి ఎయిమ్స్‌లో ఉచిత వైద్యాన్ని అందేలా చూడాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) నేతలు కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఢిల్లీలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్ నేతృత్వంలోని బృందం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం కొన్ని పరిమిత ఆస్పత్రులు, నిమ్స్ ఆస్పత్రిలో హెల్త్‌కార్డులను అనుమతిస్తున్న విషయాన్ని తెలిపారు. ఇవి భువనగిరి ఎయిమ్స్‌లో చెల్లుబాటు అయ్యేలా కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. జర్నలిస్టులతో పాటు దివ్యాంగులకు కూడా ఎయిమ్స్‌లో ఉచితంగా మెరుగైన వైద్యాన్ని అందించేలా సంబంధిత కేంద్ర పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి యోగానందం, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు భాస్కర్, ఢిల్లీ అధ్యక్షుడు వెంకటేశ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు తిరుపతి నాయక్, నేతలు కొన్నోజు రాజు, మేక గోపీకృష్ణ, ముక్కాల సతీశ్, పబ్బా సురేశ్ ఉన్నారు.

కేబినెట్‌లో ఎందరు బీసీలకు చోటిచ్చారు?

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర మంత్రివర్గంలో ఎంత మంది బీసీలకు చోటిచ్చిందని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. కేవలం బీసీలను మోసగించేందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో బీసీ బిల్లు పెడితే.. అందులో ముస్లిం రిజర్వేషన్లను తమ పార్టీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. మతపరమైన అంశాన్ని బిల్లుకు జోడించి, బీసీలను మోసగించే కుట్రను ఆనాడే బయటపెట్టామని స్పష్టం చేశారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు న్యాయపరమైన చిక్కులున్నాయని తెలిసీ బిల్లు తీసుకురావడమేమిటని ప్రశ్నించారు. బీసీ బిల్లు విషయంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా అర్థమవుతోందని ఆరోపించారు.

రేవంత్‌వి దొంగ మాటలు

- సోనియా లేఖ పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజులుగా ఢిల్లీ వీధుల్లో హంగామా చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల పేరిట డ్రామా నడిపిస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దాగుడు మూతలు, దొంగ మాటలతో సీఎం కాలం గడుపుతున్నారని ఆయన మండిపడ్డారు. బీసీ డిక్లరేషన్ హామీలను ఎత్తగొట్టిన తరహాలోనే బీసీ రిజర్వేషన్లను ఎగవేయాలని చూస్తున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సోనియా గాంధీ రాసిన లెటర్ ఆస్కార్ అవార్డుతో సమానమంటూ రేవంత్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అందులో సీఎంను మెచ్చుకునే పదం ఒక్కటి కూడా లేదని అన్నారు. రేవంత్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే దేశానికి మోడల్ కాదని, అది అట్టర్ ఫ్లాప్ సర్వే అని మండిపడ్డారు. తప్పుడు మార్గంలో వెళితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. ఒక్కడే వెళ్లారని, అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోయారని దుయ్యబట్టారు. బీసీ నాయకులను అవమానించడం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో పాటు మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే శంకరయ్యకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

5,159 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రాథమిక వైద్య సేవలు

కాంగ్రెస్ ఎంపీ చామల ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకంలోని బ్రాండింగ్ నిబంధనలను 2024 జనవరిలోనే పూర్తి చేసిందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 5,159 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఇవి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నాయని శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్రమంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరంలో మూడవ, నాలుగో త్రైమాసికాల కోసం రూ.323.73 కోట్ల కేంద్ర భాగస్వామ్య నిధులు, 2024–25 మొదటి త్రైమాసికానికి రూ.138 కోట్లు విడుదల చేయాలని కోరినట్టు వెల్లడించారు. కాగా ఇప్పటివరకు తెలంగాణకు 2023–24లో రూ.564.93 కోట్లు, 2024–25లో రూ.1,110.43 కోట్లు విడుదల చేసినట్టు కేంద్రమంత్రి వెల్లడించారు.

బిల్లు ఆమోదించకుండా పనికిమాలిన మాటలెందుకు?

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిన బిల్లుకు ఆమోదం తెలపకుండా బీజేపీ నాయకులు పనికిమాలిన మాటలెందుకు చెబుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. బీసీలపై బీజేపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందడం మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఇష్టం లేదన్నారు. బీజేపీతో కాకపోతే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించుకుంటామని చెప్పారు.

గద్దెనెక్కిన తర్వాత హామీలు గాలికి..

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: అధికారం కోసం మేనిఫెస్టోలో 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. గద్దెనెక్కిన తర్వాత నెరవేర్చకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఆయన శుక్రవారం మలేసియాలో ఎన్‌ఆర్‌ఐలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను దేశంలో అన్ని రంగాలలో ప్రగతి పథంలో నిలబెట్టారన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మలేషియా అధ్యక్షుడు సైతం తిరుపతి, ఎన్‌ఆర్‌ఐలు చిట్టిబాబు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

బంధుల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారు

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్




సాక్షి, హైదరాబాద్: రైతుబంధు రాలేదంటూ రైతులను, దళితబంధు గురించి మాట్లాడుతూ దళితులను రెచ్చగొట్టేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. దళితుల గురించి బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతుంటే విడ్డూరంగా ఉందన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో దళితులను మోసం చేసి, వారికి ద్రోహం చేసిన పార్టీ బీఆర్‌ఎస్సేనని ఆరోపించారు. దళితులపై బీఆర్‌ఎస్ దాడులు, విధ్వంసాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టడానికి తప్ప కేటీఆర్ మాటలు ఎందుకూ పనికిరావని, ఇలాంటి మాటల వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని అద్దంకి దయాకర్ అభిప్రాయపడ్డారు.

అగ్రవర్ణాల నిరుపేదల హక్కుల సాధన కోసం ఉద్యమిద్దాం

- ఈబీసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పిలుపు

సాక్షి, హైదరాబాద్: అగ్రవర్ణాల నిరుపేదల హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా ఉద్యమిద్దామని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఈబీసీ కార్యాలయంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈబీసీ కార్పొరేషన్, ఈబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రవిశంకర్, ఉపాధ్యక్షులుగా ఉన్నం సుబ్బారావు, నీలగిరి దయాకర్‌రావు, గట్టు శ్రీనివాసాచార్యులు, నూకల పద్మారెడ్డి, ప్రచార కార్యదర్శిగా యూసుఫ్ బాబు, జాయింట్ సెక్రటరీ పోచంపల్లి రమణారావు, కోశాధికారి ఒలం యాదగిరి గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆరుగురు, కార్యవర్గ సభ్యులుగా 18 మంది, గౌరవ సలహాదారులుగా 9 మంది, న్యాయ సలహాదారుగా సుప్రీంకోర్టు న్యాయవాది డి.రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు.



కడలివైపు కృష్ణమ్మ

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదిలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటిమట్టం పెరగడంతో బ్యారేజ్ గేట్లెత్తి నీటిని దిగువకు వదిలారు. దీంతో కృష్ణమ్మ కడలివైపు సాగుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



బతుకుబాటలో..

నగరాన్ని కారుమబ్బులు కమ్ముకున్నాయి. రంగురంగుల బెలూన్లు కట్టిన కర్రను బుజాన వేసుకుని ఓ చిరువ్యాపారి అమ్మకానికి బయల్దేరాడు. పైన కారుమబ్బులు, దిగువన రంగురంగుల బెలూన్లతో ఈ మనోహర దృశ్యాన్ని విశాఖ సత్యం సెంటర్లో సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కిక్కెక్కువై..

సందుకో వైన్ షాప్.. అడుగుకో బెల్ట్ షాప్.. దీంతో మందుబాబులు ఫుల్లుగా తాగి ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నారు. నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ రోడ్‌లో హైవే సమీపంలో మద్యం ఎక్కువై బండినడపలేక రోడ్డు పక్కన పడిపోయిన వ్యక్తిని పాదచారులు చూస్తూ వెళ్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా...

స్పిరిట్‌పై పటిష్ట పర్యవేక్షణ

సాక్షి, అమరావతి: పరిశ్రమల అవసరాల కోసం ఉద్దేశించిన ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్, రెక్టిఫైడ్ స్పిరిట్, ఇథనాల్ దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్ కుమార్ డిస్టిలరీల ప్రతినిధులకు చెప్పారు. వాటిని దుర్వినియోగం చేస్తూ కల్తీ మద్యం తయారు చేస్తున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని డిస్టిలరీల ప్రతినిధులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఆర్టీఐ కమిషనర్ రెహానా బేగంకు పీహెచ్‌డీ

సాక్షి, అమరావతి: ఆర్టీఐ కమిషనర్ రెహానా బేగం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గతంలోనే థీసిస్ సమర్పించిన ఆమె శుక్రవారం వర్సిటీలో వైవా ప్రజెంటేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం జర్నలిజం అండ్ కమ్యూనికేషన్‌లో రెహానాకు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపాలి: డీవైఎఫ్‌ఐ

సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి, డ్రగ్స్, మద్యంపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో ఈగల్ టీమ్, టాస్క్‌ఫోర్స్ జరిపిన తనిఖీలో చిన్న బడ్డీ కొట్టులో 110 ప్యాకెట్లల్లో 4,400 గంజాయి చాక్లెట్‌లు దొరకడం ఆందోళన కల్గిస్తోందన్నారు.

అభూత కల్పనలపై పవన్ స్పందించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

సాక్షి, అమరావతి: హరిహర వీరమల్లు చిత్ర కథలో అభూత కల్పనలపై పవన్ కళ్యాణ్ స్పందించి, చారిత్రక వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధ్యతాయుత స్థానంలో ఉన్న పవన్ హీరోగా హరిహర వీరమల్లు పేరుతో అభూత కల్పనలతో సినిమా తీయటం ఆక్షేపణీయమన్నారు.

ఆగస్టు 6న కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఆగస్టు 6వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆపదలో అమ్మ!

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముంచుకొస్తోంది. అవగాహన లోపంతో మహిళలను ముప్పుతిప్పలు పెడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కేసుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ఈ వ్యాధి ఎక్కువగా పేద, మధ్య తరగతికి చెందిన అబలలనే బలితీసుకుంటోంది. ఉచిత టీకాల విషయంపై ఎవరూ నోరెత్తకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చిత్తూరు జిల్లాలో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)

- సర్వేలో వెలుగుచూస్తున్న కేసులు
- కొందరు క్యాన్సర్‌ను దాచిపెడుతున్న వైనం
- ఈ వ్యాధి నివారణకు అవగాహన కల్పిస్తే ఒట్టు
- ఉచిత వ్యాక్సిన్ ఊసెత్తని ప్రభుత్వాలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇటీవల సిబ్బంది ఎన్‌సీడీ సర్వే చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 5,92,514 కుటుంబాలు ఉండగా 5,03,311 కుటుంబాలను సర్వే చేశారు. ఈ సర్వేలో కొంత మేర సర్వైకల్ క్యాన్సర్ కేసులు బయటపడ్డాయి. 18 ఏళ్లు దాటిన వారు 15,67,268 మంది ఉంటే 11,24,511 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఇందులో 273 మందికి ఓరల్ క్యాన్సర్, 218 మందికి రొమ్ము క్యాన్సర్, 203 మందికి సర్వైకల్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. ఇక అవగాహన రాహిత్యంతో సర్వైకల్ క్యాన్సర్‌ను గుర్తించలేకపోతున్నారు. ఇలాంటి వారు వివిధ కారణాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించడంతో కేసులు బయటపడుతున్నాయి.

సర్వైకల్ క్యాన్సర్ వ్యాప్తి ఇలా...

సర్వైకల్ క్యాన్సర్ సోకడానికి ప్రధాన కారణం 'హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ)'. ఎక్కు వ మంది భాగస్వాములతో శృగారంలో పాల్గొనడం వల్ల ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇది కొన్నేళ్ల తర్వాత వృద్ధి చెంది క్యాన్సర్‌కు కారణమవుతుంది. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ రోగుల్లో, కొన్ని రకాల మందులు తరచూ వాడడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుంది. తద్వారా కూడా సర్వైకల్ క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. చిన్న వయసులో శృంగారంలో పాల్గొనడం వల్ల హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ సోకే ముప్పు ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. అందుకే బాల్య వివాహాలు చేసుకునే వారిలో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు స్పష్టం చేస్తున్నారు. గర్భనిరోధక మాత్రలు ఏళ్ల తరబడి వాడినా సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. నెలసరి సమయంలో సరైన వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం కూడా ఈ క్యాన్సర్ ముప్పును పెంచుతుంది. వీటితో పాటు ధూమపానం, అనారోగ్యకరమైన జీవనశైలి, వంశపారంపర్యంగా కూడా కొంతమందిలో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి ఈ కేసులు అత్యధికంగా పేద కుటుంబాల్లోని మహిళల్లోనే వెలుగుచూస్తున్నాయి.

వ్యాధి లక్షణాలు

- రుతుక్రమంలో సమస్యలు
- యోని నుంచి రక్తస్రావం
- లైంగిక సంపర్కం తర్వాత రక్తస్రావం
- పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం
- యోని నుంచి దుర్వాసన, రక్తంతో కూడిన గడ్డలు రావడం
- మూత్రం, మల విసర్జనలో ఆటంకాలు
- పొత్తికడుపులో నొప్పి, బరువు తగ్గడం, నీరసం, విరేచనాలు, కాళ్లవాపు వంటి సమస్యలు

వ్యాక్సినేషన్ మాటేమిటో?

ఈ వ్యాధి బారిన పడకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో ఒకటి వ్యాక్సినేషన్. ప్రస్తుతం 9–26 ఏళ్ల వారికి ఈ టీకా అందుబాటులో ఉంది. అటు కేంద్రం కూడా దీనిపై దృష్టి సారించింది. 19–14 ఏళ్ల లోపు బాలికలు సర్వైకల్ క్యాన్సర్‌బారిన పడకుండా వ్యాక్సినేషన్‌ను పోత్సహిస్తామని ప్రకటించింది. దీని ధర మార్కెట్లో రూ.2వేల వరకు ఉన్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. విడతల వారీగా ఈ వ్యాక్సినేషన్‌ను వేయించుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఈ వ్యాక్సిన్ వేయించుకునే స్థోమత పేద, మధ్యతరగతి కుటుంబాల్లో లేదు. ఈ కారణంగా ప్రభుత్వమే వ్యాక్సిన్‌ను మహిళలకు ఉచితంగా అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు క్షేత్ర స్థాయిలో సర్వైకల్ క్యాన్సర్‌పై సరైనా అవగాహన కల్పించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ఈ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే క్యాన్సర్ నివారణ తొలి దశలోనే గుర్తించొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



స్క్రీనింగ్ పరీక్షలకొచ్చిన పింక్ బస్

వ్యాక్సిన్ ఉంది



గంటకు దేశంలో 9 మంది సర్వైకల్ క్యాన్సర్‌తో చనిపోతున్నారు. ఇప్పటి వరకు 80వేల మంది మరణించారు. కొత్త కేసులు 1.70 లక్షలు ఉన్నాయి. ఇలానే వదిలేస్తే ఇంకా కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అన్ని క్యాన్సర్లకంటే..ఈ సర్వైకల్ క్యాన్సర్ నివారణకు మాత్రమే వ్యాక్సిన్ ఉంది. ఈ క్యాన్సర్ నివారణకు ఏళ్ల లోపు పిల్లలకు 90శాతం వ్యాక్సినేషన్ పూర్తయి ఉండాలి. 35–45 సంవత్సరాల లోపు మహిళలకు 70 శాతం స్క్రీనింగ్ పరీక్షలు అయి ఉండాలి. బాధితులు కచ్చితంగా మెరుగైన వైద్యం చేయించుకోవాలి. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వల్ల 80శాతం కేసులను నివారించవచ్చు.

– ఆశ్రిత, వైద్య నిపుణులు

గ్రామాల్లోనే అధికం



గ్రామాల్లోనే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్యాన్సర్‌ను పాప్ స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించే అవకాశం ఉంది. తద్వారా మరణాలను కూడా గణనీయంగా తగ్గించవచ్చు. ఈ ముప్పును తప్పించుకోవాలంటే మన శరీరంపై అవగాహన ఉండాలి. ఏ మాత్రం మార్పు కనిపించినా దాన్ని గుర్తించాలి. శరీరంలో నొప్పి లేని గడ్డలు ఏమి కనిపించినా నిర్లక్ష్యం చేయొద్దు. తక్షణం వైద్యులను సంప్రదించాలి.

– ఉషశ్రీ, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి, చిత్తూరు

ముందే గుర్తిస్తే మేలు



సర్వైకల్ క్యాన్సర్ దాచిపెడితే ప్రాణానికే ప్రమాదం. ఇందులో దాపరికాలు వద్దు. లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. పరీక్షలు చేయించాలి. నిర్ధారణ అయితే సరైనా చికిత్స తీసుకోవాలి. బయపడాల్సి పనిలేదు. దీనికి తోడు కౌమార దశలో బాలికలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఈ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– సుధారాణి, డీఎంఅండ్ హెచ్‌ఓ, చిత్తూరు

మియావాకి విధానంలో చిట్టడవుల పెంపకం

- ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై వినూత్న ప్రయోగం
- 30 శాతం ఆక్సిజన్ పెరుగుతుందంటున్న నిపుణులు



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల: ప్రస్తుత రోజుల్లో నానాటికీ వాతావరణ కాలుష్యం పెరిగిపోతోంది. ఆ కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కల పెంపకం ఒక్కటే మార్గం. మొక్కల పెంపకంపై ప్రభుత్వాలు ఎన్ని ప్రచారాలు చేస్తున్నా అడవుల శాతం మాత్రం పెరగడం లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే భవిష్యత్‌లో ఆక్సిజన్ శాతం భారీగా తగ్గుతుందని స్పష్టమవుతోంది. ఈ తరుణంలో జపాన్ వృక్ష శాస్త్రవేత్త అకీరామియావాకి అనుసరించిన మియావాకి (చిట్టి అడవులు) పద్ధతిలో జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మొక్కలు పెంపకం చేపట్టాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సూచిస్తోంది. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో 10 వేల మొక్కలను ఈ మియావాకి పద్ధతిలో నాటుతున్నారు.

లక్ష్యంతో ముందుకు..

విశాఖపట్టణానికి చెందిన మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మైనింగ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాసరావు ఇటీవల 5 వేల నేరేడు, మామిడి, వేప, రావి, మద్ది, కొండ తంగేడి తదితర జాతుల మొక్కలను అందించారు. వీటిని శ్రీవారి కొండపైన టోల్‌గేట్ పక్కనున్న రెండు ఎకరాల ఖాళీ స్థలంలో మియావాకి పద్ధతిలో నాటుతున్నారు.



అలాగే పూళ్లకు చెందిన దాత పీవీ రామాంజనేయులు సహకారంతో శివాలయం కొండ దిగువన రెండు ఎకరాల ఖాళీ స్థలంలో ఫ్రూట్ బియరింగ్, శివుడికి ప్రీతికరమైన మారేడు, నాగమల్లి మొక్కలను నాటుతున్నారు. అదేవిధంగా లక్ష్మీపురం ఆర్చిగేటు వద్ద నుంచి గరుడాళ్వార్ విగ్రహం వరకు ఉన్న రోడ్డు మధ్యలోని డివైడర్‌లో పాక్ స్టైల్ మొక్కలు, కొత్త బస్టాండ్ వద్ద నుంచి పాత సినిమాహాలు వరకు డివైడర్‌లో టెర్మిలియన్ మెంటీలియన్ మొక్కలు నాటుతున్నారు.

సోము మొక్కలు ప్రత్యేకం

కొండపై నాటుతున్న మొక్కల్లో సోము జాతి మొక్కలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ధ్వజస్తంభాలకు ఈ చెట్లను వినియోగిస్తారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారు లు 100 మొక్కలను నాటించారు. ప్రస్తుతం ఈ పనులు ఈఓ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.



మియావాకి పద్ధతిలో దగ్గర దగ్గరగా మొక్కలు నాటుతున్న సిబ్బంది

మియావాకి విధానమే మేలు



మియావాకి విధానంలో మొక్కలు నాటడమే మేలు. పచ్చని ఆహ్లాదకర వాతావరణంతో పాటు స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్‌ను అందిస్తాయి. క్షేత్రంలో నానాటికి భక్తుల రద్దీ పెరుగుతోంది. ఇలాంటి సమయంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం శుభపరిణామం. భవిష్యత్ తరాలకు ఈ చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ నెలాఖరు నాటికి 10 వేల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

– ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి, ఈఓ, ద్వారకాతిరుమల దేవస్థానం

మియావాకి పద్ధతిలో మొక్కలు నాటే విధానం

- మొక్కలు నాటాలనుకునే భూమిని ఎక్కువ లోతు తవ్వాలి.
- మొక్కల ఎదుగుదలకు అవసరమైన నాణ్యమైన కంపోస్ట్ ఎరువును సారవంతమైన మట్టితో కలిపి గొయ్యిని పూడ్చాలి.
- స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వృక్ష జాతులను ఎంపిక చేయాలి.
- ఎక్కువ రకాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మొక్కకు, మొక్కకు ధ్య దూరం లేకుండా దట్టంగా మొక్కలు నాటాలి.
- పక్కనున్న మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడకుండా చిన్న, పెద్ద, మధ్యస్థ (ఎత్తు) మొక్కలు ఒకే దగ్గర ఉండేలా రకరకాల వృక్ష జాతులను ఎంపిక చేయాలి.
- ప్రతిరోజూ క్రమం తప్పకుండా డ్రిప్ వంటి పైప్‌ల ద్వారా నీటిని అందించాలి.

మియావాకి పద్ధతితో ప్రయోజనాలివే.

- ఒక్కో ఎకరానికి 4 వేలకు పైగా మొక్కలు నాటవచ్చు.
- చిట్టడవులను తలపించేలా దట్టంగా పెరుగుతాయి.
- జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్వచ్ఛమైన గాలి లభిస్తుంది.
- ఈ విధానంతో 30 శాతం ఆక్సిజన్ అందుతుంది.
- 30 రెట్లు త్వరగా మొక్కలు వృద్ధి చెందుతాయి.
- మూడు నుంచి నాలుగేళ్లలోనే 10 రెట్లు పచ్చదనం ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది.
- నిర్వహణా వ్యయం చాలా తక్కువ. అలాగే పక్షులు గూళ్లు పెట్టుకోవడానికి వీలుంటుంది.

నానో ఎరువుల వినియోగంతో భూములు సారవంతం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీ రావు

సాక్షి, అమరావతి: నానో ఎరువుల వినియోగం ద్వారా ముందు తరాలకు సారవంతమైన భూములను అందించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీరావు పిలుపునిచ్చారు. దేశ ఆహార భద్రతతో పాటు ఆశించిన స్థాయిలోదిగుబడులు సాధించేందుకు నానో ఎరువుల వినియోగం ఒక్కటే ప్రత్యామ్నాయ పద్ధతి అని పేర్కొన్నారు. విజయవాడలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ వనరుల రంగంలో నానో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువుల మాదిరిగా నీటిలో కరిగిపోయి నేలలో ఇంకటం,పక్క చేలకు కొట్టుకు పోవడం జరగదన్నారు. గతేడాది 3.5 లక్షల నానో బాటిల్స్ వినియోగించగా, ఈ ఏడాది 21 లక్షల నానో బాటిల్ వినియోగం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు.

ప్రతి రైతుకి కొనుగోలు పరిమితి

ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా పొగాకు కొనుగోలులో 20 క్వింటాళ్ల పరిమితిని ప్రభుత్వం విధించిందని ఢిల్లీ రావు చెప్పారు. సీఎం యాప్, ఏపీఏఐఎంఎస్ వంటి డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 25 కేంద్రాల్లో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతుధరలకు తొలి దశలో 20 వేల టన్నుల పొగాకు కొనుగోలు లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు.

దాడులు చేస్తే అది సివిలైజేషనా?

- ఇలాంటి వారు పాలకులుగా ఉండటం మన దురదృష్టం
- వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం
- డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

తాడేపల్లి రూరల్ : మంత్రి నారా లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ మాట్లాడుతుంటే.. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మాత్రం వాటిని అమలు చేసేందుకు విశ్వ ప్రయత్నం చేస్తూ ప్రజలను, తన అభిమానులను రెచ్చగొడుతున్నారు. వీరా మనల్ని పరిపాలించేది.. అంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నాగనారాయణమూర్తి, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరు కనకారావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్.. తన సినిమా ఈవెంట్‌లో అభిమానులను రెచ్చగొట్టేలా మాట్లాడటంపై శుక్రవారం రాత్రి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ×సోషల్ మీడియాలో వచ్చే కామెంట్లకు మీరు భయపడాల్సిన అవసరం లేదు.. దాడి చేయండి.. కొట్టండి.. మీకు నచ్చిన విధంగా దాడి చేయండి.. అది సివిలైజేషన్‌× అంటూ పవన్‌కళ్యాణ్ ప్రజలను, వారి సైనికులను రెచ్చగొట్టడం దారుణమన్నారు. అదే రకమైన ప్రవర్తన జనసైనికులకూ వచ్చిందన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కారును అడ్డగించి ఆపి రాళ్లు రువ్వి, పైకెక్కి వారు చేసిన విన్యాసాలను అందరూ చూశారని, తిరుపతిలో ఓ థియేటర్ అద్దాలు పగులగొట్టి.. టికెట్ లేకుండానే సినిమా చూశారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఈ విధమైన ప్రవర్తనతో వీరు రాష్ట్రాన్ని ఎటు తీసుకెళుతున్నారని ప్రశ్నించారు.



పిల్లలూ... డబ్బు చాలా ముఖ్యమైనది. అదే సర్వస్వం కాదుకానీ అది తగినంత ఉండటం అవసరం. అందుకే ఈ వయసు నుంచే మీరు డబ్బును దాచాలి. పొదుపు చేయాలి. అందుకు మీరు హుండీని పెట్టుకోవాలి. ఇంగ్లిష్‌లో దీనినే పిగ్గీ బ్యాంక్ అంటారు.

• పొదుపు





హుండీలో డబ్బు దాచుతున్నారా?

మీరు పొదుపు ఎందుకు చేయాలి?

- పొదుపు చేయకుండా డబ్బు దుబారా అవుతుంది.
- అవసరమైన వాటికి ఖర్చు చేసి మిగిలినవి దాచితే అవసరానికి ఉపయోగపడతాయి.
- అమ్మా నాన్న కష్టపడి సంపాదించే డబ్బు ఎలా ఖర్చు చేస్తే మంచిదో తెలుస్తుంది.
- అన్నిసార్లు అమ్మనే అడక్కుండా మన హుండీ నుంచి అవసరమైన వస్తువులు కొనుక్కోవచ్చు.
- డబ్బు విలువ తెలియడం చాలా ముఖ్యం. ఎందుకంటే డబ్బు చెట్లకు కాయవు.

ఎలా చేయాలి?

- పాకెట్ మనీ నుంచి కొంత మిగుల్చుకోవాలి.
- ఇంటి పనులు అంటే తోట పని, ఇల్లు సర్దడం లాంటివి చేసి అమ్మ దగ్గర బహుమానం పొంది ఆ డబ్బు దాయాలి.
- బాగా చదివి మంచి మార్కులు వచ్చినప్పుడు నాన్న సంతోషంగా ఇచ్చే డబ్బును దాచుకోవాలి.
- సినిమాల్లో, బయటకు వెళ్లినప్పుడు కొద్దిగా ఖర్చు చేసి మిగిలినవి దాయాలి.
- పుట్టిన రోజుకు పెట్టే ఖర్చులో పొదుపు చేసి దాయాలి.

ఇలా చేసి ఆ డబ్బుతో మీరు నెక్స్ క్లాస్ బుక్స్ తీసుకోవచ్చు. లేదా రెండు మూడేళ్లు దాచి ఒక సైకిల్ కొనొచ్చు. మీ డబ్బును మీరు మేనేజ్ చేయడం తెలిస్తే భవిష్యత్తులో మీరు డబ్బు విషయంలో చాలా బాగా ఉంటారు.










7 ప్రపంచంలోని సహజసిద్ధమైన అద్భుతాలు

హలో పిల్లలూం. మనకు ప్రపంచ వింతలంటే ఠక్కున గుర్తొచ్చేవి – ది గ్రే వాల్ ఆఫ్ చైనా, పెట్రా, క్రైస్ట్ ది రిడీమర్, మచ్చు పిచ్చు, చిచెన్ ఇట్జా, రోమన్ కొలోసియం, మనందరికీ ఇష్టమైన తాజ్ మహల్. ఈ ఏడు వింతలు తప్ప మరొకటి జ్ఞప్తికి రావు. ఇవి ఎంతో అందమైన, ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలు, కట్టడాలు అయినప్పటికీ ఇవన్నీ కూడా మానవ నిర్మాతలు. మనకంటే ముందు జీవించిన మన పితరులు వివిధ కాలాలలో, విభిన్న సందర్భాలలో నిర్మించిన అద్భుతమైన కట్టడాలు ఇవి. కానీ ఈరోజు మనం, మానవ ప్రమేయం లేకుండా ప్రకృతి ద్వారా సహజంగా ఏర్పడిన వింతల గురించి తెలుసుకుందాం.

ప్రపంచంలోని ఏడు సహజసిద్ధమైన అద్భుతాలు (Seven Natural Wonders of the World)

1. గ్రాండ్ కాన్యన్ (Grand Canyon, USA)
అమెరికాలోని ఈ భారీ లోయ అరిజోనాలో ఉంది. కొలరాడో నది సృష్టించిన ఈ కాన్యన్ దాదాపు 446 కిలోమీటర్ల పొడవు, 29 కిలోమీటర్ల వెడల్పుతో 1.6 కిలోమీటర్ల లోతు కలిగి ఉంది. దీని అద్భుతమైన రంగులు, భౌగోళిక నిర్మాణం పర్యాటకులను కట్టిపడేస్తాయి.

2. గ్రేట్ బారియర్ రీఫ్ (Great Barrier Reef, Australia)
ఆస్ట్రేలియా సమీపంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద పగడపు దిబ్బ. ఇది 2,300 కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉన్న ఈ అద్భుతం అనేక సముద్ర జీవులకు ఆవాసం.



3. అమెజాన్ రెయిన్ ఫారెస్ట్ (Amazon Rainforest, South America)
దక్షిణ అమెరికాలోని ఈ ఉష్ణమండల వర్షారణ్యం "ప్రపంచ ఊపిరితిత్తులు" గా పిలువబడుతుంది. ఇది అమెజాన్ నది చుట్టూ విస్తరించి ఉండటంతో పాటు భూమ్మీద ఇంతవరకు కనిపించని ఎన్నో జాతుల జంతుజాలం, వృక్షజాలానికి నిలయం.



4. విక్టోరియా జలపాతం (Victoria Falls, Zambia)
ఆఫ్రికాలోని జాంబియా–జింబాబ్వే సరిహద్దులో ఉన్న ఈ జలపాతం జంబేజీ నదిపై ఉంది. దీని వెడల్పు 1.7 కిలోమీటర్లయితే, ఎత్తు 108 మీటర్లు.


5. ఆరోరా బోరియాలిస్ (Aurora Borealis, Northern Lights)
ఉత్తర ధ్రువ ప్రాంతాలలో (నార్వే, స్వీడన్, ఫిన్లాండ్) కనిపించే ఈ అద్భుతమైన ఆకాశ దృశ్యం సౌర కణాలు భూమి వాతావరణంతో సంకర్షణ చెందడం వల్ల ఏర్పడుతుంది. ఈ దృశ్యాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకోవడమే కాకుండా ప్రకృతి డిజైన్ చేసిన గ్రాఫిక్స్ లా ఉంటాయి.

6. పారిసెలో రాక్ (Parícutin Volcano, Mexico)
మెక్సికోలోని ఈ అగ్నిపర్వతం 1943లో ఒక రైతు భూమిలో ఏర్పడింది. ఇది ఏర్పడిన తొమ్మిది సంవత్సరాలలోనే 424 మీటర్ల ఎత్తుకు చేరుకుని ఆధునిక ప్రపంచ వింతగా పరిగణింపబడుతుంది.

7. మౌంట్ ఎవరెస్ట్ (Mount Everest, Mount in Asia)
ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరం, హిమాలయాలలో 8,848 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ మంచు పర్వతాలు ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఈ హిమ పర్వతాలను అధిరోహించడానికి కొన్ని వేల మంది ఆసక్తి చూపుతుంటారు.







• పుస్తకాలు

విసుగెత్తిన నల్ల చేప ఏం చేసింది?

అనగనగా ఓ నల్ల చేపపిల్ల. దాని ప్రపంచంతో అది విసుగెత్తిపోయింది. సెలయేరు ఎక్కడ అంతం అవుతుందో చూడాలని అనిపించింది. అక్కడి వింతలూ, విశేషాలూ తెలుసుకోవాలనిపించింది. ఇల్లు వదిలి వెళ్ళిపోవాలనిపించింది. దానికి చుట్టుపక్కల వాళ్ళు ఎలా స్పందించారు? నల్లచేప పిల్లకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఇదంతా ఈ నవల చదివి తెలుసుకోవచ్చు. సమద్ బెహరంగీ పిల్లల కోసం రాసిన ఈ కథ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది.



గ్రహాలను చుట్టి వచ్చిన యువరాజు కథ

ఫ్రెంచ్ రచయిత, పైలెట్ అయిన ఆంటోయిన్ డి సెయింట్–ఎక్సుపెరీ 1943లో రాసిన నవల ఇది. భూమితో సహా వివిధ గ్రహాలను చుట్టి వచ్చిన ఓ యువరాజుకు ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనేది ఇందులోని కథ. స్నేహం, ప్రేమ వంటి అంశాలను పిల్లలకు అర్థమయ్యే సులువైన భాషలో ఇందులో పొందుపరిచారు. పిల్లలతోపాటు పెద్దలకీ ఎంతో ఇష్టమైన నవల ఇది. ఇప్పటికి 14 కోట్ల కాపీలు అమ్ముడుపోయిన రికార్డు ఈ పుస్తకానిది.



• తమాషా చిత్రం

నవ్వుతున్న పొద్దుపొడుపు

పశ్చిమ జర్మనీలో పొద్దుపొడుపు పంట విస్తారం.
రైతులు సరదాగా తమ చేలోని పొద్దు తిరుగుడు
పూలకు ఇలా ఆకారం చెక్కి కాలక్షేపం చేస్తారు.
అంతే తప్ప ఈ పూలు ఇలా నవ్వుతూ పూయవు.
మంత్రాలకు చింతకాయలు రాలవు.

• కథ

తెలివైన ఇల్లాలు



అనగనగా ఓ ఊరిలో రామయ్య అనే కూలీ ఉండేవాడు. అతనికి సొంతంగా భూమి లేదు. ఇతరుల పొలాల్లో పనిచేస్తూ పొట్టపోసుకునేవాడు. ఏరోజుకైనా సొంతంగా భూమి కొని ఊరిలో తానూ రైతుని అనిపించుకోవాలని ఆశపడేవాడు. అందుకోసం కూలీ చేయగా వచ్చిన సొమ్మును దాచిపెట్టుకునేవాడు.

కొన్నాళ్లకు రామయ్యకు పెళ్లయ్యింది. అతని భార్య చాలా తెలివైన మనిషి. భర్తతో కలిసి తనూ కష్టపడి డబ్బులు కూడబెట్టడం మొదలుపెట్టింది. కొన్నాళ్లకు ఆ ఊరిలోని ఓ వ్యక్తికి ఉన్నట్టుండి డబ్బు అవసరమొచ్చి తన పొలాన్ని బేరానికి పెట్టాడు. ఆ విషయం ఆనోటా ఈనోటా పాకి రామయ్యకు తెలిసింది. అతను వెళ్లి పొలం చూశాడు. అక్కడంతా రాళ్లూరప్పలు ఉన్నాయి. అలాంటి భూమిని సాగులోకి తేవాలంటే చాలా కష్టపడాలి. అది తనవల్ల కాదని వదిలేశాడు.

రాత్రి భోజనం చేసేటప్పుడు ఈ విషయం భార్యతో చెప్పాడు. 'రాళ్లూరప్పలున్న పొలం, పైగా అతనికి డబ్బు అవసరం కాబట్టి తక్కువకి అమ్ముతాడు, కొనుక్కోండి' అని సలహా ఇచ్చింది. కానీ ఆ పొలాన్ని బాగుచేయడం చాలా కష్టమని రామయ్య అన్నాడు. ఆ విషయం తాను చూసుకుంటానని హామీ ఇచ్చింది. భార్య మాట మీద నమ్మకంతో రామయ్య ఆ పొలాన్ని తక్కువ ధరకు కొనుక్కున్నాడు.

మరుసటి రోజు అతని భార్య ఓ ఉపాయం ఆలోచించింది. భర్తతో కలిసి పొలానికి వెళ్లి, అక్కడ ఒక్కో రాయి పైకి తీసి పక్కనేస్తూ, రాయి కింద చిన్న గుంత చేస్తూ ఉంది. భర్తను కూడా అలాగే చేయమంది. చుట్టుపక్కలవారు వచ్చి విషయమేమిటని కనుక్కున్నారు. 'ఈ పొలంలో నిధులు ఉన్నాయని తెలిసింది. అందుకే అవి వేరే వారి కంటబడకుండా మేమే తీసుకోవాలని ఇలా ఒక్కో రాయి తీసి వెతుకుతున్నాం' అని వారికి చెప్పింది.

భార్యాభర్తలు సాయంత్రం దాకా ఆ పని చేసి ఇంటికి వెళ్లారు. తర్వాత రోజు ఉదయం వారిద్దరూ పొలానికి వచ్చేసరికి పొలమంతా చదును చేసి ఉంది. రాళ్లన్నీ పక్కన ఉన్నాయి. రామయ్య ఆశ్చర్యంగా చూడగా, అతని భార్య మాత్రం తాను ఊహించిందే జరిగిందని సంతోషపడింది. ఆమె చెప్పిన అబద్ధాన్ని నమ్మి, చుట్టుపక్కల ఊళ్లలోని కొందరు రాత్రికి రాత్రే ఆ నిధిని సొంతం చేసుకోవాలని మొత్తం పొలంలో రాళ్లను తొలగించి చదును చేశారని రామయ్య గ్రహించాడు. తన భార్య తెలివిని ముచ్చటపడ్డాడు. ఇద్దరూ కలిసి ఆనందంగా పొలాన్ని పండించుకొని, సంతోషంగా జీవించారు.

• మహనీయులు

కర్షక కవి... దువ్వూరి రామిరెడ్డి



తెలుగునేలపై ఎందరో ప్రసిద్ధమైన రచయితలు ఉన్నారు. వారంతా తమ సాహిత్యంతో తెలుగు జాతిని సుసంపన్నం చేశారు. వారిలో ఒకరు దువ్వూరి రామిరెడ్డి. 'కవి కోకిల' బిరుదుతో ప్రసిద్ధి పొందిన ఆయన తెలుగు సాహిత్యంలో విశిష్టస్థానం సంపాదించారు. దువ్వూరి రామిరెడ్డి 1895, నవంబర్ 9న పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించారు. వారిది వ్యవసాయ కుటుంబం. చిన్ననాటి నుంచి పొలాల మధ్య తిరుగుతూ, ఆ శ్రమ ,జీవనాన్ని ఆస్వాదించిన రామిరెడ్డి వ్యవసాయం చేస్తూ కవిగా మారారు. అద్భుతమైన కావ్యాలు రాశారు. అందుకే ఆయన్ని 'రైతు కవి', 'సింహపురి సిరి' అని అందరూ కొనియాడారు. 23 సంవత్సరాల నాటికే ఆయన ఎన్నో రచనలు చేశారు. సొంతంగా అనేక భాషలు నేర్చుకుని అందులోనూ తన ప్రతిభ చాటారు.

1924లో తన 29 ఏళ్ల వయసులో వ్యవసాయదారుని గురించి 'కృషీవలుడు' అనే పద్యకావ్యం రాశారు. ఆ తర్వాత ఉమర్ ఖయ్యామ్ రచించిన 'రుబాయిత్'ను 'పానశాల' పేరుతో తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేశారు. రామిరెడ్డి రచనలన్నింటిలో ఇది అత్యంత ప్రసిద్ధమైనది. నేటికీ ఈ కావ్యం గురించి అందరూ గొప్పగా చెప్పుకుంటారు. వీటితోపాటు రసిక జనానందము, స్వప్నాశ్లేషము, అహల్యానురాగాలు , కృష్ణరాయబారము వంటి ప్రబంధాలు, నలజారమ్మ అనే కావ్యం, అనేక నాటకాలు రాశారు. సినీ రంగంలోనూ తన ప్రతిభ చాటారు. 1936లో 'సతీతులసి' చిత్రానికి రచయితగా సినిమారంగ ప్రవేశం చేశారు. 'చిత్రనళినీయం' సినిమాకు రచనతోపాటు దర్శకత్వం చేపట్టారు. సినీదర్శకుడైన మొదటి తెలుగుకవి ఆయనే కావడం విశేషం. తరువాత తిరుపతి వేంకటేశ్వర మహత్యం, పార్వతీ పరిణయం లాంటి చిత్రాలకు కొన్ని పాటలు, పద్యాలు రాశారు. 1947 సెప్టెంబర్ 11న 52 ఏళ్ల వయసులో ఆయన మరణించారు.

ఐపీవో స్ట్రీట్

ఎన్ఎస్‌డీఎల్ @ రూ. 760-800

- జులై 30–ఆగస్ట్ 1 మధ్య ఐపీవో
- రూ. 4,011 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: ఈ నెల 30న ప్రారంభంకానున్న స్టాక్ మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్) పబ్లిక్ ఇష్యూకి రూ. 760–800 ధరల శ్రేణి ప్రకటించింది. ఆగస్ట్ 1న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 4,011 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 29న షేర్లను ఆఫర్ చేయనుంది. ఇష్యూలో భాగంగా 5.01 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. వీటిని సంస్థలో ప్రధాన వాటాదారులైన స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈతోపాటు.. బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీబీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూటీ(ఎస్‌యూయూటీఐ) విక్రయానికి ఉంచనున్నాయి. వెరసి ఐపీవో నిధులు ప్రస్తుత వాటాదారుల సంస్థలకు చేరనున్నాయి. దీంతో కంపెనీ విలువ రూ. 16,000 కోట్లకు చేరనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 18 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్ @ రూ. 366-385

- ఈ నెల 30–ఆగస్ట్ 1 మధ్య ఐపీవో
- రూ. 650 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: ప్రీఇంజినీర్డ్ బిల్డింగ్స్(పీఈబీ), రూఫింగ్ ప్రొడక్టుల కంపెనీ ఎంఅండ్‌బీ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూకి తాజాగా రూ. 366–385 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 30న ప్రారంభమై ఆగస్ట్ 1న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 275 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 375 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 650 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధులను తయారీ ప్లాంట్ల కోసం పరికరాలు, మెషీనరీ కొనుగోలుతో పాటు.. రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ పీఈబీలో 1,03,800 ఎంటీపీఏ, సెల్ఫ్‌సపోర్టెడ్ రూఫింగ్‌లో 18,00,000 చదరపు మీటర్ల వార్షిక తయారీ సామర్థ్యాలు కలిగి ఉంది.

రేట్ల కోతను నిర్ణయించేది..

ద్రవ్యోల్బణం, వృద్ధి అంచనాలే

- మధ్య కాలానికి వ్యాపారాల విస్తరణపై వ్యయం
- చైర్మన్ సంజీవ్ పురి ప్రకటన



ముంబై: ద్రవ్యోల్బణం, వృద్ధిపై అంచనాలే భవిష్యత్తు రేట్ల కోతను నిర్ణయిస్తాయే గానీ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా కాదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. రుణ వృద్ధికి మద్దతుగా ఆర్‌బీఐ రేట్ల కోతను చేపట్టినట్టు చెబుతూ.. ఇది అస్సెట్ బబుల్‌కు (ఆస్తుల విలువ అతిగా పెరిగేందుకు) దారితీయదన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థకు మద్దతునిచ్చేందుకు రేట్ల కోతకు అదనంగా ఆర్‌బీఐ చేతిలో అస్త్రాలున్నట్టు చెప్పారు. ఆర్‌బీఐ ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక శాతం రెపో రేటు కోతను చేపట్టడం తెలిసిందే. పరపతి విధానం అమలు ఆలస్యంగా ఉంటుందన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. కనుక ద్రవ్యోల్బణం వంటి కీలక డేటా విషయంలో 12 నెలల కాలాన్ని దృష్టిలో పెట్టుకుని రేట్ల కోతపై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది''అని మల్హోత్రా తెలిపారు. క్యూ4లో ద్రవ్యోల్బణం 4.4 శాతం ఉంటుందన్నది అంచనాలు కాగా, ప్రస్తుత తీరు చూస్తుంటే ఇంకా తగ్గేలా ఉందన్నారు. జూన్ వరకు ఉన్న డేటాను గమనిస్తే బ్యాంకుల రుణ రేట్లు అర శాతం మేర తగ్గాయని.. ఆర్‌బీఐ నిర్ణయం పూర్తిగా అమలైనట్టు ఇది తెలియజేస్తోందన్నారు.

మెరుగైన రుణ వృద్ధి

2024–25లో రుణాల్లో వృద్ధి 12.1 శాతంగా ఉందని సంజయ్ మల్హోత్రా తెలిపారు. దశాబ్దం సగటు 10 శాతం కంటే అధికమన్నారు. 2025–26లో ఇది 9 శాతంగా ఉండొచ్చన్నారు. వృద్ధికి అనుకూలమైన స్థూల ఆర్థిక పరిస్థితులు ఉండేలా చూస్తామని పరిశ్రమకు హామీ ఇచ్చారు. వృద్ధికి మద్దతుగా భారీ రేట్ల కోత చేపట్టి ఆర్‌బీఐ తన సాధనాలను పూర్తిగా వినియోగించేసిందా? అన్న ప్రశ్నకు.. రేట్ల కోతకు అదనంగా మరిన్ని అస్త్రాలు తమ వద్ద ఉన్నట్టు చెప్పారు. సీఆర్ఆర్‌ను 3 శాతానికి తగ్గించినప్పటికీ, ఎలాంటి అవసరం ఏర్పడినా ఎదుర్కొనేందుకు తగినన్ని నిధులున్నట్టు తెలిపారు. కరోనా సమయంలోనూ ఒక శాతమే వినియోగించినట్టు గుర్తు చేశారు. సీఆర్ఆర్ తగ్గింపు కేవలం లిక్విడిటీని పెంచడమే కాకుండా మధ్యవర్తిత్వ వ్యయాలను తగ్గించడం కోసమన్నారు. ఇది అంతిమంగా రుణ వ్యయాలను కూడా తగ్గిస్తుందన్నారు.

ఆర్థిక సేవల విస్తృతికి వీలుగా బ్యాంక్ సిబ్బంది ప్రతి వారం 2.7 లక్షల గ్రామ పంచాయితీలను సందర్శిస్తున్నట్టు చెప్పారు. పారిశ్రామిక గ్రూప్‌లను బ్యాంకింగ్‌లోకి అనుమతించే విషయంలో ఆర్‌బీఐ ఆందోళనలను ప్రస్తావించగా.. ప్రయోజన వైరుధ్యం రిస్క్ ఉంటుందన్నారు. డిజిటల్ చెల్లింపులకు సంబంధించి వ్యయాలను ప్రస్తుతం ప్రభుత్వం భరిస్తున్నప్పటికీ.. భవిష్యత్తులో రాష్ట్రాలు లేదా వినియోగదారులు చెల్లించాల్సి రావచ్చన్నారు. ఈ వ్యవస్థ సాఫీగా సాగేందుకు ఇది అవసరమని అభిప్రాయపడ్డారు.

యూకేతో ఒప్పందం భారత్‌కు మేలు

బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం భారత్‌కు మేలు చేస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. తయారీ, సేవల రంగంలో ఎన్నింటికో ప్రయోజనం చేకూరుస్తుందంటూ.. ఇదే తరహా మరిన్ని ఒప్పందాలు అవసరమన్నారు. మరిన్ని దేశాలతో ఒప్పందాలు చర్చల దశలో ఉన్నట్టు గుర్తు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శిస్తున్నప్పటికీ.. సెంట్రల్ బ్యాంక్ స్వతంత్రను కాపాడుతున్నారంటూ యూఎస్ ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌ను అభినందించారు.

ఏడబ్ల్యూఎస్‌తో టాటా కమ్యూనికేషన్స్ జట్టు

భారత్‌లో ఏఐ నెట్‌వర్క్ ఏర్పాటు

న్యూఢిల్లీ: భారత్‌లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) లొకేషన్స్‌ను అనుసంధానించేలా అధునాతన కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు టాటా కమ్యూనికేషన్స్ వెల్లడించింది. దీని ప్రకారం దేశయంగా మూడు ఏడబ్ల్యూఎస్ ఇన్‌ఫ్రా లొకేషన్లను కనెక్ట్ చేసేందుకు అత్యధిక సామర్థ్యాలతో, సుదీర్ఘ నెట్‌వర్క్‌ను నిర్మించనున్నట్లు తెలిపింది. దీనిపై రూ. 430 కోట్ల మేర పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని, 2026 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని కంపెనీ పేర్కొంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కి హైదరాబాద్, ముంబైలో ఏడబ్ల్యూఎస్ డైరెక్ట్ కనెక్ట్ పేరిట రెండు డేటా సెంటర్ రీజియన్లు, చెన్నైలో ఏడబ్ల్యూఎస్ ఎడ్జ్ నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నాయి. హైదరాబాద్, ముంబై, చెన్నైలోని ఏడబ్ల్యూఎస్ కేంద్రాలను ఈ నెట్‌వర్క్ కలుపుతుందని, తద్వారా దేశవ్యాప్తంగా ఏఐ, మెషిన్‌లెర్నింగ్ వర్క్‌లోడ్‌లను భరించేందుకు అవసరమయ్యే శక్తివంతమైన మౌలిక సదుపాయాలను ఏర్పర్చుకునేందుకు తోడ్పడుతుందని కంపెనీ వివరించింది.



ఐటీసీ రూ.20,000 కోట్ల పెట్టుబడులు

- మధ్య కాలానికి వ్యాపారాల విస్తరణపై వ్యయం
- చైర్మన్ సంజీవ్ పురి ప్రకటన



కోల్‌కతా: ఐటీసీ మధ్య కాలానికి తన వ్యాపారాలపై రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసుకోనున్నట్లు చైర్మన్, ఎండీ సంజీవ్ పురి ప్రకటించారు. ఏ వ్యాపారాలపై వెచ్చించేదీ స్పష్టం చేయలేదు. ఇటీవలి కాలంలో ఎనిమిది ప్రపంచస్థాయి తయారీ కేంద్రాలపై రూ.4,500 కోట్లను ఐటీసీ ఖర్చు చేసినట్టు కంపెనీ వార్షిక సమావేశంలో వాటాదారులకు వెల్లడించారు. ఎఫ్ఎంసీజీ, ప్యాకేజింగ్, ఎగుమతులకు సంబంధించి విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులపై ఈ పెట్టుబడులు పెట్టినట్టు తెలిపారు. 40 అత్యాధునిక తయారీ వసతులను నిర్మించినట్టు గుర్తు చేశారు. 250 తయారీ కేంద్రాలు, 7,500 ఎంఎస్ఎంఈలతో కూడిన ఐటీసీ ఎకోసిస్టమ్‌ను ఇవి బలోపేతం చేస్తాయన్నారు. ''కంపెనీ వ్యాపారాలన్నింటా 90 శాతం మేర అదనపు విలువ జోడింపు చర్యలను చేపట్టాం. వేగంగా వృద్ధి చెందుతున్న ఆన్‌లైన్ ఫుడ్ సేవల విభాగంలోకి ప్రవేశించాం. ఇప్పటికే ఐదు పట్టణాల్లో 60 క్లౌడ్ కిచెన్లను 'ఐటీసీ మాస్టర్ చెఫ్ ఆపరేషన్స్, ఆశీర్వాద్ సౌల్ క్రియేషన్స్, సన్‌ఫీస్ట్ బేక్డ్ క్రియేషన్స్, శాన్షో బ్రాండ్ల కింద ఏర్పాటు చేశాం''అని సంజీవ్ పురి వివరించారు. మూడేళ్లలో ఈ వ్యాపారం ఏటా 108 శాతం వృద్ధిని చూసినట్టు చెప్పారు. గత మూడేళ్లలో 300 కొత్త ఉత్పత్తులను కంపెనీ విడుదల చేసినట్టు వాటాదారుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత బ్రాండ్లు ప్రపంచ వేదికపై సత్తా చాటాలన్నది తమ అభిమతమంటూ.. ఈ విషయంలో భారత్‌కే తొలి ప్రాధాన్యమని చెప్పారు.

డీమెర్జర్‌పై సరైన సమయంలో నిర్ణయాలు

ఐటీసీ ఇన్ఫోటెక్ సహా తన వ్యాపారాల డీమెర్జర్ (వేరు చేసి లిస్ట్ చేయడం) విషయమై ఎప్పటికప్పుడు అవకాశాలను ఐటీసీ మదింపు వేస్తుందని సంజీవ్ పురి తెలిపారు. పోటీ వాతావరణం, వ్యాపారం పరిపూర్ణతకు రావడం, అవకాశాలు, విలువ జోడింపు తదితర అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఏఐకి ప్రభుత్వ మద్దతు కావాలి

నెక్స్‌జెన్ ఎగ్జిబిషన్స్ నివేదిక



న్యూఢిల్లీ: జాతీయ భద్రత దృష్ట్యా కృత్రిమ మేథకి (ఏఐ) ప్రభుత్వం మద్దతు అవసరమని నెక్స్‌జెన్ ఎగ్జిబిషన్స్ ఒక నివేదికలో తెలిపింది. పటిష్టమైన సైబర్‌సెక్యూరిటీ, బోర్డర్ సెక్యూరిటీ కోసం దీనిపై గణనీయంగా ఇన్వెస్ట్ చేయాలని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. 15 నగరాలకు చెందిన 200 పైగా కంపెనీలతో నిర్వహించిన సర్వే ప్రాతిపదికన నెక్స్‌జెన్ ఈ నివేదిక రూపొందించింది. జాతీయ భద్రత కోసం ప్రభుత్వం ఏఐకి క్రియాశీలకంగా మద్దతునివ్వాలనే విషయంపై 'ఏకీభవిస్తున్నాను', 'మరింతగా ఏకీభవిస్తున్నాను' అనే ఆప్షన్లకు 86 శాతం మంది సానుకూలంగా స్పందించినట్లు సంస్థ తెలిపింది. డిఫెన్స్‌లో ఏఐ ఆవిష్కరణల కోసం ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాలు, ప్రోత్సాహకాలు అవసరమని 14 శాతం మంది అభిప్రాయపడ్డారు. పరిశ్రమలో ఏఐ అంతరాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యాలు ఉపయోగపడగలవని పేర్కొన్నారు. దేశ భద్రతను పటిష్టం చేసుకునే దిశగా ఏఐని సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలంటే పాలసీపరంగా ఉన్న అనేక అంతరాలను ప్రభుత్వం, పరిశ్రమ పరిష్కరించుకోవాల్సి ఉంటుందని నివేదిక తెలిపింది.

ఎల్రక్టానిక్ యుద్ధాలు, సమాచార యుద్ధాలతో సవాళ్లు పెరిగిపోతున్న నేపథ్యంలో జాతీయ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి ఏఐ ఎంతో ఉపయోగకరమైన సాధనంగా ఉండగలదని నెక్స్‌జెన్ పేర్కొంది. పరిశ్రమ గణాంకాల ప్రకారం 2024లో దేశీయంగా 23 లక్షల పైగా సైబర్‌దాడులు చోటు చేసుకున్నాయి. వీటి వల్ల రూ. 1,200 కోట్ల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది. అంతర్జాతీయంగా ఫిషింగ్ దాడుల విషయంలో అమెరికా, రష్యా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.

ఏఎంఎన్ఎస్‌కు సీఎస్ఐఆర్ లైసెన్సు



న్యూఢిల్లీ: రహదారుల నిర్మాణం కోసం స్టీల్ స్లాగ్ అగ్రిగేట్స్‌ను ప్రాసెస్ చేసి, విక్రయించేందుకు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ) నుంచి సాంకేతిక లైసెన్సు లభించినట్లు ఆర్సెలర్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) తెలిపింది. ఉక్కు తయారీ ప్రక్రియలో బైప్రొడక్టుగా వచ్చే వ్యర్థాలను స్టీల్ స్లాగ్‌గా వ్యవహరిస్తారు. సాంప్రదాయ నిర్మాణ మెటీరియల్స్‌తో పోలిస్తే శాస్త్రీయంగా ప్రాసెస్ చేసిన స్టీల్ స్లాగ్‌లతో రహదారుల నిర్మాణ వ్యయాలు 30–40 శాతం తక్కువగా ఉంటాయని, తారు రోడ్లతో పోలిస్తే మన్నిక మూడు రెట్లు ఎక్కువగా ఉంటుందని కంపెనీ తెలిపింది.

ప్రమాణాలు మెరుగుపర్చుకున్న ఎయిరిండియా: సీఈవో విల్సన్



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఎయిరిండియా తమ సర్వీసులు, ఉద్యోగులకు శిక్షణ ప్రమాణాలను మరింత మెరుగుపర్చుకుంది. అలాగే భద్రత ఇతరత్రా అంశాలను కూడా మెరుగుపర్చుకోవడంపై దృష్టి సారిస్తోంది. కంపెని సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ ఈ విషయాలు తెలిపారు. ప్రమాద ఘటన తర్వాత సాధారణంగానే నిశితంగా పరిశీలించడం పెరుగుతుందని, విమర్శల్లాంటి వాటిని నిర్మాణాత్మకంగా తీసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జూన్ 12న ఎయిరిండియా విమానం కూలిన ఘటన నేపథ్యంలో విల్సన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పేపర్ ఆధారిత విధానాల స్థానంలో డిజిటల్ సిస్టమ్‌లను ప్రవేశపెట్టామన్నారు.

ప్రతి బీమా సంస్థకు ఒక అంబుడ్స్‌మన్

ఐఆర్‌డీఏఐ ప్రతిపాదన



న్యూఢిల్లీ: బీమా రంగంలో మరింత జవాబుదారీతనం దిశగా బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) కీలక ప్రతిపాదన చేసింది. రూ.50 లక్షల వరకు క్లెయిమ్‌లకు సంబంధించి ఫిర్యాదులను పరిష్కరించేందుకు అంతర్గత బీమా అంబుడ్స్‌మన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ మేరకు 'ఇంటర్నల్ అంబుడ్స్‌మన్ గైడ్‌లైన్స్, 2025' ముసాయిదాను విడుదల చేసింది. ఫిర్యాదులను న్యాయంగా, పారదర్శకంగా, సకాలంలో పరిష్కరించేందుకు స్వతంత్ర, నిష్పాక్షిక యంత్రాంగం ఉండాలని పేర్కొంది. కార్యకలాపాలు ప్రారంభించి మూడేళ్లు దాటిన అన్ని బీమా సంస్థలకు ఈ కొత్త మార్గదర్శకాలు వర్తించనున్నాయి. బీమా సంస్థలు ఒకరికి మించి కూడా అంతర్గత అంబుడ్స్‌మన్‌ను నియమించొచ్చని తెలిపింది. ముసాయిదా మార్గదర్శకాలపై ఆగస్ట్ 17 వరకు సలహా, సూచనలను ఆహ్వానించింది.

జీఎస్‌టీ అమల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి

- లేదంటే చిన్న వ్యాపారులు మళ్లీ నగదు వైపు మళ్లొచ్చు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక



న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీలను మరింత లోతుగా స్క్రూటినీ చేస్తూ, వాటి ఆధారంగా జీఎస్‌టీని దూకుడుగా అమలు చేస్తే మొదటికే మోసం రావొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ ఒక నివేదికలో హెచ్చరించింది. దీనివల్ల చిన్న వ్యాపారులు తిరిగి నగదు లావాదేవీల వైపు వెళ్లిపోయే అవకాశం ఉందని పేర్కొంది. అలా జరగకుండా జీఎస్‌టీ అమలు విషయంలో జాగ్రత్తగా, బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందని నివేదిక సూచించింది. యూపీఐ చెల్లింపుల ఆధారంగా జీఎస్‌టీ నోటీసులు వస్తుండటంతో, కర్ణాటకలోని చిన్న వ్యాపారులు మళ్లీ నగదు లావాదేవీల వైపే మొగ్గు చూపుతున్నారంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. పరోక్ష పన్నుల విధానం వల్ల జవాబుదారీతనం, ఆదాయం మరింతగా పెరిగినప్పటికీ, చిన్న ట్రేడర్లపై జరిమానాలు వేయకుండా, వారికి సాధికారత కల్పించినప్పుడే దీర్ఘకాలంలో ఇది విజయవంతం అవుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. యూపీఐలాంటి డిజిటల్ లావాదేవీల ఆధారంగా బెంగళూరులోని పలువురు చిన్న ట్రేడర్లు, దుకాణదారులకు అసంబద్ధ స్థాయిలో ట్యాక్స్ నోటీసులు రావడాన్ని తన నివేదికలో ప్రస్తావించింది. ఈ అంశంపై కర్ణాటకలోని చిన్న వ్యాపారులు జులై 23 నుంచి మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలను తలపెట్టారు.

టాప్ 5 రాష్ట్రాల వాటా 50 శాతం..

జీఎస్‌టీ అమలు, మొత్తం చెల్లింపుదారుల్లో టాప్ 5 రాష్ట్రాల వాటా సుమారు 50 శాతంగా ఉంటోందని నివేదిక పేర్కొంది. చెల్లింపుదారుల్లో మహిళల వాటా (ప్రతి అయిదుగురిలో ఒకరు) పెరుగుతోందని వివరించింది. ప్రస్తుతం 1.52 కోట్ల పైగా గూడ్స్, సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్‌టీ) రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటకలాంటి రాష్ట్రాలు పెద్దవి, సంపన్నమైనవి అయినప్పటికీ, మొత్తం జీఎస్‌డీపీలో ఆయా రాష్ట్రాల వాటాతో పోలిస్తే క్రియాశీలక జీఎస్‌టీ ట్యాక్స్‌పేయర్ల వాటా తక్కువగానే ఉంటోంది. అదే సమయంలో మొత్తం జీఎస్‌డీపీలో ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, గుజరాత్‌ల వాటా తక్కువే అయినప్పటికీ మొత్తం జీఎస్‌టీ ట్యాక్స్‌పేయర్లలో ఆయా రాష్ట్రాల వాటా ఎక్కువగా ఉంటోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-7-2025

విశాఖ	465–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,535.00	3.17
SBILIFE	1,830.70	2.07
APOLLOHOSP	7,474.00	1.50
DRREDDY	1,277.00	0.91
SUNPHARMA	1,702.00	0.59

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	912.85	- 4.81
SHRIRAMFIN	610.50	- 3.64
INDUSINDBK	825.50	- 2.64
BAJAJ& AUTO	8,074.50	- 2.58
TECHM	1,460.70	- 2.53

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,997
ఎన్ఎస్ఈ	96,123
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,96,382
ఎఫ్ఐఐ	-1,980
డీఐఐ	+ 2,138

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	65.34	$ 66.03
బ్రెంట్	68.58	$ 69.18

క్యూ1 ఫలితాలు

సిప్లా లాభం రూ. 1,298 కోట్లు

క్యూ1లో 10% అప్



న్యూఢిల్లీ: ఫార్మా రంగ దిగ్గజం సిప్లా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 1,298 కోట్లను తాకింది. భారత్‌సహా యూరప్, ఆఫ్రికా దేశాలలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,178 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,694 కోట్ల నుంచి రూ. 6,957 కోట్లకు ఎగసింది. దేశీ మార్కెట్లో అమ్మకాలు 6 శాతం పుంజుకుని రూ. 3,070 కోట్లకు చేరాయి. గత క్యూ1లో రూ. 2,898 కోట్ల ఆదాయం సాధించింది. అయితే ఉత్తర అమెరికా అమ్మకాలు 7% క్షీణించి రూ. 1,933 కోట్లకు పరిమితమయ్యాయి. వర్ధమాన మార్కెట్లు, యూరప్‌లో బిజినెస్ 11% వృద్ధితో రూ. 861 కోట్లను తాకింది. ఈ బాటలో ఆఫ్రికాలో విక్రయాలు 14 % ఎగసి రూ. 871 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో సిప్లా షేరు బీఎస్ఈలో 3 శాతం లాభపడి రూ. 1,531 వద్ద ముగిసింది.

సెయిల్ లాభం జూమ్

క్యూ1లో రూ. 745 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 9 రెట్లు ఎగసి రూ. 745 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం, పటిష్ట క్యాష్‌ఫ్లో, నిర్వహణ సామర్థ్యం ఇందుకు సహకరించాయి. గతేడాది (2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 82 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 24,175 కోట్ల నుంచి రూ. 26,084 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 23,872 కోట్ల నుంచి రూ. 25,189 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో సెయిల్ షేరు 4 శాతం నష్టంతో రూ. 131 వద్ద ముగిసింది.

పెట్రోనెట్ పనితీరు బలహీనం



న్యూఢిల్లీ: పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ జూన్ త్రైమాసికంలో రూ.850 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,141 కోట్లతో పోల్చిచూస్తే 25 శాతం తగ్గిపోయింది. మొత్తం ఆదాయం రూ.13,633 కోట్ల నుంచి 12,122 కోట్లకు తగ్గింది. రూ.6,355 కోట్ల పెట్టుబడితో ఒడిశాలో నూతన దిగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. 220 టీబీటీయూల గ్యాస్‌ను ప్రాసెస్ చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 262 టీబీటీయూలుగా ఉంది. ఏప్రిల్–జూన్ కాలంలో అధిక విద్యుత్ అవసరాలు, కొన్ని ఫెర్టిలైజర్ ప్లాంట్లను నిలిపివేయడం ప్రభావం చూపించినట్టు తెలిపింది. దహేజ్ టెర్మినల్ 92 శాతం సామర్థ్యంతో పనిచేసింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు ధర 2 శాతం నష్టంతో రూ.302 వద్ద ముగిసింది.

లారస్ ల్యాబ్స్ లాభం రూ. 162 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఫార్మా సంస్థ లారస్ ల్యాబ్స్ రూ. 162 కోట్ల లాభం (కన్సాలిడేటెడ్) ప్రకటించింది. క్రితం క్యూ1లో నమోదైన రూ. 13 కోట్లతో పోలిస్తే ఇది 1,154 శాతం అధికం. అటు ఆదాయం 31 శాతం పెరిగి రూ. 1,195 కోట్ల నుంచి రూ. 1,570 కోట్లకు చేరింది. సీడీఎంవో, జనరిక్ ఫినిష్డ్ డోసేజ్ ఫామ్స్ (ఎఫ్‌డీఎఫ్), కొత్త ప్రాజెక్టుల దన్నుతో మెరుగైన పనితీరు సాధించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ చావా తెలిపారు. సీడీఎంవో, జనరిక్స్ మొదలైన వాటి కోసం పలు ప్లాంట్లు నిర్మిస్తున్నామని, ఇవి అందుబాటులోకి వస్తే, ఉత్పత్తి సామర్థ్యాలు మరింత మెరుగుపడతాయని ఆయన పేర్కొన్నారు. అటు జాయింట్ వెంచర్ సంస్థయిన కేఆర్‌కేఏ ఫార్మాలో అయిదు మిలియన్ యూరోల వరకు పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది. భాగస్వామ్య సంస్థ కేఆర్‌కేఏ డీడీ నోవో మెస్టో కూడా అయిదు మిలియన్ యూరోల వరకు ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతం ఇందులో లారస్‌కి 49 శాతం, కేఆర్‌కేఏ డీడీ నోవో మెస్టోకి 51 శాతం వాటాలు ఉన్నాయి.

శుక్రవారం బీఎస్ఈలో లారస్ ల్యాబ్స్ షేరు స్వల్పంగా రూ. 838.85కి పెరిగింది.

శ్రీరామ్ ఫైనాన్స్ ఫర్వాలేదు



న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్ జూన్ త్రైమాసికానికి రూ.2,156 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,981 కోట్లతో పోల్చి చూస్తే 9 శాతం పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో రూ.9,610 కోట్ల నుంచి రూ.11,542 కోట్లకు వృద్ధి చెందింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 10 శాతం వృద్ధితో రూ.5,772 కోట్లుగా నమోదైంది. స్థూల ఎన్‌పీఏలు 4.53 శాతంగా, నికర ఎన్‌పీఏలు 2.57 శాతంగా నమోదయ్యాయి. ఎన్‌సీడీలు/సబార్డినేటెడ్ డిబెంచర్లు, బాండ్లు జారీ రూపంలో జారీ చేయాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో శ్రీరామ్ ఫైనాన్స్ షేరు 3 శాతం నష్టపోయి రూ.615 వద్ద ముగిసింది.

ఫోర్స్ మోటార్స్ లాభం భళా

క్యూ1లో రూ. 176 కోట్లు



న్యూఢిల్లీ: ప్రధానంగా తేలికపాటి వాణిజ్య వాహన తయారీలో సుప్రసిద్ధమైన ఫోర్స్ మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 52 శాతం జంప్‌చేసి రూ. 176 కోట్లను తాకింది. దేశీ మార్కెట్లో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 116 కోట్లు ఆర్జించింది. పన్నుకుముందు లాభం సైతం రూ. 182 కోట్ల నుంచి రూ. 278 కోట్లకు ఎగసింది. ఇది 53 శాతం అధికంకాగా.. మొత్తం ఆదాయం రూ. 1,885 కోట్ల నుంచి రూ. 2,297 కోట్లకు బలపడింది.

ప్రపంచ బాక్సింగ్ పోటీలకు నిఖత్



న్యూఢిల్లీ: సెప్టెంబర్‌లో ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను ప్రకటించారు. తెలంగాణ స్టార్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ భారత జట్టులో చోటు దక్కించుకున్నారు. పాటియాలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో వారం రోజులపాటు నిర్వహించిన శిబిరం తర్వాత భారత జట్లను ఎంపిక చేశారు. కొత్తగా ఏర్పడ్డ వరల్డ్ బాక్సింగ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4 నుంచి 14 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. పురుషుల, మహిళల విభాగాల్లో 10 వెయిట్ కేటగిరీల్లో బౌట్‌లు ఉంటాయి.

భారత మహిళల బాక్సింగ్ జట్టు: మీనాక్షి హుడా (48 కేజీలు), నిఖత్ జరీన్ (51 కేజీలు), సాక్షి (54 కేజీలు), జైస్మిన్ లంబోరియా (57 కేజీలు, సంజూ ఖత్రి (60 కేజీలు), నీరజ్ ఫొగాట్ (65 కేజీలు), సనమచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), పూజా రాణి (80 కేజీలు), నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు).

భారత పురుషుల బాక్సింగ్ జట్టు: జాదుమణి సింగ్ (50 కేజీలు), పవన్ బర్త్‌వాల్ (55 కేజీలు), సచిన్ సివాచ్ జూనియర్ (60 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), హితేశ్ గులియా (70 కేజీలు), సుమిత్ కుందు (75 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), జుగ్నూ అహ్లావత్ (85 కేజీలు), హర్ష్ చౌదరీ (90 కేజీలు), నరేందర్ బెర్వాల్ (ప్లస్ 90 కేజీలు).

నగాల్ పునరాగమనం

స్విట్జర్లాండ్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌లో పాల్గొనే భారత జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: కేంద్రం నుంచి నిధులు పొందుతూ... జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు విముఖత చూపితే... వారికి నిధులు నిలిపివేస్తామని ఇటీవల కేంద్ర క్రీడా శాఖ జారీ చేసిన హెచ్చరికలు ఫలితాన్నిచ్చాయి. డేవిస్ కప్ టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు సింగిల్స్ స్టార్ సుమిత్ నగాల్... డబుల్స్ స్పెషలిస్ట్ యూకీ బాంబ్రీ మళ్లీ ముందుకొచ్చారు. ఈ ఏడాది సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు స్విట్జర్లాండ్‌తో బీల్ నగరంలో జరిగే డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్–1 మ్యాచ్‌లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. సింగిల్స్‌లో సుమిత్ నగాల్, కరణ్ సింగ్, ఆర్యన్ షా... డబుల్స్‌లో యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ ఎంపికయ్యారు. హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి, శశికుమార్ ముకుంద్, దక్షిణేశ్వర్ సురేశ్ రిజర్వ్ ఆటగాళ్లుగా ఉన్నారు. ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 306వ స్థానంలో ఉన్న సుమిత్ నగాల్ చివరిసారి 2023లో డేవిస్‌కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత పాకిస్తాన్, స్వీడన్, టోగో జట్లతో జరిగిన మ్యాచ్‌లకు సుమిత్ దూరంగా ఉన్నాడు. ప్రపంచ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 35వ స్థానంలో ఉన్న యూకీ బాంబ్రీ గత ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో ఆడిన తర్వాత స్వీడన్, టోగో జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో పాల్గొనలేదు.

ఫుట్‌బాల్‌లో డీలా... క్రికెట్‌లో ఇటలీల...

టి20 క్రికెట్‌లో ఇటలీ సంచలనం
- తొలిసారి ప్రపంచకప్ టోర్నీకి అర్హత
- కనీస సౌకర్యాలు లేకున్నా నిలకడగా ఫలితాలు
- జో బర్న్స్ సారథ్యంలో ముందుకు

ఫుట్‌బాల్‌కు పెట్టింది పేరైన ఇటలీలో ఇప్పుడు మరో క్రీడ ప్రేక్షకాదరణ పొందుతోంది. 'ఫిఫా' ప్రపంచకప్‌లో నాలుగు సార్లు (1934, 1938, 1982, 2006) చాంపియన్‌గా... మరో రెండుసార్లు (1970, 1994) రన్నరప్‌గా నిలిచిన ఇటలీ... ఇటీవలి కాలంలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతోంది. 2018, 2022లో జరిగిన 'ఫిఫా' వరల్డ్‌కప్ టోర్నీకి అర్హత పొందలేక పోయిన ఆ జట్టు... వచ్చే ఏడాది జరగనున్న ఫుట్‌బాల్ విశ్వ సమరంలో బరిలోకి దిగడం కూడా అనుమానంగా మారింది. ఘన చరిత్ర... అంతకుమించిన వారసత్వం... అపార నైపుణ్యం... దేశవ్యాప్తంగా ఫుట్‌బాల్‌కు మెరుగైన మౌలిక వసతులు ఉన్నా ఈ క్రీడలో తిరోగమనం దిశలో పయనిస్తున్న ఇటలీ... కనీస సౌకర్యాలు లేని క్రికెట్‌లో మాత్రం సత్తా చాటుతోంది. ప్రాక్టీస్ చేసేందుకు కనీసం పచ్చిక పిచ్‌లు కూడా లేకున్నా... ప్రపంచకప్‌నకు తొలిసారి అర్హత సాధించి భళా అనిపించింది. యూరప్ క్వాలిఫయింగ్ టోర్నీలో సత్తా చాటడం ద్వారా వచ్చే ఏడాది జరగనున్న టి20 వరల్డ్‌కప్ బరిలోకి దిగే అవకాశం దక్కించుకున్న నేపథ్యంలో ఇటలీ క్రికెట్‌పై ప్రత్యేక కథనం...

– సాక్షి క్రీడా విభాగం

ఫుట్‌బాల్‌ను విపరీతంగా అభిమానించే దేశంలో క్రికెట్‌కు క్రేజ్ దక్కుతుందా అనే స్థాయి నుంచి... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించే స్థాయికి ఇటలీ చేరుకుంది. క్లబ్‌లు, ఏజ్ గ్రూప్ మ్యాచ్‌లు, ప్రత్యేక టోర్నీలు, సన్నాహక మ్యాచ్‌లు ఇలా అన్నీ ఉన్న ఫుట్‌బాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించలేక పోతున్న ఇటలీ... ప్రాక్టీస్ చేసేందుకు సరైన మైదానాలు, మెరుగయ్యేందుకు అవసరమైన కనీస వసతులు లేని క్రికెట్‌లో మాత్రం రాణిస్తోంది. మెరుగైన జీవన ప్రమాణాల కోసం వలస వచ్చిన ప్లేయర్లతో నిండిన జట్టు... వారం మొత్తం ఉద్యోగాలు చేసుకుంటూ వారాంతాల్లో వీలు చిక్కినప్పుడు మాత్రమే సాధన చేసే ప్లేయర్లతో ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందడం అంటే మామూలు విషయం కాదు. టి20 ప్రపంచకప్ యూరప్ క్వాలిఫయింగ్ టోర్నీలో రెండో స్థానంలో నిలవడం ద్వారా ఇటలీ జట్టు వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించగా... తొలి మ్యాచ్‌లో పటిష్ట టీమిండియాతో ఆడాలనుకుంటున్నట్లు ఆ జట్టు సారథి జో బర్న్స్ వెల్లడించాడు.



ఆస్ట్రేలియా నుంచి ఇటలీకి...



ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున 23 టెస్టులు, 6 వన్డేలు ఆడిన జో బర్న్స్ కొన్నేళ్ల క్రితం ఇటలీకి వలస వెళ్లాడు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బర్న్స్ పూర్వీకులు ఆస్ట్రేలియాకు వెళ్లగా... ఇప్పుడు మెరుగైన కెరీర్ కోసం అతడు తిరిగి ఇటలీకి చేరుకున్నాడు. అప్పటికే నైపుణ్యం ఉన్న ఆటగాళ్లు అందుబాటులో ఉన్నా... వారికి సరైన దిశానిర్దేశం చేసే నాయకుడు లేకపోగా... బర్న్స్ రాకతో ఆ ఇబ్బంది తీరింది. అతడితో పాటు ఆస్ట్రేలియాలో దేశవాళీ క్రికెట్ ఆడిన హ్యారీ మనెంటి, బెన్ మనెంటి... ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ ఆడిన గే, స్టివర్ట్ వంటి ప్లేయర్లు... జాతీయ జట్ల తరఫున అవకాశం దక్కని ఉపఖండ ఆటగాళ్లతో ఇటలీ జట్టులో ప్రతిభకు కొదవ లేకుండా ఎదిగింది. బర్న్స్ సారథ్యంలో ఎప్పటికప్పుడు మెరుగవుతున్న ఇటలీ జట్టు... నెదర్లాండ్స్ తర్వాత ఐసీసీ టి20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించిన యూరప్ జట్టుగా నిలిచింది.

కెవిన్ ఒబ్రియాన్ కోచింగ్‌లో...

ఐర్లాండ్‌కు చెందిన ఆల్‌రౌండర్ కెవిన్ ఒబ్రియాన్ ఓసారి ఇటలీలో పర్యటిస్తున్న సమయంలో అక్కడి యువ ఆటగాళ్ల నైపుణ్యం చూసి ముచ్చట పడ్డాడు. మెరుగైన వసతులు లేకపోయినా... ప్లేయర్లలో ఏదో సాధించాలనే తపనను గమనించాడు. అలాంటి పరిస్థితులను దాటుకొని ప్రపంచకప్ స్థాయిలో మెరుపులు మెరిపించిన ఒబ్రియాన్.. అనంతరం కాలంలో ఇటలీ క్రికెట్ జట్టు సహాయక కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఆ జట్టు దశ తిరిగింది. భారత్ వేదికగా జరిగిన 2011 వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై ఐర్లాండ్ రికార్డు లక్ష్యఛేదనతో ఒక్కసారిగా స్టార్‌గా మారిన ఒబ్రియాన్... ఇటలీ ప్లేయర్లకు గొప్పగా శిక్షణనిచ్చాడు. ఇటలీ జట్టు టి20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించడంతో తను పడ్డ కష్టానికి ఫలితం దక్కినట్లు అయిందని ఒబ్రియాన్ అన్నాడు. 'కోచ్‌గా ఈ క్షణాలను ఆస్వాదిస్తున్నా. అసలు కోచింగ్ వైపు అడుగులు వేసినప్పుడు ఇదంతా ఊహించలేదు. కానీ ప్లేయర్లు నిబద్ధతతో కృషి చేసి ప్రపంచకప్ బెర్త్ దక్కించుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇది నాకు ఎంతో ప్రత్యేకం' అని పేర్కొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అప్పుడప్పుడే అడుగులు వేస్తున్న సమయంలో 2007 వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లపై ఐర్లాండ్ జట్టు విజయాలు సాధించడంలో ప్లేయర్‌గా ఒబ్రియాన్ కీలక పాత్ర పోషించాడు. సహాయక కోచ్‌గా ప్రయాణం ప్రారంభించిన...

కలుగమగె కథే వేరు...



శ్రీలంకకు చెందిన క్రిషన్ కలుగమగె 15 ఏళ్ల వయసులో ఇటలీకి వలస వెళ్లాడు. మొదట అథ్లెట్ కావాలనుకున్న క్రిషన్ ఆ తర్వాత క్రికెట్ వైపు మొగ్గు చూపాడు. అయితే ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో... ఒక రెస్టారెంట్‌లో పిజ్జా మేకర్‌గా పనికి కుదిరాడు. జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు ఒకవైపు పని కొనసాగిస్తూనే... వ్యక్తిగత ఆసక్తిని చంపుకోలేక క్రికెట్‌ను కొనసాగించాడు. వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ 2022లో ఇటలీ జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఇటలీలో క్రికెట్‌కు పెద్దగా గుర్తింపు లేకపోవడంతో... ఆ తర్వాత కూడా అతడు రెస్టారెంట్ ఉద్యోగం కొనసాగించాల్సిన పరిస్థితి. ఇలాంటి దశలో వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ కోసం చేసే పనిని పక్కన పెట్టిన క్రిషన్... ఇటలీ జట్టు వరల్డ్ కప్‌నకు అర్హత సాధించిన తర్వాత వచ్చిన స్పందనతో ఆశ్చర్యపోయాడు. 'క్వాలిఫయింగ్ టోర్నీ ముగించుకొని ఇంటికి వచ్చిన సమయంలో అక్కడ వందలాది మంది పూలు, స్వీట్లతో నా కోసం ఎదురు చూస్తున్నారు. ఇది ఏమాత్రం ఊహించనిది. దీంతో ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యా' అని కలుగమగె అన్నాడు.

స్టీరింగ్ పక్కన పెట్టి...



2006లో కుటుంబంతో కలిసి ఇటలీకి వలస వెళ్లిన జస్‌ప్రీత్ సింగ్... అంచెలంచెలుగా ఎదుగుతూ 2019లో ఇటలీ తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. భారత్ మాదిరిగా అక్కడ క్రికెట్‌కు పెద్దగా ఆదరణ లేకపోవడంతో... జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించినప్పటికీ పొట్ట కూటి కోసం క్యాబ్ డ్రైవర్‌గా కొనసాగుతున్నాడు. 2024 టి20 ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ సమయంలోనే ఇటలీ జట్టు త్రుటిలో మెగా టోర్నీలో పాల్గొనే అవకాశం కోల్పోవడంతో... ఈసారి అలాంటి తప్పు జరగకూడదనే ఉద్దేశంతో... స్టీరింగ్‌ను పక్కన పెట్టిన జస్‌ప్రీత్ పూర్తిగా క్రికెట్‌పై దృష్టి పెట్టాడు. అందుకు తగ్గ ఫలితం దక్కడం ఆనందంగా ఉందని అతడు వెల్లడించాడు. 'వరల్డ్‌కప్‌కు తొలిసారి అర్హత సాధించిన ఇటలీ జట్టులో భాగస్వామిగా ఉండటం చాలా ఆనందంగా ఉంది. పెద్దవాళ్లమయ్యాక ముందు తరాలకు చెప్పుకునేందుకు ఇంతకు మించి ఇంకేం కావాలి' అని అన్నాడు.

చినప్పటి నుంచే 'ఏజ్ గ్రూప్ క్రికెట్'కు ప్రాధాన్యత ఇచ్చి వాటి ఫలితాలు బోర్డుకు అందించాడు.


ప్రపంచకప్‌తో ఆదరణ దక్కేనా!

యూరప్ క్వాలిఫయింగ్ టోర్నీ ప్రారంభానికి రెండు వారాల ముందు... ఇటలీ జాతీయ ఒలింపిక్ కమిటీ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను క్రీడాంశంగా ప్రవేశపెట్టడంతో... ఇకపై మరింత తీవ్రంగా ప్రాక్టీస్ చేయాలనే ఉద్దేశంతో షెడ్యూల్‌లో మార్పులు చేసింది. ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలో కొత్త ప్రమాణాలు నిర్దేశించింది. ఇటలీలో పచ్చిక పిచ్‌లు అందుబాటులో లేకపోవడంతో... కృత్రిమ పిచ్‌లపై సాధన చేసేలా జట్టును సిద్ధం చేసింది. ఇతర జట్లతో మ్యాచ్‌ల సంఖ్యను సైతం పెంచింది. 'టి20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించడం ఒక కీలక మలుపు. మా ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. సౌకర్యాలు మెరుగైనప్పుడే యువత ఇటువైపు అడుగులు వేస్తుంది. ప్రపంచకప్ వంటి మెగాటోర్నీల్లో పాల్గొంటే... ఎక్కువ ఆదరణ దక్కుతుంది. తద్వారా దేశంలో ఆటకు ప్రాధాన్యత పెరుగుతుంది. అలాగే స్పాన్సర్లు, ఎండార్స్‌మెంట్‌ల రూపంలో ఆదాయం పెరుగుతుంది' అని ఇటలీ క్రికెట్ జట్టు మేనేజర్ పీటర్ డి వెనుటో అన్నాడు.

యూపీ వారియర్స్ హెడ్ కోచ్‌గా అభిషేక్ నాయర్



ముంబై: టీమిండియా మాజీ సహాయక కోచ్ అభిషేక్ నాయర్... మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఫ్రాంచైజీ యూపీ వారియర్స్ జట్టుకు హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. డబ్ల్యూపీఎల్ తొలి సీజన్ అనంతరం యూపీ వారియర్స్ జట్టుతో కలిసి పనిచేసిన అభిషేక్ నాయర్... తిరిగి ఆ జట్టు సహాయ సిబ్బందిలో భాగం కానున్నాడు. గత మూడు సీజన్‌ల నుంచి యూపీ వారియర్స్ జట్టుకు జాన్ లూయిస్ కోచ్‌గా వ్యవహరిస్తుండగా... ఇకపై నాయర్ ఆ బాధ్యతలు మోయనున్నాడు. 'కొత్త పాత్ర పోషించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. గతంలో యూపీ వారియర్స్‌తో పనిచేయడం చాలా బాగా అనిపించింది. మహిళల క్రికెట్‌కు డబ్ల్యూపీఎల్ చక్కటి వేదిక. ఫ్రాంచైజీ యాజమాన్యంతో కలిసి మెరుగైన జట్టును తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తా. ఇప్పటికే జట్టు పటిష్టంగా ఉంది. దాన్ని మరింత మెరుగ్గా తయారు చేసేందుకు కృషి చేస్తా. యూపీ వారియర్స్‌కు డబ్ల్యూపీఎల్ ట్రోఫీ అందించడమే ప్రధాన బాధ్యత' అని నాయర్ అన్నాడు. దేశవాళీల్లో ముంబై జట్టు తరఫున టన్నుల కొద్దీ పరుగులు చేసిన నాయర్... భారత జాతీయ జట్టు తరఫున మూడు వన్డేలు ఆడాడు. అనంతరం కోచింగ్ బాటపట్టిన నాయర్... 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టు ట్రోఫీ గెలిచిన సమయంలో ఆ జట్టు సహాయక కోచ్‌గా వ్యవహరించాడు. తదనంతరం గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా ఎంపికవడంతో... అతడి ప్రోత్సాహంతో నాయర్ భారత జట్టు సహాయక కోచ్‌గా పనిచేశాడు. కేవలం కోచ్‌గానే కాకుండా భారత ఆటగాళ్లకు సన్నిహితుడిగా... వారి కష్ట సమయాల్లో కీలక సూచనలు చేస్తూ నాయర్ మంచి పేరు సంపాదించుకున్నాడు. గతంలో దినేశ్ కార్తీక్, కేఎల్ రాహుల్ వంటి పలువురు ఆటగాళ్లు నాయర్ ఇచ్చిన సలహాలతోనే మరింత మెరుగయ్యామని వెల్లడించారు. కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ జట్టుకు కోచ్‌గా పనిచేసిన అనుభవమున్న అభిషేక్... 2018లో కేకేఆర్ అకాడమీకి హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు.



షాహీన్‌కు పిలుపు

వెస్టిండీస్‌తో సిరీస్‌కు పాక్ జట్టు ప్రకటన

లాహోర్: ఇటీవల బంగ్లాదేశ్ చేతిలో టి20 సిరీస్ కోల్పోయిన పాకిస్తాన్ జట్టు దిద్దుబాటు చర్యలకు పూనుకుంది. వెస్టిండీస్‌తో సిరీస్ కోసం షాహీన్ షా అఫ్రిదిని తిరిగి జట్టులో చేర్చింది. గత కొన్ని సిరీస్‌లుగా అతడిని పరిగణించని సెలెక్టర్లు కరీబియన్ దీవుల్లో జరగనున్న సిరీస్ కోసం ఎంపిక చేశారు. ఈ నెల 31 నుంచి పాకిస్తాన్ జట్టు వెస్టిండీస్‌తో మూడు టి20లు, మూడు వన్డేల సిరీస్‌లు ఆడనుంది. వీటి కోసం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) శుక్రవారం జట్లను ప్రకటించింది. బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో పేలవ ప్రదర్శన చేసిన అబ్బాస్ అఫ్రిది, అహ్మద్ దానియల్, సల్మాన్ మీర్జాను జట్టు నుంచి తప్పించిన బోర్డు... సీనియర్ పేస్ బౌలర్లు హసన్ అలీ, హారీస్ రవుఫ్‌లను తిరిగి జట్టులోకి తీసుకుంది. వన్డేలకు మొహమ్మద్ రిజ్వాన్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్‌కు జట్టులో చోటు దక్కింది.

ఆటకు వేద వీడ్కోలు

రిటైర్మెంట్ ప్రకటించిన భారత మహిళా క్రికెటర్



న్యూఢిల్లీ: భారత మహిళా క్రికెటర్ వేద కృష్ణమూర్తి కెరీర్‌కు గుడ్‌బై చెప్పింది. నిజానికి చాలా ఏళ్ల క్రితమే ఆమె జట్టుకు దూరమైంది. ఈ నేపథ్యంలోనే కర్ణాటకకు చెందిన 32 ఏళ్ల బ్యాటర్ శుక్రవారం అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. 'ఓ చిన్న పట్టణం నుంచి వచ్చిన నేను టీమిండియా జెర్సీతో పెద్ద కలల్నే సాకారం చేసుకున్నాను. భారత్‌కు ఆడటం ఎప్పటికీ గర్వకారణమే. క్రికెట్ నాకెంతో ఇచ్చింది. ఎన్నో పాఠాలు నేర్పింది. ఇన్నేళ్ల పాటు సహచరులతో పంచుకున్న విజయానుభూతులు, అభిమానుల ఆదరణ ఎప్పటికీ ప్రత్యేకమే! ఇన్ని మధురస్మృతుల మధ్య కెరీర్‌కు వీడ్కోలు పలికే సమయం కూడా వచ్చింది. అందుకే గుడ్‌బై చెబుతున్నా. ఆటకే ఈ రిటైర్మెంట్... అనుబంధానికి కాదు. ఎల్లప్పుడు భారత జట్టు కోసమే, ఎప్పటికీ భారత టీమ్‌తోనే' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆట నుంచి తప్పుకున్నప్పటికీ మరో పాత్రలో క్రికెట్‌లో కొనసాగుతానని చెప్పింది. 2011, జూన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టి20తో అరంగేట్రం చేసిన వేద టి20 ఫార్మాట్‌లో 76 మ్యాచ్‌లాడి 18.61 సగటుతో 875 పరుగులు చేసింది. ఇందులో 2 అర్ధసెంచరీలున్నాయి. అదే నెలలోనే ఇంగ్లండ్‌తో తొలి వన్డే ఆడిన ఆమె 48 మ్యాచ్‌ల్లో 25.90 సగటుతో 829 పరుగులు సాధించింది. 8 అర్ధసెంచరీలు చేసింది. చిత్రంగా టి20లో కెరీర్ ప్రారంభించిన ఆసీస్‌తోనే చివరిసారిగా 2020 మార్చిలో మ్యాచ్ ఆడింది. వన్డే కెరీర్ మొదలు పెట్టిన ఇంగ్లండ్‌తోనే... 2018, ఏప్రిల్‌లో ఆఖరి మ్యాచ్ ఆడింది. యాదృచ్ఛికంగా ఏ జట్లతో అయితే అంతర్జాతీయ ఆట మొదలుపెట్టిందో ఆ జట్లతోనే కెరీర్‌ను ముగించినట్లయ్యింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆమె చివరి మ్యాచ్‌ను గతేడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో ఆడింది. వేద దేశవాళీ క్రికెట్‌లో కర్ణాటక, రైల్వేస్ జట్లకు సారథ్యం కూడా వహించింది. చురుకైన ఫీల్డర్‌గా పేరుతెచ్చుకుంది. టి20 క్రికెట్‌లో వికెట్ కీపర్ కాకుండా అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్‌గా ఘనతకెక్కింది. కెరీర్‌లో ఎత్తుపల్లాలెన్నో చవిచూసిన వేద జీవితంలో కోవిడ్ మహమ్మారి తీరని వ్యథను మిగిల్చింది. ఏకంగా ప్రపంచం మొత్తాన్నే 'లాక్‌డౌన్' చేసిన కరోనా వైరస్ వల్ల ఆమె మాతృమూర్తి చెలువమబ దేవి, సోదరి వత్సల శివకుమార్‌లను రోజుల వ్యవధిలో కోల్పోయింది.

ఒక చాయ్‌వాలా నుంచి మరొక చాయ్‌వాలాకు..

యూకేలో మోదీకి టీ అందించిన భారతీయ యువకుడు

- సామాజిక మాధ్యమాల్లో సంభాషణ వైరల్
- ప్రధాని నరేంద్ర మోదీ యూకేలోనూ చాయ్ పే చర్చ

లండన్: అక్కడ అందరికీ చాయ్ అంటే ఇష్టమనే విషయం తెలిసిందే. అయితే.. ప్రధాని యూకే పర్యటనలో ఈ చాయ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యూకే ప్రధాని కెయిర్ స్టార్మర్ అధికారిక నివాసం చెకర్స్‌లో ల్యాండ్ మార్క్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం సందర్భంగా ఈ ఘటన జరిగింది. ప్రధాని నివాసంలోని పచ్చిక బయలులో భారతీయ సంతతికి చెందిన యువకుడు అఖిల్ పటేల్ టీ స్టాల్ ఏర్పాటు చేశారు. మోదీ, స్టార్మర్‌లు ఆ స్టాల్‌కు రాగానే.. రంగురంగుల నెహ్రూ జాకెట్ ధరించి ఉన్న పటేల్.. తన టీ ప్రత్యేకతలు చెప్పారు. 'మసాలా చాయ్ నా ప్రత్యేకత. ఇది భారత్ నుంచి వచ్చింది. తేయాకులు అస్సాం నుంచి, సుగంధ ద్రవ్యాలు కేరళ నుంచి వస్తాయి'అంటూ స్టార్మర్‌కు చాయ్ కప్పు అందించారు. ఇక ప్రధాని మోదీకి టీ కప్పు అందజేస్తూ 'ఒక చాయ్ వాలా నుంచి మరొక చాయ్ వాలాకు'అని పటేల్ వ్యాఖ్యానించారు. పటేల్ హాస్యానికి **ప్రధాని నవ్వుతూ చాయ్ అందుకున్నారు. చాయ్ ఒక సిప్ తాగిన అనంతరం చాయ్ నిజంగా బాగుందంటూ స్టార్మర్ పటేల్‌ను** అభినందించారు. 'చెకర్స్‌లో ప్రధాని కీర్ స్టార్మర్‌తో చాయ్ పే చర్చ... భారతదేశం-యూకే సంబంధాలను బలోపేతం చేస్తోంది!''అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఫొటోలను పంచుకున్నారు. పటేల్ మాత్రం తన ఇన్‌స్టా గ్రామ్‌లో వీడియోను పంచుకున్నారు. 'నరేంద్ర మోదీ, కెయిర్ స్టార్మర్‌లకు చాయ్ అందిస్తున్న ఒక సాధారణ గురువారం. క్రేజీ డే! గొప్ప గౌరవం.. అంతకుమించి స్ఫూర్తినిచ్చే సంభాషణలు. ముఖ్యమైన క్షణాలు'క్షణాలు అంటూ ఆయన ఇచ్చిన క్యాప్షన్ వీడియో వైరల్ అవుతోంది.



టీ తాగుతున్న ప్రధాని మోదీ, అఖిల్ పటేల్‌తో ముచ్చటిస్తున్న స్టార్మర్

ఐదేళ్లలో మోదీ టూర్ల ఖర్చు రూ. 362 కోట్లు

న్యూఢిల్లీ: ఐదేళ్లలో రూ.362 కోట్లు ఖర్చు అంటే.. ఇదేదో ప్రాజెక్టుకు అనుకునేరు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల ఖర్చు. 2021 నుంచి 2025 మధ్య ఆయన విదేశీ పర్యటనలకోసం అక్షరాలా రూ.362కోట్లు ఖర్చయ్యాయి. ఒక్క 2025లోనే ఆయన పర్యటనలకోసం రూ.67కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఇందులో అమెరికా, ఫ్రాన్స్ ఉన్నతస్థాయి పర్యటనలు సహా ఐదు పర్యటనలున్నాయి. రాజ్యసభలో తృణమూల్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా విదేశాంగ శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలను రాజ్యసభకు అందించారు. ఈ డేటా ప్రకారం, 2025లో ప్రధాని పర్యటనల్లో అత్యంత ఖరీదైనది ఫ్రాన్స్ పర్యటన. దీనికి రూ. 25 కోట్లకు పైగా ఖర్చయింది. ఆ తర్వాత అమెరికా పర్యటనకు రూ. 16 కోట్లకు పైగా ఖర్చయింది. మారిషస్, సైప్రస్, కెనడా దేశాల అదనపు సందర్శనల ఖర్చులు ఇంకా వీటికి కలపలేదు. ఇక 2024లో రష్యా, ఉక్రెయిన్‌తో సహా 16 దేశాల్లో పర్యటించడానికి రూ.109 కోట్లు ఖర్చు చేశారు. 2023లో దాదాపు రూ.93 కోట్లు, 2022లో రూ.55.82 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చు చేశారు. 2021లో అమెరికా పర్యటనకే రూ.19 కోట్లకు పైగా ఖర్చయింది. ఇవి కేవలం పర్యటనలకే పరిమితం కాకుండా.. పర్యటనలకు సంబంధించిన ప్రకటనలు, ప్రసార ఖర్చుల వివరాలు కూడా ఇందులో ఉన్నాయి.

10 పేట్రియాట్ క్షిపణులు కావాలి: జెలెన్‌స్కీ

కీవ్: ఉక్రెయిన్ నగరాలపై రష్యా బాంబు దాడులను తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో రష్యా క్షిపణులను అడ్డుకునేందుకు తమకు తక్షణమే పేట్రియాట్ క్షిపణి వ్యవస్థలను అందజేయాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమదేశాలను కోరుతున్నారు. ఇప్పటికే మూడు వ్యవస్థలను సమకూర్చేందుకు జర్మనీ, నార్వే అంగీకరించాయి. ఈ క్షిపణి వ్యవస్థలను విక్రయించేందుకు అమెరికా సిద్ధంగానే ఉంది. అయితే, అవసరమైన మొత్తం 10 క్షిపణి వ్యవస్థలనూ కొనుగోలు చేసేందుకు అవసరమైన సుమారు 1000 కోట్ల డాలర్ల(సుమారు రూ.8,600 కోట్లు)ను సాయం చేసే వారి కోసం జెలెన్‌స్కీ అన్వేషిస్తున్నారు. అంతేకాదు, వీటిని దేశీయంగానే ఉత్పత్తి చేసేందుకు లైసెన్స్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఇలా ఉండగా, శుక్రవారం రెండో రోజు కూడా రష్యా ఆర్మీ ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖర్కీవ్‌పై శక్తివంతమైన గ్లైడ్ బాంబులతో దాడికి దిగింది. ఈ దాడుల్లో ఏడుగురు గాయపడ్డారు. గురువారం జరిపిన దాడిలో 42 మంది క్షతగాత్రులయ్యారు.

తేజస్వీని చంపేందుకు కుట్ర: రబ్డీదేవి

పట్నా: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమ కుమారుడు, ప్రతిపక్ష ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను చంపేందుకు అధికార జేడీయూ-బీజేపీ కుట్ర పన్నాయని బిహార్ మాజీ సీఎం రబ్డీ దేవి తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలోనూ పలు మార్లు ఆయనపై హత్యాయత్నం జరిగిందని, ఈ విషయాన్ని శాసనసభలోనూ ప్రస్తావించామన్నారు. తేజస్వీ యాదవ్‌ను ఎన్నికల్లో అడ్డు తొలగించుకునేందుకు అధికార కూటమి ప్రయత్నిస్తోందన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ సారథ్యంలోనే పనిచేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ఉపరాష్ట్రపతి ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నిక-2025 కోసం కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కీలక నియామకాలు చేపట్టింది. కేంద్ర న్యాయ శాఖ, రాజ్యసభ ఉపసభాపతి సమ్మతితో రాజ్యసభ సెక్రటరీ జనరల్‌ను ఉప రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఈసీ నియమించింది. గత ఉపరాష్ట్రపతి ఎన్నికలో లోక్‌సభ సెక్రటరీ జనరల్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. ఈసారి రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు ఎన్నిక బాధ్యతను అప్పగించారు. అంతేగాక రాజ్యసభ సెక్రటేరియట్‌లో సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్న గరిమా జైన్, డైరెక్టర్ విజయ్ కుమార్‌లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఈసీ నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఈసీ డిప్యూటీ డైరెక్టర్ పి.పవన్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల చట్టం-1952, ఎన్నికల నియమావళి-1974 ప్రకారం ఉప రాష్ట్రపతి ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రారంభించినట్లు ఈసీ తెలిపింది.

జువెనైల్ జస్టిస్ బోర్డుకు వెళ్లండి..!

రేప్ కేసులో 53 ఏళ్ల వ్యక్తికి సుప్రీంకోర్టు నిర్దేశం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు తాజాగా ఓ అరుదైన కేసును విచారించింది. ఈ కేసులో నిందితుడు 1988లో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష సైతం అనుభవించాడు. 2024లో ఇందుకు సంబంధించి దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు నిలిపివేసింది. నిందితుడు సుప్రీంకోర్టుకు వెళ్లాడు. నేరానికి పాల్పడినట్లు చెబుతున్న సమయంలో తన వయస్సు 16 ఏళ్లేనంటూ రుజువులు చూపాడు. దీంతో, అతడిని తిరిగి జువెనైల్ జస్టిస్ బోర్డుకు వెళ్లాలని సుప్రీం కోర్టు ఆదేశించడం గమనార్హం.

రాజస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తి 1988లో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విచారించిన కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అతడు రాజస్తాన్ హైకోర్టులో సవాల్ చేయగా శిక్షను నిలుపుదల చేస్తూ 2024లో ఆదేశాలిచ్చింది. అనంతరం నిందితుడు సుప్రీంకోర్టుకు వెళ్లాడు. ఘటన జరిగిన సమయంలో తన వయస్సు 16 ఏళ్లు మాత్రమేనంటూ అతడు స్కూలు రికార్డులను రుజువులుగా చూపాడు. 1972 జూలై ఒకటో తేదీ పుట్టిన తేదీ అయినందున నేరానికి పాల్పడినప్పటికి తనింకా మైనర్‌నే అంటూ వాదించాడు. ఈ నెల 23న కేసు విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ మసీహ్‌ల ధర్మాసనం..వైద్య



పరీక్షలు, బాధితురాలు, సాక్ష్యుల వాంగ్మూలాలు సరిగ్గానే ఉన్నాయని పేర్కొంది. అయితే, నిందితుడు అందజేసిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అతడు మైనరేనని నిర్ధారణయిందని పేర్కొంది. ఇన్నేళ్ల తర్వాత అతడిని మైనర్‌గా పేర్కొనడం సరికాదంటూ రాజస్తాన్ ప్రభుత్వ న్యాయవాది వాదించగా చట్ట ప్రకారం సరైందేనని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో తగు ఆదేశాల కోసం అజ్మీర్‌లోని జువెనైల్ జస్టిస్ బోర్డును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. నిబంధనల ప్రకారం జువెనైల్ జస్టిస్ బోర్డు దోషిని గరిష్టంగా మూడేళ్లపాటు ప్రత్యేక షెల్టర్‌కు పంపించే అవకాశముంది.

జువెనైల్ జస్టిస్ చట్టం ఏం చెబుతోంది?

జువెనైల్ జస్టిస్(కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్)చట్టం-2015 ప్రకారం నేరం జరిగినప్పటికి ఆ వ్యక్తి వయస్సు 18 ఏళ్ల లోపు ఉండాలి. ఈ కేసుల్లో నిందితులను జువెనైల్ జస్టిస్ బోర్డులే విచారించాలి. సాధారణ కోర్టులు కాదు. వీరికి జీవిత కారాగారం, మరణ శిక్ష వంటివి విధించరాదు. ఈ చట్టంలోని సెక్షన్ 18ని అనుసరించి దోషులుగా తేలిన వారిని కౌన్సెలింగ్ చేయడం లేదా గరిష్టంగా మూడేళ్లపాటు జువెనైల్ హోంలో ఉంచడం వంటి చర్యలు చేపట్టవచ్చు. అయితే, నేరం జరిగిన సమయంలో అమల్లో ఉన్న జువెనైల్ జస్టిస్ చట్టం-1986ను అనుసరించి 16 ఏళ్లలోపు వారిని బాలురనీ, బాలికలైతే 18 ఏళ్లుగా నిర్వచించారు. 2015 చట్టం ప్రకారం సుప్రీంకోర్టు బాలబాలికల వయస్సును సమానంగా 18 ఏళ్లుగా నిర్ణయించింది. నిందితుడి ప్రస్తుత వయస్సు, గడిచిన సమయంతో సంబంధం లేకుండా బాల నేరస్థుల వాదనలు చెల్లుబాటు అవుతాయని తాజా కేసు తెలియజేస్తోంది. తీవ్రమైన నేరాల కేసుల్లో సైతం బాల నేరస్తులను భిన్నంగా చూడాలనే సూత్రానికి ఇది బలం చేకూరుస్తోంది.

రాజస్థాన్‌లో కూలిన పాఠశాల పైకప్పు

ఏడుగురు విద్యార్థులు మృతి • 28 మందికి గాయాలు, ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం

ఝులావర్: రాజస్థాన్‌లోని ఝులావర్ జిల్లాలో శుక్రవారం తీవ్ర విషాదం జరిగింది. పిప్లోడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల పైకప్పు కూలిపోయింది. ఉదయం 8.30 గంటల సమయంలో అసెంబ్లీకి ముందు ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో ఏడుగురు పిల్లలు మరణించారు. 28 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పైకప్పు కూలిన సమయంలో దాదాపు 35 మంది పిల్లలు భవనం లోపల ఉన్నారు. పాఠశాల ఆవరణలో ఒకేసారి కేకలు వినిపించడంతో, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శిథిలాల నుంచి విద్యార్థులను బయటకు తీశారు. సమాచారం అందుకున్న అత్యవసర సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను తక్షణ చికిత్స కోసం తరలించారు.

శిథిలావస్థలో భవనం..

పాఠశాల భవనం 20 ఏళ్ల కిందటి రాతి పలకలతో చేసిన పైకప్పుతో ఉంది. రాతి పలకలు పడటంతో ప్రభావం మరింత తీవ్రమైంది. అయితే.. భవనం శిథిలావస్థకు చేరుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భవనం గురించి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే పట్టించుకుని ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదని వాపోతున్నారు.

ప్రధాని మోదీ సంతాపం

ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'రాజస్థాన్‌లోని ఝులావర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన ప్రమాదం విషాదకరం. తీవ్ర బాధాకరం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను'అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా స్పందించారు. 'అమాయక పిల్లల ప్రాణాలు పోవడం మాటల్లో చెప్పలేనిది. దుఃఖిస్తున్న కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా'అని పేర్కొన్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, విద్యా శాఖ మంత్రి మదన్ దిలావర్ ఈ విషాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపిస్తామన్నారు. గాయపడిన విద్యార్థుల చికిత్స ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

ప్రధానిగా మోదీ కొత్త రికార్డు

న్యూఢిల్లీ: భారత రాజకీయ చరిత్రలో **నరేంద్ర** మోదీ మరో మైలురాయిని చేరుకున్నారు. దేశాన్ని అత్యధిక కాలం పాలించిన రెండో ప్రధానిగా ఆయన నిలిచారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టి జూలై 25 నాటికి 4,708 రోజులు పూర్తి చేసుకున్న ఆయన.. దేశానికి ఏకబిగిన ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసిన రెండో వ్యక్తిగా నిలిచారు. గతంలో ఇందిరా గాంధీ 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు 4,077 రోజులు ప్రధానిగా పనిచేశారు. అత్యంత ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసిన దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అగ్రస్థానంలో ఉన్నారు.

ఎన్నో ప్రత్యేకతలు..

ఇది మోదీ రాజకీయ ప్రయాణంలో ఒక చారిత్రాత్మక అధ్యాయాన్ని సూచిస్తుంది. అయితే ఇదొక్కటే కాదు.. మోదీ అనేక ప్రత్యేకతలు కలిగి ఉన్నారు. 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన మొదటి, ఏకైక ప్రధానమంత్రి కూడా ఆయనే. హిందీ మాట్లాడని రాష్ట్రం నుంచి ఎదిగొచ్చి అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగుతున్న రికార్డు కూడా మోదీకి ఉంది. అత్యధిక కాలం పనిచేసిన కాంగ్రెసేతర ప్రధానమంత్రి కూడీ మోదీయే. లోక్‌సభ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర ప్రధాని. ఇందిరా గాంధీ తర్వాత అత్యంత మెజారిటీతో తిరిగి ఎన్నికైన సిట్టింగ్ ప్రధానమంత్రి కూడా ఆయనే. పార్టీని వరుసగా మూడు జాతీయ ఎన్నికల్లో గెలిపించిన ట్రాక్ రికార్డు కూడా ఆయనకు ఉంది. గతంలో ఈ ఘనతను జవ నర్ లాల్ నెహ్రూ మాత్రమే సాధించారు.

సువర్ణ అధ్యాయం: బీజేపీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నిరాటకంగా 4,078 రోజుల పదవీ కాలం పూర్తి చేసుకోవడం పట్ల బీజేపీ ఎంపీ, జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది శుక్రవారం హర్షం వ్యక్తంచేశారు. ఇందిరా గాంధీ రికార్డును మోదీ అధిగమించడం సంతోషకరమని చెప్పారు. మోదీ పాలన అభివృద్ధిలో ఒక సువర్ణ అధ్యాయం అని స్పష్టం చేశారు. మోదీ ప్రజల మద్దతు ప్రధానమంత్రి అయ్యారని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ అప్పటి పరిస్థితులు, రాజకీయ అనివార్యతల కారణంగా ప్రధాన మంత్రులు అయ్యారని తెలిపారు. వారికి ప్రజల మద్దతు లేదన్నారు. నెహ్రూ తర్వాత వరుసగా అత్యధిక కాలంగా ప్రధానిగా పనిచేసిన నాయకుడిగా మోదీ రికార్డుకెక్కారని, మోదీ ఘనత ప్రతి భారతీయుడికీ గర్వకారణమని స్పష్టంచేశారు.

వీసాల ఆలస్యాన్ని పట్టించుకోండి

అమెరికాకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి • రాజ్యసభలో మంత్రి కీర్తివర్ధన్ వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా విద్యార్థి వీసాల జారీలో జరుగుతున్న అసాధారణ జాప్యాన్ని ఆ దేశ ఉన్నతాధికార వర్గాల దృష్టికి కేంద్ర ప్రభుత్వం తీసుకెళ్లింది. కొంతకాలంగా విద్యార్థి వీసా దరఖాస్తుల స్క్రీనింగ్ తదితరాలను అమెరికా కఠినతరం చేయడం తెలిసిందే. దాంతో వీసా అపాయింట్‌మెంట్లు పొందడమే విద్యార్థులకు చాలా కష్టంగా మారిపోయింది. ఫలితంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ అమెరికా విదేశాంగ శాఖ వర్గాలతో, ఢిల్లీలోని ఆ దేశ దౌత్య కార్యాలయంతో దీనిపై లోతుగా చర్చించింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ ఈ మేరకు వెల్లడించారు. భారత విద్యార్థుల ఆందోళనలను ఎప్పటికప్పుడు అమెరికా దృష్టికి తీసుకెళ్తున్నట్టు ఆయన వివరించారు. శుక్రవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత సమాధానమిచ్చారు. అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమించేవారు తదితరులను దేశంలోకి ప్రవేశించకుండా నిరోధించేందుకు అన్నిరకాల చర్యలూ తీకుంటున్నట్టు జూన్ 18న విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసిందని మంత్రి గుర్తు చేశారు. అమెరికాలోని విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి వీసాల జారీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి 14 మంది భారతీయ అమెరికన్ చట్టసభ సభ్యుల బృందం కూడా కృషి చేస్తోంది. డెబోరా రాస్ వీరికి నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో భారత విద్యార్థుల వాటా ఏటా 900 కోట్ల డాలర్ల మేరకు ఉంటుందని ఆమె అన్నారు. అంతేగాక పరిశోధనలు, ఇన్నొవేషన్లలో వారిది కీలక పాత్ర గుర్తు చేశారు. కొత్త వీసాల జారీని ఆపేయాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా కాన్సులేట్లన్నింటినీ ట్రంప్ సర్కారు గత మేలో ఆదేశించడం తెలిసిందే. రెండు నెలల విరామం తర్వాత ఎట్టకేలకు విద్యార్థి వీసాల ప్రాసెసింగ్ గత నెల మొదలైంది. కొత్త నిర్దేశకాల ప్రకారం వీసా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ కార్యకలాపాలు, సోషల్ మీడియా ఖాతాల తనిఖీ (వెట్టింగ్)ను అమెరికా పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందుకు వీలుగా సోషల్ ఖాతాల వివరాలను పబ్లిగ్గా అందుబాటులో ఉంచాల్సిందిగా ఆశావహులందరికీ సూచించింది.

అక్రమ వలసలపై...

అమెరికాలోకి అక్రమ వలసలు, మనుషుల అక్రమ రవాణా కట్టడిలో ఆ దేశ ప్రభుత్వంతో నిరంతరం టచ్‌లో ఉన్నట్టు మరో ప్రశ్నకు సమాధానంగా కీర్తివర్ధన్ సింగ్ రాజ్యసభకు వివరించారు. వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ-మైగ్రేట్ పోర్టల్, సోషల్ మీడియా హ్యాండిళ్ల తదితరాల ద్వారా ఈ విషయంలో విదేశాంగ శాఖ ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తున్నట్టు చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది

అత్యంత అప్రమత్తంగా సైనిక బలగాలు • సీడీఎస్ జనరల్ చౌహాన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. మన సైన్యం 24 గంటలూ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోందని వెల్లడించారు. రక్షణ రంగంపై ఏర్పాటైన సదస్సులో శుక్రవారం ఆయన కీలక ప్రసంగం చేశారు. ముున్ముందు సైనికులు ఇన్ఫర్మేషన్ వారియర్లు, టెక్నాలజీ వారియర్లు, స్కాలర్ వారియర్లుగా మారాల్సిన అవసరం ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. మారిన యుద్ధ తంత్రాల నేపథ్యంలో ఈ మూడూ కలగలిసిన ఇన్ఫో, టెక్, స్కాలర్ వారియర్లుగా వ్యవహరించగలిగే సైనికుల అవసరముందన్నారు. మూడు అంశాల్లోనూ పట్టు సంపాదించగలిగే వారే యుద్ధ క్షేత్రంలో రాణిస్తారని చెప్పారు. ప్రపంచంలోని ఏ దేశ మిలటరీ అయినా కార్యరంగంలోకి దూకేందుకు నిరంతరం సర్వసన్నద్ధంగా ఉండాల్సిందేనన్నారు. ఉదాహరణకు ఆపరేషన్ సిందూర్.. ఇంకా కొనసాగుతోంది. మన సన్నద్ధత రోజులో 24 గంటలూ, ఏడాదిలో 365 రోజులూ అత్యున్నత స్థాయిలో ఉంటుందని స్పష్టం చేశారు. పాక్‌తోపాటు పీవోకేలోని ఉగ్ర శిబిరాల ధ్వంసమే లక్ష్యంగా భారత్ మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ సంక్షోభానికి ముగింపు పలికేందుకు రెండు దేశాలు మే 10వ తేదీన ఒక అంగీకారానికి రావడం తెల్సిందే.



శుక్రవారం పార్లమెంట్ వెలుపల సరదా ముచ్చట్లలో (ఎడమ నుంచి కుడికి) టీఎంసీ ఎంపీ సయోనీ ఘోష్, ఎన్‌సీపీ(ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలె, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్

బాలుడిపై లైంగిక దాడి.. 24 కత్తిపోట్లు

దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

- ప్రత్యర్థికి ఇన్ఫార్మర్‌గా వ్యవహరించాడని అనుమానం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం జరిగింది. ప్రత్యర్థి గ్యాంగ్‌కు సమాచారమిచ్చాడనే కక్షతో 14 ఏళ్ల బాలుడిని అత్యంత కిరాతకంగా చంపేశారు. ఈ దారుణంలో పాలుపంచుకున్న 13 మందిలో అత్యధికులు మైనర్లే కావడం గమనార్హం. అంతా కలిసి బాలుడిపై లైంగిక దాడికి పాల్పడి, హింసించి ప్రాణాలు తీశారు. అతడి శరీరంపై మొత్తం 24 కత్తిపోట్లున్నాయి. మర్మాయవాలను తీవ్రంగా గాయపరిచారు. జూన్ 29-30వ తేదీల్లో ఈ ఘటన చోటుచేసుకోగా బాలుడి మృతదేహం జూలై ఒకటో తేదీన ఢిల్లీలో మునాక్ కాలువ ఒడ్డును నగ్నంగా పడి ఉండగా గుర్తించారు. మొత్తం పది మంది ఈ ఘోరానికి పాల్పడినట్లు తేల్చిన పోలీసులు 19 ఏళ్ల కృష్ణ అలియాస్ భోలాను ప్రధాన నిందితుడిగా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కావడ్ యాత్రికులుగా వేషం వేసుకున్న ముగ్గురిని యూపీలోని మీరట్‌లో కన్వర్ క్యాంపులో ఉండగా గుర్తించారు. ఈ నెల 18న పోలీసులు సైతం కన్వరియాలుగా వేషం వేసుకుని వెళ్లి వారిని మోనుతోపాటు ఇద్దరు మైనర్లను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన భోలాపై గతేడాది ప్రత్యర్థి బధ్వార్ సోదరులు మోను, సోనులు దాడి చేశారు. అక్రమ మద్యం విక్రయాలు, చోరీల ఆరోపణలపై పోలీసులు మోకా చట్టం కింద మోను, సోనులను జైలులో పెట్టారు. ఈ సోదరులకు తనను గురించిన సమాచారం అందిస్తున్నట్లు అనుమానం పెంచుకున్న భోలా.. ఆ బాలుడిని చంపేందుకు కుట్ర పన్నాడు. జూన్ 29వ తేదీ రాత్రి బాలుడిని వీర్ చౌక్ వద్ద ఉండగా పట్టుకుని తీవ్రంగా కొట్టారు. అనంతరం బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని మునాక్ కాల్వ వద్దకు తీసుకెళ్లారు. లైంగిక దాడికి పాల్పడటంతోపాటు వెంట తెచ్చుకున్న కత్తితో ఒకరి తర్వాత ఒకరు అతడిని పొడిచి, వదిలేసి పరారయ్యారు. గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఒంటిపై ఎలాంటి ఆచ్ఛాదన లేదు. మెడకు కేవలం స్కార్ఫ్ మాత్రం కట్టి ఉంది. ఆధారాల ప్రకారం దర్యాప్తు చేపట్టి భోలాను పట్టుకున్నారు. మిగతా వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. నిందితుల్లో అత్యధికులు మైనర్లే అయినప్పటికీ అత్యంత తీవ్రమైన నేరమైనందున మేజర్లుగా 16ఏళ్లు దాటిన వారిగా గుర్తించి, తీవ్ర శిక్షలు వేయాలని కోర్టును కోరుతామని డీసీపీ హరేశ్వర్ స్వామి తెలిపారు. నిందితులపై హత్య, సాక్ష్యాధారాల తారుమారుతోపాటు పోక్సో కేసు కూడా నమోదు చేశామన్నారు.

తల్లి ఏమరుపాటు.. చిన్నారికి మరణ శాసనం!

థానె: ఓ తల్లి ఏమరుపాటు నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలను హరించింది. మహారాష్ట్రలోని థానెలో చోటుచేసుకున్న ఈ విషాదానికి సంబంధించిన వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. చిన్నారి అన్వికా ప్రజాపతిని ఆమె తల్లి తాము ఉండే అపార్టుమెంట్‌లోని 12వ అంతస్తులోని ఫ్లాట్‌లో కిటికీ దగ్గరున్న చెప్పుల స్టాండ్‌పై కూర్చోబెట్టింది. బయటకు వెళ్లేందుకు సిద్ధమయ్యే పనిలో ఆమె బిజీగా ఉంది. ఇదేమీ తెలియని ఆ చిన్నారి చెప్పుల స్టాండ్ నుంచి ఎక్కి కిటికీలో కూర్చుంది. బ్యాలెన్స్ చేసుకోవడం తెలియక కిందపడిపోయింది. 12వ అంతస్తు నుంచి కింద పడటంతో ప్రాణాలు కోల్పోయింది. సీసీటీవీ ఫుటేజీలో ఈ మొత్తం ఘటనాక్రమం రికార్డయ్యింది. తీవ్ర వేదన కలిగించే ఈ వీడియోను ప్రసారం చేయరాదని నిర్ణయించుకున్నట్లు ఇండియా టుడే టీవీ తెలిపింది.

అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

వంద కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ: ఆఫ్రికాలోని ఓ దేశం నుంచి కాల్ సెంటర్ మాదిరిగా పనిచేస్తూ భారత్‌తోపాటు మలేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, యూకేలోని వారితో సంబంధాలున్న అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టును ఢిల్లీ పోలీసులు బయటపెట్టారు. ఆఫ్రికా దేశాలకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.100 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నైజీరియాలో ఉండే కింగ్‌పిన్ కల్లిస్టస్ అలియాస్ కలిస్ ఈ ముఠా సూత్రధారి అని అదనపు డీసీపీ(క్రైం)మంగేశ్ కశ్యప్ వెల్లడించారు. నైజీరియాలో ఉండే ఈ ముఠా సెంట్రల్ కమాండ్‌కు హ్యాండ్లర్స్ నుంచి ఆర్డర్లు అందుతాయి. భారత్‌లోని కస్టమర్లకు ఫేక్ కాల్ సెంటర్ నంబర్లు, సోషల్ మీడియా ద్వారా ఢిల్లీలోని ఏజెంట్లు కస్టమర్లకు కొకైన్, ఎంఎండీఏ, గంజాను అందజేస్తున్నారు. దీనికి వీరు ఫుడ్ డెలివరీ యాప్‌ల వంటి యాప్‌లను వాడుతున్నట్లు తేలింది. 2019 నడుస్తున్న ఈ దందాలో ఢిల్లీలోని వసంత్ గంజ్ వంటి ప్రాంతాల్లో నెలకు రూ. కోటి చొప్పున విక్రయాలు సాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ డెలివరీ బాయ్‌లను సులువుగా గుర్తించేందుకు గీతల షర్టులు, నల్ల హెల్మెట్లు ధరించేలా ప్రత్యేక డ్రెస్ కోడ్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. జూన్ 13వ తేదీన మోతీ నగర్‌కు కొరియర్‌లో వచ్చిన ఓ అనుమానాస్పద పార్శిల్‌లో 895 గ్రాముల ఎండీఎంఏ ఉన్నట్లు తేలడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ దందాను వెలుగులోకి తెచ్చారు.

లంచం కేసులో ఈడీ మాజీ అధికారికి మూడేళ్ల జైలు

న్యూఢిల్లీ: లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మాజీ అధికారి ఒకరికి ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. చెన్నైలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ విభాగానికి చెందిన లలిత్ బడద్ అనే అధికారి బెంగళూరులో డెప్యుటేషన్‌పై పనిచేసేవారు. ఆ సమయంలో లంచం ఇవ్వకుంటే ప్రతిష్టకు భంగం కలిగించేలా, కోర్టు చుట్టూ తిరిగేలా చేస్తానని ఓ వ్యాపారిని బెదిరించారు. అతడి నుంచి రూ.5 లక్షల లంచం తీసుకున్నారు. బాధిత వ్యాపారి ఇచ్చిన సమాచారం మేరకు ఆయన్ను అధికారులు పట్టుకున్నారు. నేరం రుజువు కావడంతో ప్రత్యేక కోర్టు ఆయనకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిందని సీబీఐ ప్రతినిధి ఒకరు శుక్రవారం తెలిపారు.

అమెరికా వర్సిటీలో కాల్పులు.. ఒకరు మృతి

అల్బుకర్క్: అమెరికాలోని అల్బుకర్క్‌లో ఉన్న న్యూమెక్సికో యూనివర్సిటీలో శుక్రవారం కాల్పుల ఘటన కలకలం రేపింది. వర్సిటీలోని కసాస్ డెల్ రియోలోని డార్మిటరీలో ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఒకరు చనిపోగా మరొకరు గాయపడ్డారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. క్షతగాత్రుడికి ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. ఘటన నేపథ్యంలో అల్బుకర్క్ సెంట్రల్ క్యాంపస్‌ను అధికారులు ముందు జాగ్రత్తగా మూసివేశారు. ఈ వర్సిటీలో సుమారు 23 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

భారతీయ సంగీత మూలాలు ఏ వేదంలో ఉన్నాయి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

ప్రాచీన భారతదేశ చరిత్ర

వేదకాల నాగరికత (క్రీపూ. 2000-1500)

ఆర్యులు ఆసియా మైనర్, మెసపటోమియా మీదుగా పర్షియాలోకి ప్రవేశించారు. ఆ తర్వాత బాక్ట్రియా, హిందూకుష్ పర్వత శ్రేణుల మీదుగా భారతదేశంలోకి వచ్చారు. పంజాబ్ ప్రాంతంలోని సప్తసింధు లోయను మొదటి స్థావరంగా చేసుకుని స్థిరపడ్డారు.

వేదాలు:
1) రుగ్వేదం 2) యజుర్వేదం
3) సామవేదం 4) అధర్వణ వేదం

ఉపవేదాలు:
1) ధనుర్వేదం 2) ఆయుర్వేదం
3) శిల్పవేదం 4) గాంధార వేదం

వేదాంగాలు:
1) శిక్ష 2) కల్పం 3) జ్యోతిషం
4) వ్యాకరణం 5) నిరుక్తం 6) చంధస్సు

దర్శనాలు - అందులో ప్రసిద్ధులు:
1) సంఖ్య – కపిలుడు
2) వైశేషికం – కణాదుడు
3) న్యాయం – గౌతముడు
4) యోగ – పతంజలి
5) మీమాంస – జెమిని
6) ఉత్తర మీమాంస – బాదరాయణుడు

తొలివేద కాలం (క్రీపూ. 1500-1000)

ఈ కాలంలో ఆర్యులు సప్తసింధు ప్రాంతానికి మాత్రమే పరిమితమయ్యారు. ఈ కాలం గురించి తెలుసుకోవడానికి రుగ్వేదం ఒక్కటే ప్రధాన ఆధారంగా ఉంది.ఆర్యులు భారతదేశంలో స్థిరపడ్డ తర్వాత రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలు రాశారు. వేదాలన్నింటిలో రుగ్వేదం ప్రాచీనమైంది. ఇందులో పది మండలాలున్నాయి. యజుర్వేదం క్రతువుల నిర్వహణకు ఆధార గ్రంథం. సామవేదం సంగీతానికి మూలం. అధర్వణ వేదం మంత్రతంత్రాలకు సంబంధించింది. ఈ కాలంలో రాజ్యానికి రాజే అధిపతి. రాజరికం వంశపారంపర్యం. ప్రజల రక్షణ బాధ్యత రాజు చూసేవాడు. దీనికిగాను ప్రజలు రాజుకు గోవులను కానుకగా ఇచ్చేవారు. ఈ విధానాన్ని 'బలి' అని పిలిచేవారు. పాలనా వ్యవహారాల్లో 'సమితి', 'సభ' అనే సంస్థలు రాజుకు సాయపడేవి. సమాజంలో స్త్రీకి గౌరవప్రదమైన స్థానం ఉండేది. 'సమితి', 'సభ' సమావేశాల్లో మహిళలు సైతం పాల్గొనేవారు. వితంతు పునర్వివాహాలు జరిగేవి. సతీసహగమనం, పరదా పద్ధతి వీరికి తెలియదు. రుగ్వేదకాలంనాటి ఆర్యులకు పశుపోషణ, వ్యవసాయం ప్రధాన వృత్తులు. పశువులను.. ముఖ్యంగా ఆవులను ప్రాణప్రదంగా భావించేవారు. వీటిని వర్తకంలో మారకంగా ఉపయోగించేవారు. ఆర్యులు ప్రకృతి శక్తులను పూజించారు. ద్యుస్ (ఆకాశం), ఇంద్ర, వరుణ, వాయు, అగ్ని, సోమ తదితర పురుష దైవాలతో పాటు అతిథి, ఉషస్సు లాంటి స్త్రీ మూర్తులను కూడా ఆరాధించేవారు. ఇంద్రుడు వీరి ప్రధాన దైవం.

మలివేదకాల ఆర్య నాగరికత (క్రీపూ.1000-600)

ఈ కాలంలో ఆర్యులు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్ ప్రాంతాలకు విస్తరించారు. వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా స్వీకరించిన జాతులన్నీ స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. క్రమంగా ఆధిపత్యం కోసం తెగల మధ్య యుద్ధాలు ప్రారంభమయ్యాయి. విజయం సాధించిన తెగ నాయకుడు విశాల భూభాగానికి అధినేతగా మారాడు. అతడు సామ్రాట్ తదితర బిరుదులను వహించడం ఆరంభమైంది. అశ్వమేథ, రాజసూయ, బలి కర్మ కాండలు ప్రారంభమయ్యాయి. సామ్రాజ్యాల విస్తరణ పెరిగింది. రాజు దైవాంశ సంభూతుడుగా మారాడు. రుగ్వేదంలోని పురుష సూక్తం ఆధారంగా మలివేద కాలంలో వర్ణవ్యవస్థ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలుగా సమాజ విభజన జరిగింది. క్రమంగా వృత్తులు వంశపారంపర్యమయ్యాయి. ఈ యుగంలో స్త్రీ అంతకుముందున్న సామాజిక స్థాయిని కోల్పోయింది. సతీ సహగమన పద్ధతి మొదలైంది. వివాహ నిబంధనలు కఠినమయ్యాయి. కొత్తగా భూములు సాగులోకి రావడంతో వ్యవసాయాభివృద్ధి అధికమైంది. వర్తకం, వాణిజ్యం, పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పట్టణాలు ఏర్పడ్డాయి. తక్షశిల, హస్తినాపురం, కౌశాంబి, కాంపల్య, వైశాలి, శ్రావస్తి, వారణాసి మొదలైనవి నాటి ప్రసిద్ధ నగరాలు. వస్తుమార్పిడి స్థానంలో 'నిష్క', 'శతమాన', 'కర్షాపణం' అనే నాణేలు ప్రవేశించాయి. బంగారం, వెండి, రాగితో ఈ నాణేలను తయారు చేసేవారు. సృష్టికర్తగా 'ప్రజాపతి' ఈ యుగ ప్రధాన ఆరాధ్య దైవం. అగ్ని, ఇంద్రుడు లాంటి దైవాలకు ప్రాధాన్యం తగ్గి త్రిమూర్తుల (విష్ణు, బ్రహ్మ, శివుడు) ఆరాధన పెరిగింది.

రుగ్వేద సంహిత: ఇందులో 1028 శ్లోకాలున్నాయి. ఇది పురాతనమైంది. అగ్ని, ఇంద్రుడు, వరుణుడు లాంటి అనేక దేవతల స్తోత్ర పాఠాలు ఈ సంహితంలో ఉన్నాయి. ఇందులో ఇంద్రుడి గురించి ఎక్కువ శ్లోకాలు ఉన్నాయి.

సామవేద సంహిత: సోమ యజ్ఞాలు చేసేప్పుడు సంగీత బద్ధంగా శ్లోకాలను ఎలా ఆలపించాలో సామవేద సంహిత తెలుపుతుంది. భారతీయ సంగీత మూలాలు సామవేదంలో కనిపిస్తాయి.

యజుర్వేద సంహిత: ఇందులో యజ్ఞ సమయంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పఠించే మంత్రాల గురించి ఉన్నాయి.

అధర్వణ వేద సంహిత: రోగాలు, దుష్టశక్తులను పారదోలడానికి అవసరమైన మంత్రాలు, తంత్రాలు ఇందులో ఉన్నాయి. ఆర్యేతరుల విశ్వాసాల గురించి ఇది కొంతవరకు తెలుపుతుంది.

బ్రాహ్మణాలు: ఇవి వేదాల తర్వాత వచ్చాయి. కర్మకాండల విధానాన్ని వివరిస్తాయి. వీటిలో ప్రధానంగా యజ్ఞాలు, బలులకు సంబంధించిన విధి విధానాలు ఉన్నాయి.

అరణ్యకాలు: ఇవి తాత్విక చింతనకు చెందిన అంశాలతో కూడి ఉన్నాయి.

ఉపనిషత్తులు: ఉపనిషత్తులు తాత్విక గ్రంథాలు. వీటిలో ఆత్మ, అంతరాత్మ, ప్రకృతి రహస్యాల గురించి ఉన్నాయి. ఉపనిషత్తులు కర్మకాండలను నిరసించాయి. ఇవి సరైన జ్ఞానం, సన్మార్గానికి ప్రాముఖ్యం ఇస్తాయి.

సామాజిక మార్పులు (క్రీపూ. 600-300)

ఈ కాలంలో అనేక మత ఉద్యమాలు ఆవిర్భవించాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ మార్పులు అధికంగా జరిగాయి. 16 జనపదాలు, పట్టణాలు ఏర్పడ్డాయి. దీన్ని రెండో పట్టణీకరణ కాలంగా పేర్కొంటారు. ఇనుముతో రూపొందించిన పరికరాల వాడకం వల్ల వ్యవసాయంలో అధిక వృద్ధి సాధ్యమైంది. ఈ కాలంలో చాతుర్ వర్ణ వ్యవస్థ బలపడింది. ద్విజులుగా పేర్కొనే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు.. ద్విజులు కాని శూద్రులకు మధ్య సాంఘిక వ్యత్యాసం ఎక్కువైంది. బ్రాహ్మణాధిపత్యం వైశ్యులకు, క్షత్రియులకు నచ్చలేదు. అస్పృశ్యులను ఒక ప్రత్యేక వర్గంగా చూడటం ఈ కాలంలోనే ప్రారంభమైంది. వ్యవసాయ రంగంలో నిమిగులుతో రాజులు సైన్యాన్ని నిర్మించారు. రాజులు పన్ను వసూలు చేసేవారు. న్యాయ వ్యవస్థకు పునాది పడింది. జీవహింసకు వ్యతిరేకమైన బౌద్ధ, జైన మతాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడ్డాయి.

బౌద్ధమతం (క్రీపూ. 563-483)

బౌద్ధమత స్థాపకుడు సిద్ధార్థుడు (గౌతముడు). ఈయన క్షత్రియ వంశానికి చెందినవారు. క్రీ.పూ. 563లో శాక్యరాజ్యాధిపతి శుద్ధోదనుడు, మాయాదేవికి రాజధాని 'కపిలవస్తు' సమీపంలోని 'లుంబినీ వనం'లో జన్మించారు. గౌతముని భార్య పేరు 'యశోధర', కుమారుని పేరు 'రాహులుడు'. కపిలవస్తు నగరంలో కనిపించిన వృద్ధుడు, వ్యాధిగ్రస్తుడు, శవం, సన్యాసి దృశ్యాలు ఆయన్ని కదల్చివేశాయి. దీంతో భవబంధాల నుంచి బయటపడ్డారు. దీన్నే 'మహాభినిష్క్రమణం' అంటారు. గయ సమీపంలో బోధి వృక్షం కింద నలభై రోజుల తపస్సు తర్వాత 'సంబోధి'ని పొంది 'బుద్ధుడై' పరిపూర్ణ జ్ఞానంతో ఉద్భవుడయ్యాడు. మొదటగా సారనాథ్‌లోని 'మృగదావనం'లో అయిదుగురు శిష్యులకు జ్ఞానబోధ చేశాడు. ఈ ప్రబోధాన్ని 'ధర్మచక్ర ప్రవర్తనం' అంటారు. బుద్ధుడు తన 80వ ఏట క్రీ.పూ.483లో మహాపరి నిర్యాణం పొందారు. బుద్ధుడి శిష్యుడు ఆనందుడు.

ఆర్య సత్యాలు

1) ప్రపంచం దుఃఖమయం.
2) దుఃఖాలకు కోర్కెలే కారణం.
3) కోర్కెలను నిరోధిస్తే దుఃఖం అంతమవుతుంది.
4) దుఃఖాన్ని అంతమొందించడానికి మార్గం ఉంది.

అజ్ఞానమే దుఃఖానికి కారణమని పేర్కొని, దీన్ని తొలగించడానికి 'అష్టాంగమార్గం' రూపొందించాడు. అవి.. సరైన వాక్కు, క్రియ, జీవనం, శ్రమ, ఆలోచన, ధ్యానం, నిశ్చయం, దృష్టి. పునర్జన్మ రహితమైన మోక్షమే నిర్వాణం అని చెప్పారు. బౌద్ధమతం హేతుబద్ధమైంది. బుద్ధుడు ఆత్మ, భగవంతుడి ఉనికిని గుర్తించలేదు. వైదిక కర్మకాండలను, వేదాలను నిరసించారు.

మొదటి 'బౌద్ధ సంగీతి' రాజగృహంలో అజాత శత్రువు పాలనా కాలంలో జరిగింది. దీని అధ్యక్షుడు మహాకాశ్యప. ఈ సంగీతిలో 'వినయ', 'సుత్త' అనే పీటికల (నియమావళి గ్రంథాలు)ను సంకలనం చేశారు. రెండో సంగీతి 'వైశాలి'లో జరిగింది. ఈ సంగీతిలో బౌద్ధసంఘం 'థెరవాదులు', 'మహాసాంఘికులు' అనే రెండు వర్గాలుగా చీలిపోయింది. మూడో సంగీతి అశోకుడి కాలంలో పాటలీపుత్రంలో జరిగింది. ఈ సంగీతిలో అభిదమ్మ పీటకాన్ని రచించారు. నాలుగో సంగీతి కనిష్కుడి పాలనా కాలంలో వసుమిత్రుడి అధ్యక్షతన జరిగింది. సాంచి, బార్హుత్, అమరావతి ఈ కాలంనాటి శిల్పకళకు ప్రతీకలైన స్తూపాలు. చైత్య గృహాల నిర్మాణానికి అజంతా, ఎల్లోరా ఉదాహరణలు. బుద్ధుని సందేశాన్ని భిక్షకులు విదేశీయులకు అందించారు. బౌద్ధ మతం ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. చైనా, జపాన్, శ్రీలంక, బర్మా మొదలైన తూర్పు, ఆగ్నేయాసియా దేశాల్లో బౌద్ధ మతం విస్తరించింది. కాశ్మీర్‌లో జరిగిన నాలుగో బౌద్ధ సంగీతిలో బౌద్ధమతం మహాయాన, హీనాయాన శాఖలుగా చీలిపోయింది.

మహాయానం: ఈ శాఖకు చెందినవారు బుద్ధ విగ్రహాలను ఆరాధించేవారు. బుద్ధుడు, బోధిసత్వుల ద్వారా మానవులు మోక్షం పొందొచ్చని భావించారు. ఈ శాఖ ఇండియా, చైనా, జపాన్‌లో బాగా ప్రాచుర్యం పొందింది. నాగార్జునుడు మాధ్యమిక చింతనను ప్రవేశపెట్టాడు. ప్రపంచమంతా మిథ్య, భ్రమ అని నాగార్జునుడి వాదన.

హీనాయానం: బర్మా, థాయిలాండ్, కాంబోడియాలో ఈ శాఖ బాగా వ్యాపించింది. బుద్ధుడి ప్రవచనాలను మాత్రమే తీసుకుని ధ్యానం ద్వారా మోక్షం పొందొచ్చని వీరు భావించారు. విగ్రహారాధనకు వీరు వ్యతిరేకం. పాళీ భాషలో సుత్త, వినయ, అభిదమ్మగా పేర్కొనే త్రిపీటకాలను వీరు రచించారు. క్రీ.శ 8వ శతాబ్దంలో వజ్రాయానం అనే కొత్త శాఖ వెలిసింది.

స్తూపాలు: బుద్ధుడు లేదా ఇతర ప్రముఖ సన్యాసుల అవశేషాలను నిక్షిప్తం చేసి నిర్మించారు. వీటినే స్తూపాలు అంటారు.

చైత్యం: ఇందులో ప్రధానంగా ప్రార్థనాలయం ఉంటుంది.

బుద్ధుడికి సంబంధించిన అంశాలు:

తండ్రి	శుద్ధోదనుడు
తల్లి	మాయాదేవి
సవతి తల్లి	గౌతమి
బంధువు	దేవదత్త
భార్య	యశోధర
కుమారుడు	రాహుల్
రథ చోదకుడు	చెన్నుడు
గుర్రం	కంథక
గురువు	అలారకలామ
బుద్ధగయలో పరిచర్యలు చేసినది	సుజాత

మహా జనపదాలు - పట్టణాలు

1) మగధ	-	పాటలీపుత్రం
2) కాశీ	-	వారణాసి
3) అంగ	-	చంపా
4) చేది	-	భుక్తిమతి
5) కోసల	-	అయోధ్య
6) కురు	-	ఇంద్రప్రస్థం
7) వత్స	-	కౌశాంబి
8) పాంచాల	-	అవిచ్ఛత్రము
9) మత్స్య	-	విరాటనగరం
10) అస్మక	-	పొతన్
11) సూరసేన	-	మధుర
12) అవంతి	-	ఉజ్జయిని
13) కాంభోజ	-	రాజపురం
14) గాంధార	-	తక్షశిల
15) వజ్జి	-	విదేహ
16) మల్ల	-	కుశి

ప్రధాన బౌద్ధ గుహాలయాలు, చైత్యాలయాలు:
1) కార్లే 2) నాసిక్
3) భాజ 4) బార్హుత్
5) సాంచి 6) అమరావతి
7) నాగార్జున కొండ 8) భట్టిప్రోలు

విహారం: బౌద్ధ సన్యాసులు నివసించే ప్రాంతమైన అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ ఆసియాలో అతిపెద్ద బౌద్ధ విహార కేంద్రం.





శాతవాహనుల రాజ్యభాష ఏది?

టెట్ / డీఎస్సీ ప్రత్యేకం
తెలంగాణ చరిత్ర

శాతవాహనుల చరిత్ర

శ్రేణులు - ప్రాధాన్యం

జున్నార్ శాసనాల్లో 'ధమ్మిక', 'కాసాకార', 'తెసకార' శ్రేణుల గురించి పేర్కొన్నారు. గోవర్ధనలో 'కాలీకసికాయ' శ్రేణులుండేవి. నాసిక్ శాసనాల్లో 'కులరిక', 'తెలపిషిక', 'ఒదయంత్రిక' మొదలైన శ్రేణుల గురించి పేర్కొన్నారు. ప్రతి శ్రేణికి అధ్యక్షుడిగా శ్రేష్ఠి ఉండేవాడు. శ్రేణుల కార్యాలయాలు పురమందిరంలో లేదా నిగమ సభలో ఉండేవి. ఉషవదత్తుడు శ్రేణుల్లో పెట్టిన పెట్టుబడులు 'నిగమసభ'లో రిజిస్టర్ చేశారు.

బ్యాంకులు - రుణపరపతి విధానాలు

శాతవాహనుల కాలంలో వడ్డీకి అప్పులు ఇచ్చే పద్ధతి ఉండేది. స్వల్ప వడ్డీ మాత్రమే వసూలు చేసేవారు. అప్పుల మీద వడ్డీరేటు సాధారణంగా ఏడాదికి 12 శాతం ఉండేది. దీన్ని నెలకు ఒకసారి గణించే పద్ధతిలో నిర్ణయించేవారు. నాటి సంస్థలు, బ్యాంకులు ఈ విధానాన్ని అనుసరించాయని పశ్చిమ దక్కన్‌లో దొరికిన శాసనాలు ధ్రువపరుస్తున్నాయి. ఉషవదత్తుని నాసిక్ శాసనంలో గోవర్ధనలోని చేనేత పనివారి శ్రేణి రెండు డిపాజిట్లు స్వీకరించినట్లుగా పేర్కొన్నారు. అందులో మొదటిది నెలకు ఒక శాతం వడ్డీ రేటుతో 2,000 కార్షాపణలు, రెండోది నెలకు 3/4 శాతం వడ్డీ రేటు మీద 1,000 కార్షాపణలు ఉన్నాయి. మొదటి డిపాజిట్ మీద వచ్చే వడ్డీ మొత్తాన్ని నాసిక్‌లోని గుహలో వర్షాకాలంలో నివాసం ఏర్పాటు చేసుకున్న బౌద్ధ సన్యాసులకు ప్రతి ఒక్కరికి ఏడాదికి వస్త్రాలు ఖరీదు చేసేందుకుగాను 12 కార్షాపణలుగా ఖర్చు పెట్టడానికి నిర్దేశించారు. రెండో డిపాజిట్‌పై వచ్చే మొత్తాన్ని ఆ బౌద్ధ సన్యాసుల ఇతర అవసరాలకు కేటాయించారు.

సాంస్కృతిక విధానం

దక్కన్ పీఠభూమికి చెందిన పాతరాతి యుగం నిర్మాతలకు ఇనుము, వ్యవసాయానికి సంబంధించిన పరిజ్ఞానం ఉందని వివిధ ఆధారాల ద్వారా తెలుస్తోంది. కరీంనగర్ జిల్లాలోని ఒక ప్రాంతంలో కమ్మరి కొలిమి బయటపడింది. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని ఇనుప ఖనిజ నిక్షేపాలను శాతవాహనులు ఉపయోగించుకున్నట్లుగా ఆధారాలున్నాయి. రాతి యుగంలోనే ఇనుము పరిశ్రమ ఉన్నట్లుగా ఆయా ప్రాంతాల్లో ఆధారాలు లభించాయి. శాతవాహనులు బంగారాన్ని ఆభరణాల్లో మాత్రమే ఉపయోగించి ఉండవచ్చు. కుషాణులలా వీరు బంగారు నాణేలను ముద్రించలేదు. వీరు ప్రధానంగా సీసంతో చేసిన నాణేలను ముద్రించారు. ఇవి దక్కన్ పీఠభూమి ప్రాంతంలో లభించాయి. వీరు రాగి, కంచు నాణేలను కూడా ముద్రించారు.

ప్లీని (క్రీ.శ. మొదటి శతాబ్దంలో వచ్చిన గ్రీకు యాత్రికుడు) కథనం ప్రకారం ఆంధ్ర సామ్రాజ్యం లక్ష మంది కాల్బలం, రెండువేల గుర్రాలు, వెయ్యి ఏనుగులను కలిగిన సైన్యాన్ని పోషించేది. దీని వెనుక పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రజానీకం ఉండేదని, వారు పెద్ద సైన్యాన్ని పోషించగలిగే అదనపు ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారని ఊహించవచ్చు.

కరీంనగర్ జిల్లాలోని పెద్ద బంకూరులో క్రీ.పూ. 200–క్రీ.శ. 200 మధ్యకాలంలో కాల్చిన ఇటుకలు, ఇంటి పైకప్పుల్లో సమతలంగా ఉన్న పెంకులను వినియోగించినట్లు ఆధారాలున్నాయి. ఈ ప్రాంతంలో మురుగునీటిని సంబంధిత గుంటల్లోకి తీసుకువెళ్లే మూతమూసిన కాలువలు కూడా బయటపడ్డాయి. ఆంధ్రప్రాంతంలో 30 కోటలు కలిగిన పట్టణాలు, అసంఖ్యాక గ్రామాలు ఉన్నట్లుగా మెగస్తనీస్ పేర్కొన్నాడు. రెండో, మూడో శతాబ్దాలకు చెందిన అనేక పట్టణాల వివరాలు కూడా శాసనాలు, తవ్వకాల ద్వారా తెలుస్తోంది.

యజ్ఞశ్రీ శాతకర్ణి చేనేత పనివారి శ్రేణికి 1,000 కార్షాపణలు, వడ్రంగి పనివారి శ్రేణికి 2,000 కార్షాపణలు, నూనె గానుగ పనివారి శ్రేణికి 5,000 కార్షాపణాలు డిపాజిట్ చేసినట్లుగా శాసనాల ద్వారా తెలుస్తోంది.



మత విధానాలు

దేవతలు, ఆరాధ్య వృక్ష జంతుగణాలు, వైదిక క్రతువుల వివరాలు క్రీ.శ.2వ శతాబ్ది నాటి బౌద్ధమత వికాసం గురించి తెలుపుతున్నాయి. నాగానిక వేయించిన శాసనంలో తనను తాను 'దీక్షవ్రత యజ్ఞసుంద', 'యజ్ఞహుత ధూపన సుగంధాయ'గా వర్ణించుకుంది. అదేవిధంగా గౌతమీ బాలశ్రీ నాసిక్ శాసనంలో రాజర్షి వధువు (వైదిక మతానుయాయ అయిన రాజుకు ధర్మపత్ని)గా ప్రకటించుకుంది.

నానాఘాట్ శాసనం ప్రారంభంలో ఇంద్ర, ధర్మ, లోకపాలక, సంకర్షణ, వాసుదేవులను, సూర్య, చంద్రులను స్తుతించే అంశాలున్నాయి. శాతకర్ణి కుమారుల్లో ఒకరికి వేదసిరి అనే పేరుండటం, తర్వాతి రాజులకు యజ్ఞశ్రీ తదితర పేర్లు ఉండటం లాంటివి వైదిక మతం పట్ల శాతవాహనుల గౌరవ, ఆదరణలను సూచిస్తున్నాయి. రామాయణ, మహాభారతంలోని ఘట్టాలను గృహాల్లో చిత్రపటాలుగా అలంకరించుకున్నట్లు ఆధారాలు లభించాయి. గాథాసప్తశతిలో కృష్ణ లీలలను వర్ణిస్తూ రాసిన కొన్ని కథలు పౌరాణికం, ఇతిహాసం, మతానికి ఉన్న ప్రజాదరణ గురించి తెలుపుతున్నాయి. ఉషవదత్తుని శాసనాలు కూడా అతడి వైదిక మతాభిమానం; బ్రాహ్మణ పోషణ; ప్రభాస, పుష్కర మొదలైన తీర్థయాత్రల సందర్శన గురించి వివరిస్తున్నాయి.

జైనమతం: శాతవాహన వంశ స్థాపకుడైన సిముకుడు జైన మతాన్ని ఆదరించేవాడని అనేక ప్రాచీన జైన గ్రంథాల ద్వారా తెలుస్తోంది. తర్వాత కాలంలో రెండో శాతకర్ణి జైనమతాచార్యుడైన కొండకుందాచార్యుని ఆగ్రహానికి గురయ్యాడనీ, జైనాచార్యుడు శాతవాహనుల అధికారాన్ని నిర్మూలించడానికి భారతదేశానికి శకులను ఆహ్వానించాడని కొన్ని జైన గ్రంథాల్లో పేర్కొన్నారు.

బౌద్ధమతం: భద్రయానీయ శాఖకు చెందిన బౌద్ధులకు గౌతమీ బాలశ్రీ నాసిక్‌లో గుహాలయాన్ని తొలిపించింది. క్షత్రియుడైన ఉషవదత్తుడు నాసిక్ వద్ద కొన్ని గుహలను తొలిపించి వాటి నిర్వహణ కోసం వేలాదిగా కార్షాపణాలను దానం చేశాడు. మహా సాంఘికుల్లోని చైత్యాక, శైల, పూర్వశైల, అపరశైల శాఖలు కూడా తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రజాదరణ పొందాయి. నాటి హీనయాన బౌద్ధం లేదా మహాథేరవాదం కూడా తెలంగాణలో నేటికీ కొనసాగుతూనే ఉంది. వీరికి, సాంఘికవాదులకు మధ్య వీరిద్దరినీ సమీకరించే దృష్టితో బహుత్రతీయ అనే మరోశాఖ కూడా తెలంగాణ బౌద్ధుల్లో కనిపిస్తుంది.

శిల్పకళ - సేవలు

గుడిమల్లం (చిత్తూరు జిల్లా)లో జరిపిన తవ్వకాల్లో బయటపడిన దేవాలయ శిథిలాలు శాతవాహన యుగానికి చెందినవే అనే అభిప్రాయం ఉంది. బౌద్ధశిల్పాలకు బుద్ధుని జీవితంలోని పంచ కల్యాణాలు, బుద్ధ జాతక కథలు, సామాన్య జీవిత దృశ్యాలు కథా వస్తువులు. కృష్ణాలోయలోని స్తూపాల్లో చాలావాటికి నాలుగు దిక్కుల్లో వేదికలు, వాటిపై విదేశీ 'ఆయక స్తంభాలు' ఉండేవి.

ఇవి పంచ కల్యాణాలను (బుద్ధుని జననం, మహాభినిష్క్రమణ, సంబోధి, ధర్మచక్ర పరివర్తనం, మహా పరినిర్వాణం) సూచిస్తాయి.

విహారం: వర్షాకాలంలో బౌద్ధ భిక్షువుల నివాసానికి ఉద్దేశించినవి విహారాలు.

చైత్యం: పూజా వస్తువుగా చైత్యం లేదా బుద్ధ విగ్రహం ఉండి నిత్యార్చనకు ఉపయోగించే ఆలయమే చైత్యగృహం లేదా చైత్యాలయం.

సంఘారామం: ఒకే ఆవరణలో మూడు, నాలుగు విహారాలుండి, అధ్యయనానికి అనుకూలమైనది సంఘారామం.

చిత్ర కళలు

అజంతా 10వ గుహలోని 'శ్వేతగజ జాతక' చిత్రం శాతవాహన యుగానిదే. నాటి ప్రజలు రామాయణ భాగవతాది పురాణ గాథలను ఇళ్ల గోడలపై చిత్రించుకునే వారని గాథాసప్తశతి ద్వారా తెలుస్తోంది.

సాహిత్య సేవ

శాతవాహన రాజులు సాహిత్య ప్రియులు. వీరి రాజ్యభాష ప్రాకృతం. ప్రాకృత భాషా వికాసానికి వీరు చాలా కృషి చేశారు. కుంతల శాతకర్ణి అంతఃపురంలో ప్రాకృతభాషను ఉపయోగించినట్లు రాజశేఖరుడు తన 'కావ్య మీమాంస'లో పేర్కొన్నాడు. హాలుడు సంకలితపరిచిన 'గాథాసప్తశతి' ద్వారా నాటి సామాన్య ప్రజలు కూడా ప్రాకృత భాషలో కవితలు చెప్పగలిగేవారని, కేవలం రాజాదరణ వల్లే కాకుండా ప్రజాదరణ వల్ల కూడా సాహిత్య వికాసం జరిగిందని తెలుస్తోంది. శక-క్షత్రువుల శాసనాలు చాలావరకు సంస్కృత భాషలో ఉన్నాయి.

యజ్ఞశ్రీ శాతకర్ణికి సంబంధించిన ద్వైభాషిక నాణేలపై ప్రాకృతం కాకుండా ఉన్న మరో భాష తెలుగేనని డి.సి. సర్కార్ నిర్ణయించారు. ఆచార్య నాగార్జునుడు (భారతదేశ ఐన్‌స్టీన్) రచించిన సుహృల్లేఖ (స్నేహితునికి లేఖ) గ్రంథాన్ని నాటి పాఠ్యాంశాల్లో భాగంగా చేర్చి, విద్యార్థులతో కంఠస్థం చేయించేవారని ఇత్సింగ్ రచనల ద్వారా తెలుస్తోంది. ఆర్యమంజూశ్రీ రాసిన 'కల్పసూత్రం', గుణాఢ్యుడి 'బృహత్కథ', శర్వవర్మ రాసిన 'కాతంత్ర వ్యాకరణం', ఆర్యదేవుడు రాసిన 'చిత్తశుద్ధి' మొదలైనవి శాతవాహనుల కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది ఏది?

భారతదేశ ప్రధాన నదీ వ్యవస్థ

భారతదేశంలో నదీ వ్యవస్థను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

1) జీవ నదీ వ్యవస్థ
2) వర్షాధార నదీ వ్యవస్థ

ఈ రెండు నదీ వ్యవస్థల వల్ల భారతదేశానికి వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా, రవాణా పరంగా చాలా ప్రయోజనాలున్నాయి.

జీవ నదీ వ్యవస్థ

వీటినే హిమాలయన్ నదులు అని కూడా అంటారు. సంవత్సరం పొడవునా నీటి ప్రవాహం ఉన్న నదులను 'జీవనదులు' అంటారు. వర్షాకాలంలోని వర్షపు నీరు, ఇతర కాలాల్లో పర్వత శిఖరాల్లోని మంచు కరగడం వల్ల ఈ నదులు ఎల్లప్పుడూ ప్రవహిస్తూ ఉంటాయి. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర, వీటి ఉపనదులు జీవ నదులుగా ఉన్నాయి.

- **సింధూనది:** ఇది 'టిబెట్' హిమాలయాల్లోని 'మానస సరోవరం' పశ్చిమ వైపున 5180 మీ. ఎత్తయిన కైలాస శిఖరాల్లో జన్మిస్తోంది. టిబెట్, భారత్, పాకిస్థాన్‌లో ప్రవహిస్తోంది. దీని మొత్తం పొడవు 2880 కి.మీ. భారతదేశంలో 709 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. ఈ నది భారతదేశంలో జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. ఈ రాష్ట్రం నుంచి పాకిస్థాన్‌లోకి ప్రవేశించి, ఆ దేశంలో ఉత్తర, దక్షిణాలుగా ప్రవహిస్తోంది. చివరకు పాకిస్థాన్‌లోని 'కరాచి' వద్ద అరేబియా సముద్రంలో కలుస్తోంది. జమ్మూ-కాశ్మీర్‌లో ప్రధానంగా లడక్, బలిస్థాన్ ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోంది. దీని ఉపనదులు సట్లెజ్, జీలం, చినాబ్, బియాస్, రావి. వీటిలో అతి పెద్ద ఉపనది సట్లెజ్.
- **గంగా:** ఇది భారతదేశంలో ప్రవహిస్తున్న నదుల్లో అత్యంత పొడవైంది. ఉత్తరాఖండ్ హిమాలయాల్లో గంగోత్రి హిమానీనదం వద్ద జన్మిస్తున్న అలకనంద, భగీరథ అనే రెండు పాయలు కొంత దూరం ప్రవహించి 'దేవ ప్రయాగ' వద్ద కలిసి 'గంగానది' ఏర్పడుతోంది. దీని మొత్తం పొడవు 2525 కి.మీ. దీని పరీవాహక ప్రాంతం సుమారు 8,61,404 చ.కి.మీ. విస్తరించి ఉంది.

ఈ నది భారతదేశంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తూ బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీన్ని బంగ్లాదేశ్‌లో 'పద్మా నది' అని, బ్రహ్మపుత్రా నదితో కలిసిన తర్వాత 'మేఘన' అని పిలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బ్యారేజీ ద్వారా దీని నీటిని హుగ్లీనదికి మళ్లిస్తున్నారు. దీని ప్రధాన ఉప నదులు- యమున, కోసీ, రామ్‌గంగా, గోమతి, బాగ్రా, గండక్, మహానందా, సోన్.



దక్షిణ దిశ నుంచి వచ్చి గంగానదిలో కలిసే ఏకైక ఉపనది సోన్. మిగితావన్నీ హిమాలయాల నుంచి వచ్చి గంగానదిలో కలుస్తున్నాయి.

- **యమునా:** ఇది గంగానది ఉపనదులన్నింటిలో పెద్దది. ఇది 'యమునోత్రి' హిమానీనదం వద్ద పుట్టి 'అలహాబాద్' దగ్గర గంగానదితో కలుస్తుంది. చంబల్, బెట్వా, కెన్ దీని ఉపనదులు.
- **బ్రహ్మపుత్ర:** ఇది టిబెట్ హిమాలయాల్లోని 'మానస సరోవరం' తూర్పు వైపున జన్మిస్తోంది. టిబెట్, భారత్, బంగ్లాదేశ్ ద్వారా 2900 కి.మీ. దూరం ప్రయాణించి బంగాళాఖాతంలో కలుస్తోంది.

ఈ నది భారత్‌లో అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించిన వెంటనే 'షియాంగ్' అనే నదితో కలిసి కొంత దూరం ప్రయాణించి 'దిహంగ్' అనే ప్రదేశం వద్ద దిహంగ్, లోహిత నదులతో కలుస్తోంది. అసోంలో 'తీస్తా' ఉపనదిని కలుపుకొని బంగ్లాదేశ్‌లో ప్రవేశిస్తోంది. చివరగా గంగానదితో కలిసి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ నదిని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. టిబెట్‌లో – సాంగ్‌పో లేదా త్యాంగ్‌పో అని పిలుస్తున్నారు. 'స్వచ్ఛమైన' అని దీని అర్థం. అరుణాచల్ ప్రదేశ్‌లో 'దిహంగ్' అని, బంగ్లాదేశ్‌లో 'జమునా' అని పిలుస్తున్నారు.

మగవారి పేరుతో పిలుస్తున్న భారతదేశ ఏకైక నది బ్రహ్మపుత్ర. దీని ఉపనదులు తీస్తా, షియాంగ్, దిహంగ్, లోహిత. గంగా, బ్రహ్మపుత్ర నదులు సముద్రంలో కలిసేచోట ప్రపంచంలో కెల్లా అతి పెద్దదైన 'సుందర్‌బన్ డెల్టా'ను ఏర్పరుస్తున్నాయి.

వర్షాధార నదీ వ్యవస్థ

వర్షాకాలం మాత్రమే నీటి ప్రవాహం కలిగి ఉండటం వల్ల వీటిని 'వర్షాధారిత నదులు' అంటారు. వీటినే 'ద్వీపకల్ప నదులు' అని కూడా అంటారు.

వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

పశ్చిమం వైపునకు ప్రవహిస్తున్న నదులు: సబర్మతి, నర్మదా, తపతి, మహి మొదలైనవి.

- **నర్మదానది:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న నదుల్లో అతి పొడవైంది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'అమర్‌కంటక్' ప్రాంతంలో పుట్టి వింధ్య, సాత్పుర పర్వత శ్రేణుల మధ్య 1312 కి.మీ. ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. భారతదేశంలో 'పగులు లోయ'లో ప్రవహిస్తున్న అతి పొడవైన నది నర్మద.

దీని ప్రధాన ఉపనదులు షార్, బర్హానర్, బుంజర్, షక్కర్, కోలర్, బుర్నా, హీరాన్. ఈ నది ప్రవాహ మార్గంలో రెండు ప్రధాన జలపాతాలున్నాయి. అవి: కపిల ధారా, ధూన్‌ధర్. దీని పరీవాహ ప్రాంతం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో (87 శాతం), మిగి లింది మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

- **తపతి:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న వాటిలో రెండో అతిపెద్ద నది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'బిటువల్' జిల్లాలోని 'ముల్తాయి' వద్ద పుట్టి 724 కి.మీ. పొడవున సాత్పురా – అజంతా పర్వత శ్రేణుల మధ్య ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. పూర్ణానది, గిర్నా, బోరి, కీప్ర, సిప్రా, సుకీ, అమరావతి దీని ఉపనదులు.

తూర్పు వైపునకు ప్రవహిస్తున్న నదులు: వీటిలో ముఖ్యమైనవి గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, పెన్నా.

ద్వీపకల్ప పీఠభూమి తూర్పువైపునకు వాలి ఉండటంతో దీనిలోని నదులు అధికభాగం తూర్పుదిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

- **గోదావరి:** భారతదేశంలో గంగానది తర్వాత రెండో అతిపెద్ద నది గోదావరి. ఇది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది. దీన్ని 'దక్షిణ గంగా', 'దక్షిణ గంగోత్రి', 'వృద్ధ గంగా' అని కూడా అంటారు. ఈ నది మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో 'నాసిక్ త్రయంబకం' వద్ద జన్మిస్తోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ద్వారా సుమారు 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. మంజీరా, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, వార్ధా మొదలైనవి దీని ఉపనదులు. ఇది నిర్మల్ జిల్లాలోని 'బాసర' వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది.
- **కృష్ణానది:** ఇది మహారాష్ట్రలో పశ్చిమ కనుమల్లోని 'మహాబలేశ్వరం' వద్ద పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది. 1440 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఇది దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్దనది. ఈ నది నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం 'తంగడి' వద్ద తెలంగాణ రాష్ట్రం లో ప్రవేశించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది.

తుంగభద్ర, కోయన, పాలేరు, దిండి, మూసీ, భీమా, మున్నేరు, ఘటప్రభ మొదలైనవి దీని ఉపనదులు.

- **కావేరి:** ఇది కర్ణాటకలోని 'కూర్గ్' జిల్లాలో 'బ్రహ్మగిరి' కొండల్లో జన్మించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ద్వారా సుమారు 805 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. తమిళనాడులోని కావేరి పట్టణం ప్రాంతంలో బంగాళాఖాతంలో కలుస్తోంది. హేమావతి, లోకపావని, షింషా, ఆర్కావతి, లక్ష్మణ తీర్థ, భవాని మొదలైనవి దీని ఉపనదులు. ఇది తమిళనాడులో అతి ప్రధానమైన నది.
- **పెన్నా:** ఇది కర్ణాటకలోని మైసూరు వద్ద 'నంది దుర్గ' కొండల్లో పుట్టి అనంతపురం జిల్లా హిందూపురం వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తోంది. నెల్లూరు జిల్లాలోని 'ఊటుకూరు' వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. జయమంగళి, చిత్రావతి, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు దీని ఉపనదులు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అత్యంత పొడవైన నది ఏది?
   1) గంగా 2) నర్మదా
   3) కృష్ణా 4) గోదావరి
2. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది మొదట ఎక్కడ ప్రవేశిస్తుంది?
   1) అరుణాచల్ ప్రదేశ్
   2) త్రిపుర 3) అస్సాం
   4) మేఘాలయ
3. దక్షిణ గంగా అని ఏ నదికి పేరు?
   1) కృష్ణా 2) గోదావరి
   3) తుంగభద్ర 4) పెన్నా
4. ఏ నదీ సమూహం టిబెట్‌లో ప్రారంభ మూలాన్ని కలిగి ఉంది?
   1) బ్రహ్మపుత్ర, గంగా, సట్లెజ్
   2) గంగా, సట్లెజ్, యమున
   3) చినాబ్, రావి, సట్లెజ్
   4) బ్రహ్మపుత్ర, ఇండస్, సట్లెజ్
5. సాత్పురా, వింధ్య శ్రేణుల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్
   3) తపతి 4) గోదావరి
6. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
   1) సుభ్ర 2) భగీరథి
   3) రూప్ నారాయణ్ 4) పద్మ

సమాధానాలు

1) 1; 2) 1; 3) 2; 4) 4;
5) 1; 6) 4.

- **మహానది:** ఇది మధ్యప్రదేశ్‌లో పుట్టి ఒడిశా ద్వారా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీని పొడవు 857 కి.మీ. దీని ఉపనదులు- మండ్, షియోనాథ్, లేవ్, ఇబ్, హస్‌డియో.

మాదిరి ప్రశ్నలు

1. కొంకణ్ తీరం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) కేరళ 4) మహారాష్ట్ర
2. అత్యధిక సంఖ్యలో సరస్సులు, లాగూన్‌లను కలిగి ఉన్న తీర ప్రాంతం ఏది?
   1) కేరళ తీరం 2) తమిళనాడు తీరం
   3) ఒడిశా తీరం 4) గుజరాత్ తీరం
3. అష్టముడి సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) తమిళనాడు 2) కేరళ
   3) పశ్చిమ బెంగాల్ 4) మణిపూర్
4. శ్రీహరికోటలోని 'సతీష్‌ధావన్' రాకెట్ ప్రయోగ కేంద్రం ఏ సరస్సులో విస్తరించి ఉంది?
   1) చిలుకా సరస్సు 2) కొల్లేరు సరస్సు
   3) పులికాట్ సరస్సు
   4) వెంబనాడ్ సరస్సు
5. పగులులోయ ద్వారా ప్రవహిస్తున్న నది?
   1) గంగా 2) నర్మదా
   3) బ్రహ్మపుత్ర 4) గోదావరి
6. టిబెట్‌లో 'త్యాంగ్‌పో' అని ఏ నదిని పిలుస్తారు?
   1) సింధూ 2) బ్రహ్మపుత్ర
   3) గంగా 4) గండక్
7. గంగానది ఉపనదుల్లో ఉత్తరానికి ప్రవహించేది?
   1) కోసి 2) ఘాగ్ర
   3) సోన్ 4) గండక్
8. కిందివాటిలో పశ్చిమానికి ప్రవహించే నది?
   1) గోదావరి 2) చంబల్
   3) మహానది 4) నర్మదా
9. ఒడిశా రాష్ట్రంలో డెల్టాను ఏర్పరిచే నది?
   1) సువర్ణరేఖ 2) మహానది
   3) కావేరి 4) నర్మదా
10. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) కోసి 2) హుగ్లీ
    3) దామోదర్ నది 4) గంగానది
11. బీహార్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) దామోదర్ 2) కోసి
    3) బ్రహ్మపుత్ర 4) వైతరణి
12. కృష్ణా – గోదావరి నదుల మధ్య విస్తరించిన సరస్సు ఏది?
    1) పులికాట్ 2) కొల్లేరు
    3) చిలుకా 4) అష్టముడి
13. గంగానది ఉపనదుల్లో కెల్లా అతిపెద్దది?
    1) చంబల్ 2) ఘాగ్ర
    3) కోసి 4) యమునా
14. కపిలధార జలపాతం ఏ నదిపై ఉంది?
    1) యమునా 2) నర్మదా
    3) గోదావరి 4) కావేరి
15. అలకనంద, భాగీరథిలు ఎక్కడ కలుస్తాయి?
    1) రుద్ర ప్రయాగ్ 2) దేవ ప్రయాగ్
    3) రిషికేష్ 4) ప్రయాగ్
16. నర్మదా నది ఎక్కువ భాగం ఏ రాష్ట్రం ద్వారా ప్రవహిస్తుంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) మధ్యప్రదేశ్ 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2; 4) 3;
5) 2; 6) 2; 7) 3; 8) 4;
9) 2; 10) 3; 11) 2; 12) 2;
13) 4; 14) 2; 15) 2; 16) 3.

The scheme has fallen out due to..



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-10):

In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/phrase in each case and mark your answer.

Though most of us know him _____ (1) for his inventions, Thomas Alva Edison was first and _____ (2) a telegraph operator. Born humbly in Ohio, U.S.in 1847, he was the seventh _____ (3) last child of Samuel Ogden Edison. At the _____ (4) age of nineteen he moved to Kentucky, where he worked in night shifts. He was _____ (5) with a lead-acid battery when he spilled Sulfuric acid onto the floor it ran between the floorboards and onto his boss's desk below. The next morning Edison was ____ (6). He was ___ (7) about reading and experimenting. One of his mentors during those early years was a fellow telegrapher and inventor named Franklin Leonard Pope, who allowed the ____(8) youth to live and work in the basement of his home. The invention that first gained him notice was the phonograph in 1877. This ___ (9) was so unexpected by the public at large as to appear almost ___ (10).

1. (1) except (2) best (3) hardly (4) greatly (5) sometimes
2. (1) previous (2) only (3) foremost (4) above (5) lastly
3. (1) between (2) before (3) with (4) and (5) of
4. (1) elder (2) early (3) delicate (4) old (5) tough
5. (1) set (2) establish (3) working (4) shared (5) purchase
6. (1) fired (2) send (3) showed (4) followed (5) take
7. (1) fame (2) character (3) passionate (4) defeat (5) poor
8. (1) poverty (2) worry (3) problem (4) conflict (5) impoverished
9. (1) accomplishment (2) well (3) fine (4) leading (5) excellent
10. (1) partly (2) wisely (3) rarely (4) magical (5) almost

Directions (Q. 11-20):

Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** *to help you locate them while answering some of the questions.*

The joy of discovery is a very real **incentive** to research, despite the rareness of its realization. It is on error to suppose that the scientist is unemotional, or could succeed if he were. The error has arisen through a misconception. The absolute necessity that a scientist's findings shall not be changed from **objective** truth in response to emotional urges of any kind does not result in his becoming a particularly unemotional person: whether a discoverer or anyone else is pleased with a discovery has no effect on its validity. 'I have been working like a madman at Drosera' wrote Darwin to Sir J.D. Hooker in reference to his study of insectivorous plants and a few days later, to the geologist, Lyell 'at the present moment I care more about Drosera that the origin of all the species in the world---- I am **frightened** and **astounded** at my results'. Kropotkin once wrote, 'There are not many joys in human life equal to the **joy** of the sudden birth of a generalization ---He who has once in this life experienced this joy of scientific creation will never forget it.'

11. The author of the passage counters the misconception that a scientist is unemotional by pointing out that
    1) the objectivity of a scientist cannot make emotional compromises
    2) even such a great scientist as Darwin cared so much for Drosera
    3) he has capacity to react to emotional appeals made by others
    4) he considers scientific discovery equal to the joy of creation
    5) he has no capacity to react to emotional appeals made by others
12. In this passage the author tells us that scientific research leads one to
    1) rare discoveries
    2) success, sometimes
    3) sure success
    4) finding the objective truth
    5) funding letter
13. Darwin's letter to Lyell reveals to us that he
    1) attached greater importance to his discovery of insectivorous pants than to his discovery of the origin of the species
    2) used to get deeply involved in whatever research, big or small, he had on hand at a given point of time
    3) was rather uncertain about his success in his research on insectivorous plants
    4) was worried that insectivorous plants would destroy all species of insects
    5) was sure of success
14. The findings of scientific researchers
    1) are universally welcome
    2) result in robbing the researcher of all emotions
    3) are objective in nature
    4) have universal validity
    5) no relation to present
15. Kropotkin says about the unforgettable experience
    1) joy of scientific creation
    2) remember the experience
    3) sorrows of human life
    4) generalized observations
    5) astounding facts

Directions (Q. 16-18):

Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in **bold** *as used in the passage.*

16. **ASTOUNDED**
    1) amazed 2) scared
    3) rescued 4) worked
    5) furnished
17. **JOY**
    1) ecstasy 2) wander
    3) murmur 4) jump 5) leap
18. **INCENTIVE**
    1) enticement 2) enjoyment
    3) overwhelm 4) spurious
    5) engulf

Directions (Q. 19-20):

Choose the word which is MOST OPPOSITE in meaning to the word printed in **bold** *as used in the passage.*

19. **OBJECTIVE**
    1) purpose 2) subjective
    3) change 4) bonus
    5) increment
20. **FRIGHTENED**
    1) ghastly 2) beastly
    3) horrified 4) courageous
    5) happy

Directions (Q. 21-25):

Each question below has two blanks, each blank indicating that something has been omitted. Choose the set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Scientists fear that many birds ----- heading towards a unisex existence that would ----- to extinction.
    1) is… make 2) are.. making
    3) is… moving 4) are…lead
    5) were…leading
22. Using ------ from government survey, he found ------ support for his line of reasoning.
    1) data… strong 2) date… much
    3) doubt…many
    4) dates…very 5) date…meek
23. Science consists of ------, Art consists of ------.
    1) naming…pleading
    2) knowing…doing
    3) doing… pleasing
    4) creation…erosion
    5) evolution…inspection
24. Technology is important but what is of great ---------- is the capturing of tacit knowledge.
    1) important 2) import
    3) improvement 4) importance
    5) importantly
25. The ------ of the hour is to evolve measures to tackle the issue.
    1) time 2) moment 3) need
    4) pride 5) speed

Directions (Q. 26-30):

Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

26. There is a misconception (1)/that freedom means(2)/to be doing (3)/your own thing.(4)/No error (5)
27. Shakespeare was (1)/ better than any poet(2)/of his days (3)/ according to critics. (4)/ No error (5)
28. I ordered for a cup of tea (1)/ but the bearer (2)/brought it only (3)/ at the end of the tea-session. (4)/ No error (5)
29. Lack of honesty(1)/ is sometimes labeled as(2)/tact public relations (3)/or politics. (4)/ No error (5)
30. in the aftermath of the September 11th (1)/ the American president's speech was (2)/ broadcasted and televised (3)/ all over the world. (4)/ No error (5)

Directions (Q. 31-35):

Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase printed in bold in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.

31. The minister **hit out** at his critics and categorically denied his involvement in the scam.
    1) hit up 2) hit back
    3) hit upon 4) hit around
    5) no correction
32. He can **strike out** a friendship even with complete strangers.
    1) strike up 2) strike at
    3) strike on 4) strike back
    5) no correction
33. I prefer listening to soft music to help me **wind over** after a stressful day.
    1) wind up 2) wind down
    3) wind off 4) wind of
    5) no correction
34. The scheme has **fallen out** due to paucity of funds.
    1) fallen through 2) fallen over
    3) fallen apart 4) fallen back
    5) no correction

KEY

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 3;
6) 1; 7) 3; 8) 5; 9) 1; 10) 4;
11) 1; 12) 4; 13) 1; 14) 3; 15) 1;
16) 1; 17) 1; 18) 1; 19) 2; 20) 4;
21) 4; 22) 1; 23) 2; 24) 4; 25) 3;
26) 3; 27) 2; 28) 1; 29) 2; 30) 3;
31) 2; 32) 1; 33) 2; 34) 1